
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 47

బుధవారం 1-11-2023



పాకిస్తాన్‌కో విజయం
7 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ చిత్తు.. వరల్డ్‌కప్‌లో బంగ్లా ఖేల్ ఖతం - 12లో



భారత్ డిమాండ్.. 'బంగారం'
రెండో త్రైమాసికంలో డిమాండ్ 10 శాతం అప్.. 210 టన్నులుగా నమోదు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మరాఠాలకు కుణ్బి సర్టిఫికెట్లు
ప్రత్యేక కోటా నిరసనల నేపథ్యంలో మరాఠాలకు కుణ్బి కుల ధ్రువీకరణ పత్రాల జారీకి మహారాష్ట్ర సర్కార్ నిర్ణయించింది.
వివరాలు 6లో ▸



సూపర్ అణుబాంబు!
అత్యంత శక్తిమంతమైన సూపర్ అణు బాంబును త్వరలో తయారు చేయనున్నట్టు అమెరికా ప్రకటించింది.
వివరాలు 6లో ▸



ఎస్–400 క్షిపణుల మోహరింపు
చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో భారత వైమానిక దళం మూడు స్క్వాడ్రన్ల ఎస్–400 క్షిపణులను మోహరించింది.
వివరాలు 6లో ▸



అంబరాన్నంటిన సిరిమానోత్సవం
ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం విజయనగరంలోని పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.
వివరాలు 5లో ▸

ఫ్యాక్ట్‌చెక్
డిస్కంల ప్రతిపాదనలపై
రోత రాతలా?
- విద్యుత్ వినియోగదారులపై వడ్డీ బాదుడు అంటూ 'ఈనాడు' వక్రరాతలు
- ప్రతినెలా విద్యుత్ సంస్థలకు సబ్సిడీ సొమ్ములు సకాలంలో చెల్లిస్తున్న ప్రభుత్వం
- వర్కింగ్ కేపిటల్‌కు ప్రభుత్వ బకాయిలే కారణం అంటూ రామోజీ విషపురాతలు

10లో

కంటి చికిత్స కోసం కండీషన్లతో బెయిల్

చంద్రబాబుకు 4 వారాల తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు

నవంబర్ 28వ తేదీ సాయంత్రం 5 గంటలకల్లా లొంగిపోవాలి

మానవతా దృక్పథం, ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా తాత్కాలిక బెయిల్

2లో

- గతంలో చికిత్స జరిగిన ఆస్పత్రిలోనే చేయించుకోవచ్చు
- రూ.లక్షతో రెండు పూచీకత్తులు సమర్పించాలి
- లొంగిపోయే సమయంలో వైద్య చికిత్స వివరాలను సీల్డ్ కవర్‌లో జైలు అధికారులకు ఇవ్వాలి



- ఆ కవర్‌ను జైలు అధికారులు ఏసీబీ కోర్టు ముందుంచాలి
- కేసు వివరాలు తెలిసిన ఏ వ్యక్తిని కూడా బెదిరించడం, భయపెట్టడం చేయరాదు
- ప్రత్యక్షంగా.. పరోక్షంగా ప్రలోభ పెట్టకూడదు.. చంద్రబాబును ఆదేశించిన న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు
- ప్రధాన బెయిల్ పిటిషన్‌పై విచారణ 10కి వాయిదా

ఇదెక్కడి రోగం?

ఆస్పత్రి పేరుతో జైలు నుంచి బయటకు వచ్చి చంద్రబాబు విజయోత్సవాలు

నిజం గెలిచిందంటూ రాత్రంతా ర్యాలీలు.. బాబు తీరుపై విస్తుపోతున్న ప్రజలు

- చంద్రబాబుకు షరతులతో తాత్కాలిక బెయిల్.. అదీ కంటి ఆపరేషన్ కోసం
- స్కిల్ స్కామ్ కేసు యథాతథమే.. చేసిన నేరం అలాగే ఉంది
- నిజం గెలిచిందంటూ స్వాతంత్య్ర సమర యోధుడిలా ఊరేగింపులా?.. తన కోసం జనం తండోపతండాలుగా వచ్చినట్లు హడావుడి
- ముందే కార్యకర్తల సమీకరణ.. రూట్ షెడ్యూల్ విడుదల
- అరెస్టయిన నాటి నుంచే టీడీపీ అధినేత డ్రామాలు

2లో


రాజమండ్రి జైలు నుంచి ర్యాలీగా వెళ్తూ అభివాదం చేస్తున్న చంద్రబాబు

- జైలులో దోమలు.. చర్మ రోగాలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు హంగామా
- అవేమీ పారకపోవడంతో భద్రత లేదని, ప్రాణ హాని ఉందంటూ నాటకాలు
- చివరికి కంటి ఆపరేషన్ కోసం తాత్కాలిక బెయిల్ ఇవ్వాలంటూ వేడుకోలు
- మానవత్వంతో బెయిలిస్తే తమ విజయంగా చిత్రీకరిస్తూ టీడీపీ రభస

నేడు 'వైఎస్సార్' అవార్డుల
ప్రదానోత్సవం
7 రంగాల్లో విశిష్ట సేవలందించిన 27 మంది వ్యక్తులు, సంస్థలకు పురస్కారాలు
23 వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, 4 వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులు
హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- వివరాలు 14లో

మీడియాతో మాట్లాడొద్దు
- చంద్రబాబుకు హైకోర్టు అదనపు షరతులు
- ర్యాలీల్లో పాల్గొనకూడదు.. ఇంటర్వ్యూలు ఇవ్వొద్దు
- కేసు గురించి బహిరంగంగా మాట్లాడొద్దని ఆదేశాలు

2లో



మీ అభిమానం మరువలేను
ఇలాంటి అనుభూతి ఏ నాయకుడికీ కలగదు
నేను ఏ తప్పూ చేయలేదు.. చేయను.. చేయబోను
నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు
జనసేన అధ్యక్షుడు పవన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు
జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత చంద్రబాబు
- వివరాలు 2లో

మద్యం స్కాం కేసులో.. ముందస్తు బెయిల్ ఇవ్వండి
అరెస్టు చేయాలన్న ఉద్దేశంతోనే నన్ను అందులో నిందితునిగా చేర్చారు
హైకోర్టులో బాబు అత్యవసరంగా లంచ్‌మోషన్ పిటిషన్
28 వరకు బాబును అరెస్టు చేయబోమన్న అడ్వకేట్ జనరల్



3లో

చికిత్స తర్వాత జైలుకెళ్లాల్సిందే
చంద్రబాబు జైలు నుంచి వస్తున్నది రోగిగానా.. వీరయోధుడిగానా!: సజ్జల
3లో

నిజం గెలిచి కాదు.. కంటి ఆపరేషన్‌కే
4 వారాల తర్వాత బాబు మళ్లీ జైలుకే.. దీనికి కూడా సంబరాలా?: మంత్రి అంబటి
3లో

మిరప.. రెపరెప

రికార్డు స్థాయిలో సాగు

- ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 4.84 లక్షల ఎకరాలు
- 2022–23లో రికార్డు స్థాయిలో 5.70 లక్షల ఎకరాల్లో సాగు
- ఈ ఏడాది కనీసం 6.30 లక్షల ఎకరాలు దాటుతుందని అంచనా
- ఫలించిన సస్యరక్షణ చర్యలు.. నల్ల తామర సహా చీడపీడలు దూరం
- గతేడాది కంటే మిన్నగా దిగుబడులు వస్తాయని అంచనా



ఈ రైతు పేరు కంబాల బ్రహ్మం. పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన ఈయన గతేడాది 2 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ ఏడాది బోరు కింద 4 ఎకరాల్లో మిరపను సాగు చేస్తున్నారు. ప్రభుత్వం, ఉద్యాన శాఖ అధికారుల అండదండలతో సాగు చేస్తున్నామని.. నల్ల తామర సహా చీడపీడలు, తెగుళ్ల ప్రభావం ఎక్కడా కనిపించలేదని బ్రహ్మం చెబుతున్నారు. ఈ ఏడాది దిగుబడితోపాటు గతేడాది కంటే మంచి ఆదాయం వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

సాక్షి, అమరావతి: ఈ ఏడాది మిరప పంటను రైతులు రికార్డు స్థాయిలో సాగు చేస్తున్నారు. మంచి ధర పలుకుతుండటంతో ప్రతికూల వాతావరణంలోనూ భారీ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. నల్ల తామర సహా చీడపీడలు, తెగుళ్ల ప్రభావం పెద్దగా లేకపోవడం.. గత ఏడాది కంటే మిన్నగా దిగుబడులొచ్చే అవకాశం ఉండటంతో రైతుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. రాష్ట్రంలో మిరప సాధారణ విస్తీర్ణం 4.87 లక్షల ఎకరాలు కాగా.. గతేడాది రికార్డు స్థాయిలో 5.70 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే 6 లక్షల ఎకరాల్లో మిరప నాట్లు వేయగా.. నవంబర్ మొదటి వారం వరకు పంట వేసే అవకాశం ఉన్నందున అదనంగా కనీసం మరో 20–30 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు ఒకింత కలవరపెట్టినప్పటికీ సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలు రైతులకు ఊరటనిచ్చాయి. గతేడాది కురిసిన వర్షాలతో భూగర్భ జలాలకు లోటు లేకపోవడంతో బోర్ల కింద రికార్డు స్థాయిలో పంటలు వేశారు.

సమృద్ధిగా ఎరువులు.. ఫలిస్తున్న సస్యరక్షణ చర్యలు
సీజన్ ఆరంభం నుంచి ప్రభుత్వం అండగా నిలవడంతో ఏ దశలోనూ విత్తనం, ఎరువుల కోసం రైతులు ఇబ్బందిపడలేదు. ఆర్బీకేల్లో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉంచడంతో గ్రామంలోనే పొందగలుగుతున్నారు. మరోవైపు నల్ల తామరను ఎదుర్కొనేందుకు ఆర్బీకే స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించడంతో రైతులు జాగ్రత్త పడ్డారు. ప్రస్తుతం పంట 85 శాతం ఏపుగా పెరిగే దశలో ఉండగా.. 15 శాతం పూత దశకు చేరుకుంది. ప్రభుత్వ చర్యల ఫలితంగా నల్లతామరతో సహా ఇతర చీడపీడలు, తెగుళ్ల జాడ కనిపించలేదు.


దిగుబడి.. ధరలపై ఆశలు

గతేడాది ఎకరాకు 18 నుంచి 23 క్వింటాళ్ల దిగుబడి రాగా.. ఈసారి 20–25 క్వింటాళ్లకు తగ్గదని అధికారులు చెబుతున్నారు. గతేడాది 11.50 లక్షల టన్నుల దిగుబడులు రాగా.. ఈ ఏడాది 12 లక్షల టన్నులకు పైగా వస్తుందని అంచనా వేస్తున్నారు. 2022–23లో గరిష్ఠంగా క్వింటాల్ ధర రూ.27 వేలు పలకగా.. ప్రస్తుతం కనిష్ఠం రూ.20వేలు, గరిష్ఠంగా రూ.29 వేలు, మోడల్ రకం రూ.24 వేల వరకు పలుకుతోంది. తొలుత మార్కెట్‌కు వచ్చే మధ్యప్రదేశ్ మిరపపై వర్షాభావ పరిస్థితులు ప్రభావం చూపడంతో మిరప ధర మరింత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. పంట కోతకొచ్చే సమయానికి రూ.30 వేల నుంచి రూ.32 వేలకు పైగా చేరవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మిరపకు ఢోకా లేదు

మిరప గతేడాది కంటే మిన్నగా సాగవుతోంది. ఇప్పటికే 6 లక్షల ఎకరాలు దాటింది. సీజన్ ముగిసే నాటికి కనీసం 6.30 లక్షల ఎకరాలు దాటే అవకాశాలు ఉన్నాయి. ఆర్బీకే స్థాయిలో చేపట్టిన సస్యరక్షణ చర్యల వల్ల నల్లతామర, చీడపీడల ప్రభావం కనిపించలేదు. ప్రస్తుతం రికార్డు స్థాయిలో పెరుగుతున్న ధరలు వల్ల రైతులకు మంచి ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి.
– ఎం.వెంకటేశ్వర్లు, అడిషనల్ డైరెక్టర్, ఉద్యాన శాఖ

ఏపీలో ప్రకృతి వ్యవసాయం భేష్

ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ ● తెనాలిలో విదేశీ సంస్థల ప్రతినిధుల పర్యటన


దేశవాళీ వరిపైరును పరిశీలిస్తున్న విదేశీ బృందాల ప్రతినిధులు


చేను గట్టుపై పంటల పరిశీలన

తెనాలి: ప్రకృతి, సేంద్రియ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు కొన్ని అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలోకి అడుగుపెట్టనున్నాయి. ఆయా సంస్థల ప్రతినిధులు రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పంట పొలాలను సందర్శిస్తున్నారు. రైతులతో నేరుగా మాట్లాడి అనుభవాలు తెలుసుకుంటున్నారు. ఈక్రమంలో అమెరికాకు చెందిన కంపెనీల ప్రతినిధులు మంగళవారం తెనాలిలో పర్యటించారు. ప్రకృతి వ్యవసాయం ఒక విప్లవంలా ఉందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ కల్పిస్తామని హామీ ఇచ్చారు.

అమెరికాకు చెందిన ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ టీమ్ లీడర్ లారెన్స్, రెబెకా, హనా బృందం, సోషియో లాడర్ గ్రూప్ సీఈవో శ్రవణాచార్య, రిషిక, జీఐజెడ్ జర్మనీకు చెందిన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ప్రతినిధి సెవిరాన్ స్కాన్ బెర్గర్ మంగళవారం తెనాలి రూరల్ మండలం ఎరుకలపూడి చేరుకున్నారు. రైతుసాధికార సంస్థ (ఆర్‌ఎస్‌ఎస్) ప్రకృతి వ్యవసాయ విభాగం మార్కెటింగ్ హెడ్ ప్రభాకర్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారితో కలిసి గ్రామంలో 2014 నుంచి ప్రకృతి సేద్యంలో ఉన్న ముళ్లపూడి రంగయ్య పంటపొలాన్ని సందర్శించారు. అక్కడ సాగులో ఉన్న దేశవాళీ వరి 'మైసూర్ మల్లిక' పంట పొలాన్ని పరిశీలించారు. రసాయన ఎరువులు వాడిన పైరుతో పోల్చితే, మైసూర్ మల్లిక పైరు దుబ్బు నాణ్యంగా, ఆరోగ్యంగా ఉండటాన్ని గమనించారు. పొలం గట్టుపై వివిధ రకాల కూరగాయలు, పూలమొక్కల పెంపకాన్ని ప్రత్యక్షంగా చూశారు. ప్రకృతి పంట సాగు విధానాలను డెమో ద్వారా రాజకుమారి విదేశీ బృందాలకు వివరించారు. జీవామృతంతో విత్తన శుద్ధి, వేసవిలో పంటచేలో 30 రకాల విత్తనాలతో చేనుకు ఎరువు అందించే విధానం, జీవామృతం తయారీ ప్రత్యక్షంగా చూశారు. అక్కడే మహిళా రైతులతో వారు అనుసరిస్తున్న సాగు విధానాలపై ముచ్చటించారు.

అక్కడి నుంచి తూములూరులో ఏటీఎం మోడల్‌లో కూరగాయలు సాగుచేస్తున్న రైతు పృథ్వీరాజ్ పంటపొలాన్ని పరిశీలించారు. ఒక పద్ధతిలో విత్తనాలను నాటడం ద్వారా నిత్యం పంటలతో డబ్బు సంపాదన, ఆరోగ్యకరమైన ఆహారం పొందటానికి ఈ మోడల్ ఉపయోగపడుతుందని రైతు వెల్లడించారు. అనంతరం కొల్లిపరలోని శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘం కలెక్షన్ సెంటర్, కోల్డ్ రూమ్, సూపర్ మార్కెట్, సేంద్రియ ఉత్పత్తులను పరిశీలించారు. చైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి, డైరెక్టర్ వుయ్యూరు సాంబిరెడ్డి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రకృతి విభాగం మార్కెటింగ్ హెడ్ ప్రభాకర్ మాట్లాడుతూ దేశవాళీ వరి, కోకోవా, వేరుశెనగ, పసుపు, జీడిపప్పు ఆయిల్‌పామ్ వంటి పంటల ఉత్పత్తులకు అంతర్జాతీయంగా మార్కెటింగ్ కల్పించేందుకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఆసక్తిగా ఉన్నట్టు చెప్పారు.

దీనికి సంబంధించి త్వరలో ఒప్పందాలు చేసుకోనున్నారని తెలిపారు. సేంద్రియ/ప్రకృతి విధానంలో సాగుచేసే రైతులు, రైతు సంఘాలకు పెట్టుబడులు పెట్టేందుకు కూడా వారు సహకరిస్తారని వివరించారు. ప్రతి ప్యాకింగ్‌పై ఎక్కడ పండింది? ఏ రైతు పండించాడు? ఏ విధానంలో చేశామనేది పూర్తిగా నమోదై ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విజయలక్ష్మి, విజయకుమారి, కుమార్, సత్యనారాయణ, ఉమాదేవి, సుమ, ఝాన్సీ, రేణుక, పరిశుద్ధకుమారి పాల్గొన్నారు.

గొప్ప సామాజిక మార్పు...

ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం గొప్ప సామాజిక మార్పుగా కనిపిస్తోంది. రసాయనాలతో పనిలేని ఇక్కడి విధానాలు అద్భుతంగా ఉన్నాయి. నేలతల్లికి రసాయనాల కాలుష్యం ఉండదు. రసాయనాల అవశేషాలు లేని ఆహారంతో మనుషుల ఆరోగ్యం బాగుంటుంది. తప్పకుండా ప్రకృతి ఉత్పత్తులను ప్రోత్సహిస్తాం.
– లారెన్స్/హనా, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్, అమెరికా

విప్లవాత్మక విధానం...

జీరో బడ్జెట్ నాచురల్ ఫార్మింగ్ తెలుసుకుని, ఇక్కడి పంటలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెటింగ్ లింకేజ్ కల్పిస్తే ఎలా ఉంటుందనే పరిశీలనకు వచ్చాం. రసాయనాలు లేకుండా రైతులు మంచి దిగుబడులు పొందుతున్నారు. ప్రకృతి విధానంతో మూలాలకు వెళుతున్నామన్న భావన కలుగుతోంది. నిజంగా ఇది విప్లవాత్మకం.
– శ్రవణాచార్య/రిషిక, సోషియో లాడర్ గ్రూప్, అమెరికా

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యార్థులకు శిక్షణ

- నెదర్లాండ్స్ సదస్సులో 'ఈఎండీపీ'పై వివరించనున్న సురేష్‌కుమార్
- భారత్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక అధికారి


అంతర్జాతీయ ప్రతినిధుల సదస్సులో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎంపికచేసిన ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ) విజయవంతమైందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ స్పష్టం చేశారు. నెదర్లాండ్స్‌లోని ఉట్రెచ్‌లో నేటినుంచి మూడురోజుల పాటు గ్లోబల్ సోషల్ అండ్ ఫైనాన్షియల్ స్కిల్స్ కాన్ఫరెన్స్–2023 నిర్వహించనున్నారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 75 దేశాల నుంచి 350 మంది పాల్గొంటున్నారు. సదస్సుకు ముఖ్య వక్తగా భారతదేశం నుంచి హాజరయ్యే ఏకైక అధికారి సురేష్ కుమార్ కావడం విశేషం. సదస్సులో ఆయన ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై ప్రసంగించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఆలోచనా సామర్థ్యాలు, ఆధునిక నైపుణాలను పెంచడం, బేసిక్ ఫైనాన్షియల్ లిటరసీ పెంచాలనే లక్ష్యంతో 2021లో 30 ప్రభుత్వ పాఠశాలల్లోని వెయ్యి మంది తొమ్మిదో తరగతి విద్యార్థులతో ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో ఈ విద్యా సంవత్సరం 5,420 పాఠశాలల్లోని 3.50 లక్షల మంది విద్యార్థులకు విస్తరించారు. గత మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 6 లక్షల మంది విద్యార్థులు ఈఎండీపీ కింద శిక్షణ పొందారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం, గ్లోబల్ విద్యార్థులుగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈఎండీపీ ఉందని మంగళవారం జరిగిన ప్రత్యేక ప్రతినిధుల సమావేశంలో సురేష్‌కుమార్ వివరించారు.

క్లుప్తంగా...

నేడు రాష్ట్ర అవతరణ దినోత్సవం

- సీఎం క్యాంపు కార్యాలయంలో పాల్గొననున్న సీఎం జగన్
- తెలుగు తల్లి, అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులు
- రాష్ట్ర ఉత్సవంగా ఘనంగా నిర్వహణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం రాష్ట్ర ఉత్సవంగా ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 10.15 గంటలకు పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. తెలుగు తల్లి, అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం సీఎం ఏ కన్వెన్షన్ సెంటర్‌కు బయలుదేరి వెళ్తారు. కాగా, అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే కార్యక్రమాల్లో కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొంటారు. తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

అమరజీవికి నివాళులర్పించండి

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఏపీలోని ఆర్యవైశ్యులంతా అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు, చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళులర్పించాలని ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య వేల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఆర్యవైశ్య సంఘాలు, వాసవీ క్లబ్స్, పొట్టి శ్రీరాములు సంస్థ సభ్యులు, ఇతర ఆర్యవైశ్య అనుబంధ సంస్థలు ఈ వేడుకల్లో పాలుపంచుకోవాలని మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

డిప్యూటీ కలెక్టర్లుగా 44 మంది తహశీల్దార్లు

సాక్షి, అమరావతి: డిప్యూటీ కలెక్టర్ల తాత్కాలిక పదోన్నతుల ప్యానెల్ 2023–24కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో 39 మంది తహశీల్దార్లు, సీసీఎల్ఏ కార్యాలయంలో పని చేసే ఐదుగురు సెక్షన్ ఆఫీసర్లు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి పొందారు. ఇటీవల సీసీఎల్ఏ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన డీపీసీ (డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) డిప్యూటీ కలెక్టర్ల పదోన్నతుల ప్యానెల్‌ను ఖరారు చేసి ప్రభుత్వానికి పంపగా, ప్రభుత్వం ఆమోదించింది. పదోన్నతి పొందిన 44 మందికి త్వరలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ప్రభుత్వం నియమించనుంది.

విశాఖలో నెడ్‌క్యాప్ రాష్ట్ర కార్యాలయం!



విశాఖ విద్య: ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్ఆర్ఈడీసీఏపీ) రాష్ట్ర కార్యాలయం విశాఖ నగరంలోని ఎన్ఏడీ కూడలి మర్రిపాలెంలో ఏర్పాటు కానుంది. జిల్లాలో ఆ సంస్థ కార్యకలాపాల నిర్వహణకు గాను ఇప్పటివరకు నగరంలోని రైల్వే కాలనీలోని ఓ అద్దె భవనంలో కార్యాలయం కొనసాగుతోంది. హైవేకు ఆనుకొని పాస్‌పోర్టు కార్యాలయం వెనుక చేపట్టిన అధునాతన నూతన భవన నిర్మాణం పూర్తికావొచ్చింది. జిల్లా కార్యాలయాన్ని లాంఛనప్రాయంగా బుధవారం నూతన భవనంలోని మార్పు చేస్తున్నారు. త్వరలోనే విశాఖపట్నంలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ఏర్పాటు నేపథ్యంలో నెడ్‌క్యాప్ సంస్థ రాష్ట్ర కార్యకలాపాలను ఇదే భవనం నుంచి కొనసాగించేలా సంస్థ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇదం జగత్



సీ యూ అగెయిన్ సార్..!!

కంటి చికిత్స కోసం కండీషన్లతో బెయిల్

సాక్షి, అమరావతి: దసరా సెలవుల్లో న్యాయమూర్తులపై నాట్ బిఫోర్ అస్త్రాలను ప్రయోగించి విఫలమైన టీడీపీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ఎట్టకేలకు తాత్కాలిక బెయిల్ పొందడంలో సఫలమయ్యారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేసిన కేసులో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు కంటికి శస్త్ర చికిత్స నిమిత్తం తనకు తాత్కాలిక బెయిల్ ఇవ్వాలంటూ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం అనుమతించింది. కుడి కంటికి శుక్లాల (కాటరాక్ట్) శస్త్ర చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితిలో ఆయనకు నాలుగు వారాల పాటు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. ఎడమ కంటికి ఏ ఆసుపత్రిలో (డాక్టర్ ఎల్‌వీ ప్రసాద్) అయితే శస్త్రచికిత్స చేయించుకున్నారో అదే ఆసుపత్రిలో ఇప్పుడు శస్త్ర చికిత్స చేయించుకునేందుకు అనుమతిచ్చింది. మానవతా దృక్పథంతో పాటు చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటూ ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా హైకోర్టు పలు షరతులు విధించింది. ఏసీబీ కోర్టు సంతృప్తి మేరకు రూ.లక్షతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. సొంత ఖర్చులతో తనకు నచ్చిన ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు చంద్రబాబుకు అనుమతిస్తున్నట్లు తెలిపింది. తిరిగి లొంగిపోయే సమయంలో తనకు వైద్యులు అందించిన చికిత్స, ఏ ఆసుపత్రిలో చికిత్స పొందారు.. తదితర వివరాలను సీల్డ్ కవర్‌లో రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌కు అందచేయాలని చెప్పింది. ఈ సీల్డ్ కవ


కార్యకర్తలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు

ర్‌ను అలాగే ఏసీబీ కోర్టు ముందుంచాలని జైలు సూపరింటెండెంట్‌ను, నవంబర్ 28 సాయంత్రం 5 గంటలలోపు జైలు సూపరింటెండెంట్ ముందు లొంగిపోవాలని చంద్రబాబును ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించిన వాస్తవాలు తెలిసిన ఏ వ్యక్తిని కూడా ఆ వివరాలు కోర్టుకు, సంబంధిత అథారిటీకి తెలియచేయకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా బెదిరించడం గానీ, భయపెట్టడం గానీ, ప్రలోభాలకు గురి చేయడం గానీ చేయరాదని హైకోర్టు తన 16 పేజీల ఉత్తర్వుల్లో చంద్రబాబును ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తెల్లాప్రగడ మల్లికార్జున రావు మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తాత్కాలిక బెయిల్ కోసం అనుబంధ పిటిషన్‌పై సోమవారం జరిగిన విచారణలో చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్.. సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ మల్లికార్జునరావు మంగళవారానికి తన నిర్ణయాన్ని వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు మంగళవారం ఆయన ఉత్తర్వులు వెలువరించారు. స్కిల్ కుంభకోణం కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ చంద్రబాబు దాఖలు చేసిన ప్రధాన బెయిల్ పిటిషన్‌పై న్యాయమూర్తి తదుపరి విచారణను నవంబర్ 10వ తేదీకి వాయిదా వేశారు. తాత్కాలిక బెయిల్ ఉత్తర్వుల సారాంశం ఇదీ..

న్యాయ ప్రక్రియ నుంచి తప్పించుకోలేరు

- ఈ కోర్టు అభిప్రాయం ప్రకారం, న్యాయ ప్రక్రియ నుంచి చంద్రబాబు తప్పించుకుంటారనేందుకు చిన్నపాటి అవకాశం కూడా కనిపించడం లేదు. విదేశాలకు పారిపోయే అవకాశం కూడా లేదు. వైద్య సాయం అవసరమైన వ్యక్తికి తక్షణమే సమర్థవంతమైన సమగ్ర చికిత్సను అందించాల్సిన అవసరం ఉందని ఈ కోర్టు ధృడంగా నమ్ముతోంది.
- బాధాకరమైన చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటూ, ఈ కేసు పూర్వాపరాల్లోకి వెళ్లకుండా, కేవలం శస్త్ర చికిత్స చేయించుకునేందుకు వీలుగా మాత్రమే ఈ కోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తోంది. అందుకే గతంలో శస్త్రచికిత్స చేయించుకున్న ఆసుపత్రిలో ఇప్పుడు కూడా శస్త్ర చికిత్స చేయించుకునేందుకు అనుమతి ఇవ్వడం సహేతుకమని ఈ కోర్టు భావిస్తోంది.

ఈ వయస్సులో వృద్ధాప్య సమస్యలు మామూలే

- అందుబాటులో ఉన్న ఆధారాలను బట్టి 2023 జూన్ 21 నుంచి ఆరు నెలల్లో కుడి కంటికి కాటరాక్ట్ శస్త్ర చికిత్స చేయించుకోవాలని చంద్రబాబుకు వైద్యులు సిఫారసు చేశారు. దూరదృష్టి కలిగిన ఓ వ్యక్తి కేవలం కాటరాక్ట్ శస్త్ర చికిత్స చేయించుకునేందుకు మాత్రమే బెయిల్ కోరతారని అనుకోవడం అహేతుకమని ఈ కోర్టు భావిస్తోంది.
- ఒకవేళ అదే నిజం అయితే మధ్యంతర బెయిల్ దాఖలు చేసేందుకు 2023 అక్టోబర్ 25 వరకు చంద్రబాబు వేచి చూడాల్సిన అవసరం ఉండేది కాదు. చంద్రబాబు వయసును ఈ కోర్టు పరిగణనలోకి తీసుకుంటోంది. ఈ వయసులో వృద్ధాప్య సమస్యలు రావడం మామూలే. చంద్రబాబు తన అనారోగ్యానికి సంబంధించి సమర్పించిన సర్టిఫికెట్ల యథార్థతను సందేహించే విషయంలో ఈ కోర్టు ముందు ఎలాంటి ఆధారాలు లేవు.
- డాక్టర్ శ్రీనివాసరావు తన రెండో నివేదికలో ఎక్కడా కూడా చంద్రబాబుకు కంటి శస్త్ర చికిత్స అవసరం లేదని చెప్పలేదు. అందువల్ల అదనపు అడ్వొకేట్ జనరల్ సూచించినట్లు చంద్రబాబును మెడికల్ బోర్డు ఎదుట హాజరు కావాలని ఒత్తిడి చేయాల్సిన అవసరం ఈ కోర్టుకు కనిపించడం లేదు. చంద్రబాబు తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది కింది కోర్టు నుంచి గానీ, హైకోర్టు నుంచి గానీ బెయిల్ కోరేందుకు ఎంత మాత్రం అడ్డంకి కాదు.
- అనారోగ్య సమస్యల కారణంతో మధ్యంతర బెయిల్ కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు ముందుందన్నది ఎవరి వాదనా కాదు. చంద్రబాబు క్వాష్ పిటిషన్‌లో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించేంత వరకు ఆయన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపరాదన్న అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి వాదనను ఆమోదించలేకున్నాం.

కంటికి శస్త్ర చికిత్స అవసరమే

- ఓ వ్యక్తిపై వచ్చిన నేరారోపణల తీవ్రత కంటే అతని ఆరోగ్యం, క్షేమాన్నే ఈ కోర్టు పరిగణనలోకి తీసుకుంటుంది. దర్యాప్తులో భాగంగా కస్టడీ విధించడం శిక్షాత్మకం కాదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవడం ముఖ్యం. ప్రతి వ్యక్తికి కూడా సంపూర్ణ, సమగ్ర వైద్య సాయం పొందే స్వతఃసిద్ధ హక్కు ఉంటుంది. కస్టడీలో ఉన్న వ్యక్తులు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే.. వారికి తగిన, సమర్థవంతమైన వైద్య చికిత్స అందించేందుకు అనుమతివ్వడం తప్పనిసరి అని ఈ కోర్టు విశ్వసిస్తోంది.
- ఓ వ్యక్తి జీవితం ప్రమాదంలో ఉన్నప్పుడు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసే విషయంలో కోర్టు తనకున్న విచక్షణాధికారాన్ని కొన్ని పరిస్థితులకు లోబడి పరిమితం చేయడం సాధ్యం కాదు. చంద్రబాబుకు శస్త్రచికిత్స అవసరం లేదని ఏ వైద్య నివేదికలు కూడా చెప్పడం లేదు. చంద్రబాబు కొన్ని అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. వారికి వైద్య సాయం అందించడం తప్పనిసరి. ముఖ్యంగా కుడి కంటికి శస్త్ర చికిత్స చేయించుకోవడం అవసరమని ఈ కోర్టు భావిస్తోంది.

మీ అభిమానం మరువలేను

జైలు నుంచి విడుదలైన అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబు

సాక్షి, రాజమహేంద్రవరం/సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'నేను కష్టంలో ఉన్నప్పుడు 52 రోజుల పాటు తెలుగు ప్రజలు రోడ్లపైకి వచ్చి సంఘీభావం తెలిపారు.. పూజలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు నాపై చూపిన అభిమానాన్ని జీవితంలో ఎప్పటికీ మర్చిపోను. నేను చేసిన అభివృద్ధితో ఫలాలు పొందిన వారందరూ చూపిన అభిమానంతో నా జీవితం ధన్యమైంది. ఇలాంటి అనుభూతి ఏ నాయకుడికీ దక్కదు. 45 ఏళ్ల నా రాజకీయ ప్రస్థానంలో ఎలాంటి తప్పు చేయలేదు.. చేయను.. చేయబోను' అని ప్రతిపక్ష నేత చంద్రబాబు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఆయన రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే. మంగళవారం ఆయనకు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి జైలు బయట మాట్లాడారు. తను అరెస్టును ఖండించిన బీజేపీ, సీపీఐ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. తన అరెస్టును ఖండిస్తూ సంపూర్ణ మద్దతు తెలిపిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. టీడీపీ కార్యకర్తలు 52 రోజుల పాటు అధైర్యపడకుండా పోరాటం చేశారని ప్రశంసించారు. శ్రీకాకుళం నుంచి కుప్పం వరకు కొందరు సైకిల్ యాత్ర చేశారన్నారు. సైబర్ టవర్స్ నిర్మించి 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో కృతజ్ఞతలు తెలుపుతూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కాగా విడుదలకు ముందు జైల్లో చంద్రబాబుతో ఆయన తనయుడు నారా లోకేశ్, కోడలు నారా బ్రాహ్మణి ములాఖత్ అయ్యారు. విజయవాడ వరకు ఎలా వెళ్దాం? ఏం చేద్దాం? అనే అంశాలపై చర్చించినట్లు తెలిసింది. బాబు బెయిల్ కాపీలను తీసుకుని లోపలికి వెళ్లిన లాయర్లు జైల్లో బెయిల్‌కు అవసరమైన ఫార్మాలిటీస్ అన్ని పూర్తి చేశారు. అనంతరం ఆయనను బయటకు తీసుకొచ్చారు. జైలు రెండో గేటు వద్దకు రాగానే చంద్రబాబు తన మనవడు దేవాన్ష్‌ను ముద్దాడారు. నందమూరి బాలకృష్ణ, టీడీపీ ముఖ్య నేతలను ఆలింగనం చేసుకున్నారు. భువనేశ్వరి శ్రీకాకుళం పర్యటన రద్దు చేసుకుని ఆలస్యంగా లోకేశ్ క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం వారంతా రోడ్డు మార్గంలో విజయవాడ బయలుదేరారు.

బాబుకు తాత్కాలిక బెయిల్.. కీలక ఉద్యోగి సహకారం

సాక్షి, అమరావతి: చంద్రబాబుకు హైకోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగానే.. ఆ ఉత్తర్వుల తాలూకు సర్టిఫైడ్ కాపీ (హైకోర్టు అధికారిక ముద్రతో కూడిన కాపీ)ని ఆగమేఘాలపై సిద్ధం చేసేందుకు ఆయన మనుషులు రంగంలోకి దిగారు. ఇందుకు హైకోర్టులో తమకున్న పలుకుబడిని ఉపయోగించారు. ఇందులో ఒక వివాదాస్పద ప్రజాప్రతినిధి చక్రం తిప్పారని సమాచారం. ఆయన చెప్పుచేతల్లో ఉండే ఓ కీలక ఉద్యోగి సర్టిఫైడ్ కాపీ పొందేందుకు సహకరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సాయంత్రం కల్లా చంద్రబాబు బయటకు రావాల్సిందేనని, ఎలాంటి జాప్యం జరగడానికి వీల్లేదని ఆ ఉద్యోగికి ఆ ప్రజాప్రతినిధి దిశానిర్దేశం చేశారు. ఏం కావాలన్నా కూడా తాను చూసుకుంటానని ఆ ఉద్యోగికి భరోసా ఇచ్చారు. దీంతో ఆ ప్రజాప్రతినిధి తరఫున హైకోర్టులో అన్నీ తానై చూసుకునే ఆ కీలక ఉద్యోగి వెంటనే రంగంలోకి దిగారు. ఉత్తర్వుల కాపీకి సంబంధించిన ఫైల్‌ను దగ్గరుండి పర్యవేక్షించారు. ఎక్కడా ఎలాంటి జాప్యం లేకుండా సర్టిఫైడ్ కాపీని సిద్ధం చేయించారు. ఈ సర్టిఫైడ్ కాపీ ఉంటేనే చంద్రబాబు జైలు నుంచి విడుదలయ్యేందుకు అవకాశం ఉంటుంది. సాధారణంగా ఎవరికైనా హైకోర్టు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినప్పుడు అందుకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీ అందుబాటులోకి రావడానికి కనీసం వారం పడుతుంది. అది కూడా కక్షిదారులు తమ న్యాయవాదుల వెంటపడితేనే. అయితే చంద్రబాబు విషయంలో మాత్రం ఉదయం 10.30 గంటలకు కోర్టు ఉత్తర్వులు వెలువరిస్తే, మధ్యాహ్నం కల్లా సర్టిఫైడ్ కాపీ సిద్ధం కావడం విశేషం. ఆ సర్టిఫైడ్ కాపీని హైకోర్టు వెబ్‌సైట్‌లో కూడా అదే సమయంలో అప్‌లోడ్ చేయడం గమనార్హం. హైకోర్టులో ఓ వర్గం చంద్రబాబు కోసం ఏ స్థాయిలో పనిచేస్తుందో దీన్ని బట్టి సులభంగా అర్థం చేసుకోవచ్చు.

ఇదెక్కడి 'రోగం'?

సాక్షి, అమరావతి: రోగానికి చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్తానంటూ కాళ్లావేళ్లా పడి ఎలాగోలా బయటపడ్డ ఓ వృద్ధ నేత విజయోత్సవాలు నిర్వహించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది! స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ సీఎం చంద్రబాబుకు అనారోగ్య కారణాలతో న్యాయస్థానం షరతులతో కూడిన తాత్కాలిక బెయిల్ ఇస్తే నిజం గెలిచిందంటూ టీడీపీ నేతలు నిస్సిగ్గుగా బుకాయించడం విస్తుగొలుపుతోంది! 70 ఏళ్లు పైబడిన ఓ వృద్ధ నేత, రిమాండ్ ఖైదీకి కంటి ఆపరేషన్ చేయించుకునేందుకు మానవతా దృక్పథంతో హైకోర్టు షరతులతో తాత్కాలిక బెయిల్ ఇచ్చింది. సహజంగా జైల్లో ఉండే ఏ ఖైదీకైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే, అత్యవసరంగా సర్జరీ లాంటివి నిర్వహించాల్సి వస్తే న్యాయస్థానం కొన్ని షరతులతో బెయిల్ ఇస్తుంది. ఇప్పుడు కూడా అదే తరహాలో హైకోర్టు చంద్రబాబుకు బెయిల్ ఇచ్చింది. అంతేకానీ ఆయనేమీ శుద్ధపూసగా భావించి క్లీన్‌చిట్ ఇవ్వలేదు. చంద్రబాబుపై స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసు ఇంకా అలాగే ఉంది. అమరావతి ఇన్నర్ రింగు రోడ్డు కుంభకోణం, అసైన్డ్ భూముల దోపిడీ, ఫైబర్‌నెట్ స్కామ్, అక్రమంగా మద్యం డిస్టిలరీలకు లైసెన్సులు ఇచ్చిన కేసులు న్యాయస్థానాల్లో అలాగే ఉన్నాయి. ఏ కేసులోనూ చంద్రబాబు నేరం చేయలేదని కోర్టు తీర్పు చెప్పలేదు. అయినా సరే చంద్రబాబు, ఆయన బృందం నిజం గెలిచిందంటూ ఊరేగింపులు నిర్వహిస్తూ స్వాతంత్ర్య పోరాటం చేసి జైలు నుంచి విడుదలైనట్లుగా రాద్ధాంతం చేయడంపై ప్రజలు విస్తుపోతున్నారు. ఆపరేషన్ చేయించుకున్నాక నవంబర్ 28వతేదీ సాయంత్రం 5 గంటల్లోపు మళ్లీ జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని కోర్టు స్పష్టంగా చంద్రబాబును ఆదేశించింది. అలాంటప్పుడు ఇందులో నిజం ఎక్కడ గెలిచిందో, ఎలా గెలిచిందో అర్థంకాక సామాన్య ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

కార్యకర్తలను తరలించి హడావుడి

అనారోగ్య సమస్యలున్న ఖైదీలకు అత్యంత సాధారణంగా న్యాయస్థానాలు ఇచ్చే బెయిల్‌ను తమ విజయంగా టీడీపీ నేతలు అభివర్ణిస్తుండడంపై సోషల్ మీడియాలో సెటైర్లు వెల్లువెత్తుతున్నాయి. షరతులతో తాత్కాలిక బెయిల్ వస్తుందని ముందే తెలియడంతో రాజమహేంద్రవరానికి టీడీపీ కార్యకర్తలను పెద్దఎత్తున తరలించారు. సెంట్రల్ జైలు పరిసరాలకు చేరుకుని నానా హడావుడి సృష్టించారు. పోలీసులను, బారికేడ్లను తోసుకుంటూ జైలు వద్దకు వెళ్లే ప్రయత్నం చేశారు. రాజమహేంద్రవరం నుంచి విజయవాడ చేరుకునే వరకు హడావుడి చేసేలా టీడీపీ ముందే ప్రణాళిక రూపొందించింది. జాతీయ రహదారి మీదుగా చంద్రబాబు ఏ ప్రాంతానికి ఏ సమయంలో వస్తారో రూట్‌మ్యాప్, షెడ్యూల్ కూడా ఆ పార్టీ విడుదల చేసింది. ప్రతిచోటకూ కార్యకర్తలు, నాయకులు రావాలంటూ పార్టీ కార్యాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు సమాచారం ఇచ్చింది. ఇతర జిల్లాల నుంచి కూడా కార్యకర్తలను తీసుకువచ్చారు. కాన్వాయ్‌ను నెమ్మదిగా పోనిస్తూ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఆయన్ను చూసేందుకు ఎగబడుతున్నారని ప్రచారం హోరెత్తించారు. వాస్తవానికి చంద్రబాబును చూడడానికి సాధారణ ప్రజలు ఏమాత్రం ఆసక్తి చూపలేదు.

ఆది నుంచి డ్రామాలే

చంద్రబాబు అరెస్టయిన నాటి నుంచి ఆయనతో పాటు టీడీపీ నేతలంతా నిజాలను దాచి కేవలం అబద్ధాలను ప్రచారం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. స్కిల్ స్కామ్‌లో అవినీతి జరిగిందా? లేదా? అనే ప్రశ్నకు సూటికి సమాధానం చెప్పకుండా చంద్రబాబు ఐటీకి ఆద్యుడని, 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారని, నిప్పని, ఆయన లేకపోతే రాష్ట్రమే లేదనే తరహాలో ప్రచారాలకు దిగారు.

కోర్టుల్లో మాత్రం చంద్రబాబు 70 ఏళ్ల వయసు పైబడిన వారని, అనారోగ్య సమస్యలున్నాయనే కారణాలతో బెయిల్ అడుగుతూ వచ్చారు. ఇందుకోసం చంద్రబాబు కుటుంబం రోజుకో కొత్త డ్రామాను తెరపైకి తెచ్చింది. ఆయన జైలుకు వెళ్లిన మొదట్లో స్నానానికి వేడి నీళ్లు ఇవ్వడంలేదని, దోమలు కుడుతున్నాయనే అర్థం లేని ఆరోపణలు చేసి అబాసుపాలయ్యారు. చంద్రబాబు ఉన్న బ్యారక్‌లోకి సీఎం జగన్ కావాలని దోమలను పంపి ఆయన అనారోగ్యం పాలయ్యేలా చేస్తున్నారంటూ వాదనలు కూడా చేసి ప్రజల్లో చులకనయ్యారు. వీటిని చూసి జనం నవ్వుకోవడంతో బాబుకు చర్మ సమస్యలున్నాయని, దద్దుర్లు వస్తున్నాయని, జైల్లో సరైన వైద్యం అందించడం లేదంటూ మరో ఎత్తుగడ వేశారు. వైద్యులు ఆయనకు ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తూ టీడీపీ చెబుతున్న వాటిల్లో నిజం లేదని స్పష్టం చేయడంతో మరో నాటకానికి తెర తీశారు. జైల్లో గంజాయి స్మగ్లర్లు, నక్సలైట్లు ఉన్నారని, వారి నుంచి బాబుకు ప్రాణహాని ఉందంటూ కొన్నిరోజులు హంగామా నడిపారు. చంద్రబాబును చంపేస్తామంటూ నక్సలైట్లు పోలీసులకు లేఖ రాశారని, జైల్లో డ్రోన్లు ఎగరేస్తున్నారని పసలేని ప్రచారాలు చేశారు.

తొలిరోజే కోర్టు ఆదేశాలు బేఖాతర్


రాజమహేంద్రవరం జైలు వద్ద టీడీపీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న చంద్రబాబు

తమ అధినేతను అన్యాయంగా జైల్లో పెట్టారు, ఆధారాలు లేవంటూ రోజూ డ్రామాలతో కాలం గడపడమే కానీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో జరిగిన అవినీతిపై ఒక్క ప్రశ్నకు కూడా చంద్రబాబు కుటుంబసభ్యులు, టీడీపీ నేతలు సమాధానం చెప్పలేకపోయారు. కోర్టుల్లోనూ తమ అధినేత గొప్పతనం, అనారోగ్యం, గవర్నర్ అనుమతి తీసుకోకుండా అరెస్టు చేశారనే వాదనలు వినిపించారు. అంతేకానీ చంద్రబాబు అవినీతి చేయలేదని ఎక్కడా ఒక్కసారి కూడా ఆయన న్యాయవాదులు చెప్పలేదు. చివరికి ఆయన కంటికి కేటరాక్ట్ ఆపరేషన్ చేయించాలని వైద్యులిచ్చిన ఓ నివేదికను చూపించి కనికరించి బెయిల్ ఇవ్వాలని వేడుకున్నారు. ఇన్ని డ్రామాల తర్వాత ఎట్టకేలకు కోర్టు ఆయన వయసు, అనారోగ్య సమస్యలను పరిగణలోకి తీసుకుని షరతులతో కూడిన తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. దీన్ని గొప్ప విజయంగా, నిజం గెలిచిందని, ధర్మం నిలబడిందని చెప్పుకుంటూ చంద్రబాబును ఊరేగింపుగా తరలించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కాగా తాత్కాలిక బెయిల్‌పై విడుదలైన చంద్రబాబు తొలిరోజే హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. ర్యాలీలు, రాజకీయ ప్రసంగాలు చేయవద్దని న్యాయస్థానం ఆదేశించినా ఖాతరు చేయలేదు. జైలు నుంచి బయటకు రాగానే మైకు అందుకున్నారు.


మీడియాతో మాట్లాడొద్దు

- చంద్రబాబుకు హైకోర్టు అదనపు షరతులు
- ర్యాలీల్లో పాల్గొనకూడదు.. ఇంటర్వ్యూలు ఇవ్వొద్దు
- కేసు గురించి బహిరంగంగా మాట్లాడొద్దని ఆదేశాలు
- బాబుకు తాత్కాలిక బెయిల్ ఇవ్వగానే అదనపు షరతుల కోసం సీఐడీ అనుబంధ పిటిషన్
- బాబు వాదనలు విన్నాక అదనపు షరతులపై నిర్ణయిస్తానన్న న్యాయమూర్తి
- తీవ్రంగా వ్యతిరేకించిన అదనపు ఏజీ
- లంచ్‌మోషన్ దాఖలుకు అనుమతి ఇవ్వని న్యాయమూర్తి
- మద్యం కుంభకోణం కేసులో చంద్రబాబుకిచ్చి మాకెందుకివ్వరన్న సీఐడీ
- దీంతో అతి కష్టంమీద లంచ్‌మోషన్‌కు అనుమతి
- సత్యేంద్ర జైన్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలన్న ఏఏజీ
- ఆ తీర్పులో సుప్రీంకోర్టు విధించిన షరతులను వర్తింపజేయాలని వినతి
- తన ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే సుప్రీంకోర్టుకు వెళ్లొచ్చన్న న్యాయమూర్తి
- ఆ పని తప్పకుండా చేస్తామని చెప్పిన అదనపు ఏజీ
- అనంతరం బాబుకు అదనపు షరతులు విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు
- కౌంటర్ దాఖలు చేయాలని బాబుకు ఆదేశం.. విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: స్కిల్ కుంభకోణం కేసులో అరెస్టయిన చంద్రబాబుకు మానవతా దృక్పథం, ఆరోగ్య సమస్యల దృష్ట్యా తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో సీఐడీ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. చంద్రబాబుకు అదనపు షరతులు విధించింది. సీఐడీ అనుబంధ పిటిషన్‌పై తీర్పు వెలువడేంత వరకు ఆయన మీడియాతో మాట్లాడకూడదని ఆదేశించింది. ర్యాలీల్లో పాల్గొనకూడదని, ఈ కేసు గురించి బహిరంగంగా కూడా మాట్లాడవద్దని చంద్రబాబును ఆదేశించింది.

చంద్రబాబుకు హైకోర్టు తాత్కాలిక బెయిల్ ఇస్తూ న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జున రావు ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ.. మరిన్ని అదనపు షరతులు విధించాలని కోరారు. ఆ షరతులేమిటో లిఖితపూర్వకంగా ఇవ్వాలని న్యాయమూర్తి చెప్పారు. దీంతో సీఐడీ ఓ అనుబంధ పిటిషన్ రూపంలో వాటిని కోర్టు ముందుంచింది. ఈ అనుబంధ పిటిషన్‌పై లంచ్‌మోషన్ రూపంలో విచారించాలని సీఐడీ న్యాయవాదులు కోరారు. ఇందుకు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జున రావు సుముఖత వ్యక్తం చేయలేదు. అదనపు షరతులకు అంత తొందరేముందని ప్రశ్నించారు. చంద్రబాబుకు నోటీసులు జారీ చేసి వారి వాదనలు విన్న తరువాత నిర్ణయం చెబుతానన్నారు. ఉదయం మద్యం కుంభకోణంలో చంద్రబాబుకు లంచ్‌మోషన్ ఇచ్చి తమకు ఇవ్వకపోవడం ఎంతమాత్రం సరికాదని సీఐడీ న్యాయవాదులు చెప్పారు. దీంతో న్యాయమూర్తి లంచ్‌మోషన్‌కు అనుమతినిచ్చారు.

మధ్యాహ్నం అతికష్టం మీద సీఐడీ అనుబంధ పిటిషన్ విచారణకు వచ్చింది. సీఐడీ తరఫున ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, స్పెషల్ పీపీ యడవల్లి నాగ వివేకానంద, అదనపు పీపీ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఆరోగ్య కారణాలతో మధ్యంతర బెయిల్ మంజూరులో సుప్రీంకోర్టు నిర్దేశించిన షరతులను చంద్రబాబుకు వర్తింపజేయాలని సుధాకర్‌రెడ్డి కోరారు. రాజకీయ ర్యాలీలు, రాజకీయ ప్రసంగాలు, ఇతర రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకుండా చంద్రబాబును ఆదేశించాలని కోరారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ముందు మాట్లాడకుండా నిరోధించాలన్నారు. వైద్య చికిత్సకు మాత్రమే పరిమితమయ్యేలా చూడాలన్నారు. కేసుల విషయంలో ఆయనకు, ఇతర నిందితులకు సంబంధించి ఎలాంటి ఇంటర్వ్యూలు ఇవ్వకుండా కూడా ఆదేశాలు జారీ చేయాలన్నారు. చంద్రబాబు వెంటే



ఉండి, ప్రతి రోజూ ఆయన కార్యకలాపాలను కోర్టుకు నివేదించేందుకు ఇద్దరు డీఎస్పీలను అనుమతించాలని కోరారు. దీనిపై చంద్రబాబు కౌంటర్ దాఖలు చేసిన తరువాత నిర్ణయం తీసుకుంటానని న్యాయమూర్తి తెలిపారు. దీనికి సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. ఎప్పుడో నిర్ణయం వెలువరిస్తామంటే ఎలా అని అన్నారు. చంద్రబాబు బయటకు వచ్చి ర్యాలీలు తీసి రాద్ధాంతం చేసిన తరువాత అదనపు షరతులు విధిస్తే ప్రయోజనం ఉండదన్నారు. అదనపు షరతులు తాము సృష్టించినవి కావన్నారు. మీరు (న్యాయమూర్తి) చంద్రబాబుకు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో సత్యేంద్రజైన్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఉటంకించారని, ఆ తీర్పులోనే సుప్రీం పలు షరతులను విధించిందని తెలిపారు. ఆ తీర్పు ఆధారంగా చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ ఇచ్చినప్పుడు అదే తీర్పులోని షరతులను కూడా విధించాలన్నారు. తీర్పును మొత్తంగా వర్తింపజేయాలే తప్ప, కొంత భాగాన్ని వర్తింపజేసి, కొంత వదిలేస్తామంటే ఎలా అని అన్నారు. తీర్పులో ఏం రాయాలో మీరు కోర్టును శాసించలేరని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. తాను శాసించడం లేదని, తీర్పు పూర్తి పాఠాన్ని వర్తింపజేయాలని మాత్రమే కోరుతున్నానని సుధాకర్‌రెడ్డి చెప్పారు. 'అలా అయితే నిన్ననే (సోమవారం) వాదనల సందర్భంగా షరతులు చెప్పి ఉండాల్సింది. నేను అప్పుడు వాటిని పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉండేది.' అని న్యాయమూర్తి అన్నారు. 'మీరు వారికి అనుకూలంగా తీర్పునిస్తారని ముందే అనుకునేందుకు నేనేమైనా జ్యోతిష్యుడి వద్దకు వెళ్లానా? మీరు ఉత్తర్వులు జారీ చేసిన తరువాతే కదా ఎలాంటి షరతులు విధించారో మాకు తెలిసింది. అలాంటప్పుడు ముందే మేం ఎలా షరతుల గురించి చెప్పగలం' అని సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. చిదంబరం కేసులో కూడా సుప్రీంకోర్టు స్పష్టమైన షరతులను నిర్దేశించిందని సుధాకర్‌రెడ్డి వివరించారు. సుప్రీం తీర్పులో ఏ భాగాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నది తన విచక్షణాధికారానికి సంబంధించినదని న్యాయమూర్తి పేర్కొన్నారు. సుప్రీం తీర్పును అందరూ అనుసరించాల్సిందేనని, అలా చేయని పక్షంలో అదనపు షరతుల కోసం తాము దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేయాలని సుధాకర్‌రెడ్డి కోర్టును కోరారు. చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ ఇస్తూ తానిచ్చిన ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే, సుప్రీం కోర్టుకు వెళ్లొచ్చని న్యాయమూర్తి చెప్పగా.. తాము ఆ పని కచ్చితంగా చేస్తామని సుధాకర్‌రెడ్డి చెప్పారు. అదనపు షరతుల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నడుచుకోవాల్సిందేనని పట్టుబట్టారు. చంద్రబాబు తరఫు న్యాయవాదులు జోక్యం చేసుకుంటూ, కేసు గురించి కాక మిగిలిన రాజకీయాల గురించి మీడియాతో మాట్లాడటం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. చంద్రబాబు రాజకీయ నాయకుడని, ఆయన రాజకీయాల గురించి మాట్లాడకుండా ఎలా ఉండగలరని అడిగారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, కొద్దిసేపటి తర్వాత ఉత్తర్వులు జారీ చేస్తానని చెప్పారు. అనంతరం అదనపు షరతులు విధిస్తూ ఉత్తర్వులిచ్చారు. సీఐడీ అనుబంధ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబును ఆదేశిస్తూ విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

క్లుప్తంగా...

'ఎక్స్'లో 'కరప్ట్ బాబు నాయుడు' ట్రెండింగ్



సాక్షి, అమరావతి: 'కరప్ట్ బాబు నాయుడు' అనే హ్యాష్‌ట్యాగ్ మంగళవారం 'ఎక్స్(ట్విట్టర్)' యాప్‌లో ట్రెండింగ్‌లో మొదటి స్థానంలో నిలిచింది. స్కిల్ కుంభకోణంలో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు మధ్యంతర బెయిల్‌పై జైలు నుంచి బయటకు రావడంతో.. ఆయనకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు పెద్ద ఎత్తున ట్వీట్లు వేశారు. చంద్రబాబు అవినీతి పనుల గురించి వారు చర్చించుకున్నారు.

టీడీపీ సంబరాలు సిగ్గుచేటు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



రేణిగుంట(తిరుపతి జిల్లా): ఆరోగ్యం బాగాలేదన్న కారణంతో నాలుగు వారాల పాటు చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ ఇస్తే టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకోవడం సిగ్గు చేటని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం రేణిగుంట విమానాశ్రయంలో ఆయన టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్‌పై స్పందించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆయన మళ్లీ నాలుగు వారాల తర్వాత జైలుకు వెళతారని, మరికొన్ని కేసుల్లోనూ అరెస్టు తప్పదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆయన అక్రమాలు తేటతెల్లమయ్యాయన్నారు.

ప్రజాధనం లూటీపై బాబును నిలదీస్తాం

రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్



రాజమహేంద్రవరం రూరల్: అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజాధనాన్ని అక్రమంగా, అడ్డదారుల్లో లూటీ చేసిన చంద్రబాబును వదిలే ప్రసక్తే లేదని, ప్రజాకోర్టులో నిలదీస్తామని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ స్పష్టం చేశారు. అనారోగ్య సాకులతో కోర్టుకు లేఖలు రాయడం వల్లే చంద్రబాబుకు తాత్కాలిక బెయిల్ వచ్చిందన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మోరంపూడి జంక్షన్ వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబుకు బెయిల్ వచ్చిందని టీడీపీ నాయకులు చంకలు గుద్దుకోవాల్సిన అవసరం లేదన్నారు. చంద్రబాబు రూ. వేల కోట్ల అక్రమాలకు పాల్పడ్డారనే వాస్తవం కోర్టులకు, ప్రజలకు తెలుసని చెప్పారు. చంద్రబాబు ఒక్క స్కిల్ స్కామ్‌లోనే రూ.వందల కోట్ల అవినీతికి పాల్పడ్డారని సీఐడీ స్పష్టమైన ఆధారాలు ఇవ్వడం వల్లనే ఏసీబీ న్యాయస్థానం రిమాండ్ విధించిందన్న విషయాన్ని టీడీపీ శ్రేణులు గుర్తించాలని తెలిపారు. ఆయన దాదాపు 53 రోజుల పాటు జైలులో ఉన్నారంటే, ప్రజాధనాన్ని లూటీ చేశాడనేది ఎవరికైనా అర్థం అవుతుందన్నారు. లోకేశ్, పవన్‌కళ్యాణ్‌ను కూడా ప్రజాకోర్టులో నిలదీస్తామని ఎంపీ భరత్ తెలిపారు.


ఆపరేషన్ కోసం బెయిల్ ఇస్తే.. సంబరాలా?

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



సాక్షి,అమరావతి: స్కిల్ కుంభకోణం కేసులో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిన చంద్రబాబు ఒక దొంగ అని అందుకే ఆయన జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కంటి ఆపరేషన్ కోసమే చంద్రబాబుకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది తప్ప కోర్టు ఈ కేసును కొట్టేయలేదన్నారు. షరతులతో కూడిన బెయిల్‌కే టీడీపీ సంబరాలు చేసుకుంటుందని ఎద్దేశా చేశారు. బాబుకు రెగ్యులర్ బెయిల్ ఇవ్వలేదని, అది ఇంకా విచారణలో ఉందని, కేసు మెరిట్స్‌పై కోర్టులో విచారణ జరగలేదని చెప్పారు. రిమాండ్ ఖైదీగా మాత్రమే కంటికి ఆపరేషన్ కోసం చంద్రబాబు బయటకు వచ్చారని టీడీపీ గుర్తించాలన్నారు. చంద్రబాబు కుటుంబం రోజుకో స్టేట్‌మెంట్ ఇస్తూ, ఇటు జైలు అధికారులు, అటు రాష్ట్ర ప్రభుత్వంపైన బురదజల్లే ప్రయత్నం చేసిందని మండిపడ్డారు.

బెయిల్‌పై బాబు విడుదలను స్వాగతించాలి: పవన్



సాక్షి, అమరావతి: చంద్రబాబుకు హైకోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేయడం సంతోషకరమని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. 'సంపూర్ణ ఆరోగ్యంతో.. ఇనుమడించిన ఉత్సాహంతో ప్రజా సేవకు పునరంకితం కావాలని ఆకాంక్షిస్తున్నాను. ఆయన అనుభవం ఈ రాష్ట్రానికి ఎంతో అవసరం. చంద్రబాబు విడుదల కోసం కోట్లాది మంది ఎదురు చూస్తున్నారు. అందరం ఆయన్ని స్వాగతిద్దాం' అని మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

నిజం గెలిచి కాదు.. కంటి ఆపరేషన్‌కే బెయిల్

నాలుగు వారాల తర్వాత చంద్రబాబు మళ్లీ జైలుకెళ్లాల్సిందే

- దీనికి కూడా టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదం
- ఇప్పుడు యుద్ధం మొదలైతే.. ఎర్రడైరీ పట్టుకొని ప్రగల్భాలు పలికినప్పుడు ఏం మొదలైంది లోకేశ్?
- తెలంగాణలో మాదిరిగానే ఏపీలోనూ టీడీపీ దుకాణం మూతపడబోతోంది
- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): చంద్రబాబుకు కంటి ఆపరేషన్ కోసం హైకోర్టు నాలుగు వారాల పాటు తాత్కాలిక బెయిల్ ఇస్తే.. టీడీపీ నేతలు న్యాయం గెలిచిందంటూ హంగామా చేయటం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. నిజం, సత్యం, ధర్మం గెలిచి చంద్రబాబు బయటకు రాలేదనే విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలని సూచించారు. మంగళవారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు తాత్కాలిక బెయిల్ ఎందుకు ఇచ్చారనే విషయాన్ని హైకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. చంద్రబాబు గతంలో ఒక కంటికి ఆపరేషన్ చేయించుకున్నారని.. మరో కంటికి కూడా ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పడంతో మానవతా దృక్పథంతో కోర్టు తాత్కాలిక బెయిల్ ఇచ్చిందని వివరించారు. అందువల్ల చంద్రబాబు ఆపరేషన్ చేయించుకొని.. 4 వారాల తర్వాత మళ్లీ జైలులో సరెండర్ కావాల్సిందేనన్నారు. శరీరంపై దురదలు వస్తున్నాయంటే ఏసీబీ కోర్టు మొన్న ఏసీ ఏర్పాటు చేయమన్నదని.. ఇప్పుడు జైలులో కంటి ఆపరేషన్ చేయలేరు కనుక హైకోర్టు తాత్కాలిక బెయిల్ ఇచ్చిందన్నారు. అంతేగానీ ఏదో సత్యం, ధర్మం, న్యాయం గెలిచి.. చంద్రబాబు బయటకు రాలేదన్నారు. ప్రస్తుతం చంద్రబాబుపై కేసు విచారణలో ఉందని.. ఇప్పటికే కొందరు సహ నిందితులను ఆయన విదేశాలకు పంపించారని.. వారిని కూడా విచారించాల్సిన అవసరముందన్నారు. చంద్రబాబుకు తాత్కాలిక బెయిల్ వస్తే.. లోకేశ్ యుద్ధం మొదలైందని హెచ్చరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పుడు యుద్ధం మొదలైతే మరి ఎర్ర డైరీ పట్టుకుని ఉత్తర కుమారుడి ప్రగల్భాలు పలికినప్పుడు, ఏం పీకారంటూ సవాల్ విసిరినప్పుడు ఏం మొదలైందని ప్రశ్నించారు. టీడీపీ నేతలు రెచ్చగొట్టే మాటలు మాట్లాడటం మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

జ్ఞానేశ్వర్‌కు జ్ఞానోదయం అయ్యింది

ఎక్కడైతే ఎన్టీఆర్ టీడీపీని ప్రారంభించారో.. అక్కడే టీడీపీ జెండాను చంద్రబాబు పీకేశారన్నారు. తెలంగాణలో టీడీపీ దుకాణం మూతపడిందని.. అక్కడ ఆ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న జ్ఞానేశ్వర్‌కు జ్ఞానోదయమై రాజీనామా చేశారని చెప్పారు. జ్ఞానేశ్వర్‌ను పార్టీ అధ్యక్షుడిగా పెట్టి, ఆయన చేత డబ్బులు ఖర్చు పెట్టించి, బీసీలకు పట్టం కడతామని పెద్దపెద్ద ఉపన్యాసాలిచ్చి.. చివరకు చంద్రబాబు, లోకేశ్ కలిసి తెలంగాణలో టీడీపీ జెండా పీకేశారని అన్నారు. ఇతర పార్టీల గెలుపు కోసం టీడీపీని తాకట్టు పెట్టారని జ్ఞానేశ్వర్ స్పష్టంగా చెప్పారంటే.. టీడీపీ దుస్థితేంటో అర్థం చేసుకోవచ్చన్నారు. ఏపీలో కూడా ఎన్నికల ముందో, ఆ తర్వాతో టీడీపీ జెండా పీకేయటం ఖాయమన్నారు. టీడీపీ తెలంగాణ అధ్యక్షుడిగా కాసాని జ్ఞానేశ్వర్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా లోకేశ్ ఎత్తలేదంటే.. ఆయన సంస్కారమేంటో, పార్టీ పట్ల నిబద్ధతేంటో అర్థం చేసుకోవచ్చన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

మద్యం స్కాం కేసులో.. అరెస్టు చేయాలన్న ఉద్దేశంతోనే నన్ను అందులో నిందితునిగా చేర్చారు

- హైకోర్టులో చంద్రబాబు అత్యవసరంగా లంచ్‌మోషన్ పిటిషన్
- విచారణ జరిపిన జస్టిస్ మల్లికార్జునరావు
- 28 వరకు చంద్రబాబును అరెస్టు చేయబోం
- హైకోర్టుకు నివేదించిన ఏజీ శ్రీరామ్
- తదుపరి విచారణ 21కి వాయిదా



సాక్షి, అమరావతి: మద్యం కంపెనీలకు అడ్డగోలుగా అనుమతులు మంజూరుకు సంబంధించి సీఐడీ తాజాగా నమోదు చేసిన కేసులో తనకు ముందస్తుగా బెయిల్ మంజూరు చేయాలంటూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మంగళవారం హైకోర్టులో అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేశారు. లంచ్ మోషన్ రూపంలో దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై జస్టిస్ మల్లికార్జునరావు విచారణ జరిపారు. చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబుకు తాత్కాలిక బెయిల్ ఇస్తే, మరో కేసులో అరెస్టు చేయాలన్న కుట్రతోనే తాజాగా మద్యం కుంభకోణం కేసు నమోదు చేసిందన్నారు. దీర్ఘకాలం పాటు జైలులోనే ఉంచాలన్న వ్యూహంలో భాగంగానే ఈ కేసు నమోదు చేశారని ఆయన తెలిపారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ కేసు నమోదు చేశారన్నారు. స్కిల్ కుంభకోణంలోనూ ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఏకపక్షంగా అరెస్టుచేశారని వివరించారు. ఈ కేసులో కూడా అలా అరెస్టుచేస్తారన్న ఆందోళనతోనే ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశామని ఆయన చెప్పారు.

అడ్డగోలుగా అనుమతులతో..

నిజానికి.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా టీడీపీ నేతలకు చెందిన మద్యం కంపెనీలకు అడ్డగోలుగా అనుమతులు మంజూరుచేశారు. దీనివల్ల ఖజానాకు ఏటా రూ.1,300 కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఈ కుంభకోణంపై ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ ఎండీ డి.వాసుదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ తాజాగా కేసు నమోదు చేసింది. ఇందులో చంద్రబాబును మూడో నిందితునిగా చేర్చింది.

28వరకు అరెస్టు చేయబోం..

అనంతరం.. సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) శ్రీరామ్ స్పందిస్తూ.. స్కిల్ స్కాం కేసులో కంటి శస్త్రచికిత్స నిమిత్తం చంద్రబాబుకు నవంబరు 28 వరకు తాత్కాలిక బెయిల్ ఇచ్చిందని, అందువల్ల అప్పటివరకు తాము ఆయనను అరెస్టుచేయబోమని చెప్పారు. ఏజీ చెప్పిన ఈ వివరాలను రికార్డ్ చేసిన న్యాయమూర్తి తదుపరి విచారణను నవంబర్ 21కి వాయిదా వేశారు. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తెల్లాప్రగడ మల్లికార్జునరావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

చికిత్స తర్వాత చంద్రబాబు జైలుకు వెళ్లక తప్పదు

- చంద్రబాబు జైలు నుంచి వస్తున్నది రోగిగానా.. వీరయోధుడిగానా!
- కంటి ఆపరేషన్ కోసమే బాబుకు కోర్టు తాత్కాలిక బెయిల్ ఇచ్చింది
- ఆ మాత్రానికి నిజం గెలిచిందంటూ సంబరాలు చేసుకోదానికి సిగ్గుండాలి
- సానుభూతి కోసమే చంద్రబాబు ఆరోగ్యం, భద్రతపై నాటకాలు
- టీడీపీ తీరుపై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల ఎద్దేవా



సాక్షి, అమరావతి: ఖజానా నుంచి రూ.371 కోట్లు దోచేసిన కేసులో రిమాండ్‌పై జైల్లో ఉన్న చంద్రబాబుకు కంటి ఆపరేషన్ కోసమే కోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇస్తే విజయోత్సవాలు, ర్యాలీలు ఎందుకు నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చంద్రబాబు కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలను నిలదీశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం సజ్జల మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు రోగిగా జైలు నుంచి బయటకు వస్తున్నారా లేక ఏదైనా యుద్ధంలో గెలిచి వీరయోధుడిగా వస్తున్నాడనుకుంటున్నారా అని ఎద్దేవా చేశారు. కంటి చికిత్స కోసం నాలుగు వారాల తాత్కాలిక బెయిల్‌పై చంద్రబాబు బయటకు వస్తున్నారని.. చికిత్స తర్వాత ఈ నెల 28న సాయంత్రం 5 గంటలకు రాజమండ్రి సెంట్రల్ జైలులో లొంగిపోవాల్సిందేనన్నారు. ఈ మాత్రానికే రాజమండ్రి నుంచి రోడ్ షో నిర్వహించడానికి, సంబరాలు చేసుకోవడానికి సిగ్గుండాలని టీడీపీ నేతలకు చురకలంటించారు. స్కిల్ స్కాంలో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిపోయిన దొంగ చంద్రబాబు అని స్పష్టం చేశారు. ఈ కేసులో సీఐడీ పోలీసులు సమర్పించిన ఆధారాలతో ఏకీభవించిన ఏసీబీ కోర్టు చంద్రబాబును రిమాండ్‌పై జైలుకు పంపిందని గుర్తు చేశారు.

సానుభూతి కోసమే నాటకాలని ఒప్పుకోండి

చంద్రబాబు జైలుకెళ్లడంతో ప్రజల్లో పెద్దఎత్తున సానుభూతి వస్తుందని టీడీపీ నేతలు ఆశపడ్డారని.. తీరా పరిస్థితి చూసి భంగపడ్డారంటూ సజ్జల వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ప్రజల్లో ఎలాంటి స్పందన కనిపించకపోవడంతో చర్మవ్యాధులే ప్రాణాంతకమైనట్టు చూపుతూ చంద్రబాబుకు ఆరోగ్యం క్షీణిస్తోందంటూ టీడీపీ సానుభూతి డ్రామాలకు తెరతీసిందన్నారు. చంద్రబాబు ఆరోగ్యం, భద్రతపై ఆయన కుటుంబ సభ్యులు రోజుకో అబద్ధం చెబుతూ జైలు అధికారులు, ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. చెప్పుకోవడానికి కూడా న్యూసెన్స్‌గా అనిపించే చర్మ వ్యాధులు చంద్రబాబుకు ఉన్నాయనే అంశాన్ని ఆయన కుటుంబ సభ్యులే ప్రపంచానికి చెప్పి.. ఏసీ కావాలని కోర్టును అడిగారని దెప్పిపొడిచారు. జైలులో చంద్రబాబు ఉండే బ్యారక్‌లో ఏసీ ఏర్పాటుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో ఆయనను బయటకు తెచ్చుకోవడానికి అడ్డదారుల్లో ఆలోచన చేశారని మండిపడ్డారు. రోగాల్ని చూపి సానుభూతి డ్రామాలాడి మొత్తానికి చంద్రబాబుకు తాత్కాలిక బెయిల్ తెచ్చుకున్నారు కనుక.. ఇప్పటికైనా తాము నాటకాలు ఆడామని ప్రజల ముందు ఒప్పుకోవాలని చంద్రబాబు కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలను సజ్జల డిమాండ్ చేశారు.

నిర్దోషిగా బయటకొచ్చారా.. నిజం గెలిచిందనడానికి

స్కిల్ స్కాం కేసులో చంద్రబాబుకు బెయిల్ ఇవ్వాలని దాఖలు చేసిన పిటిషన్‌పై ఆయన న్యాయవాదులు వాదనలు వినిపించకుండా కంటి చికిత్సను సాకుగా చూపి తాత్కాలిక బెయిల్‌పై వాదనలు వినిపించారని సజ్జల గుర్తు చేశారు. కంటి చికిత్స కోసమే.. మానవీయ కోణంలో షరతులతో కూడిన బెయిల్ ఇస్తే నిజం గెలిచిందంటూ చంద్రబాబు కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు సంబరాలు జరుపుకోవడం వెనుక అర్థమేమిటని ప్రశ్నించారు. చంద్రబాబు నిర్దోషిగా బయటకొస్తున్నారా నిజం గెలిచిందనడానికి అని నిలదీశారు. ఇలా చెప్పుకోవడానికి టీడీపీ నేతలకు సిగ్గు అనిపించడం లేదా అని చురకలంటించారు. 'చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండి సీమెన్స్ సంస్థతో చేసుకున్నది ఫేక్ అగ్రిమెంటా? కాదా?, చేసుకున్న ఒప్పందం ప్రకారం 90 శాతం అంటే రూ.3,000 కోట్లు సీమెన్స్ సంస్థ పెట్టుబడి పెట్టకుండానే.. 10 శాతం మొత్తం అంటే, 370 కోట్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు రిలీజ్ చేశాడా? లేదా?, సీమెన్స్ సంస్థ ప్రభుత్వం నుంచి మాకెటువంటి సొమ్ము అందలేదని చెప్పిందా? లేదా?, చంద్రబాబు తన సొంత మనుషుల్ని బయటినుంచి తెచ్చుకుని స్కిల్ స్కామ్‌కు పాత్రధారులుగా పెట్టుకున్నాడా? లేదా?, 13 చోట్ల చంద్రబాబు సంతకాలు ఉన్నాయా? లేవా?, చంద్రబాబు రిలీజ్ చేయమంటేనే.. ఖజానా నుంచి ఫండ్స్ రిలీజ్ చేస్తున్నామని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు నోట్ ఫైల్స్ రాశారా? లేదా?, ప్రభుత్వం రిలీజ్ చేసిన ఫండ్స్‌లో రూ.240 కోట్లు షెల్ కంపెనీలకు వెళ్లాయని కేంద్ర జీఎస్టీ విజిలెన్స్ సంస్థ బయటపెట్టిందా? లేదా?, షెల్ కంపెనీలకు వెళ్లిన ఫండ్స్ క్యాష్ రూపంలో తిరిగి చంద్రబాబు పీఏ పెండ్యాల శ్రీనివాస్ ద్వారా చేరాయని ఐటీ దాడుల్లో రుజువైందా? లేదా?, ఈ విషయం పూర్తి నిర్ధారణ కోసం పెండ్యాల శ్రీనివాస్‌ను పట్టుకుంటే అసలు వాస్తవాలు తెలుస్తాయనడం నిజమా? కాదా?, పెండ్యాల శ్రీనివాస్ కోసం సీఐడీ నోటీసులు జారీ చేస్తే.. ఆయన్ను అమెరికాకు పంపడం ద్వారా తప్పు చేసినట్టుగా చంద్రబాబు అంగీకరించారా? లేదా?' అంటూ టీడీపీ నేతలపై ప్రశ్నల వర్షం కురిపించారు.

అందరూ నీ తండ్రిలా ఉంటారు అనుకుంటే ఎలా లోకేశ్!

చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నన్ని రోజులూ ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు చేసిన విషప్రచారం అంతాఇంతా కాదని సజ్జల గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ వ్యవస్థల్ని మేనేజ్ చేస్తున్నారంటూ లోకేశ్ చౌకబారు మాటలు మాట్లాడారన్నారు. 'అందరూ నీ తండ్రిలా ఉంటారనుకుంటే ఎలా' అని లోకేశ్‌పై మండిపడ్డారు. ఆదినుంచీ వ్యవస్థల్ని మేనేజ్ చేయడానికి విష సర్పాలను పెంచి పోషించిందే చంద్రబాబు అని మండిపడ్డారు. నిజంగా సీఎం వైఎస్ జగన్ వ్యవస్థల్ని మేనేజ్ చేసి ఉంటే 52 రోజుల తర్వాత చంద్రబాబు జైలు నుంచి ఎలా బయటకొస్తాడని ప్రశ్నించారు.

'కాల్ డేటా' పిటిషన్ కొట్టివేత

సాక్షి, అమరావతి: చంద్రబాబును అరెస్టు చేసిన సీఐడీ అధికారుల కాల్ డేటా రికార్డులు ఇవ్వాలని బాబు లాయర్లు దాఖలు చేసిన పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు తిరస్కరించింది. ఈ కేసులో ఇరు పక్షాల వాదనలు ఇప్పటికే పూర్తి కాగా రిజర్వ్ చేసిన తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. స్కిల్ స్కామ్‌లో తనను అరెస్ట్ చేసిన సీఐడీ అధికారుల కాల్‌డేటా రికార్డులు ఇవ్వాలని కోరుతూ చంద్రబాబు విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌ను సీఐడీ తరఫు న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. సీఐడీ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివేకానంద వాదనలు వినిపిస్తూ కాల్ డేటా రికార్డులు ఇవ్వడం అధికారుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం అని చెప్పారు. తమ ఉన్నతాధికారులతో మాట్లాడటం సీఐడీ విధి నిర్వహణలో భాగం అని తెలిపారు. ఆ వివరాలు ఇతరులకు తెలియాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించి..సీఐడీ అధికారుల కాల్ డేటా రికార్డులు ఇవాల్సిన అవసరం లేదని పేర్కొంటూ చంద్రబాబు వేసిన పిటిషన్‌ను కొట్టి వేసింది.

హైకోర్టు జడ్జిపై అనుచిత పోస్టులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టు జడ్జిపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐడీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎన్.సంజయ్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. న్యాయమూర్తి వ్యక్తిగత విలువలనే కాకుండా, న్యాయ వ్యవస్థను కించపరిచేలా ఆ పోస్టులు ఉన్నాయన్నారు. ఇలాంటి అభ్యంతకర పోస్టులను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వారిపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

టీడీపీ సంబరాల్లో అపశ్రుతి

తూర్పుగోదావరి, ప్రకాశంజిల్లాల్లో ఘటనలు



ఊనగట్లలో గాయపడ్డ బాలుడు

చాగల్లు/కొండపి(సింగరాయకొండ)/అనంతపురం: స్కిల్ స్కామ్‌లో అరెస్టు అయిన టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాజమండ్రి జైలు నుంచి విడుదలైన సందర్భంగా మంగళవారం ఆ పార్టీ నేతలు జరిపిన సంబరాల్లో అపశృతి చోటు చేసుకుంది. తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం ఊనగట్లలో టీడీపీ శ్రేణులు బాణాసంచా కాలుస్తుండగా తారాజువ్వ అదుపుతప్పి బొల్లా గంగాధర్ కుమారుడిపైకి దూసుకువచ్చింది. బాలుడు ముఖం మీద తీవ్ర గాయమైంది. ముఖ భాగం కాలడంతో కళ్లు తెరవలేని పరిస్థితిలో బాలుడిని ఆస్పత్రికి తరలించారు. అలాగే ప్రకాశం జిల్లా కొండపిలో టీడీపీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బాణాసంచా కాల్చడంతో పూలకొట్టుకు మంటలు అంటుకున్నాయి. స్థానికులు వేగంగా స్పందించడంతో పక్కనే ఉన్న దుకాణాలకు మంటలు వ్యాపించకుండా పెనుప్రమాదం తప్పింది. తెలుగు తమ్ముళ్ల అత్యుత్సాహం, హడావుడి, సంబరాల తీరు చూసి ప్రజలు విస్తుపోయారు. కాగా, టీడీపీ దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సిబ్బందికి స్వీట్లు పంచారు. విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ చంద్రశేఖర్ వెంటనే స్టేషన్‌కు వెళ్లి చింతమనేనిని బయటకు పంపించివేశారు. చింతమనేని తీరుపై పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు చిత్రపటానికి రక్తాభిషేకం

అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం పి.సిద్ధరాంపురం గ్రామంలో టీడీపీ జెండా కింద చంద్రబాబు చిత్రపటం పెట్టి నాలుగు గొర్రెలను మంగళవారం బలిచ్చారు. వాటి రక్తంతో చంద్రబాబు చిత్రపటానికి రక్తాభిషేకం చేశారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వాటిని చూసిన వారు ఇదెక్కడి చోద్యమంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

52 రోజుల బాబు జైలు జీవితం ఇలా..

జైలు చరిత్రలో ఏ ఖైదీకి లేని సదుపాయాలు.. ఆయనున్న గదిలో టవర్ ఏసీ

- 24 గంటలు అందుబాటులో ప్రత్యేక వైద్య బృందం
- రోజూ వైద్య పరీక్షలు, మందులు
- అయినా ఎల్లో మీడియా, టీడీపీ దుష్ప్రచారం

సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయిన ప్రతిపక్ష నేత చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో 52 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. అనారోగ్య కారణాలతో ఆయనకు మంగళవారం తాత్కాలిక బెయిల్ మంజూరైంది. చంద్రబాబు 52 రోజులపాటు జైలులో ఉన్నప్పటికీ ఆయన కోరిక మేరకు ఏసీతో సహా అన్ని సదుపాయాలు కల్పించారు. ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా 24 గంటలపాటు ప్రత్యేక వైద్య బృందాన్ని కేటాయించారు. రోజూ వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు కూడా ఇచ్చారు. ఇలా 52 రోజుల పాటు చంద్రబాబు జైలు జీవితం సాగింది. 53వ రోజు ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. అరెస్టు నుంచి విడుదల వరకు ముఖ్య పరిణామాలు ఇలా..

- ➤ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబును సెప్టెంబర్ 9న అరెస్టు చేశారు. అదే రోజు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది.
- ➤ రిమాండ్ ఖైదీగా సెప్టెంబర్ 10 అర్ధరాత్రి 1.30 గంటలకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.
- ➤ జైల్లో ఆయనకు ప్రత్యేకంగా స్నేహ బ్లాక్ కేటాయించారు. ఏ గదిలో ఉంచారో భద్రతా కారణాల రీత్యా గోప్యంగా ఉంచారు.
- ➤ కోర్టు ఆదేశాలతో రోజూ ఇంటి భోజనం, మందులు, అల్పాహారం ఆయన ఇంటి నుంచే అందించే వెసులుబాటు కల్పించారు.
- ➤ మొదట సెప్టెంబరు 22 వరకు చంద్రబాబు రిమాండ్‌లో ఉన్నారు. అనంతరం రెండు రోజులపాటు సీఐడీ కస్టడీకి అప్పగించారు.
- ➤ రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లోనే రెండురోజుల పాటు ఆయనను సీఐడీ అధికారులు విచారించారు. అన్నింటికీ 'తెలియదు.. గుర్తులేదు.. మరిచిపోయా' అనే తీరులో చంద్రబాబు సమాధానం చెప్పారు.
- ➤ సెప్టెంబర్ 24న మరోసారి బాబుకు రిమాండ్. దీన్ని అక్టోబర్ 5 వరకు కొనసాగించారు.
- ➤ జైల్లో దోమలు ఉన్నాయని, చంద్రబాబుకు ముప్పు పొంచి ఉందని ఎల్లో మీడియా దుష్ప్రచారానికి దిగింది.
- ➤ చంద్రబాబుకు ముందు నుంచే ఉన్న చర్మ సమస్య జైల్లో ఇంకా పెరిగిపోయిందని ఎల్లో మీడియా కథనాలు అల్లింది. ఆయనకు వైద్యులతో ప్రత్యేక వైద్య బందం ఏర్పాటు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు చంద్రబాబుకు జైల్లో టవర్ ఏసీ వసతి కల్పించారు.
- ➤ నిత్యం మూడుసార్లు వైద్య పరీక్షలతోపాటు ఒకసారి ఆయన కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య బృందంతో పరీక్షలు.
- ➤ చంద్రబాబు రిమాండ్ మరోసారి పొడిగింపు. అక్టోబర్ 5 నుంచి 19 వరకు ఏసీబీ కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ పొడిగించింది.
- ➤ వారానికి రెండుసార్లు బాబుతో ములాఖత్ అయిన ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు నారా లోకేశ్, కోడలు బ్రాహ్మణి.
- ➤ బాబు ఆరోగ్యంపై టీడీపీ, ఎల్లో మీడియా 5 కిలోలు బరువు తగ్గారంటూ విష ప్రచారం.
- ➤ చంద్రబాబు కిలో బరువు పెరిగారని, జైలుకు వచ్చినప్పుడు 66 కిలోలు ఉండేవారని, ఇప్పుడు 67 కిలోలు ఉన్నారని జైళ్ల శాఖ స్పష్టం చేసింది. విడుదల సమయానికి అర కిలో పెరిగి 67.5 కిలోలకు చేరుకున్నారు.
- ➤ అక్టోబర్ 19 నుంచి నవంబర్ 1 వరకు చంద్రబాబు జ్యుడిషియల్ రిమాండ్‌ను పొడిగించిన ఏసీబీ కోర్టు.
- ➤ తన కుడి కంటికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని జైలు అధికారులకు తెలిపిన చంద్రబాబు. ఆయనకు జీజీహెచ్ వైద్యులతో పరీక్షలు చేయించిన అధికారులు.
- ➤ బాబు ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు.



అవగాహన చేసుకోకుండానే ఒకదాన్ని విశ్వసించమని ఒత్తిడి చేయడం రాజకీయం అవుతుంది గానీ, ఆధ్యాత్మికం, బౌద్ధికం కాజాలదు.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 1 నవంబర్ 2023

దివ్యమైన పతకాల పంట

భారతీయ క్రీడా రంగానికి ఇది కనివిని ఎరుగని సీజన్. ఇటీవలే ఏషియన్ గేమ్స్‌లో పతకాల శతకం సాధించిన భారత్ తాజాగా ఏషియన్ పారా గేమ్స్‌లోనూ శతాధిక పతకాలను చేజిక్కించుకుంది. మునుపెన్నడూ లేని విధంగా ఆసియా పారా క్రీడోత్సవాల్లోనూ శతాధిక పతకాలు సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సంబరాలు జరుపుకొనే మరో సందర్భం అందించింది. విధి క్రూరంగా వ్యవహరించినా, ఆత్మస్థైర్యం కోల్పోకుండా ముందుకు సాగితే విజయానికి ఆకాశమే హద్దు అనడానికి తాజా ఆసియా పారా క్రీడోత్సవాల్లో పాల్గొన్న మన 303 మంది ఆటగాళ్ళ విజయగాథలే ఉదాహరణ. ఈ పారా గేమ్స్‌లో భారత్ అరడజను ప్రపంచ రికార్డులు, 13 ఏషియన్ రికార్డులు నెలకొల్పింది. క్రీడల్లోనూ భారత్ బలంగా ఎదుగుతున్న క్రమానికి ఇది మరో మచ్చుతునక. 2036లో ఒలింపిక్స్‌కు ఆతిథ్య దేశంగా నిలవాలని ఆశిస్తున్న భారత్‌కు ఈ విజయాలు అతి పెద్ద ఉత్ప్రేరకాలు.

ఈసారి ఆసియా క్రీడోత్సవాల్లో భారత బృందం నినాదం 'ఇస్ బార్ సౌ పార్'. అలా వంద పతకాల లక్ష్యాన్ని దాటడమే ఈసారి లక్ష్యమనే నినాదంతో ముందుకు దూకిన భారత్ 107 పతకాలతో ఆ గోల్ సాధించింది. చైనాలోని హాంగ్‌జౌలో సాగిన ఏషియాడ్‌తో పాటు, ఆ వెంటనే అదే వేదికగా సాగిన ఏషియన్ పారా గేమ్స్‌లోనూ భారత్ 111 పతకాలతో మరోసారి ఈ శతాధిక విన్యాసం చేయడం విశేషం. ఏషియన్ గేమ్స్‌లో మనవాళ్ళు కనివిని ఎరుగని రీతిలో పతకాల సాధన చేయడంతో, అందరి దృష్టీ ఈ పారా అథ్లెట్ల మీదకు మళ్ళింది. మొత్తం 191 మంది పురుష అథ్లెట్లు, 112 మంది స్త్రీ అథ్లెట్లు 17 క్రీడా విభాగాల్లో మన దేశం పక్షాన ఈ క్రీడా సంరంభంలో పాల్గొన్నారు. మునుపెన్నడూ పారా క్రీడోత్సవాల్లో లేని విధంగా 29 స్వర్ణాలు, 31 రజతాలు, 51 కాంస్యాలు దేశానికి తెచ్చిపెట్టారు. పతకాల పట్టికలో చైనా, ఇరాన్, జపాన్, దక్షిణ కొరియా తర్వాత అయిదో స్థానంలో మన దేశాన్ని నిలిపారు.

నిజానికి, భారత క్రీడా వ్యవస్థలో పారా క్రీడల పట్ల దీర్ఘకాలికంగా ఉదాసీనత నెలకొంది. ఉదాహరణకు, 2008 నాటి బీజింగ్ పారాలింపిక్స్‌లో మనం అయిదుగురు అథ్లెట్లనే పంపాం. రిక్తహస్తాలతో ఇంటిదారి పట్టాం. అయితే, ఎనిమిదేళ్ళ క్రితం రియోలోని క్రీడాసంరంభంలో 19 మంది భారతీయ పారా ఒలింపియన్లు పాల్గొని, 2 స్వర్ణాలు సహా మొత్తం 4 పతకాలు ఇంటికి తెచ్చారు. అక్కడ నుంచి పరిస్థితులు క్రమంగా మారాయి. రెండేళ్ళ క్రితం టోక్యో పారాలింపిక్స్‌లో మనవాళ్ళు 5 స్వర్ణాలు సహా 19 మెడల్స్ గెలిచారు. అలా పారా అథ్లెట్లకూ, క్రీడలకూ ప్రాచుర్యం విస్తరించింది. ఏషియన్ పారా గేమ్స్‌లోనూ 2018లో భారత్ 72 పతకాలు గెల్చి, తొమ్మిదో స్థానంతో సంతృప్తి పడాల్సి వచ్చింది. అదే ఈసారి హాంగ్‌జౌలో మనవాళ్ళు ఏకంగా 111 పతకాలు సాధించి, అయిదో స్థానానికి ఎగబాకారు. రానున్న ప్యారిస్ పారాలింపిక్స్ పట్ల ఆశలు పెంచారు. చైనా గెల్చిన 521 పతకాలతో పోలిస్తే, మన సాధన చిన్నదే కావచ్చు. అయితే, దేశంలో అథ్లెట్లతో పాటు పారా అథ్లెట్లూ పెరుగుతూ, క్రీడాంగణాన్ని వెలిగిస్తున్న వైనం మాత్రం అవిస్మరణీయం.


ఈ పారా – అథ్లెట్ల భారత బృందం సాధించిన 111 పతకాలకూ వెనుక 111 స్ఫూర్తి కథనాలున్నాయి. చేతులు లేకపోతేనేం, విలువిద్యలో దిట్ట అయిన కశ్మీర్‌కు చెందిన 16 ఏళ్ళ శీతల్ దేవి తన పాదాలతోనే బాణాన్ని సంధించి, లక్ష్యాన్ని ఛేదించి, పతకం సాధించిన తీరు వైరల్ అయింది. నిరాశలో కూరుకున్న కోట్లమందికి ఆమె సరికొత్త స్ఫూర్తి ప్రదాత. అలాగే, ఒకప్పుడు రెజ్లర్‌గా ఎదుగుతూ, రోడ్డు ప్రమాదంలో ఎడమకాలు పోగొట్టుకున్న సుమిత్ అంతిల్ మరో ఉదాహరణ. జీవితంలో పూర్తిగా నిస్పృహలో జారిపోయిన ఆ ఆటగాడు కన్నతల్లి ప్రోత్సాహంతో, అప్పటి దాకా విననైనా వినని పారా క్రీడల్లోకి దిగారు. ఇవాళ జావెలిన్ త్రోయర్‌గా పారాలింపిక్స్‌కు వెళ్ళారు. ఏషియన్ ఛాంపియన్‌గా ఎదిగారు. తాజా క్రీడోత్సవాల్లో తన ప్రపంచ రికార్డును తానే మెరుగుపరుచుకున్నారు. సోదరుడి వివాహంలో కరెంట్ షాక్‌తో చేతులు రెండూ కోల్పోయిన పారా స్విమ్మర్ సుయశ్ నారాయణ్ జాధవ్, కుడి మోచేయి లేని పరుగుల వీరుడు దిలీప్, నడుము కింది భాగం చచ్చుబడినా తొణకని కనోయింగ్ వీరుడు ప్రాచీ యాదవ్... ఇలా ఎన్నెన్నో ఉదాహరణలు.

పారా క్రీడల విషయంలో గతంలో పరిస్థితి వేరు. దేశంలో పారా క్రీడలకు పెద్ద తలకాయ అయిన భారత పారా ఒలింపిక్ కమిటీ అనేక వివాదాల్లో చిక్కుకుంది. 2015లో అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ సస్పెండ్ చేసింది. ఆ పైన 2019లో జాతీయ క్రీడా నియమావళిని ఉల్లంఘించారంటూ, సంఘం గుర్తింపును క్రీడా శాఖ రద్దు చేసింది. ఏడాది తర్వాత పునరుద్ధరించింది. అంతర్గత కుమ్ములాటలు, అవినీతి, ఆశ్రిత పక్షపాతం లాంటి ఆరోపణలు సరేసరి. అన్ని అవరోధాల మధ్య కూడా ఆటగాళ్ళు పట్టుదలగా ముందుకు వచ్చారు. ఒకప్పుడు నిధులు, శిక్షణ కొరవడిన దశ నుంచి పరిస్థితి మారింది. ప్రత్యేక అవసరాలున్న ఆటగాళ్ళకు నిధులు, శిక్షణనివ్వడంలో శ్రద్ధ ఫలిస్తోంది.

భారత క్రీడా ప్రాధికార సంస్థకు చెందిన పలు కేంద్రాల్లో భారత పారా అథ్లెట్లకు మునుపటి కన్నా కొంత మెరుగైన శిక్షణ లభిస్తోంది. విదేశీ పర్యటనలతో వారికి క్రీడా ప్రపంచాన్ని పరిచయం చేస్తున్నారు. ఆటగాళ్ళ దీక్షకు తల్లితండ్రులు, కోచ్‌ల ప్రోత్సాహం తోడై పతకాల పంట పండిస్తోంది. పారా స్పోర్ట్స్ అంటే ఎవరికీ పెద్దగా తెలియని రోజుల నుంచి దివ్యాంగులు పలువురు క్రీడల్ని ఓ కెరీర్‌గా ఎంచుకొనే రోజులకు వచ్చాం. అయితే, ఇది చాలదు. వసతుల్లో, అవకాశాల్లో సాధారణ ఆటగాళ్ళతో పాటు దివ్యాంగులకూ సమప్రాధాన్యమివ్వాలి. దేశంలోని దివ్యాంగ క్రీడాకారుల్లోని ప్రతిభాపాటవాలు బయటకు తేవాలి. 9 నెలల్లో రానున్న ప్యారిస్ పారాలింపిక్స్‌కి అది చేయగలిగితే మేలు!

కుల నిర్మూలన ఇలాగేనా?

విశ్లేషణ



కంచ ఐలయ్య షెపర్డ్

ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కుల నిర్మూలన గురించి మాట్లాడటం మంచిదే. అదే సమయంలో దానికి గల మార్గాలను కూడా వారు వివరించాలి. ప్రస్తుత మాంసాహారం వర్సెస్ శాకాహారం వివాదం కులతత్వంతో కూడుకున్నది. ఇది కుల నిర్మూలనకు సహాయం చేయకపోగా, పౌర సమాజంలో, విశ్వ విద్యాలయాల్లో కులతత్వాన్ని ప్రోత్సహిస్తుంది. వివాహం, గౌరవప్రదమైన కులాంతర భోజనాలు అనే ఈ రెండు సామాజిక వ్యవస్థలు తీవ్రమైన కుల నిర్మూలనా శక్తిని కలిగి ఉన్నాయి. అందుకే తాము హిందువులని ఆర్‌ఎస్‌ఎస్ భావించే అన్ని కులాలకూ దేవాలయాలలో అర్చకత్వ హక్కులు కల్పించాలి. దేశం, సమాజం, కుటుంబం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం మంచిదని ప్రచారం చేయడం ద్వారా కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి.

జాతీయ స్థాయిలో కుల గణనను డిమాండ్ చేస్తూ, ద్విజ ఆధిపత్యం కలిగిన సమాజంలో తమ చారిత్రక స్థానం పట్ల స్పృహను ప్రదర్శిస్తూ, తమ సంఖ్య గురించి శూద్ర/ఓబీసీలు చైతన్యాన్ని చూపుతున్న నేపథ్యంలో– ఎట్టకేలకు, ఆర్‌ఎస్‌ఎస్ బహిరంగ వేదికలపై కుల నిర్మూలన గురించి మాట్లాడుతోంది. కుల నిర్మూలన కోసం దత్తాత్రేయ హోసబలే, ఇతర నాయకులు దళితులు, శూద్రులకు ఆలయ ప్రవేశాన్ని, నీటి హక్కులను గురించి ప్రస్తావిస్తున్నారు. ఈ రెండు అంశాలూ కాలం చెల్లినవి మాత్రమే కాదు, ఇవి సామాజిక వివక్షను తొలగించే అవకాశం లేదు.

రెండు సామాజిక వ్యవస్థల శక్తి

మాంసాహారం వర్సెస్ శాకాహారం వివాదం కులతత్వంతో కూడుకున్నది. ఇది కుల నిర్మూలనకు సహాయం చేయకపోగా, పౌర సమాజంలో, విశ్వవిద్యాలయాల వంటి ప్రభుత్వ సంస్థలలో కుల తత్వాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది ఆహార సాంస్కృతిక ఘర్షణలకు దారి తీస్తుంది. కులాల మధ్య విభజితమైన ఆహార సంస్కృతి కూడా కులాంతర వివాహాలకు అడ్డుగోడగా నిలుస్తోంది.

వివాహం, గౌరవప్రదమైన కులాంతర భోజనాలు అనే ఈ రెండు సామాజిక వ్యవస్థలు తీవ్రమైన కుల నిర్మూలనా శక్తిని కలిగి ఉన్నాయి. వివాహం, ఆహార సాంస్కృతిక కండిషనింగ్ అనేవి, సామాజిక బృందాలను ఏకం చేయగలవు లేదా విభజించగలవు కాబట్టి వాటిని నేను ఉద్దేశపూర్వకంగానే శక్తి అని పిలుస్తాను. కుల వివాహ వ్యవస్థ, సామాజికంగా వేర్పాటుతో కూడిన ఆహార సాంస్కృతిక పరంపర అనేవి వేయి సంవత్సరాలుగా దేశంలో కుల అంతరాలను కొనసాగించాయి. కుల కేంద్రకమైన వివాహ వ్యవస్థ అనేది వ్యక్తుల డీఎన్ఏను కుల ప్రాతిపదికన విభజించడానికి ఉద్దేశించబడింది.

గత వందేళ్ల ఆర్‌ఎస్‌ఎస్ ఉనికిని చూసినట్లయితే, కుల నిర్మూలన కోసం కులాంతర వివాహాలను అది ప్రోత్సహిస్తుందనడానికి వారి రచనల్లో గానీ, నాయకుల ప్రసంగాల్లో గానీ ఎలాంటి ఆధారాలు లేవు. కులాంతర వివాహం వివిధ వృత్తులు కలిగిన రెండు వేరు వేరు వర్గాల మధ్య రక్త సంబంధాలను మార్పిడి చేస్తుందని డా. బి.ఆర్ అంబేడ్కర్ సూచించారు. ఇది ఇద్దరు భాగస్వాముల కులాన్ని బలహీనపరచడమే కాకుండా, వారి సంతానపు మానసిక, శారీరక సామర్థ్యాలను మెరుగుపరుస్తుంది. బహుశా అలాంటి కులాంతర వివాహాన్ని రుజువు చేయడానికి ఆయన సవితా అంబేడ్కర్‌ను వివాహం చేసుకున్నారు. ఆమె బ్రాహ్మణ కుటుంబ నేపథ్యం నుండి వచ్చారు. సాధారణంగా పాశ్చాత్య సంస్కృతితో మాంసాహారం తినే దళితుడు, భారతీయ వాతావరణంలో మాత్రమే పెరిగిన బ్రాహ్మణ స్త్రీ తమ వైవాహిక జీవితంలో ఎలాంటి సర్దుబాట్లు చేసుకున్నారు అనే సమాచారం మన వద్ద లేదు. అంబేడ్కర్, సవిత తమ ఆహారాన్ని పూర్తి శాకాహారంగా గానీ, మిశ్రమ ఆహారంగా గానీ మార్చుకుని ఉండొచ్చు. లేదా ఎదుటివారి ఆహార ఎంపికను మరొకరు గౌరవించి ఉండొచ్చు.



ప్రస్తుత వ్యవస్థలో కులాంతర వివాహం

అన్ని కులాలకు చెందిన భారతీయ యువత ఉన్నత విద్యను అభ్యసిస్తున్నందున కులాంతర వివాహాల పరిధి పెరుగుతోంది. అవి జరుగుతున్నాయి కూడా. కానీ కులాంతర వివాహాలను సాధారణంగా తల్లిదండ్రులు అంగీకరించరు. ఎందుకంటే ఇది సామాజిక కళంకాన్ని తీసుకొస్తుంది. అనేక సందర్భాల్లో, ముఖ్యంగా ఒక భాగస్వామి దళితుడు, మరొకరు దళితేతరులు అయినప్పుడు అలాంటి వివాహితులను చంపడం ఇప్పుడు పెద్ద సమస్య అయిపోయింది.

అధికారంలో ఉన్న బీజేపీకి మార్గదర్శకంగానూ, భారతదేశంలోని అతిపెద్ద సామాజిక సంస్థగానూ ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ ఈ సమస్యతో ఎలా వ్యవహరిస్తుందో సమాజానికి తెలియదు. ఈ సంస్థ నాయకులు సనాతన ధర్మం లేదా హిందూ సంప్రదాయం గురించి నిరంతరం మాట్లాడుతుంటారు. కులాంతర వివాహాలు సనాతన ధర్మంలో లేక హిందూ సంప్రదాయంలో భాగమేనా అన్నది వాళ్లు స్పష్టం చేయాలి. భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడానికి కుల నిర్మూలన ఒక క్లిష్టమైన యత్నం. కుల నిర్మూలన గురించి మాట్లాడటం మంచిదే. అదే సమయంలో దానికి గల మార్గాలను, సాధనాలను వివరించాలి.

కులాలు, మాంసాహారం, శుద్ధ శాకాహారులు

కుల వ్యవస్థ భారతీయుల మధ్య భోజనాన్ని ప్రధాన సమస్యగా మార్చింది. శతాబ్దాలుగా దేశంలోని వివిధ కులాల ప్రజలు పక్క పక్కనే కూర్చుని భోంచేయడం లేదు. పట్టణ ప్రాంతాల్లో ఆధునిక రెస్టారెంట్ వ్యవస్థలు కుల రహితంగా తినే వీలును కల్పించాయి. కానీ గ్రామాల్లో ఇప్పటికీ ఇది పెద్ద సమస్య. అనేక పాఠశాలల్లో దళితులు వండిన ఆహారాన్ని దళితేతరులు తినడం లేదు. ఈ పరంపరకు వ్యతిరేకంగా ఆర్‌ఎస్‌ఎస్ స్పష్టమైన వైఖరిని తీసుకోలేదు.

శాకాహారం, మాంసాహారం అనే సమస్య ప్రస్తుతం చాలా ఐఐటీలు, ఇతర కేంద్ర విద్యా సంస్థల్లో తీవ్రమైన సమస్యగా మారింది. కొంతమంది కేంద్ర మంత్రులు ఆర్‌ఎస్‌ఎస్ శాకాహార సంస్కృతిలో భాగమయ్యారు. పైగా వారు పూర్తి శాకాహార మెనూని అవలంబించాలని ఆయా సంస్థలను కోరుతున్నారు. కేంద్ర విద్యాసంస్థల్లో, విశ్వ విద్యాలయాలలో శాకాహారం మాత్రమే అందించాలని ఆదేశాలను పంపిన మొదటి విద్యా మంత్రి స్మృతి ఇరానీ. ముంబై ఐఐటీతో సహా ఇతర ఐఐటీల అధిపతులు శాకాహారం, మాంసాహారం తినేవారికి వేర్వేరు వసతి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీటన్నింటికీ కారణం సనాతన ధర్మాచరణకు చెందిన శాకాహార భావజాలమే.

ముస్లింలను, క్రైస్తవులను విడిచిపెట్టండి... శూద్రులు, దళితులు, ఆదివాసీలు భారతదేశంలో ప్రధానంగా మాంసాన్ని, లభ్యత ఆధారంగా శాకాహారాన్ని తినడం ద్వారా జీవిస్తున్నారు. కానీ పండుగ సందర్భాలలో వారికి ఇష్టమైనది మాంసాహారమే. ఆహార సాంస్కృతిక పరంపరలో స్పష్టమైన కుల వర్ణ విభజన ఉంది. ఆర్‌ఎస్‌ఎస్ తన స్వచ్ఛమైన శాకాహార సంస్కృతిని వదులుకుంటుందా? బహిరంగ, వ్యక్తిగత ప్రదేశాలలో ప్రజలు తమకు నచ్చిన ఆహారాన్ని తినడం గురించి ఏ వైఖరిని తీసుకుంటుంది? హిందూ లేదా హిందూత్వ ఆహార సంస్కృతి ఏమిటి? ఇది స్వచ్ఛమైన శాకాహారమా లేదా వ్యక్తిగత ఎంపిక ఆధారంగా మిశ్రమ ఆహారమా?

వ్యక్తిగత ప్రాధాన్యాల ఆధారంగా ఆహార సంస్కృతిని ప్రజాస్వామ్యీకరించడం కుల నిర్మూలన చర్యల్లో ఒకటి. కానీ ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కుటుంబాల ఆహార స్వేచ్ఛ గురించి ఎప్పుడూ మాట్లాడలేదు. ఉదాహరణకు దక్షిణ భారతదేశంలో శూద్రులు, దళితులు, ఆదివాసీలందరూ మాంసాహారాన్ని తింటుంటారు. బ్రాహ్మణులు, వైశ్యులు కులపరంగా శాకాహారులు. వారి పిల్లలకు అలాగే తినేలా శిక్షణ ఇస్తారు. ఈ పద్ధతులను ప్రస్తావించకుండా ఆర్‌ఎస్‌ఎస్ కులాన్ని ఎలా నిర్మూలిస్తుంది?

కుల నిర్మూలనకు దశలవారీగా ఉపయోగపడే నాలుగు సామాజిక సాధనాలను నేను గుర్తించాను. వాటి గురించి ఈ సంస్థ మౌనంగా ఉంది. 1) తాము హిందువులని ఆర్‌ఎస్‌ఎస్ భావించే అన్ని కులాలకు దేవాలయాలలో అర్చకత్వ హక్కులు కల్పించాలి. దళితులు, ఆదివాసీలు, శూద్రులతో సహా అన్ని కులాల కోసం వాటిల్లో ప్రవేశానికి హక్కు కల్పించేలా ధార్మిక పాఠశాలలను, కళాశాలలను తెరవాలి. 2) చర్మశుద్ధి నుండి కుండల తయారీ వరకు అన్ని వృత్తుల గౌరవం పెరిగేలా బోధనా సామగ్రిని రూపొందించాలి. 3) దేశం, సమాజం, కుటుంబం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం మంచిదని ప్రచారం చేయడం ద్వారా కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి. 4) మాంసాహారం, శాకాహారంతో సంబంధం లేకుండా ఇతరుల ఆహార ఎంపికను గౌరవిస్తూ కలిసి భోంచేసేలా చూడాలి.

ఢిల్లీలో జరిగిన జీ20 సదస్సుతో సహా, శుద్ధ శాకాహారమే హిందూ లేదా భారతీయ ఆహార సంస్కృతిగా జరుగుతున్న ప్రచారాన్ని నిలిపివేయాలి. కుల నిర్మూలన గురించి ఆర్‌ఎస్‌ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఈ అంశాలపై తన వైఖరిని స్పష్టంగా తెలియ జేయాలి.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సమాచారం గాలికి?



81 కోట్ల మంది భారతీయుల కోవిడ్ సమాచారం అతిక్రమణకు గురైనట్టు తెలుస్తోంది. డార్క్ వెబ్‌లో పెట్టిన డాటాలో పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, ఆధార్ కార్డ్ నంబర్లు లాంటి సమాచారం ఉంది.

– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

సాహో అఫ్ఘానిస్తాన్!



2023 ప్రపంచ కప్ చరిత్ర రాసినప్పుడు (ఆట ఇంకా పూర్తి కాలేదనుకోండి), అఫ్ఘానిస్తాన్ ఒక పూర్తి అధ్యాయానికి అర్హురాలు. ఇండియా ఆట అంతా క్లాస్‌గా ఉంటే, అఫ్ఘాన్లు మాత్రం హృదయంతో ఆడారు (చాలా నైపుణ్యంతో కూడా).

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ఆ హక్కు ఉందా?



ఇజ్రాయిల్‌కు యూఎస్ ఏటా 3.8 బిలియన్ డాలర్లు అందిస్తోంది. బైడెన్ ప్రభుత్వం, కాంగ్రెస్ ఒకటి స్పష్టం చేయాలి. ఇజ్రాయిల్‌కు తనను తాను రక్షించుకునే, హమాస్‌ను నాశనం చేసే హక్కు ఉంది. కానీ గాజాలోని వేలాదిమంది అమాయకులను చంపడానికి యూఎస్ డాలర్లను వాడే హక్కు లేదు.

– బెర్నీ శాండర్స్, అమెరికా నాయకుడు

ముందే వెలుగు



1996. ఎట్టకేలకు మా నాన్నను నాకోసం ఒక హీరో హోండా స్ప్లెండర్ కొనడానికి ఒప్పించాను. ఆ 46 వేల కోసం ఆయన తన బీమా పాలసీని సరెండర్ చేసినట్టున్నారు. ఇవ్వాళ ఈ స్ప్లెండర్ (ఫొటో షేర్ చేశారు)ను మాతో 15 ఏళ్లుగా ఉన్న మా డ్రైవర్ రవీందర్ కోసం బుక్ చేశాను. దీపావళి మనకే కాదు, మన కోసం పనిచేసేవాళ్లకు కూడా!

– దీపక్ కృష్ణమూర్తి, వైద్యుడు

తేడా లేదు!



ఈ యుద్ధంతో ఒకటి మరింత స్పష్టంగా అర్థమవుతోంది. అధికారిక ప్రజాస్వామ్యాల్లోని ప్రజలు కూడా నిరంకుశ దేశాల్లోని ప్రజల్లా అంతే బ్రెయిన్ వాష్‌కు గురయ్యి, ఏ విమర్శనాత్మక ఆలోచన లేని వాళ్లుగా ఉండగలరు.

– సి ఎంగుయెన్, ఫెలో

ఓటు హక్కు కోసం మహిళా పోరాటం

అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో 1913 లో స్త్రీల ఓటు హక్కు కోసం పెద్ద ఊరేగింపు జరిగింది. మహిళల ఓటు హక్కు ఉద్యమకారిణి ఇనెజ్ మిల్హాలండ్ ఊరేగింపునకు నాయకత్వం వహించారు. తెల్లటి పొడవు అంగవస్త్రం, టోపీ ధరించి, గుర్రంపై స్వారీ చేస్తూ జనాలను ఆకర్షించారు. మహిళా ఓటు హక్కు ఉద్యమకారిణి, ఆంగ్ల వనిత ఎమ్మెలైన్ పంఖుర్స్ట్ నుంచి స్ఫూర్తి పొందారు. న్యూయార్క్ నగరంలో పిల్లల, స్త్రీల, కార్మిక హక్కుల కోసం పనిచేశారు. 1916లో అమెరికా అంతటా మహిళల ఓటు హక్కు కోసం ప్రచారం చేశారు. కాలిఫోర్నియా రాష్ట్రం, లాస్ ఏంజిల్స్‌లో ఉపన్యసిస్తూ కుప్పకూలారు. తీవ్ర రక్తహీనతతో మరణించారు. తన ఘాటయిన పదజాల ఉపన్యాసాలతో ఇనెజ్ అమెరికా మహిళల ఓటు హక్కు ఉద్యమ గుర్తుగా మారారు.



ఇనెజ్ మిల్హాలండ్

ఎమ్మెలైన్ పంఖుర్స్ట్ బ్రిటన్ మహిళల ఓటు హక్కు ఉద్యమ నాయకురాలు. 'చేతలే, మాటలు కాద'న్న నినాదంతో 1903లో మహిళల సామాజిక, రాజకీయ సంఘం (డబ్ల్యు.ఎస్.పి.యు.)ను స్థాపించారు. ఈ సంస్థ స్త్రీల ఓటు హక్కుకు తీవ్రంగా పోరాడింది. సమరశీల పోరాట ఎత్తుగడలతో డబ్ల్యు.ఎస్.పి.యు. ప్రసిద్ధి గాంచింది. 'స్త్రీల జీవితాలు అధ్వాన్నంగా ఉన్నాయి. వారి పరిస్థితులు, మా ఉద్యమ అవసర కారణాల వైపు ప్రభుత్వ దృష్టిని మరల్చడానికి చట్ట ధిక్కరణ కూడా మా బాధ్యత' అని ఎమ్మెలైన్ తమ తీవ్ర తిరుగుబాటు చర్యలను సమర్థించుకునేవారు. 1918లో పాక్షిక విజయాన్ని సాధించారు. ప్రభుత్వం 30 ఏళ్లు నిండిన స్థానిక ప్రభుత్వ సభ్యురాళ్లకు, సభ్యుల భార్యలకు ఓటు హక్కునిచ్చింది. 1928లో ఎమ్మెలైన్ క్యాన్సర్‌తో మరణించిన తర్వాత బ్రిటిష్ స్త్రీలకు సంపూర్ణ ఓటు హక్కు లభించింది.

మరొక అమెరికా మహిళా ఓటు హక్కు ఉద్యమకారిణి ఆలిస్ పాల్ 1917లో 7 నెలల జైలు శిక్ష అనుభవించారు. మహిళల ఓటు హక్కు కోసం రాజధాని వాషింగ్టన్ శ్వేతసౌధం వద్ద శాంతియుతంగా ధర్నాచేయడమే ఆమె చేసిన నేరం. ఆమె తల్లి నేషనల్ అమెరికన్ ఉమన్ సఫ్రేజ్ (వోటు హక్కు) అసోసియేషన్ సభ్యురాలు. తల్లి ద్వారా ఆలిస్ మహిళల ఓటు హక్కు ఉద్యమ నాయకురాలయ్యారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఆర్థికశాస్త్రం)లో సామాజిక, ఆర్థిక శాస్త్రాల అధ్యయనానికి లండన్ వెళ్లారు. అక్కడ స్త్రీల ఓటు హక్కు ఉద్యమంలో చేరారు. ఆ ఉద్యమ నిరసనలు, ఊరేగింపుల్లో క్రమం తప్పక పాల్గొనేవారు. అక్కడ మరొక మహిళా హక్కుల అమెరికా ఉద్యమకారిణి లూసి బరన్స్‌తో పరిచయమైంది. లూసితో కలిసి అమెరికాకు వచ్చారు. 'నేషనల్ ఉమెన్స్ పార్టీ'ని స్థాపించారు. ఆలిస్ కృషి ఫలితంగా మహిళల ఓటు హక్కు ఉద్యమం విజయం సాధించింది. 1878లో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణను 1920లో అమెరికా ప్రభుత్వం 19వ రాజ్యాంగ సవరణగా ఆమోదించింది. స్త్రీలకు ఓటు హక్కు లభించింది. తర్వాత ఆలిస్ స్త్రీల సమాన హక్కుల కోసం 'లింగ వివక్షతో అమెరికా కాని, రాష్ట్ర ప్రభుత్వాలు కాని స్త్రీలకు సమాన హక్కులను నిరాకరించరాదు, కుదించరాదన్న' ఆశయంతో తీవ్రంగా పోరాడారు. సమాన హక్కుల కోసం రాజ్యాంగ సవరణ జరుగుతుండగానే '1964 పౌర హక్కుల చట్ట' సవరణ ద్వారా మహిళల రక్షణ హక్కును సాధించారు.

– సంగిరెడ్డి హనుమంత రెడ్డి, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి
మొబైల్: 94902 04545

అమరజీవి నడిచిన దారిలో...

సందర్భం



పి. విజయబాబు

'నాకు శ్రీరాములు వంటి పదకొండు మంది అనుచరులు ఉంటే చాలు. నేను ఒక్క సంవత్సరంలో బ్రిటిష్ పాలన నుంచి దేశాన్ని విముక్తి చేస్తాను' అని పొట్టి శ్రీరాములు అంకిత భావం, ఉపవాస సామర్థ్యం గురించి వ్యాఖ్యానిస్తూ గాంధీజీ అన్నారు. తెలుగువారందరికీ ప్రాతఃస్మరణీయుడైన శ్రీరాములు గొప్పదనానికి ఇంతకంటే కితాబు ఏముంటుంది?

పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 'పెద్ద మనుషుల ఒప్పందం' ఫలితంగా తెలంగాణ ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలతో 1956 నవంబర్ 1న 'ఆంధ్రప్రదేశ్' ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవ తరణ దినోత్సవాన్ని ఏటా నవంబర్ ఒకటవ తేదీ నాడు జరుపుకోవడం ఆనవాయితీ అయింది.

అయితే 2014లో ఏపీ తెలంగాణ నుంచి విడిపోయిన తర్వాత నాటి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నవంబర్ 1 నుంచి మార్చి వేశారు. ఇది అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగానికి జరిగిన మహా అపరాధంగా భావించాలి. అయితే జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆ తప్పును సరిదిద్ది ఎప్పటిలాగే నవంబర్ 1 ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం జరుపుతూ శ్రీరాములు త్యాగానికి ఘన నివాళులర్పిస్తున్నారు.

మద్రాస్ రాష్ట్రంలో కలిసి ఉన్న తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని 56 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన పొట్టి శ్రీరాములు చరిత్ర సృష్టించారు. పొట్టి శ్రీరాములు మరణ వార్త తెలిసి వేలాదిమంది తెలుగు ప్రజలు మద్రాస్‌లోని మౌంట్ రోడ్‌కు చేరుకోవడంతో పరిస్థితి అల్లకల్లోలంగా మారింది. ప్రజా ఆస్తుల విధ్వంసం జరిగింది. తెలుగు ప్రాంతాలైన విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, భీమవరం, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, ఏలూరు, గుంటూరు, తెనాలి, ఒంగోలు, కనిగిరి, నెల్లూరులతో సహా అనేక ప్రాంతాల్లో ఆందోళనలు మిన్నంటాయి. అనకాపల్లి, విజయవాడలలో పోలీసులు ఏడుగురిని కాల్చి చంపారు. ఫలితంగా మద్రాస్, ఆంధ్రా ప్రాంతాలలో పెద్ద ఎత్తున నాలుగు రోజుల పాటు ప్రజాందోళన కొనసాగింది. దీంతో కేంద్ర సర్కారు దిగివచ్చి, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని అప్పటి ప్రధానమంత్రి నెహ్రూ 1952 డిసెంబరు 19న ప్రకటించారు. 1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా తెలుగు మాట్లాడే



వారి కోసం ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైంది. ఇది దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాంది అయ్యింది. అనంతరం, తెలంగాణను కలుపుతూ తెలుగు మాట్లాడే జిల్లాలు అన్నీ కలిసి హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైంది.

నెల్లూరు జిల్లాలోని పడమటపల్లిలో 1901లో శ్రీరాములు జన్మించారు. అయితే ఆ ప్రాంతంలో కరవు పరిస్థితులు నెలకొనడంతో వారి కుటుంబం మద్రాసుకు తరలి వెళ్లింది. అక్కడే పాఠశాలలో శ్రీరాములు తన విద్యాభ్యాసం పూర్తి చేశారు. తర్వాత శానిటరీ ఇంజనీరింగ్ బొంబాయిలోని విక్టోరియా జూబ్లీ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో చేశారు. కళాశాల విద్య తర్వాత, ముంబైలోని 'గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వే'లో చేరారు. దురదృష్టవశాత్తు తన భార్యను, అప్పుడే పుట్టిన బిడ్డను కోల్పోయారు. ఆయన జీవితంలో జరిగిన అత్యంత విషాదకర సంఘటన ఇది. ఆ సంఘటనను ఆయన జీర్ణించుకోలేకపోయారు. మనోవేదనతో రెండు సంవత్సరాల తరువాత ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేసి భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేందుకు గాంధీజీ నిర్వహిస్తున్న సబర్మతి ఆశ్రమంలో చేరారు.

గాంధీజీ ఆశయాలకు ప్రభావితులై దళితుల అభ్యున్నతికి విశేషమైన కృషి చేశారు. సమాజంలోని అంటరానితనాన్నీ, అసమానతలనూ నిరసించి అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త. కుల, మతాలకు అతీతంగా అట్టడుగు వర్గాల ఇళ్లలో భోజనం చేసేవారు. దళితుల హక్కులకు మద్దతుగా ఉపవాసాలు చేశారు. నెల్లూరు మూలపేట వేణుగోపాల స్వామి ఆలయంలో దళితుల ప్రవేశానికి మద్దతుగా ఆయన నిరాహార దీక్ష చేపట్టారు.


వారి హక్కుల సాధనకు కాళ్లకు చెప్పులు లేకుండా ఎర్రటి ఎండలో గొడుగు లేకుండా తిరిగేవారు. సమసమాజ స్థాపన కోసం గాంధీజీ సిద్ధాంతాలను ఆచరిస్తున్న ఆయన్ని చూసి కొంతమంది స్థానికులు పిచ్చివాడిగా భావించేవారు. దళితులకు సంఘీభావం తెలిపినందుకు ఒక దశలో అగ్రకులాల వారి ఆగ్రహానికి గురయ్యారు. ప్రత్యేకించి తన వైశ్య కులం వారు ఆయన్ని కులం నుంచి బహిష్కరించినట్లుగా ప్రకటించారు. అయినా ఆయన అవేవీ పట్టించుకోకుండా తన సంకల్పం కోసం దీక్షతో ముందుకు సాగిపోయారు. తదనంతర కాలంలో కానీ ఆయన గొప్పతనం ఏమిటో వాళ్లకు అర్థం కాలేదు.

దళితుల అభ్యున్నతికీ, అణగారిన వర్గాల సంక్షేమానికీ కృషి చేయడం నాయకుల బాధ్యత అని చెప్పిన పొట్టి శ్రీరాములు బాటలోనే నేటి సీఎం జగన్ మోహన్ రెడ్డి పయనించడం ముదావహం.

వ్యాసకర్త ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షులు
(నేడు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం)

దేవుని మార్గం

ఒకసారి యాజ్ఞవల్క్య మహర్షి వేద మంత్రాలను శిష్యులకి బోధిస్తున్నారు. శిష్యులు కూడా గురువు చెబుతున్న మంత్రాలను శ్రద్ధగా నేర్చుకుంటూ గురువు గారి స్వరంతో తమ స్వరం కలుపుతూ వల్లె వేస్తున్నారు. 'ఈ ప్రపంచంలో ఉన్న ప్రతి వస్తువు లోనూ ఈశ్వరుని చూడగలగాలి. మనకు కావలసినవన్నీ ఈశ్వరుడే సమకూర్చాడు. వాటిని త్యాగబుద్ధితో అనుభవిస్తూ ఆనందంగా జీవించాలి. ఈ విశ్వమంతా ఈశ్వరుని ఆజ్ఞ ప్రకారమే కదులుతోంది. మనిషి, మృగం, చెట్టు, పుట్ట, ఆడ, మగ, చిన్న, పెద్ద అన్ని ప్రాణుల్లోనూ భగవంతుని చూడగల సాధకుడే పరమాత్మను తెలుసుకోగలడు' అని గురువుగారు అన్నారు. అప్పుడు ఓ శిష్యుడు త్యాగంతో అంటే సర్వ సంగ పరిత్యాగం చేసి ధ్యానంలో కూర్చుని ఆత్మని పరమాత్మలో లీనం చెయ్యాలనేగా అర్థం? అటువంటి సామర్థ్యం అందరికీ ఉంటుందా? లేని వారికి మరేదైనా భగవంతుని చేరే మార్గం ఉందా?' అని ప్రశ్నించాడు.



'ఆత్మను పరమాత్మలో లీనం చేసే సామర్థ్యం అందరికీ ఉండదు. మహాత్ములు, పరిపక్వమైన జ్ఞానం కలవారు సృష్టి అణువు అణువులో దైవాన్ని చూడగలరు. అంత వైరాగ్యాన్ని పొందలేనివారు పుణ్య కార్యాలు చేస్తూ భగవంతుని చేరడానికి ప్రయత్నించాలి. పూజలు, వ్రతాలు, దాన ధర్మాలు, అతిథి సేవ, భూత సేవ వంటివి చేస్తూ జ్ఞాన మార్గంలో నడిచేవారు నూరేళ్లు ఆనందంగా జీవిస్తార'ని గురువుగారు సమాధానం చెప్పారు.

ఇది చాలా గొప్ప విషయం. అందరూ చేయగలిగే కర్మలే ఇవి. ఈ పూజలు, దాన ధర్మాలు, అతిథి సేవ వంటివి నిర్మలమైన మనసుతో, నిస్వార్థంగా చేయాలి. అప్పుడే భగవంతుని చేరగలం. మంచి మార్గంలో నడవడమే భగవంతుని చేరడమంటే!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.చవితి రా.10.40 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** రోహిణి ఉ.6.09 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ఉ.11.54 నుండి 1.32 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.22 నుండి 12.08 వరకు, **అమృత ఘడియలు:** రా.9.44 నుండి 11.22 వరకు. ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.02, **సూర్యాస్తమయం:** 5.27.

క్లుప్తంగా...

'బర్డ్' ట్రస్ట్‌కు రూ.70 లక్షల విరాళం



టీటీడీ ఈవోకు విరాళాన్ని అందజేస్తున్న దాత

తిరుపతి కల్చరల్: కర్ణాటకలోని హారోహళ్లికి చెందిన ఆర్కిడ్ లామినేట్స్ ప్రైవేట్ సంస్థ తరపున ఆ సంస్థ ప్రతినిధి టి.బాలసుదర్శన్‌రెడ్డి మంగళవారం బర్డ్ ట్రస్ట్‌కు రూ.70.70 లక్షలు విరాళంగా అందజేశారు. సంబంధిత డీడీని తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో ఏవీ ధర్మారెడ్డికి దాత అందించారు. బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

20 నుంచి టీటీడీ కార్తీక దీపోత్సవాలు

రాష్ట్రంలో 3 ప్రాంతాల్లో నిర్వహణ



సమీక్షిస్తున్న ఏవీ ధర్మారెడ్డి

తిరుపతి కల్చరల్: ధర్మప్రచారంలో భాగంగా ఈ నెల 20న తిరుపతి, 27న కర్నూలు, డిసెంబర్ 4న విశాఖలో కార్తీక దీపోత్సవాలు నిర్వహిస్తామని ఇందుకోసం విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. టీటీడీ పరిపాలన భవనంలో మంగళవారం ఆయన కార్తీక దీపోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. దాతల సహకారంతో ఈ 3 ప్రాంతాల్లో కార్తీక దీపోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం ఆయా జిల్లా, పోలీస్ యంత్రాంగాల సహకారం తీసుకోవాలని సూచించారు. శ్రీవారి ఆలయ ప్రధానార్చకులతో సంప్రదించి దీపోత్సవానికి అవసరమైన సామాగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు. ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీపోత్సవ కార్యక్రమ సరళిపై సుదీర్ఘంగా చర్చించాలని, ఎక్కువ మంది భక్తులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో శ్రీలంక మంత్రి



శ్రీలంక మంత్రి ప్రసన్న రణతుంగను సత్కరిస్తున్న ఆలయ అధికారి

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం శ్రీలంక హౌసింగ్ శాఖ మంత్రి ప్రసన్న రణతుంగ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రణతుంగకు గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

రూ.20 వేలు స్వాధీనం



క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్ చూపుతున్న సీఐ రాఘవరెడ్డి

పుంగనూరు(చిత్తూరు జిల్లా): క్రికెట్ బెట్టింగ్ ముఠాలోని ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ రాఘవరెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. పట్టణానికి చెందిన రంజిత్‌కుమార్, అఫ్సర్, నిరంజన్, సుహేల్‌బాషా, శివకుమార్ కలసి పట్టణంలోని సెంట్రల్ లాడ్జిలో ఉన్న కరీమ్ టీస్టాల్‌లో ప్రపంచ కప్ ఇంగ్లండ్–ఇండియా మధ్య పోటీలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌తో డబ్బు వసూలు చేస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. వారి నుంచి రూ.20 వేలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచగా, వారికి ఒక్కొక్కరికి రూ.300 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

జగిరాం ఫైబర్ జ్యూట్ మిల్లు తెరిపించండి

సీఎం వైఎస్ జగన్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

సాక్షి, అమరావతి: పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు మండలం, జగిరాంలోని ఏపీ ఫైబర్ జ్యూట్ మిల్లు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎంకు రాసిన లేఖను మంగళవారం మీడియాకు విడుదల చేశారు. జగిరాంలో ఏపీ ఫైబర్ జ్యూట్ మిల్లును 17 నెలల క్రితం యాజమాన్యం అక్రమంగా లాకౌట్ ప్రకటించిందని తెలిపారు. పలు దఫాలు కార్మికులు తమ ఆవేదనను మిల్లు యాజమాన్యానికి తెలియజేసినప్పటికీ నేటి వరకు వారు మొండిగానే వ్యవహరిస్తూ వచ్చారన్నారు. తహసిల్దార్, పార్వతీపురం అసిస్టెంట్ లేబర్ కమిషన్ సమక్షంలో చర్చలు కోసం పిలిచినా యాజమాన్యం పట్టించుకోవడంలేదని తెలిపారు.

అంబరాన్నంటిన పైడితల్లి సిరిమానోత్సవం

ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి బొత్స దంపతులు

- ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు
- మధ్యాహ్నం 12 గంటలకు ఆలయానికి చేరుకున్న సిరిమాను
- 4.30 గంటలకు చదురుగుడి నుంచి రథం ప్రారంభం
- మూడు సార్లు కోట వరకు వెళ్లి వచ్చిన రథం
- సిరిమాను పైనుంచి భక్తులపైకి అక్షతలు చల్లిన పూజారి
- 3.5 లక్షల మంది సిరిమాను ఉత్సవాన్ని వీక్షించినట్లు అంచనా



విజయనగరం వీధుల్లో సిరిమానోత్సవ తిరువీధి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోర్కెలు తీర్చే కల్పవల్లి విజయనగరంలోని పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత మంగళవారం ఉదయం పైడితల్లి అమ్మవారికి మంత్రి బొత్స సత్యనారాయణ దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటలకే సిరిమాను హుకుంపేట నుంచి ఆలయానికి చేరుకుంది. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానును అధిరోహించారు. మధ్యాహ్నం 3 గంటలకు సిరిమాను కట్టడాలు పూర్తి చేసి, పూజలు చేశారు. 4:30 గంటలకు మూడు లాంతర్లు వద్దనున్న చదురుగుడి నుంచి సిరిమాను రథం బయల్దేరింది. మూడుసార్లు ఆలయం నుంచి కోట వరకూ వెళ్లింది. సిరిమానుపై ఆశీనులైన పూజారి రూపంలో ఉన్న అమ్మవారు పైనుంచి అక్షితలను చల్లి భక్తులను ఆశీర్వదించారు. ఉత్సవం సాయంత్రం 5.56 గంటలకు పూర్తయింది. సిరిమాను తిరుగుతున్నంతసేపూ ఆలయంలోని అమ్మవారికి వేదపండితులు లక్ష పుష్పార్చన చేశారు. సుమారు మూడున్నర లక్షల మంది సిరిమాను ఉత్సవాన్ని వీక్షించినట్లు అధికారులు అంచనావేశారు. విజయనగరం కోటపై నుంచి అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, జిల్లా సహకార బ్యాంకు ప్రాంగణంలోనుంచి మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సిరిమానును వీక్షించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం కమాండ్ కంట్రోల్ ద్వారా నిరంతర నిఘా పెట్టడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సిరిమానోత్సవాన్ని ఆద్యంతం పర్యవేక్షించారు. సిరిమానోత్సవం సందర్భంగా నిర్వహించిన విజయనగరం సాంస్కృతిక ఉత్సవాలు అంబరాన్నంటాయి.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

సిరిమానోత్సవం సందర్భంగా తెల్లవారుజాము నుంచే పలువురు ప్రముఖులు, భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. మంత్రి బొత్స సత్యనారాయణ దంపతులతో పాటు మంత్రి గుడివాడ అమర్‌నాథ్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, కంబాల జోగులు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, సినీ నటుడు సాయి కుమార్ తదితరులు దర్శించుకున్నారు.



సిరిమానును అధిరోహించిన పూజారి వెంకటరావు



పైడితల్లి అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ దంపతులు

'శ్రీవారి' కోసం.. వేల కిలోమీటర్లు కాలినడకన..

- గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ నుంచి తిరుమలకు..
- శ్రీవారి దర్శన భాగ్యం అనంతరం తిరిగి సొంతూరుకు..
- వేలాది కిలోమీటర్ల కాలినడక

తాడిపత్రి: ఏడుకొండల స్వామిని దర్శించుకోవాలనే సంకల్పం ఆ వృద్ధ దంపతులను వేలాది కిలోమీటర్ల దూరం నడిపించింది. స్వామివారి దర్శనభాగ్యం లభించిన అనంతరం తిరిగి కాలినడకనే సొంతూరికి తిరుగు పయనమయ్యారు. తాడిపత్రి ప్రాంతానికి చేరుకున్న ఆ వృద్ధ దంపతులను 'సాక్షి' పలకరించగా.. ఆశ్చర్యకర విషయాలు వెల్లడయ్యాయి.. గుజరాత్ రాష్ట్రంలోని ద్వారకాకు చెందిన డాక్టర్ ఆర్.ఉపాధ్యాయ(74), భార్య సరోజినీ (71).. డాక్టరేట్ పూర్తి చేశారు. ఉపాధ్యాయ తల్లి మెడికల్ సూపరింటెండెంట్‌గా పనిచేసేవారు. ఆమె కొన్నేళ్ల క్రితం కేన్సర్‌తో చనిపోయారు. ఆమెకు జీవితంలో ఒక్కసారైనా తిరుమల వెంకన్న స్వామిని దర్శనం చేసుకోవాలనే కోరిక ఉండేది. కేన్సర్ కారణంగా శరీరం సహకరించక పోవడంతో ఆమె కోరిక నెరవేరలేదు. కానీ అత్త బాధను అర్థం చేసుకున్న కోడలు సరోజినీ తన భర్త ఉపాధ్యాయతో కలసి కాలినడకన వెళ్లి ఏడుకొండల వాడిని దర్శనం చేసుకుంటామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి దాదాపు 70 రోజుల క్రితం సుమారు 2,150 కిలోమీటర్ల దూరంలోని తిరుమలకు తోపుడు బండి (లగేజీ కోసం) తీసుకుని కాలినడకన బయలు దేరారు. స్వామి సన్నిధికి చేరుకునేందుకు 59 రోజులు పట్టింది. వెంకన్న దర్శనానంతరం తిరిగి కాలినడకనే సొంతూరికి పయనమయ్యారు. కాగా, ఏడు కొండల వాడి దర్శనానికి బయలుదేరే ముందు తన భార్యకు కాళ్లవాపుతో పాటు ఆయాసం ఉండేదని, తనకూ గ్లకోమా వ్యాధి ఉండేదని ఉపాధ్యాయ చెప్పారు. స్వామిపైన భారం వేసి యాత్ర మొదలుపెట్టామని, ఇప్పుడంతా బాగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. తన భార్య నడవలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు తోపుడు బండిపై కూర్చోబెట్టుకుని కొంతదూరం తోసుకుంటూ వెళ్తున్నట్లు ఉపాధ్యాయ చెప్పారు. వారి సంకల్పాన్ని చూసిన పలువురు ఆశ్చర్యపోతున్నారు.



తోపుడు బండిపై భార్య సరోజినీని కూర్చోబెట్టుకుని తోసుకుంటూ వెళుతున్న ఉపాధ్యాయ

కిడ్నాప్ కేసులో దస్తగిరి అరెస్ట్

యువతిని అపహరించి తీసుకువెళ్తుండగా పట్టుకున్న పోలీసులు

ఎర్రగుంట్ల: వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని పోలీసులు ఓ కిడ్నాప్ కేసు వ్యవహారంలో అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు మరో నలుగురిపై కిడ్నాప్ కేసు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం వైఎస్సార్ జిల్లా యర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌లో జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు మీడియాకు తెలిపారు. వేర్వేరు కులాలకు చెందిన ఇమాంబీ, లక్ష్మీనారాయణ డిగ్రీ చదువుతోన్న సమయంలో ప్రేమించుకున్నారు. తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తుండటంతో లక్ష్మీనారాయణతో కలిసి ఇమాంబీ ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన అనంతరం ఇమాంబీని సీఐ ఈశ్వరయ్య తహశీల్దార్ ఎదుట ప్రవేశపెట్టారు. ఇమాంబీ వయసు 18, లక్ష్మీనారాయణ వయసు 21 కావడంతో ఇమాంబీని తల్లిదండ్రులకు అప్పగించారు. అయితే ఇమాంబీ తల్లిదండ్రులు వద్దంటూ సుందరయ్య కాలనీలోని లక్ష్మీనారాయణ ఇంటికి వెళ్లిపోయింది. కొన్ని రోజులు గడిచిన తర్వాత ఇమాంబీ తల్లిదండ్రులు దస్తగిరి, మరి కొందరితో కలసి ఈ నెల 30న లక్ష్మీనారాయణ ఇంటికి వచ్చారు. అక్కడ ఉన్న ఇమాంబీని బలవంతంగా ఈడ్చుకుని వెళ్లారు. ఈ సమయంలో లక్ష్మీనారాయణను దస్తగిరి కులం పేరుతో దూషించాడు. అతడి వెంట ఉండే ఎస్కార్ట్ పోలీసులను ప్రొద్దుటూరుకు పోవాలంటూ తప్పుదోవ పట్టించి కడప వైపునకు బయలుదేరాడు. ఎస్కార్ట్ పోలీసులు యర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్యకు సమాచారమిచ్చారు. చెన్నూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో దస్తగిరి వెళుతోన్న వాహనాలను ఆపి తనిఖీ చేయగా అందులో ఇమాంబీ ఉంది. ఘటనాస్థలికి వెళ్లి చుట్టు పక్కల వారిని విచారించగా ఇమాంబీని బలవంతంగా కిడ్నాప్ చేసి తీసుకుని వెళ్లి, లక్ష్మీనారాయణను కులం పేరుతో దూషించినట్లు స్పష్టమైంది. దీంతో ఈ విషయంపై 2 కేసులను పోలీసులు నమోదు చేశారు. ఈ కేసులో దస్తగిరి (పులివెందుల), ఎస్ ఇమ్రాన్ (వేముల) బాష, ఎస్ రమీజా (యర్రగుంట్ల), ఎస్.అశ్విన్(పులివెందుల), ఎస్ హైదర్‌బీ (తొండూరు)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు.



దస్తగిరిని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు.. (ఇన్‌సెట్లో) సుందరయ్య కాలనీలో లక్ష్మీనారాయణ ఇంటి వద్ద దస్తగిరి

ఒరిజినల్ డాక్యుమెంట్లు తనిఖీ చేశాకే మ్యుటేషన్లు

డాక్యుమెంట్స్ ఒరిజినలా, కాదా అనేది తహసీల్దార్లు సర్టిఫై చేయాలి

- ఒరిజినల్స్ పరిశీలించినట్లు ఆన్‌లైన్‌లో ధ్రువీకరించాలి
- జిరాక్స్, ఇతర అనధికార పత్రాలతో మ్యుటేషన్లు చేయకూడదు
- నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు
- కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ సర్క్యులర్

సాక్షి, అమరావతి: మ్యుటేషన్లకు సంబంధించి ప్రభుత్వం కీలకమైన ఆదేశాలు జారీ చేసింది. భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లను తనిఖీ చేశాకే మ్యుటేషన్లు చేయాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించింది. జిరాక్స్, ట్రూ కాపీలు, ఇతర అనధికారిక పత్రాల ఆధారంగా మ్యుటేషన్లు చేయవద్దని స్పష్టం చేసింది. వీటివల్ల వివాదాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ ఆదేశాలిచ్చింది. ఒరిజినల్ డాక్యుమెంట్లను తహసీల్దార్లు ధృవీకరించాలని చెప్పింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ యంత్రాంగానికి భూ పరిపాలన ప్రధాన కమిషనర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ సర్క్యులర్ జారీ చేశారు. తహశీల్దార్లు ప్రతి మ్యుటేషన్‌కు తప్పనిసరిగా సేల్ డీడ్ వంటి ఒరిజినల్ డాక్యుమెంట్లు, వాటి ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లు, ఒరిజినల్ ఈసీతోపాటు దానికి సంబంధించిన ఇతర అధికారిక పత్రాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. ఒరిజినల్ డాక్యుమెంట్లను పరిశీలించినట్లు తహసీల్దార్ ఆన్‌లైన్‌లో ధృవీకరించాలని (సర్టిఫై చేయాలి) ఆదేశించారు. రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్ నుంచి ఆన్‌లైన్‌లో చూసే డాక్యుమెంట్లు తప్ప ఇతర ఏ సందర్భంలోనైనా ఈ విధానం పాటించాల్సిందేనని చెప్పారు. ఇండియన్ ఎవిడెన్స్ చట్టం ప్రకారం ఒరిజినల్ డాక్యుమెంట్లని ధృవీకరించకుండా చేసిన ఎలాంటి మ్యుటేషన్ లేదా ఆర్డర్ ఆమోదయోగ్యం కాదని తెలిపారు.

రాష్ట్రంలో పలుచోట్ల తహశీల్దార్లు ఫొటో కాపీల ఆధారంగా మ్యుటేషన్లు చేయడం, అసలైన యజమానులు ఫిర్యాదుతో అవి సరైన పత్రాలు కావని నిర్ధారణ అయిన నేపథ్యంలో హైకోర్టు సీరియస్‌గా స్పందించింది. దీంతో సీసీఎల్ఏ ఈ ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ శాఖలోని చివరి వ్యక్తి నుంచి అన్ని స్థాయిల్లో ఈ నిబంధనలు పాటించాలని, దీనికి విరుద్ధంగా ఎవరైనా ఫొటో కాపీలు చూసి మ్యుటేషన్లు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. యాక్ట్ 15 ఆఫ్ 2022 ప్రకారం క్రిమినల్ లా కింద ఎవరైనా ఆర్ఓఆర్ చట్టానికి విరుద్ధంగా ఆర్డర్లు ఇస్తే వారిని జిల్లా కలెక్టర్లు విచారించే అధికారం ఉందని తెలిపారు.

రూ. 6 కోట్లతో 'గంగవరం'లో సదుపాయాల పెంపు



అదానీ గంగవరం పోర్ట్

పెదగంట్యాడ (గాజువాక): అదానీ గంగవరం పోర్ట్ కొత్త కార్గో హ్యాండ్లింగ్ పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పోర్ట్ ప్రాంగణంలో మౌలిక సదుపాయాలు పెంచుతున్నట్లు మంగళవారం వెల్లడించింది. పోర్టులో సామర్థ్యం, ఉత్పాదకతను పెంపొందించడానికి అదానీ గంగవరం పోర్టు పెట్టుబడి ప్రణాళికలో భాగంగా ఈ చర్యలు చేపట్టింది. ఈ కార్గో హ్యాండ్లింగ్ పరికరాలలో 2 కొత్త గ్రాబ్స్ (సామర్థ్యం–46 సీబీఎం ఒక్కొక్కటి) రెండు కొత్త కార్గో హాప్పర్స్ (సామర్థ్యం ఒక్కొక్కటి 60 ఎంటీలు) ఉన్నాయి. రూ.6 కోట్లతో కొత్త పరికరాలు కార్గోను సమర్థవంతంగా నిర్వహించగల రీతిలో పోర్ట్ సామర్థ్యాన్ని పెంపొందిస్తాయి. తద్వారా తక్కువ టర్న్ అరౌండ్ సమయం సాధ్యమవుతుందని పోర్టు వర్గాలు తెలిపాయి.

బాబును జైలుకు పంపి.. రాష్ట్రాన్ని కాపాడండి..

1,129వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: తాత్కాలిక బెయిల్‌పై బయటకొచ్చిన చంద్రబాబు తన కేసుల్లో ఆధారాలు లేకుండా చేసేందుకు కుట్రలు పన్ని రాష్ట్రంలో అల్లర్లు సృష్టించే అవకాశం ఉందని, వీలైనంత త్వరగా ఆయనను మళ్లీ జైల్లో పెట్టి రాష్ట్రాన్ని కాపాడాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు కోరారు. న్యాయస్థానాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,129వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాలను అడ్డుపెట్టుకుని రూ. వేల కోట్లు దోపిడీ చేసిన బాబు ఈ ప్రాంత రైతులు, రైతు కూలీలను మాత్రం రోడ్డున పడేశాడన్నారు. పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్న కులవాదులు.. మూడు రాజధానులు, ఇంగ్లిష్ మీడియం విద్య, బాబు అవినీతి కేసుల్లో స్టేలు ఎలా తెచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. బాబుకు మధ్యంతర బెయిల్ రావడాన్ని స్వాగతిస్తున్న ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి.. అవినీతిని ప్రోత్సహిస్తున్నట్టేనన్నారు. ఏపీలో న్యాయవ్యవస్థ పనితీరుపై 5 కోట్ల మంది ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుంటే.. ఓ సామాజిక వర్గం మాత్రం గగ్గోలు పెట్టి ఇష్టానురీతిగా మాట్లాడుతుందని విమర్శించారు. నాయకులు పులి దాసు, పల్లె బాబు, ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

డ్రైవర్ రామ్‌సింగ్‌కు ఆర్టీసీ ఎండీ పరామర్శ



శ్రీరామ్‌సింగ్‌ను పరామర్శిస్తున్న ద్వారకా తిరుమలరావు

సాక్షి, అమరావతి: కావలి తరహా ఘటనలు పునరావృతం కాకుండా అన్ని జిల్లాల ఎస్పీలను అప్రమత్తం చేసినట్టు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఈ నెల 26న శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, కావలిలో జరిగిన దాడిలో గాయపడి, విజయవాడ విద్యాధరపురం ఆర్టీసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీరామ్‌సింగ్‌ను ద్వారకా తిరుమలరావు మంగళవారం పరామర్శించారు. దాడి ఘటన గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని చీఫ్ మెడికల్ ఆఫీసర్ డీవీఎస్ అప్పారావును ఆదేశించారు. సంస్థ అండగా ఉంటుందని ఆందోళన చెందవద్దని శ్రీరామ్‌సింగ్ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. దాడి జరిగిన వెంటనే నెల్లూరు జిల్లా ఎస్పీతో మాట్లాడానని, కేసుకు సంబంధించి ఇప్పటికే పోలీసులు పలువురిని అరెస్టు చేశారని ద్వారకా తిరుమలరావు వివరించారు.

ప్రసాదాల నాణ్యత పరీక్షకు ఒప్పందం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడి
- రూ.800 కోట్లతో ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణ పనులు



సాక్షి, అమరావతి: ఆలయాల్లో భక్తులకు పంపిణీ చేసే ప్రసాదాల నాణ్యతను పరీక్షించేందుకు ఎన్ఏబీఎల్ ఆమోదం పొందిన ల్యాబ్‌తో దేవదాయ శాఖ ఒప్పందం కుదుర్చుకుంటున్నట్టు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో దేవదాయ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేవదాయ శాఖ పరిధిలో టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా దాదాపు రూ.300 కోట్లతో కొత్తగా 3,000 ఆలయాల నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. మరో రూ.500 కోట్లతో పురాతన ఆలయాల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. కాంట్రాక్టర్లకు బిల్లుల క్లియరెన్స్‌లో ఆలస్యం జరగకుండా కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక అకౌంట్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఇకపై దేవదాయ శాఖ పరిధిలో జరిగే కాంట్రాక్టు పనులకు ఈ విభాగం ద్వారానే చెల్లింపులు జరుగుతాయన్నారు. రూ.5 కోట్లకు పైబడిన అభివృద్ధి పనుల టెండర్ల పర్యవేక్షణకు దేవదాయ శాఖ కమిషనర్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రసాదాల తయారీకి ఉపయోగించే పదార్థాల రేట్లలో వ్యత్యాసాన్ని నియంత్రించేందుకు.. ప్రధాన పదార్థాల రేట్లను నిర్ణయించేందుకు రాష్ట్రస్థాయి టెండర్ కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే వారంలో గోదావరి జిల్లాల్లో హిందూ ధర్మ ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

టీడీపీ, జనసేనలది కలహాల కాపురమే..

టీడీపీ, జనసేన పార్టీలది పూర్తిగా కలహాల కాపురమేనని.. సమన్వయ కమిటీ సమావేశాల పేరుతో ఇరు పార్టీల నేతలు కడుపులో కత్తులు పెట్టుకొని, పైకి కౌగిలించుకున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వ్యాఖ్యానించారు. కలిసి పోటీ చేయడం వల్ల తమకేదో లబ్ధి చేకూరుతుందనే భ్రమల్లో ఆ పార్టీల అగ్ర నాయకులున్నారని.. కానీ క్షేత్ర స్థాయిలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. తెలంగాణలో టీడీపీ దుకాణం మూతపడిందన్నారు. ఏపీలో కూడా ఆ పార్టీ సొంతంగా పోటీ చేయలేక.. జనసేనను నమ్ముకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. న్యాయవ్యవస్థను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన లోకేశ్‌ను అరెస్టు చేయాల్సిన అవసరముందన్నారు.

తెలంగాణ

అమెరికాలో ఖమ్మం యువకుడిపై హత్యాయత్నం

- జిమ్ నుంచి వస్తుండగా కత్తితో దాడి చేసిన దుండగుడు
- తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

ఖమ్మంక్రైం: అమెరికాలోని చికాగోకు ఉన్నతవిద్య నిమిత్తం వెళ్లిన ఓ యువకుడిపై గుర్తుతెలియని దుండగుడు హత్యాయత్నం చేశాడు. దీంతో తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఖమ్మంలోని బుర్హాన్‌పురంలో నివసిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు పుచ్చా రామ్మూర్తి కుమారుడు వరుణ్ చికాగోలో ఉంటూ ఎంఎస్ చదువుతున్నాడు. ఈ నెల 29న జిమ్ నుంచి బయటకు వస్తున్న వరుణ్‌పై అకస్మాత్తుగా ఓ దుండగుడు కత్తితో దాడి చేశాడు. అప్రమత్తమైన వరుణ్ పొట్టకు చేతులు అడ్డుపెట్టుకోగా, నుదురు భాగంలో పొడిచాడు. తీవ్రగాయాలపాలైన వరుణ్ రక్తపు మడుగులో పడిపోగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వచ్చి ఆయనను ఆస్పత్రికి తరలించారు. అయితే ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. అమెరికాలో నివసిస్తున్న వారి బంధువు సాయివర్ధన్ ఫోన్ చేసి వరుణ్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. నిందితుడు ఆండ్రేడ్ జోర్డాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. వరుణ్‌పై దాడికి కారణాలు తెలియరాలేదు. కాగా, తమ కుమారుడికి మెరుగైన వైద్యం అందేలా చూడటంతోపాటు తాము అమెరికా వెళ్లేందుకు సహకరించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కోరినట్లు రామ్మూర్తి తెలిపారు.

యాదాద్రీశుడికి బంగారు చీర బహూకరణ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామికి సిరిసిల్లకు చెందిన నల్ల విజయ్ అగ్గిపెట్టెలో పట్టే బంగారు చీరను, శాలువాను మంగళవారం బహూకరించారు. మొదటగా శ్రీస్వామి వారిని దర్శించుకున్న నల్ల విజయ్, కుటుంబ సభ్యులు, అనంతరం అగ్గిపెట్టెలో తీసుకువచ్చిన బంగారు చీరను, శాలువాను ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద ఆలయాధికారులకు అందజేశారు. అనంతరం నల్ల విజయ్ మాట్లాడుతూ.. తన తండ్రి నల్ల పరంధాములు అగ్గిపెట్టెలో చీరను తయారు చేసి సిరిసిల్ల ఖ్యాతిని ప్రపంచానికి చాటారన్నారు. అదే స్ఫూర్తితో తాను కూడా అగ్గిపెట్టెలో ఇమిడే చీరను తయారు చేశానన్నారు. ఇటీవల కాలంలో తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి ఆలయానికి, విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయాలకు వేర్వేరుగా రెండు గ్రాములతో అగ్గిపెట్టెలో పట్టే బంగారు చీరను తయారు చేసి ఇచ్చినట్లు తెలిపారు. 15 రోజులు కష్టపడి, దేవుడిపై ఇష్టంతో ఐదున్నర మీటర్ల వెడల్పు, 48 ఇంచులు పొడవులో 120 గ్రాముల బరువుతో ఈ అగ్గిపెట్టెలో పట్టే బంగారు చీర, శాలువాను తయారు చేశానన్నారు. ఇందులో 2 గ్రాముల బంగారం వాడానని, మిగతావి నూలు, రంగులున్నాయని విజయ్ వెల్లడించారు.

ప్రతిపక్ష ఎంపీల ఐఫోన్ల హ్యాకింగ్!

రాజకీయ కాక

- జాబితాలో ఖర్గే, థరూర్, మొయిత్రా, ఏచూరి
- కేజ్రీవాల్ ఓఎస్డీ, రాహుల్ గాంధీ సన్నిహితులు కూడా
- ఇది కచ్చితంగా మోదీ సర్కారు నిర్వాకమే
- ప్రభుత్వంపై దుమ్మెత్తిపోసిన విపక్ష పార్టీలు
- అవాస్తవాలంటూ తోసిపుచ్చిన కేంద్రం
- లోతుగా దర్యాప్తు జరిపిస్తాం: కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటన
- నకిలీ అలర్టులు అయ్యుండొచ్చు
- ఇలా 150 దేశాల్లో వచ్చాయంటూ యాపిల్ సంస్థ వివరణ

ప్రభుత్వ దన్నుతో మీ ఐఫోన్ల హ్యాకింగ్ యత్నమంటూ విపక్ష ఎంపీల ఫోన్లకు యాపిల్ అలర్ట్‌లు

న్యూఢిల్లీ: పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల పోరు తారస్థాయికి చేరిన వేళ విపక్ష నేతల ఫోన్ల హ్యాకింగ్ వార్తలు దేశవ్యాప్తంగా పెను రాజకీయ సంచలనానికి దారితీశాయి. కాంగ్రెస్ మొదలుకుని పలు విపక్షాల ఎంపీలు తదితరుల ఐఫోన్లకు దాని తయారీ సంస్థ యాపిల్ నుంచి మంగళవారం వచ్చిన హ్యాకింగ్ అలర్టులు తీవ్ర కలకలం రేపాయి. 'ప్రభుత్వ ఆధ్వర్యంలో పని చేస్తున్న హ్యాకర్లు మీ ఐఫోన్లను నియంత్రణలోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు' అంటూ వచ్చిన హెచ్చరిక నోటిఫికేషన్లు సంచలనం సృష్టించాయి. ఇది కచ్చితంగా కేంద్రంలోని మోదీ సర్కారు పనేనంటూ విపక్ష నేతలు భగ్గుమన్నారు. గతంలో పెగాసెస్ సాఫ్ట్‌వేర్‌తో తమపై గూఢచర్యం చేసిన బీజేపీ, ఎన్నికల వేళ మరోసారి ఇలాంటి చౌకబారు చర్యలకు దిగిందంటూ దుయ్యబట్టారు. ఈ ఆరోపణలను కేంద్రం తీవ్రంగా ఖండించింది. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపించి వాస్తవాలు వెలుగులోకి తెస్తామని ప్రకటించింది. మరోవైపు ఈ కలకలం నేపథ్యంలో, తమ నోటిఫికేషన్లలో కొన్ని ఫేక్ అలర్టులు కూడా ఉండొచ్చంటూ యాపిల్ స్పందించింది. భారత్‌లోనేగాక 150 దేశాల్లో పలువురు యూజర్లకు ఇలాంటి అలర్టులు వచ్చాయని పేర్కొంది. అయితే ఈ అలర్టులకు దారితీసిన కారణాలను బయట పెట్టేందుకు నిరాకరించింది.

నా ఫోన్ తీసుకోండి: రాహుల్

ఈ ఉదంతంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. విపక్ష నేతల ఐఫోన్ల హ్యాకింగ్ కచ్చితంగా మోదీ సర్కారు పనేనంటూ తీవ్రంగా ధ్వజమెత్తారు. 'మేం భయపడేది లేదు. మా ఫోన్లను ఎంతగా హాకింగ్ చేసుకుంటారో చేసుకోండి. మీకు కావాలంటే చెప్పండి, నా ఫోన్ కూడా ఇస్తా' అంటూ విరుచుకుపడ్డారు. పారిశ్రామికవేత్త గౌతం అదానీయే ప్రస్తుతం దేశాన్ని రిమోట్ కంట్రోల్‌తో నడుపుతున్నారని ఆరోపించారు. 'ఇప్పుడు దేశంలో అదానీయే నంబర్ వన్. తర్వాతి స్థానాల్లో మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఉన్నారు. మోదీ ఆత్మ అదానీ దగ్గరుంది. అందుకే అదానీని ఎవరైనా ఒక్క మాటన్నా వెంటనే నిఘా వర్గాలు రంగంలోకి దిగుతున్నాయి.



దుయ్యబట్టిన విపక్ష నేతలు

ఈ ఉదంతంలో కేంద్రప్రభుత్వ పాత్ర కచ్చితంగా ఉందంటూ విపక్ష నేతలు ఆరోపించారు. తమ ఫోన్లలో అభ్యంతరకర సమాచారాన్ని చొప్పించి అందుకు తమను బాధ్యులను చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, శివసేన ఎంపీ ప్రియాంకా చతుర్వేది ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఈ అంశాన్ని తక్షణం లోక్‌సభ హక్కుల కమిటీకి నివేదించాలని డిమాండ్ చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మహిళా ఎంపీ మహువా మొయిత్రా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛ, గోప్యతలపై ఇలాంటి దాడి దారుణమని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తదితర విపక్ష నేతలను విచారణ పేరుతో వేధించడం, తాజాగా వారి ఫోన్ల హ్యాకింగ్‌కు ప్రయత్నించడం మోదీ సర్కారు అభద్రతా భావానికి సూచనలని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఆరోపించారు.

లోతుగా దర్యాప్తు: ఐటీ మంత్రి వైష్ణవ్

విపక్ష నేతల ఆరోపణలను కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కొట్టిపారేశారు. మోదీ నాయకత్వంలో దేశ ప్రగతిని చూసి ఓర్వలేక ఇలాంటి విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అయితే ఈ ఉదంతంపై కూలంకషంగా దర్యాప్తు జరిపించి నోటిఫికేషన్ల వ్యవహారాన్ని నిగ్గుదేలుస్తామని ప్రకటించారు. 'పూర్తి పారదర్శకంగా సరైన సమాచారాన్ని అందజేయడం ద్వారా విచారణలో మాతో కలిసి రావాల్సిందిగా యాపిల్‌ను కోరాం. ముఖ్యంగా ప్రభుత్వ దన్నుతో హ్యాకింగ్ జరగవచ్చని ఏ ఆధారంతో చెప్పారో వివరించాలని సూచించాం. ఇది పూర్తిగా సాంకేతికపరమైన దర్యాప్తు. కనుక కంప్యూటర్ సెక్యూరిటీ సంబంధిత అంశాలకు బాధ్యత వహించే జాతీయ నోడల్ ఏజెన్సీ సెర్ట్-ఇన్ దీన్ని చేపడుతుంది.' అని మంత్రి ప్రకటించారు. ఇలాంటి నోటిఫికేషన్లు 150కి పైగా దేశాల్లోని ఐఫోన్ యూజర్లకు వచ్చాయని ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ గుర్తు చేశారు.



అలర్టులు అందుకున్న నేతలు..

మల్లికార్జున ఖర్గే, శశి థరూర్, పవన్ ఖేరా, కె.సి.వేణుగోపాల్, సుప్రియా శ్రీనేత్, టి.ఎస్.సింగ్‌దేవ్, భూపీందర్ సింగ్ హుడా, రాహుల్ గాంధీ సహాయకులు, మహువా మొయిత్రా (టీఎంసీ), సీతారాం ఏచూరి (సీపీఎం), ప్రియాంకా చతుర్వేది (శివసేన-యూబీటీ), రాఘవ్ ఛద్దా (ఆప్), అసదుద్దీన్ ఒవైసీ (మజ్లిస్), సమీర్ సరణ్ (ఓఆర్ఎఫ్ అధ్యక్షుడు), సిద్దార్థ్ వరదరాజన్ (ద వైర్ వ్యవస్థాపక ఎడిటర్), ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఓఎస్డీ తదితరులు

యాపిల్ అలర్టులో ఏముందంటే...

'ప్రభుత్వ ఆధ్వర్యంలో పని చేసే హాకర్లు మీ ఐఫోన్‌ను టార్గెట్ చేసుకుని ఉండొచ్చని యాపిల్ అనుమానిస్తోంది. బహుశా మీ హోదా, మీరు చేస్తున్న పనుల వల్ల మీరు వ్యక్తిగతంగా వారి లక్ష్యంగా మారి ఉండొచ్చు. ఇలాంటి ప్రభుత్వ ఆధ్వర్యంలోని హాకర్లు మీ ఫోన్‌ను హాక్ చేసి తమ అధీనంలోకి తీసుకుంటే అందులోని సున్నితమైన డేటా, సమాచారంతో పాటు కెమెరా, మైక్రోఫోన్ వారి చేతిలోకి వెళ్లిపోతాయి. ఇది ఫేక్ హెచ్చరికే అయ్యుండే ఆస్కారమూ లేకపోలేదు. కానీ దయచేసి దీన్ని సీరియస్‌గా తీసుకోండి'

అర్ధరాత్రి రోడ్డుపై ప్రాణభయంతో పరుగులు..

బెంగళూరు: ఓ వ్యక్తి ప్రాణభయంతో పరుగులు తీస్తుండగా వెనుకే ఓ స్కార్పియో వాహనం అతడిని తరుముతోంది. చివరికి అతడిని బలంగా ఢీకొట్టి అంతే వేగంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది. బాధితుడు ఘటనా స్థలిలోనే ప్రాణాలు కోల్పోయాడు. బెంగళూరు నగరంలోని పులకేశి నగర్‌లో అక్టోబర్ 18వ తేదీ అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో అందరూ చూస్తుండగానే జరిగిన దారుణమిది. మృతుడిని అస్గర్‌గా గుర్తించిన పోలీసులు, సాధారణ రోడ్డు ప్రమాద కేసుగా భావించారు. అయితే, మృతుడి స్నేహితుడిచ్చిన సమాచారంతో దర్యాప్తు చేపట్టి ప్రధాన నిందితుడు అఫ్రీన్, అతడి వెంట ఉన్న మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. డబ్బు వివాదం కారణంగానే తామీ పనికి పూనుకున్నట్లు వారు అంగీకరించారు. దీంతో ముగ్గురిపైనా పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. అస్గర్ సెకండ్ హ్యాండ్ కార్ డీలర్ కాగా, అతడి వద్ద అఫ్రీన్ కారు కొనుగోలు చేశాడు. దీనికి సంబంధించి అతడు అస్గర్‌కు రూ.4 లక్షలు బకాయి పడ్డాడు. దీనిపై ఇద్దరి మధ్యా ఘర్షణ జరిగింది. అస్గర్ తనపై దాడి చేశాడంటూ అఫ్రీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసు వెనక్కి తీసుకోవాలని అస్గర్ కోరగా అఫ్రీన్ నిరాకరిస్తున్నాడు. ఘటన జరిగిన రాత్రి మాట్లాడుకుందాం రమ్మని అస్గర్‌ను అఫ్రీన్ పిలిచాడు. చెప్పినచోటుకు రాగానే ప్లాన్ ప్రకారం అతడిని కారుతో ఢీకొట్టి, చంపాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో ఈ ఘటన ఆ సాంతం వీడియో తీశాడని పోలీసులు చెప్పారు.

పారిస్ రైలులో బెదిరింపులు.. పోలీసు కాల్పులు

పారిస్: ఫ్రాన్సు రాజధాని పారిస్‌లో హిజాబ్ ధరించిన ఓ మహిళ(38) రైలులో ప్రయాణికులను బెదిరింపులకు గురిచేసింది. దీంతో పోలీసులు కాల్పులు జరిపి ఆమెను గాయపరిచారు. దక్షిణ పారిస్‌లోని 13వ డిస్ట్రిక్ట్ గుండా వెళ్తున్న సబర్బన్ రైలులో ఓ మహిళ 'అల్లాహూ అక్బర్' అని అరుస్తూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తోందంటూ పోలీసులకు సమాచారం అందింది. ఉగ్రవాద వ్యతిరేక దళం పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని, సదరు మహిళను పలుమార్లు హెచ్చరించారు. తనను తాను పేల్చేసుకుంటానంటూ బెదిరించింది. దీంతో పోలీసులు ఆమెపైకి కాల్పులు జరిపారు. గాయపడిన మహిళను ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. ఆమె 2021లోనూ భద్రతా అధికారులను ఇలాగే బెదిరింపులకు గురిచేసిందన్నారు. ఈ సంఘటన తర్వాత మానసిక ఆరోగ్య కారణాలతో కొన్ని రోజులపాటు నిర్బంధంలో ఉంచామన్నారు. తాజా ఘటనపై దర్యాప్తు చేపట్టామన్నారు. ఇజ్రాయెల్- హమాస్ యుద్ధంతో ఫ్రాన్సులో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ చోటుచేసుకున్న ఈ ఘటనపై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

సారా అబ్దుల్లాతో సచిన్ పైలట్ విడాకులు

జైపూర్: భార్య సారా అబ్దుల్లాతో విడాకులు తీసుకున్నట్లు కాంగ్రెస్ నేత సచిన్ పైలట్(46) మొదటిసారిగా వెల్లడించారు. మంగళవారం టోంక్ స్థానానికి ఆయన సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో ఈ విషయాన్ని పేర్కొన్నారు. భార్య వివరాలు తెలిపే కాలమ్‌లో ఆయన 'డైవోర్స్‌డ్' అని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా కూతురు సారా అబ్దుల్లా. సారా, సచిన్‌లు 2004లో పెళ్లి చేసుకున్నారు. వారికి ఆరన్, విహాన్ అనే కొడుకులున్నారు. ఇద్దరూ తన వద్దే ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా, అయిదేళ్లలో పైలట్ ఆస్తులు రెట్టింపైనట్లు కూడా అఫిడవిట్‌ను బట్టి తెలుస్తోంది. 2018లో ఆయన ఆస్తుల విలువ రూ.3.8 కోట్లు కాగా, 2023లో రూ.7.5 కోట్లకు చేరాయి.



గాజా స్ట్రిప్‌లోని రఫాలో ఇజ్రాయెల్ దాడుల్లో నేలమట్టమైన భవన శిథిలాల వద్ద విచార వదనంతో బాలిక

గాజాపై నిప్పుల వాన

డెయిర్ అల్ బలా (గాజా): ఇజ్రాయెల్ ప్రతీకార దాడుల తీవ్రతకు గాజా అల్లాడుతోంది. మంగళవారం ఇజ్రాయెల్ క్షిపణుల ధాటికి వందలాది నివాసాలు నేలమట్టమయ్యాయి. ఒక్క రోజే ఏకంగా 300 'లక్ష్యాలను' ఛేదించినట్టు సైన్యం ప్రకటించింది. ముఖ్యంగా శరణార్థుల ఆవాస ప్రాంతంలోని కనీసం ఆరు అపార్ట్‌మెంట్లను ఇజ్రాయెల్ రాకెట్లు కుప్పకూల్చాయి. ఈ దారుణంలో భారీగా జన నష్టం జరిగిందని హమాస్ ఆరోపించింది. మృతుల సంఖ్యపై ఇప్పటిదాకా స్పష్టత రాకున్నా వందల మంది చనిపోయి ఉంటారని చెబుతున్నారు. శిథిలాల దిబ్బల్లో తమవారి కోసం వెదుకుతున్న దృశ్యాలు కలచివేస్తున్నాయి. వీడియో ఫుటేజీల్లో రక్తమోడుతున్న ఇద్దరు బాలలను కొందరు యువకులు భుజాలపై వేసుకుని తీసుకొస్తూ కన్పించారు. మరోవైపు నుంచి ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు ఉత్తర గాజాపై శతఘ్నుల వర్షం కురిపిస్తున్నాయి. అక్కడి హమాస్ ఉగ్రవాద సంస్థ తాలూకు భూగర్భ నిర్మాణాలపై ప్రత్యక్ష దాడులకు దిగింది. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య పలుచోట్ల పెద్దపెట్టున కాల్పులు జరుగుతున్నాయి. ఉత్తర గాజాలో ఇంకా లక్షల మంది పాలస్తీనియన్లు చిక్కిపోయి ఉన్న నేపథ్యంలో ప్రాణ నష్టం ఏ స్థాయికి పెరుగుతుందోనంటూ సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయినా హమాస్‌ను నిర్మూలించేదాకా కాల్పుల విరమణ ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ పునరుద్ఘాటించారు. ఐరాస సహాయక సంస్థలకు చెందిన 64 మంది సిబ్బంది ఇప్పటిదాకా దాడులకు బలయ్యారు. ఇంత తక్కువ సమయంలో ఇంతమంది తమ సిబ్బంది మరణించడం ప్రపంచంలో ఇప్పటిదాకా ఏ పోరులోనూ జరగలేదని ఐరాస అధికార ప్రతినిధి వాపోయారు. ఇప్పటిదాకా పోరుకు బలైన పాలస్తీనియన్ల సంఖ్య 9,000 దాటినట్టు తెలుస్తోంది.

సైనికురాలి విడుదల

హమాస్ చెర నుంచి ఒరీ మెగిదీష్ అనే తమ సైనికురాలిని విజయవంతంగా విడిపించుకున్నట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) ప్రకటించింది. ఆమెను అక్టోబర్ 7న మెరుపు దాడి సందర్భంగా ఉగ్రవాదులు అపహరించినట్టు వివరించింది. ఆమె తన కుటుంబ సభ్యులతో ఉన్న తాజా ఫొటోను ప్రధాని కార్యాలయం సోషల్ మీడియాలో షేర్ చేసింది. హమాస్ చెరలో ఇంకా 240 మందికి పైగా బందీగా ఉన్నట్టు ఇజ్రాయెల్ తెలిపింది.

సముద్రమార్గంలో సాయం: సైప్రస్

అత్యవసరాలకు కూడా దిక్కు లేక అల్లాడుతున్న గాజావాసులను ఆదుకునేందుకు సైప్రస్ ముందుకొచ్చింది. ఐరోపా సమాఖ్య, మధ్య ప్రాచ్య దేశాలు సహకరిస్తే సముద్రమార్గ నడువా(సీ కారిడార్) ఏర్పాటు చేసి నిత్యావసరాలను గాజాకు చేరవేస్తామని ప్రకటించింది.

హమాస్ అగ్ర నేత హతం!

మంగళవారం వెస్ట్‌బ్యాంక్‌లో హమాస్ అగ్ర నేత సలేహ్ అల్ అరౌరీ నివాసాన్ని నేలమట్టం చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. దాడిలో అతను కూడా మరణించి ఉంటాడని భావిస్తున్నారు. అక్టోబర్ ఏడో తేదీన ఇజ్రాయెల్‌పై హమాస్ భారీ మెరుపుదాడికి పథక రచన చేసిన హమాస్ ఉత్తర డివిజన్ కమాండర్ నసీమ్ అబు అజీనా కూడా తమ యుద్ధ విమానాల దాడిలో హతమైనట్టు సైన్యం పేర్కొంది.

యువత కోసం 'మై భారత్'

- ప్రారంభించిన ప్రధాని మోదీ
- అమృత్ మహోత్సవ్ స్మారక్, అమృత్ వాటికలకు శంకుస్థాపన

న్యూఢిల్లీ: దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 2021 మార్చి 12న ప్రారంభమై రెండేళ్లపాటు సాగిన 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమం మంగళవారం ముగిసింది. నా మట్టి-నా దేశం(మేరీ మాటి-మేరా దేశ్)లో దేశవ్యాప్తంగా సేకరించిన మట్టితో ఢిల్లీకి చేరిన కలశాల్లోని మట్టిని ప్రధాని మోదీ కర్తవ్యపథ్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో అమృత్ కలశ్‌లో నింపారు. ఆ మట్టితో నుదుటన తిలకం దిద్దుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మంత్రి యువత కోసం 'మై భారత్'అనే సామాజిక వేదికను ప్రారంభించారు. అమృత్ మహోత్సవ్ స్మారక్, అమృత్ వాటికలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషన్ రెడ్డి, అర్జున్‌రామ్ మేఘ్వాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మోదీ, ఇతర నేతలు, ఆహూతులతో కలిసి 'పంచ్ ప్రాణ్' ప్రతిజ్ఞ చేశారు. మేరా యువ భారత్ (మై భారత్) స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ. ఇది యువత సారథ్యంలో జరిగే అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిని కేంద్రీకరించడానికి, యువత తోడ్పాటునందిస్తుందని కేంద్ర సాంస్కృతిక శాఖ తెలిపింది. అమృత్ మహోత్సవ్ స్మారక్, అమృత్ వాటిక శంకుస్థాపన తర్వాత, ప్రతిపాదిత నిర్మాణాల డిజిటల్ వెర్షన్‌ను ప్రదర్శించే చిన్న వీడియో అక్కడ ప్రదర్శించారు. అమృత్ వాటిక 12 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుందని, నాలుగు నుంచి ఆరు నెలల్లో పూర్తవుతుందని అధికారులు చెప్పారు.

బుజ్జగింపు రాజకీయాలే పురోగతికి అడ్డంకి

కెవాడియా: దేశ అభివృద్ధి ప్రయాణంలో బుజ్జగింపు రాజకీయాలే అతిపెద్ద అవరోధంగా మారాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సానుకూల రాజకీయాలను మాని, స్వార్థపూరిత లక్ష్యాల కోసం దేశ ఐక్యతతో సైతం రాజీపడే చాలా పెద్ద రాజకీయ వర్గంపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. గడిచిన తొమ్మిదేళ్లలో దేశం పలు వైపుల నుంచి అనేక అంతర్గత సవాళ్లను ఎదుర్కొందని చెప్పారు. కానీ, మన భద్రతా బలగాల కృషి ఫలితంగా మన శత్రువులు గతంలో మాదిరిగా సఫలీకృతం కాలేకపోయారని ప్రధాని పేర్కొన్నారు. సర్దార్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గుజరాత్‌లోని నర్మదా జిల్లా కెవాడియాలో ఐక్యతా విగ్రహం వద్ద ప్రధాని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినంగా కూడా పాటిస్తారు. దేశానికి వచ్చే 25 ఏళ్లు అత్యంత ముఖ్యమైనవని ప్రధాని అన్నారు. పటేల్ నుంచి స్ఫూర్తి పొందుతూ దేశాన్ని సంపన్నంగా, అభివృద్ధి చెందిన దేశంగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. 'మన అభివృద్ధి ప్రయాణంలో అతి పెద్ద అడ్డంకి బుజ్జగింపు రాజకీయాలు. ఇలాంటి రాజకీయాలు నెరిపేవారు ఉగ్రవాదాన్ని, దాని భయానక, రాక్షస రూపాన్ని ఎన్నడూ చూడలేరు. దేశంలో అనేక దశాబ్దాలపాటు చోటుచేసుకున్న పరిణామాలే ఇందుకు సాక్ష్యం'అని ప్రధాని అన్నారు. 'ఇలాంటివారు ఉగ్రవాద కార్యకలాపాలపై దర్యాప్తును నిర్లక్ష్యం చేస్తారు. దేశ వ్యతిరేక శక్తులపై ఉదాసీనంగా ఉంటారు. బుజ్జగింపు మనస్తత్వం చాలా ప్రమాదకరమైంది. ఉగ్రవాదులను సైతం రక్షిస్తుంది. ఇటువంటి వైఖరితో ఏ సమాజానికీ, ఏ దేశానికీ ఎప్పటికీ ప్రయోజనం ఉండదు'అని ప్రధాని అన్నారు.



అమృత్ కలశ్‌లోని మట్టితో నుదుట తిలకం దిద్దుకుంటున్న మోదీ. చిత్రంలో మంత్రులు మీనాక్షి లేఖీ, మేఘ్వాల్, నిశిత్, అమిత్ షా

సూపర్ అణుబాంబు!

- 'హిరోషిమా'కంటే 24 రెట్లు శక్తిమంతం
- త్వరలో తయారు చేస్తాం: అమెరికా

వాషింగ్టన్: అటు ఏడాదిన్నర దాటినా ఆగని రష్యా-ఉక్రెయిన్ యుద్ధం. ఇటు తాజాగా పాలస్తీనా-హమాస్ పోరు. ఇంకోవైపు భయపెడుతున్న చైనా-తైవాన్ తదితర ఉద్రిక్తతలు. ఈ సమస్యలన్నీ చాలవన్నట్టు దేశాల మధ్య అణ్వాయుధ పోటీని మరింత పెంచే దిశగా అమెరికా అడుగులు వేస్తోంది. అత్యంత శక్తిమంతమైన సూపర్ అణు బాంబును తయారు చేయనున్నట్టు మంగళవారం ప్రకటించింది! అది రెండో ప్రపంచ యుద్ధం చివర్లో జపాన్‌లోని హిరోషిమాపై అమెరికా ప్రయోగించిన అణుబాంబు కంటే ఏకంగా 24 రెట్లు శక్తిమంతంగా ఉండనుందని వెల్లడించింది! 1945 ఆగస్టులో హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా వేసిన అణుబాంబులు లెక్కలేనంత జన నష్టానికి దారితీయడం తెలిసిందే. ఆ విధ్వంసాన్ని తలచుకుని జపాన్ ఇప్పటికీ వణికిపోతుంటుంది. హిరోషిమాపై వేసిన అణుబాంబు 15 కిలో టన్నుల శక్తిని, నాగసాకిపై పడ్డ బాంబు 23 కిలో టన్నుల శక్తిని విడుదల చేశాయి. ఇప్పుడు తయారు చేయనున్న అణుబాంబు ఏకంగా 360 కిలో టన్నుల శక్తిని వెలువరిస్తుందని చెబుతున్నారు! బి61 న్యూక్లియర్ గ్రావిటీ బాంబును ఆధునీకరించి రూపొందిస్తున్న ఈ బాంబును బి61-13గా పిలుస్తున్నారు. దీని తయారీకి అమెరికా కాంగ్రెస్ అనుమతి లభించాల్సి ఉంది. అంతేగాక తమ అమ్ములపొదిలో ఉన్న అణ్వాయుధాలను 2030 కల్లా 1,000కి పెంచనున్నట్టు కూడా అమెరికా రక్షణ శాఖ ప్రకటించింది.

చైనా, పాక్ సరిహద్దుల్లో ఎస్-400 క్షిపణుల మోహరింపు

న్యూఢిల్లీ: చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో భారత వైమానిక దళం(ఐఏఎఫ్) మూడు స్క్వాడ్రన్ల ఎస్-400 క్షిపణులను మోహరించింది. రష్యా నుంచి ఇంకా రెండు స్క్వాడ్రన్ల ఎస్-400 క్షిపణి వ్యవస్థలను అందుకునే విషయంలో తుది చర్చలు జరుపుతున్నట్లు ఐఏఎఫ్ తెలిపింది. ఇప్పటికే అందిన మూడు స్క్వాడ్రన్లు కీలక ప్రాంతాల్లో విధుల్లో ఉన్నాయని తెలిపింది. ఒక యూనిట్‌ను చైనా, పాకిస్తాన్‌లకు కలిపి, మరో రెండు యూనిట్లు చైనా, పాకిస్తాన్‌లకు వేర్వేరుగా సరిహద్దుల్లో ఉన్నాయని రక్షణ వర్గాలు ఏఎన్‌ఐకి వివరించాయి. మిగతా రెండు స్క్వాడ్రన్ల బట్వాటా ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా ఆలస్యమవుతోందని వివరించింది. ముందుగా కుదిరిన ఒప్పందం మేరకు మిగతా ఎస్-400 క్షిపణి వ్యవస్థలను అందజేసేదీ లేనిదీ రష్యా స్పష్టం చేయలేదని తెలిపింది. దీనిపై త్వరలోనే ఆ దేశంతో చర్చలు జరుపుతామని వెల్లడించింది. అయితే, భారత్ కోసం తయారు చేసిన ఈ వ్యవస్థలను ఉక్రెయిన్‌పై రష్యన్లు వినియోగించుకుంటున్నట్లు తెలిసిందని ఆ వర్గాలు అంచనా వేశాయి. అయితే, దీనిని రష్యా ధ్రువీకరించలేదు. 2018-19లో ఎస్-400 క్షిపణి వ్యవస్థల కోసం రష్యాతో రూ.35 వేల కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు గుర్తు చేసింది. మరో పరిణామంలో, ప్రాజెక్టు కుషాలో భాగంగా లాంగ్ రేంజ్ సర్ఫేస్ ఎయిర్ మిస్సైల్ వ్యవస్థ(ఎల్ఆర్‌సామ్)ల కొనుగోలుకు రక్షణ శాఖ ఇటీవల ఆమోదం తెలిపింది. ఈ క్షిపణులు 400 కిలోమీటర్ల పరిధిలోని శత్రు విమానాలు, మిస్సైళ్లను ధ్వంసం చేయగలవు.

మణిపూర్‌లో అలజడి

పోలీసు అధికారి కాల్చివేత

ఇంఫాల్: మణిపూర్‌లో రెండు జాతుల మధ్య వైరం సమసిపోయి సాధారణ పరిస్థితులు నెలకొంటున్న తరుణంలో కలకలం రేగింది. మంగళవారం తెంగ్నోపాల్ జిల్లాలోని మోరే పట్టణంలో సరిహద్దు భద్రతా బలగాలు నిర్మిస్తున్న ఓ హెలీప్యాడ్‌ను పర్యవేక్షించడానికి వచ్చిన మోరే సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్(ఎస్‌డీపీఓ) చింగ్థమ్ ఆనంద్‌పై గుర్తు తెలియని వ్యక్తి జరిపిన కాల్పుల్లో అధికారి ప్రాణాలు కోల్పోయారు. మయన్మార్ సరిహద్దులోని ఈ ప్రాంతంలో కుకీ తెగ వ్యక్తుల ప్రాబల్యం ఎక్కువ. పోలీసు అధికారి హత్యతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటన జరిగిన ప్రాంతంలోనే గతంలో కొన్ని నెలల పాటు కుకీ, మైతేయ్ జాతుల మధ్య తీవ్ర ఘర్షణలు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసు అధికారి హత్యతో కాల్పులకు తెగబడిన వ్యక్తిని పట్టుకునేందుకు భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ ప్రారంభించినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. 'గాయాన్ని బట్టి చూస్తే అది స్నైపర్ రైఫిల్‌తో కాల్చినట్లు తెలుస్తోంది. బుల్లెట్ దూసుకొచ్చిన మార్గం జనావాసాల మధ్యలో ఉంది. వెంటనే బలగాలను జనావాసాల్లోకి పంపితే పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారే ప్రమాదం ఉంది. అందుకే ఆ పని చేయలేకపోయాం' అని ఘటనపై పోలీసు ఉన్నతాధికారి ఒకరు వివరించారు.

బీడ్ నగరంలో కర్ఫ్యూ

- ఇంటర్నెట్ సేవలు బంద్
- జిల్లాలో 55 మంది అరెస్ట్

ముంబై/ ఛత్రపతి శంభాజీనగర్: మహారాష్ట్రలో ప్రత్యేక కోటా డిమాండ్‌తో మరాఠాలు చేపట్టిన నిరసనలతో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. సోమవారం బీడ్ జిల్లాలో ఇద్దరు ఎన్‌సీపీ ఎమ్మెల్యేలు, ఒక బీజేపీ ఎమ్మెల్యే ఇళ్లు, కార్యాలయాలపై ఆందోళనకారులు దాడులకు పాల్పడి, నిప్పంటించిన విషయం తెలిసిందే. పలు ప్రాంతాల్లో రహదారులపై బైటాయించారు. ఈ ఘటనల నేపథ్యంలో అధికార యంత్రాంగం అదనంగా పోలీసు బలగాలను మోహరించింది. మరాఠ్వాడా ప్రాంతంలోని కొందరు రాజకీయ నేతలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద గస్తీ పెంచింది. సోమవారం సాయంత్రం సుమారు వెయ్యి మంది ఆందోళనకారులు బీడ్ డిపోలోని 53 బస్సుల అద్దాలు, సీసీటీవీ కెమెరాలను ధ్వంసం చేశారు. వాటికి నిప్పుపెట్టేందుకు కూడా ప్రయత్నించినట్లు అధికారులు వెల్లడించారు. సుమారు రూ.70 లక్షల మేర నష్టం కలిగించారన్నారు. సోమవారం రాత్రి, మంగళవారం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని పోలీసు అధికారులు తెలిపారు. సోమవారం దాడుల్లో పాల్గొని, ఆస్తులకు నష్టం కలిగించారనే ఆరోపణలపై 12 కేసులు నమోదు చేసి, 55 మందిని అరెస్ట్ చేసినట్లు బీడ్ ఎస్పీ నందకుమార్ ఠాకూర్ చెప్పారు. వేర్వేరు హింసాత్మక పాల్పడిన 300 మందిని గుర్తించామన్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో ముందు జాగ్రత్తగా దుకాణాలను మూయించివేశారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందన్నారు. బీడ్ నగరంలో కర్ఫ్యూ విధిస్తూ కలెక్టర్ దీపా ముధోల్ ముండే మంగళవారం సాయంత్రం ఆదేశాలిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారుల వెంట, తాలూకా ప్రధాన కార్యాలయాలు, కలెక్టర్ ఆఫీసుకు అయిదు కిలోమీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయన్నారు. నగరంలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశామన్నారు. ధారాశివ్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లోనూ అధికారులు కర్ఫ్యూ అమలు చేస్తున్నారు. మంగళవారం పుణే నగరంలో ముంబై- బెంగళూరు హైవేపై కొందరు ఆందోళనకారులు టైర్లను కాల్చారు.

మరాఠాలకు కుణ్బి సర్టిఫికెట్ల జారీ

మరాఠాలకు ప్రత్యేక కోటా కల్పించాలంటూ వెల్లువెత్తిన ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంతో మహారాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాలపై చర్యలు ప్రారంభించింది. మరాఠ్వాడా ప్రాంతంలో మరాఠాలకు కుణ్బి కుల ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియపై ఏర్పాటైన హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ షిండే కమిటీ అందించిన ప్రాథమిక నివేదికను మంగళవారం రాష్ట్ర కేబినెట్ ఆమోదించింది. ఈ మేరకు కుణ్బి కుల ధ్రువీకరణ పత్రాల జారీ మొదలైందని కూడా ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. వ్యవసాయమే వృత్తిగా ఉన్న కుణ్బి కులాన్ని మహారాష్ట్రలో ఇతర వెనుకబడిన కులాల(ఓబీసీ) కేటగిరీలో చేర్చారు. విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో వీరికి రిజర్వేషన్లు అమలవుతున్నాయి. మరాఠాలు విద్యాపరంగా, సామాజికంగా ఎంతమేరకు వెనుకబడి ఉన్నారనే విషయమై ఓబీసీ కమిషన్‌తో అంచనా వేయించాలని కూడా మంగళవారం సీఎం ఏక్‌నాథ్ షిండే అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం నిర్ణయించింది. ఈ విషయంలో న్యాయపరమైన అంశాలపై సూచనలిచ్చేందుకు ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేయనుంది.

ఇస్రో చీఫ్‌కు రాజ్యోత్సవ అవార్డు

సోమనాథ్ సహా 68 మందికి ప్రకటించిన కర్ణాటక ప్రభుత్వం

బెంగళూరు: ఇస్రో చీఫ్ ఎస్.సోమనాథ్ సహా 68 మందికి కర్ణాటక ప్రభుత్వం మంగళవారం రాజ్యోత్సవ అవార్డులను ప్రకటించింది. తమతమ రంగాల్లో అత్యుత్తమ సేవలందించిన వారిని రాష్ట్రంలో రెండో అతిపెద్ద పౌర పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపింది. నవంబర్ ఒకటో తేదీన 68వ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అవార్డుతో సన్మానించనున్నట్లు వివరించింది. ఎంపికైన వారిలో 13 మంది మహిళలు, 54 మంది పురుషులు ఉన్నారు. గ్రహీతలకు పురస్కారం కింద రూ.5 లక్షల నగదు, 25 గ్రాముల బంగారు పతకం అందజేస్తారు.

ఉగ్రమూకల కాల్పుల్లో నేలకొరిగిన కానిస్టేబుల్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో వరుసగా మూడో రోజూ ఉగ్రమూకలు రెచ్చిపోయాయి. బారాముల్లా జిల్లా పట్టన్ ఏరియాలో క్రాల్‌పొరకు చెందిన హెడ్ కానిస్టేబుల్ గులాం మహ్మద్ దార్‌పై మంగళవారం ఉదయం ఆయన ఇంటి వద్దే ఉగ్రవాదులు కాల్పులకు దిగారు. తీవ్రంగా గాయపడిన దార్ ఆస్పత్రిలో కన్నుమూశారని అధికారులు తెలిపారు.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

బుధవారం, 1, నవంబర్, 2023





బెంగళూరు బనశంకరిలో కుటీర మేళా ఆకట్టుకుంటోంది. సందర్శకుల షాపింగ్ సందడి

న్యూస్‌రీల్

పోలీస్ స్టేషన్ ముందు రౌడీ హల్‌చల్



తుమకూరు: తుమకూరు నగరంలో ఒక రౌడీషీటర్ మహిళా పోలీస్ ముందే పెద్ద కత్తి పట్టుకుని హల్‌చల్ చేశాడు. సోమవారం రాత్రి ప్రైవేట్ బస్టాండు దగ్గర అశోకా రోడ్డులో మహిళా పోలీసు స్టేషన్ ముందు మోహా అలియాస్ మధు అనే రౌడీషీటర్ మద్యం మత్తులో కత్తి పట్టుకుని వీరంగం చేశాడు. ఇటీవలే ఒక కేసులో జైలుకు వెళ్ళి వచ్చాడు. కత్తి పట్టుకుని అరుస్తుండగా మహిళా పోలీస్ మంగళమ్మ వచ్చి అతన్ని హెచ్చరించినా పట్టించుకోలేదు. దీంతో పోలీసులు వచ్చి అతన్ని అరెస్టు చేసి తరలించారు.

కరావళి ప్రాంతంలో ఐటీ దాడులు

బనశంకరి: కరావళి ప్రాంతంలో బంగారు దుకాణాలు, యజమానుల ఇళ్లపై ఆదాయ పన్ను శాఖ అధికారులు దాడులు చేశారు. ఉడుపి, కార్కళ, కుందాపుర, పడుబిద్రి, బ్రహ్మావార, పుత్తూరుతో పాటు పలు ప్రాంతాల్లో బంగారు దుకాణాలపై ఐటీ అధికారులు ఏకకాలంలో దాడులు చేశారు. మంగళూరు ఖద్రి వద్ద శివబాగ్ జువెలరీ దుకాణంలో మంగళవారం ఐటీ అధికారులు సోదాలు చేశారు. పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలో 14, గోవాలో బంగారు ఆభరణాలు దుకాణాలు కలిగిన సుభాష్ కామత్, మహేశ్ కామత్ యజమాన్యంలోని నగల దుకాణాల్లో కూడా సోదాలు చేశారు.

ధీమంత నాయకురాలు ఇందిరాగాంధీ

శివాజీనగర: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ లాంటి ప్రజోపయోగ, ప్రజాభిమాన ప్రధాన మంత్రి ఎవరూ లేరని, పేదలకు బతుకు దారి చూపించిన ధైర్యవంతురాలు ఆమె అని కాంగ్రెస్ నేతలు స్మరించుకున్నారు. మంగళవారం కేపీసీసీ ఆఫీసులో ఇందిరాగాంధీ 39వ వర్ధంతిని నిర్వహించారు. సీఎం సిద్ధరామయ్య, నేతలు పాల్గొన్నారు. ఇందిర దేశంలో పేదల ఆరాధ్య దైవంగా ఉండేవారని సీఎం అన్నారు. మహాత్మాగాంధీ, ఇందిర, రాజీవ్‌గాంధీలు దేశం కోసం ప్రాణత్యాగం చేశారు. బీజేపీలో అలా త్యాగం చేసినవారు ఎవరూ లేరన్నారు. అలాగే సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. డీసీఎం డీ.కే.శివకుమార్, మంత్రులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ, ఒకరు మృతి

మైసూరు: రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకరు మరణించారు. వివరాలు.. జిల్లాలోని హుణసూరు తాలూకాలోని శిండెనహళ్ళికి చెందిన సణ్ణయ్య కుమారుడు ప్రసాద్ (32) మంగళవారం ఇంటికి విద్యుత్ సామగ్రి కొనడానికి కారులో మైసూరుకు బయల్దేరాడు. కుప్పె గ్రామం వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను మైసూరులోని కేఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స ఫలించక మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడగా వారిని హుణసూరు ఆస్పత్రిలో చేర్చారు.

కలుషిత దాణా తిని పశువులు మృతి

మైసూరు: కలుషితమైన దాణా తిన్న రెండు ఆవులు, రెండు ఎద్దులు మృత్యువాత పడ్డాయి. జిల్లాలోని హుణసూరు తాలూకాలోని గావడగెరె దగ్గర కృష్ణాపురలో ఈ దుర్ఘటన వివరాలు.. జయకృష్ణ అనే రైతు యాచెగౌడనహళ్ళి గ్రామంలో ఉన్న గణేష్ ఫీడ్స్ దుకాణంలో నుంచి మేతను కొనుగోలు చేశాడు. దానిని తన ఆవులు, ఎద్దులకు పెట్టాడు. తిన్న కొంతసేపటికే కిందపడిపోయి విలవిలలాడుతూ ప్రాణాలు విడిచాయని రైతు విలపించాడు. రూ. 3 లక్షలు నష్టపోయినట్లు చెప్పాడు. కన్నబిడ్డల్లా పెంచుకుంటున్న జీవాలు కలుషిత దాణాకు బలయ్యాయని రైతు కుటుంబీకులు రోదించారు. పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్. రాజశేఖరప్ప, సిబ్బంది వచ్చి నాలుగు పశువులకు శవ పరీక్షలు నిర్వహించారు. దాణానే మృతికి కారణమని తెలిపారు.

మైసూరులో భారీగా గంజాయి సీజ్

మైసూరు: పర్యాటక నగరి మైసూరులో పోలీసులు డ్రగ్స్ విక్రేతలను అరెస్టు చేసి రూ.28 లక్షల విలువ చేసే మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. నజరాబాద్ పోలీస్ స్టేషన్ పరిదిలోని ప్రభుత్వ అతిథి గృహం వద్ద ఇద్దరిని పట్టుకుని, రూ. 20 లక్షల విలువ చేసే 15.5 కేజీల గంజాయి, 217 గ్రాముల ఎండిఎంఎ మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మెటగళ్ళి పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి రూ. 8 లక్షల ఖరీదైన 15.5 కేజీల గంజాయిని, ఒక ఆటోని సీజ్ చేశారు.

సైబర్ నేరాలపై.. గొంతెత్తి జాగృతి



- ఐటీ సిటీవాసులకు వాయిస్ నోట్లు
- పోలీస్ కమిషనర్ వినూత్న చర్య



బెంగళూరులో అత్యధికంగా సైబర్ మోసాలు జరుగుతున్నాయి

బనశంకరి: సైబర్ నేరగాళ్లు సిలికాన్ సిటీని లక్ష్యంగా చేసుకుని అమాయకులను దోచుకుంటున్నారు. ఎంత జాగృతం చేసినప్పటికీ మోసపోయేవారి సంఖ్య పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. ఈ తరుణంలో సైబర్ నేరాల నుంచి ఎలా తప్పించుకోవాలో బెంగళూరు పోలీసులు సోషల్ మీడియాలో జాగృతం చేస్తున్నారు. వాట్సాప్ చానల్ అనే కొత్త ఫీచర్ ద్వారా.. సైబర్ టిప్ ఏ డే పేరుతో నగర పోలీస్ కమిషనర్ బీ దయానంద్ నిత్యం వాయ్స్ నోట్ విడుదల చేస్తున్నారు. వాట్సాప్‌లో ఫైండ్ చానెల్ ద్వారా బెంగళూరు సిటీ పోలీస్‌ను గాలించి ఫాలో అనే ఆప్షన్ నొక్కగానే మెసేజ్‌లు రావడం మొదలవుతుంది. ఇప్పటికే 2 వేల మందికిపైగా ఫాలో చేశారు, క్రమంగా మరింత పెరుగుతుందని అధికారులు తెలిపారు.

ఇలా ఉంటుంది సలహా

నమస్కారం, నేను బెంగళూరు పోలీస్ కమిషనర్‌ని, సైబర్ జాగృతి అభియాన్‌లో సైబర్ మోసాలు జరిగే తీరు గురించి వివరిస్తా. ఎవరైనా సైబర్ వంచన తెలిసిన వెంటనే సైబర్ సహాయవాణి 1930 కు ఫోన్ చేసి చెప్పవచ్చు. లేదా పీఎస్‌లో ఫిర్యాదు చేయవచ్చు. తద్వారా పోలీసులు విచారణ జరిపి నేరగాళ్లను పట్టుకోవచ్చు. ఆన్‌లైన్ జాబ్ ఫ్రాడ్, కెరియర్ ఫ్రాడ్, బయోమెట్రిక్ స్కామ్ ఎక్కువగా జరుగుతుంటాయి.. అని ఓ వాయిస్ నోట్‌లో తెలిపారు. వివిధ రకాల మోసాలు, వాటి నుంచి బయటపడే అంశాలు వాయిస్ నోట్స్‌లో ఉంటాయి. బెంగళూరు సిటీ పోలీస్ వాట్సాప్ చానల్ ద్వారా వీడియో, ఆడియో, సమాచారం అందిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

తలనొప్పిగా ఈ నేరాలు

- ఇంట్లోనే ఉంటూ సంపాదించవచ్చు, యూట్యూబ్‌లో రివ్యూలు, లైక్స్ ద్వారా ఖాతాలో డబ్బు పడిపోతుందని నమ్మించి పెట్టుబడి పెట్టించుకుని వంచనకు పాల్పడడం పెరిగింది. మధ్య తరగతి మహిళలు ఎక్కువగా ఇందులో చిక్కుకుంటున్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ చేసే ఐటీ ఉద్యోగులు బలి అవుతున్నారు.
- మేం పోలీసులమని లేదా కస్టమ్స్ అధికారులమని, ఇక్కడ పార్శిల్‌లో మీ అడ్రస్‌కి డ్రగ్స్, లేదా నిషేధిత వస్తువులు వచ్చాయని భయపెట్టి, డబ్బు గుంజడం జరుగుతోంది. అధికంగా ఉన్నత వర్గాల యువతను టార్గెట్‌గా చేసుకుని వంచనకు పాల్పడతారు.
- ఇక బయోమెట్రిక్ స్కాంలో ప్రజల వేలిముద్రలు, ఆధార్ నంబర్‌లను సేకరించి బ్యాంకు ఖాతాలను డబ్బు కొట్టేస్తారు.

తీవ్రంగా బయోమెట్రిక్ మోసాలు

- పోలీస్ కమిషనర్ ఆందోళన

బెంగళూరులో సైబర్ క్రైం కేసులు హెచ్చుమీరుతున్నాయి, అందులోనూ బయోమెట్రిక్ వంచనలు తీవ్రమౌతున్నాయని పోలీస్ కమిషనర్ బీ దయానంద తెలిపారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆధార్ ఎనేబుల్ చెల్లింపుల వ్యవస్థ గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులకు ప్రయోజనం కలిగేలా ఏర్పాటైంది. ఇందులో ఓటీపీ, పాస్‌వర్డ్, మొబైల్ నంబరు తీసుకోకుండా నగదు డ్రా చేయవచ్చు. ఇందులో లబ్ధిదారు వేలిముద్ర, ఆధార్ నంబరు ద్వారా వ్యవహారం జరుగుతుంది. కానీ వంచకులు ప్రభుత్వ రిజిస్ట్రేషన్, ముద్రణశాఖల కావేరి వెబ్‌సైట్ల నుంచి జనం వేలిముద్రలను సేకరించి సిలికాన్ పేపర్ పై అచ్చువేసి నకిలీ వేలిముద్రలను రూపొందిస్తారు. ఆధార్ నంబరు సహాయంతో మైక్రో ఏటీఎంల ద్వారా నగదు కొట్టేసినట్లు గత మూడు నాలుగు నెలల్లో 116 కేసులు నమోదయ్యాయి అని కమిషనర్ తెలిపారు. ఈ బాగోతాన్ని రిజిస్ట్రేషన్, ముద్రణశాఖల దృష్టికి తీసుకువచ్చామని, బయోమెట్రిక్, ఆధార్ నంబరు ఎవరికీ కనబడకుండా చేయాలని సలహా ఇచ్చామని తెలిపారు.



ఆధార్ సంఖ్య, వేలిముద్రల సాయంతో జనం సొమ్ము స్వాహా

2న హంపీకి సీఎం రాక



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

హొసపేటె: సీఎం సిద్ధరామయ్య నవంబర్ 2న ప్రపంచ పర్యాటక కేంద్రం హంపీకి రానున్న నేపథ్యంలో హంపీ ప్రాధికార ఆధ్వర్యంలో విరుపాక్ష ఆలయం ఆవరణలో పరిశుభ్రత పనులను చేపట్టారు. కర్ణాటక స్వర్ణోత్సవం, కన్నడ రాజ్యోత్సవాల సందర్భంగా విరుపాక్ష, భువనేశ్వరి, పంపాంబికా దేవి ఆలయాలతో పాటు రథ వీధి, ఎదురు బసవణ్ణ, కృష్ణ మందిరం, ఉగ్రనరసింహ తదితర ప్రాంతాల్లో స్వచ్ఛత పనులకు శ్రీకారం చుట్టారు.

కీచకుని కోసం గాలింపు



మాల్‌లో అసభ్యంగా ప్రవర్తించిన దృశ్యాలు

యశవంతపుర: బెంగళూరులోని లులు మాల్‌లో యువతిని, మహిళలను అసభ్యంగా తాకిన ఓ మధ్య వయస్కుని కోసం మాగడి రోడ్డు పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. గత నెల 29న సాయంత్రం లులు మాల్‌లో రెండో ఫ్లోర్‌లో గేమ్ జోన్ వద్ద రద్దీగా ఉండగా, ఒక వ్యక్తి ఒంటరిగా తిరుగుతూ, ఓ యువతిని అసభ్యంగా తాకాడు. తరువాత మరికొందరు మహిళలతోనూ అలాగే ప్రవర్తించాడు. బాధితులు గొడవ ఎందుకని మౌనంగా వెళ్లిపోయారు. ఈ తతంగాన్ని ఒక వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, కీచకుని దాష్టీకంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఈ వీడియో వైరల్ కావడంతో మాగడి పోలీసులు కేసు నమోదు చేసుకుని ఉన్మాది కోసం గాలింపు చేపట్టారు.

మెడికల్ సీటు పేరుతో వంచన

- మోసగాడికి కటకటాలు
- రూ.47.80 లక్షల నగదు స్వాధీనం

బనశంకరి: మెడికల్ సీటు ఇప్పిస్తామని నమ్మించి పెద్ద మొత్తంలో నగదు తీసుకుని వంచనకు పాల్పడిన అంతరాష్ట్ర మోసగాడిని మంగళవారం సంజయనగర పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతడి వద్ద నుంచి రూ.47.80 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణా హైదరాబాద్‌లో శరత్‌గౌడను అరెస్ట్ చేసి బెంగళూరు నగరానికి తీసుకువచ్చి విచారణ చేస్తున్నారు. న్యూ బీఈఎల్ రోడ్డులో నెక్సస్ ఎడ్యుకేషన్ ఏజెన్సీ నుంచి ఫోన్ చేసి మీ కుమారుడికి తక్కువ ప్యాకేజీలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని ఫిర్యాదుదారుడికి తెలిపారు. ఏ తరహా మెడికల్ సీటు ఇస్తారని ఫిర్యాదుదారుడు ప్రశ్నించగా డ్రాపౌట్ తక్కువ ప్యాకేజీలో ఇప్పిస్తానని చెప్పగా, నెక్సస్ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఇద్దరు వ్యక్తులను కలిశాడు. ఆ వ్యక్తులు కేరళ పీకే.దాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు ఉంటుంది. కాలేజీ ఫీజు మీరు చెల్లించాలి మాకు రూ.12 లక్షలు ఇవ్వాలని తెలిపారు. అనంతరం వారితో వ్యవహారాలు మాట్లాడుకుని రూ.10 లక్షలకు అంగీకారం కుదిరింది. ఆ నగదు దశలవారీగా ఆ వ్యక్తులకు తీసుకుని మెడికల్ సీటు ఇవ్వకుండా మోసం చేశారు. దీంతో కంగారుపడిన బాధితుడు నెక్సస్ కార్యాలయానికి వెళ్లగా తాళం వేసి ఉంది. ఇదేవిధంగా 18 మంది బాధితులు నెక్సస్ కార్యాలయానికి రావడంతో వీరు కూడా ఇదే విధంగా మోసపోయినట్లు తెలిసింది. దీంతో బాధితులు సంజయనగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తీవ్రంగా పరిగణించి దర్యాప్తు చేపట్టి హైదరాబాద్‌లో శరత్‌గౌడను అరెస్ట్ చేసి రూ.47.80 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు.



నగదు పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ బీ.దయానంద



నిందితుడు శరత్‌గౌడ

చిరుత దాగుడుమూతలు

- బొమ్మనహళ్లిలో ముమ్మర గాలింపు

బొమ్మనహళ్లి: సిలికాన్ సిటీలో చిరుతపులి కలకలం సృష్టిస్తోంది. బొమ్మనహళ్ళి సమీపంలోని కూడ్లు గేట్ దగ్గర కనిపించిన చిరుతని పట్టుకోవడానికి అటవీ, పోలీస్, పాలికె అధికారులు గాలింపు ముమ్మరం చేశారు. ఆదివారం రాత్రి కూడ్లు, హోసపాళ్య, బండెపాళ్య, సామసంద్రపాళ్య చుట్టుపక్కల తిరిగినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. మంగళవారం అటవీ శాఖ సిబ్బంది, పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి సుమారు 70 మంది చిరుత కోసం గాలిస్తున్నారు. చివరగా ఒక అపార్టుమెంటులోకి దూరింది, అక్కడ వెతగ్గా ఏమీ కనిపించలేదు. ఈ ప్రాంతాల్లో ప్రజలు ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు రావాలంటే భయపడుతున్నారు. కొంత మంది వచ్చినా కూడా కట్టెలు తీసుకుని వస్తున్నారు. అటవీ అధికారులు చెట్లు, పొదలు అంతటా గాలింపు జరిపినా చిరుత జాడ దొరకలేదు.

రాత్రి వేళ బయటకు రావద్దు

చిరుత కోసం 2 బోన్లు ఏర్పాటు చేశామని, రాత్రి సమయంలో ప్రజలు ఎవరూ బయటికి రావద్దని స్థానిక అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి హోసపాళ్యలో పోలీసులు హొయ్సళ వాహనంలో గస్తీ తిరుగుతుండగా కారు ముందు నుంచి చిరుతపులి వెళ్లిందని చెబుతున్నారు. చుట్టుపక్కల ప్రజలు దానిని తరిమివేయడానికి టపాసులు కాల్చారు. సింగసంద్ర, సామసంద్రపాళ్య, పరంగిపాళ్య, బండెపాళ్య, కూడ్లు గేట్ చుట్టు పక్కల ప్రాంతాల్లో కూంబింగ్ సాగుతోంది. ప్రజలు ఎవరూ భయపడవద్దని బొమ్మనహళ్ళి ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి అన్నారు. గాలింపు చర్యలను ఆయన పరిశీలించారు.



కారుతో తొక్కించి హత్య

- నగరంలో దారుణం

యశవంతపుర: బెంగళూరు నగరంలోని జేసీ నగరలో యువకున్ని స్కార్పియో కారుతో తొక్కించి హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడు అస్కర్ కాగా, నిందితుడు అమీన్‌గా గుర్తించారు. వీరిద్దరూ స్నేహితులే, అస్కర్ సెకెండ్ హ్యాండ్ కార్లను అమ్ముతుంటాడు, అమీన్ అతని వద్ద ఒక కారును కొన్నాడు. రూ. 4 లక్షల డబ్బుల విషమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అమీన్ దాడి చేయడంతో అస్కర్ జేసీ నగర పోలీసులకు ఫిర్యాదు చేయగా హత్యాయత్నం కేసును నమోదు చేశారు. అక్టోబర్ 20న మాట్లాడాలంటూ అస్కర్‌ను పిలిచి కేసు వాపస్ తీసుకోవాలని అమీన్ ఒత్తిడి చేశాడు. అతడు ఒప్పుకోలేదనే కోపం తన స్కార్పియో కారుతో ఎక్కించి, తొక్కించి హత్య చేశాడు. ఈ వీడియోలు వైరల్ కావటంతో పోలిసులు అమీన్‌ను అరెస్ట్ చేశారు.

బీజేపీ కరువు యాత్రలపై సీఎం ధ్వజం

శివాజీనగర: బీజేపీ నాయకుల కరువు అధ్యయన పర్యటనపై మండిపడిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇది కరువు యాత్రగా లేదని ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. కేంద్రంలో వారిదే ప్రభుత్వం, కరువు అధ్యయన బృందంపై విశ్వాసం లేదా అని ప్రశ్నించారు. కరువు నష్టం అంచనా రూ. 33,770 కోట్లు, అయితే తాము కోరింది రూ. 17,901 కోట్లు, ఇప్పటి వరకు కేంద్రం నయా పైసా కూడా పరిహారం ఇవ్వలేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వస్తే పాలు తేనె కలసి ప్రవహిస్తుందని అమాయక కన్నడిగులను నమ్మించి గత లోక్‌సభ ఎన్నికల్లో 25 మంది ఎంపీలను గెలిపించి ఇచ్చారు కదా, వారు శెనక్కాయలు తింటున్నారా అని ఎద్దేవా చేశారు.

రాష్ట్ర సంబరం.. నేడే రాజ్యోత్సవం

- ఘన వేడుకలకు ఏర్పాట్లు

బనశంకరి: ఏటేటా మాదిరిగానే నవంబరు 1న కన్నడ రాజ్యోత్సవాలకు రాష్ట్రం సిద్ధమైంది. కూడళ్లు, మైదానాలు, చారిత్రక కట్టడాలపై కన్నడ ధ్వజాలు రెపరెపలాడుతున్నాయ. కాగా, ప్రత్యేక కర్ణాటక రాష్ట్రం ఏర్పడి 50 సంవత్సరాలు కావడం వల్ల ఈసారి మరింత ఘనంగా సంబరాలు జరగనున్నాయి. బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో కన్నడ సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో వైభవంగా రాజ్యోత్సవం జరగనుంది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మంత్రులు పాల్గొంటారు. బాలలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించనున్నాయి. ఈ ఏడాది కన్నడ రాజ్యోత్సవ పురస్కారాలకు ఎంపికైన 68 మంది వివిధ రంగాల ప్రముఖులకు సాయంత్రం రవీంద్ర కళాక్షేత్రలో సీఎంచే అవార్డుల ప్రదానం జరుగుతుంది. బీబీఎంపీ ప్రధాన కార్యాలయంలో, అలాగే నగరవ్యాప్తంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో భారీఎత్తున నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

బెళగావిలో ప్రత్యేకం

బెళగావిలో మహారాష్ట్ర మరాఠా సంఘాలు కన్నడ రాజ్యోత్సవాన్ని బ్లాక్‌డే గా పాటించాలని పిలుపునిచ్చి ఆందోళనలకు సిద్ధమయ్యాయి. వేడుకలను నిర్వహించి తీరుతామని స్థానిక జిల్లా యంత్రాంగం, కన్నడ సంఘాలు ప్రకటించాయి. బెళగావి నగరంలో విద్యుద్దీపాలంకరణ కనువిందు చేస్తోంది. కన్నడ పతాకాల రాష్ట్రవ్యాప్తంగా విక్రయిస్తున్నారు. బెళగావిలో కన్నడ స్ఫూర్తిని చాటే టీ షర్టుల అమ్మకాలు జోరుగా సాగాయి.





మంగళవారం బెళగావిలో కన్నడ పతాకాలు, టీషర్టుల విక్రయాలు



గొడవలు సృష్టిస్తే ఊరుకోం: హోంమంత్రి

శివాజీనగర: మహారాష్ట్రలో అల్లర్లు, కన్నడ రాజ్యోత్సవాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సరిహద్దు పోలీసులకు హోం మంత్రి పరమేశ్వర్ ఆదేశించారు. మహారాష్ట్ర నేతలు వచ్చి గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం నగరంలో విలేకరులతో మాట్లాడిన ఆయన, మహారాష్ట్ర సరిహద్దు బెళగావి, బీదర్‌లోని పోలీసులను ఇప్పటికే అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు. బెళగావిలో ఎంఈఎస్ జరిపే కార్యక్రమాలకు మహారాష్ట్ర మంత్రులు, నాయకులు వచ్చి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దీపావళి తరువాత ప్రజా పనుల శాఖ మంత్రి సతీశ్ జారకిహొళి నేతృత్వంలో 30 మంది ఎమ్మెల్యేలు దుబాయి పర్యటన చేపడతారనడంపై స్పందిస్తూ, బీజేపీవారు మాత్రం పర్యటనకు వెళతారంటే తమకు ఎలాంటి సంబంధం లేదు. ముందుగా వారు పర్యటనకు వెళ్లని ఆ తరువాత మాట్లాడటం సమంజసంగా ఉంటుందని పరమేశ్వర్ అన్నారు. కొత్తవారికి అవకాశం ఇవ్వాలని అధిష్టానం ఆదేశిస్తే తాను ఏ క్షణంలోనైనా రాజీనామా చేయడానికి సిద్ధమేనన్నారు.



బెళగావి నగరంలో అలంకారాలు

సరిహద్దుల్లో అలర్ట్: డీసీఎం

రాష్ట్రంలో సరిహద్దు, పొరుగు రాష్ట్రాల్లో ఉన్న కన్నడిగుల భద్రతకు తగిన చర్యలు తీసుకొంటామని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు. నగరంలో విలేకరులతో మాట్లాడిన ఆయన, మహారాష్ట్రలో కేఎస్ఆర్‌టీసీ బస్సులకు నిప్పటించటం తప్పు. ఎవరైనా గాని అటువంటి పనికి పూనుకోరాదు. రాష్ట్ర హితాన్ని కాపాడేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. రాష్ట్రంలోపల, పొరుగు రాష్ట్రాల్లో కన్నడగుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకొన్నాం. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం పోలీస్ అధికారులతో సభ జరిపి అవసరమైన సూచన ఇచ్చారని తెలిపారు.

క్లుప్తంగా

క్రికెట్ పోటీల విజేత కోలారు



ట్రోఫీని అందుకున్న కోలారు జట్టు

కోలారు: తుమకూరులోని మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో 2022–23వ సంవత్సరపు ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల ఫైనల్‌లో రాయచూరు జిల్లా జట్టుపై కోలారు జిల్లా జట్టు విజయం సాధించింది. విజేత కోలారు జట్టుకు జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.సురేష్‌బాబు అభినందనలు తెలిపారు. క్రికెట్ జట్టు ఉత్తమ ప్రదర్శనతో విజయం సాధించిందని కొనియాడారు. విజేత జట్టుకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షడక్షరి ట్రోఫీని అందించారు. కేజీఎఫ్ ఆటగాడు మంజునాథ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

కాలువలో గేజ్ కాపాడండి



ఎంపీకి వినతిపత్రం సమర్పిస్తున్న నిరుపాది

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువలో నీటి గేజ్‌ను సక్రమంగా నిర్వహించాలని కర్ణాటక రాష్ట్ర సమితి కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ, సింధనూరు ఎమ్మెల్యే హంపనగౌడ బాదర్లిని డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లాధ్యక్షుడు నిరుపాది మాట్లాడుతూ 40, 42, 46, 52, 54వ మైలు వద్ద నీటి నిర్వహణకు అధికారులు సహకరించి ఆయకట్టు చివరి భూములకు నీరందించాలన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తాం

తుమకూరు: నగర, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదలకు సొంత ఇళ్లను నిర్మించి ఇస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బెంగళూరు నగరం నుంచి దావణగెరె వెళ్తున్న ఆయన మార్గం మధ్యలో తుమకూరు నగరంలోని సదాశివనగరలో యూత్ కాంగ్రెస్ కార్యదర్శి ఇలాహి నివాసంలో ఆయన అల్పాహారం తీసుకుని మీడియాతో మాట్లాడారు. నగరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలను గుర్తించి వారికి ఇళ్లను కేటాయిస్తామన్నారు.

స్వామీజీకి గౌరవ డాక్టరేట్



మైసూరు: మైసూరు నగరంలోని రాష్ట్ర డాక్టర్ గంగూబాయి హానగల్ సంగీత విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో 6వ స్నాతకోత్సవం సందర్భంగా మైసూరు నగరంలోని అవధూత, దత్తపీఠంకు చెందిన పీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానంద స్వామికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి సన్మానించారు. రాజ్‌భవన్‌లో జరిగిన సాధారణ కార్యక్రమంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఈ అవార్డును ప్రదానం చేశారు.

జహేదా బానుకు బంగారు పతకం

తుమకూరు: బాగేపల్లి పట్టణానికి చెందిన కన్నడ పోరాటదారుడు జబీవుల్లా కుమార్తె జహేదాబాను ఉన్నత విద్యలో సత్తా చాటుతోంది. ఎమ్మెస్సీలో ఆమె బంగారు పతకం సాధించింది. 10వ తరగతి వరకు బాగేపల్లిలో చదివిన జహేదా అనంతరం పీయూసీ నరసింహయ్య నేషనల్ కళాశాలలో పూర్తి చేశారు. అనంతరం బెంగళూరు జీకేవీకే వ్యవసాయ వర్సిటీలో బీఎస్సీ అగ్రి, ఎమ్మెస్సీ పూర్తి చేశారు. పీజీలో ఉత్తమ ర్యాంకు సాధించి ఇటీవల జరిగిన వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ థావర్‌చంద్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు.

హుషారుగా కాలేజ్ ఫెస్ట్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

బనశంకరి: బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద గల ఐబీఎస్ , బెంగళూరు లో పేరుపొందిన కాలేజీగా ఉంది. మంగళవారం టౌన్‌హాల్ పుట్టణ్ణ శెట్టి పురభవన్‌లో ఐబీఎస్ సర్ఫేస్– 2023 అంతర్ కాలేజీ సాంస్కృతిక ఉత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే నాటకాలు, నృత్యం, గాయనం తదితర 50 కి పైగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించగా, ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రముఖులు అక్షిత్ కెనడి ప్రసంగించారు. ముఖ్య అతిథులుగా అశ్వినకుమార్– డెలాట్ ఇండియా డైరెక్టర్, ఐబీఎస్ సంస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జైప్రకాష్, మహేశ్వరరెడ్డి, కులదీప్‌శర్మా, ప్రిన్సిపాల్ డాక్టర్ త్రిపురనేని జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

రేగిన మరాఠా రిజర్వేషన్ల చిచ్చు

- కర్ణాటక ఆర్టీసీ బస్సుకు ఆందోళనకారుల నిప్పు
- మహారాష్ట్రకు తాత్కాలికంగా బస్సుల నిలిపివేత



కర్ణాటక బస్సుకు నిప్పు పెట్టిన దృశ్యాలు



రాళ్ల దాడిలో ధ్వంసమైన ఓ బస్సు అద్దం

సాక్షి బళ్లారి: మహారాష్ట్రలో చెలరేగిన మరాఠా రిజర్వేషన్ల పోరాటం హింసాత్మకంగా మారింది. ఎమ్మెల్యే ఇంటిపై ఆందోళనకారులు దాడి చేసి నిప్పంటించారు. దీంతో పాటు కర్ణాటక ఆర్టీసీ బస్సుకు నిప్పు పెట్టడంతో మహారాష్ట్రకు వెళ్లే కర్ణాటక బస్సులను తాత్కాలికంగా నిలిపి వేసినట్లు కేఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ రాచప్ప తెలిపారు. మహారాష్ట్రలో రిజర్వేషన్ల పోరాటం తీవ్ర రూపం దాల్చడం సోమవారం కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో కలకలం సృష్టించింది. రెండు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మహారాష్ట్రలోని ఉమర్గా సమీపంలోని తరూరీ గ్రామం వద్ద బీదర్ జిల్లా భాల్కి నుంచి పుణె వెళ్తున్న బస్సు(కేఏ–37 ఎఫ్–1201)కు ఆందోళనకారులు నిప్పు పెట్టారు. ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనతో మహారాష్ట్రకు వెళ్లే అన్ని బస్సులను నిలిపివేయడంతో కాస్త పరిస్థితి అదుపులోకి వచ్చింది. మహారాష్ట్రలో మరాఠా రిజర్వేషన్ల డిమాండ్‌పై గత ఆగస్టు నుంచి నిరసనలు కొనసాగుతున్నాయి. అక్టోబర్ 25న జాల్నా జిల్లా అంతర్‌వాలి సారథి గ్రామంలో నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభమైన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మరాఠా రిజర్వేషన్ల పోరాటం మళ్లీ ఉధృతమై హింసాత్మకంగా మారడానికి కారణమైంది.

ఎమ్మెల్యే ఇంటిపైకి రాళ్లు

నిరసనకారులు ఎమ్మెల్యే ఇంటిపై రాళ్లు రువ్వడంతో పాటు కర్ణాటక బస్సును తగలబెట్టడం ద్వారా తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. రిజర్వేషన్లు కోరుతూ మనోజ్ అనే కార్యకర్త ముంబైలో నిరవధిక నిరాహార దీక్షను చేపడుతున్నారు. ఆయన దీక్ష చేపట్టి వారం రోజులైంది. అంతకు ముందు మరాఠా వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలని లేకుంటే మరాఠాలతో పోరాడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ రెండు ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి. మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించేదాకా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని సూచించారు. మరాఠా రిజర్వేషన్ల పోరాటం హింసాత్మకంగా మారడంతో బీడ్ జిల్లాలో కూడా ముగ్గురు ఎమ్మెల్యేల ఇళ్లపై దాడులు నిర్వహించారు. ఇద్దరు ఎన్‌సీపీ ఎమ్మెల్యేలపై కూడా దాడులు జరిపారు. పోరాటం హింసాత్మకంగా మారిన నేపథ్యంలో పోలీసులు పరిస్థితిని అదుపు చేసేందుకు టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. రిజర్వేషన్ల డిమాండ్‌తో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి కూడా పాల్పడ్డాడు. బెళగావిలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. మహారాష్ట్రకు వెళ్లే వందలాది బస్సు సర్వీసులను నిలిపి వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సుకు నిప్పు పెట్టిన నేపథ్యంలో కర్ణాటక రవాణా శాఖా మంత్రి రామలింగారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటి దాడులు సరికాదని ఆందోళనకారులకు తీవ్రంగా హెచ్చరికలు జారీ చేశారు.



మాట్లాడుతున్న రవాణా మంత్రి రామలింగారెడ్డి

కావేరి నీటి కోసం పట్టు ఖండనీయం



వినతిపత్రం సమర్పిస్తున్న కరవే నేతలు

కంప్లి: కావేరిపై కర్ణాటక బంద్‌కు మద్దతిస్తూ కంప్లి రైతు సంఘం, కన్నడ పర సమాఖ్య, విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతు ప్రముఖులు బీవీ గౌడ, సీఆర్ హనుమంత మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు విలయ తాండవం చేస్తోందన్నారు. కావేరి జలాశయంలో తగినంత నీటి నిల్వ లేనప్పటికీ తమిళనాడుకు నీటిని విడుదల చేయాలనడం ఖండనీయం అన్నారు. ప్రముఖులు బీ.రమేష్, బళె మల్లికార్జున, బీసీ నాగరాజ్, బీ.సిద్దప్ప పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై రైతుల ధర్నా

రాయచూరు రూరల్: గ్రామాల్లో విద్యుత్ కోతలు విధిస్తుండడంతో రైతులు భూముల్లో వేసుకున్న పంటలు ఎండిపోతున్నాయని పేర్కొంటూ కర్ణాటక రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులు ఎండిన వరిదుబ్బులతో జిల్లాధ్యక్షుడు నిరుపాది నేతృత్వంలో ఆందోళనకు పూనుకున్నారు. గ్రామాల్లో 12 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నా కేవలం 3 గంటలకు మించి విద్యుత్ సరఫరా చేయక పోవడంతో పంప్‌సెట్లకు నీరందక పంటలు ఎండిపోతున్నాయన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా చేపట్టాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఎల్ఎల్‌సీకి నీరివ్వకుంటే పోరాటం



మాట్లాడుతున్న శ్రీరాములు, చిత్రంలో సురేష్‌బాబు

కంప్లి: తుంగభద్ర ఎల్ఎల్‌సీకి డిసెంబర్ 15వ వరకు నీరు పారించని పక్షంలో జిల్లాధికారి కార్యాలయం ముందు రైతాంగం ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపట్టనున్నట్టు మాజీ మంత్రి బీ.శ్రీరాములు హెచ్చరించారు. కంప్లి పట్టణంలో బీజేపీ కార్యకర్తలు, ప్రముఖుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తుంగభద్ర కుడి దిగువ కాలువ(ఎల్ఎల్‌సీ)కు డిసెంబర్ 15 వరకు నీటిని వదలాలన్నారు. ఇక ప్రధానంగా ఈ ప్రాంతంలో మిరప పంట పండించే రైతుల శ్రేయస్సును కాపాడాలన్నారు. కాలువ నీటి పంపకాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చించాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు, బీజేపీ క్షేత్ర అధ్యక్షులు అళ్లళ్లి వీరేష్, బ్రహ్మయ్య పురుషోత్తం, బీ.సిద్దప్ప, డాక్టర్ వెంకటేష్ బర్మక్కనవర్, వీఎల్ బాబు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుమనిషి అడుగు జాడల్లో నడవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందిస్తున్న దృశ్యం

కంప్లి: రాష్ట్రీయ ఏక్తా దివస్ ఉక్కు మనిషిగా పేరొందిన సర్దార్ వల్లభ్‌బాయి పటేల్ జయంతిని తమ సంస్థ పరంగా జరుపుకోవడం తమ పూర్వ జన్మ సుకృతమని జేసీఐ కంప్లి సోనా అధ్యక్షులు సంతోష్ కొట్రప్ప సోగి, కార్యదర్శి బీహెచ్ఎం అమరనాథ శాస్త్రి తెలిపారు. మంగళవారం విజయనగర పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారి అడుగు జాడల్లో నడవాలని సూచించారు. అనంతరం ఎన్ఎల్‌టీఎస్ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రమాణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల మండలి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు జేసీఐ కంప్లి సోనా పదాధికారులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీటి కోసం రాస్తారోకో

- మూడు గంటలు స్తంభించిన రవాణ
- తుంగభద్రను మరో కావేరి కానివ్వొద్దు
- ముక్తకంఠంతో నినదించిన ఆందోళనకారులు



ఎండిన వరిదుబ్బులతో రాస్తారోకో చేస్తున్న రైతులు

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువలో నీటి గేజ్‌ను కాపాడి చివరి ఆయకట్టుకు నీరందించాలని 104వ మైలు పోరాట సమితి డిమాండ్ చేసింది. మంగళవారం సాత్ మైలు వద్ద చేపట్టిన రాస్తారోకోను ఉద్దేశించి అధ్యక్షుడు మహంతేష్ పాటిల్, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు చామరస మాలిపాటిల్, జిల్లా జేడీఎస్ అధ్యక్షుడు విరుపాక్షి, జనాందోళన సమితి అధ్యక్షుడు రాఘవేంద్ర కుష్టిగి మాట్లాడారు. 104వ మైలు వద్ద నీటి నిర్వహణకు అధికారులు సహకరించాలన్నారు. ఆయకట్టు చివరి భూములకు నీరందించాలంటే గేజ్‌ను పెంచాలన్నారు. ఇంజినీర్లు సక్రమంగా కాలువలపై నీటి నిర్వహణ చేపట్టాలన్నారు. చివరి ఆయకట్టుకు నీరు వచ్చేంత వరకు ఆందోళను విరమించరాదన్నారు. నీటిపారుదల శాఖా మంత్రి డీకే శివకుమార్ మౌనం వీడాలన్నారు. తుంగభద్రను మరో కావేరీని కానివ్వొద్దు అంటూ నినాదాలు చేశారు. రాస్తారోకోతో మూడు గంటల పాటు వాహన రాకపోకలు స్తంభించాయి.

ఇందిరా, పటేల్‌లకు పుష్పాంజలి



ఇందిరా, పటేల్‌ల చిత్రపటాలకు నాయకుల పుష్పాంజలి

రాయచూరు రూరల్: దేశానికి స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు శ్రమించిన మహానుభావుడు, ఉక్కు మనిషిగా పేరొందిన వ్యక్తి సర్దార్ వల్లభ్‌బాయి పటేల్ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వసంత్ కుమార్, నగరాధ్యక్షుడు బసవరాజరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి సర్దార్ వల్లభ్‌బాయి పటేల్ జయంతి, ఏక్తా దివస్, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. మహనీయుల ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో సుఖాణి, బసవరాజ్ పాటిల్, శశికళ, శాంతప్ప, అమరేగౌడ, శ్రీనివాస్, ఆంజినేయ, మంజులలున్నారు.

కన్నడ సేవకులు ఆదర్శప్రాయులు

కోలారు: ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా కన్నడ మాతకు సేవ చేస్తూ నిరంతరం తరిస్తున్న వారిని ప్రతి కన్నడిగుడు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు బీవీ గోపినాథ్ తెలిపారు. మంగళవారం కన్నడ రాజ్యోత్సవం పురస్కరించుకుని పాత్రికేయుల భవనంలో కన్నడ మాత సేవకులకు సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కన్నడ సేవే పరమార్థమనే భావన ప్రతి ఒక్కరిలోను రావాలన్నారు. సురేష్, రమేష్‌లు ఇద్దరూ నిజమైన కన్నడ పరిచారకులన్నారు. అలాంటి వారినందరిని గుర్తించి తగిన విధంగా గౌరవించడం పాత్రికేయుల బాధ్యత అన్నారు. గోకాక్ విప్లవం తరువాత కేజీఎఫ్ పరిస్థితిలో ఎంతో మార్పు వచ్చిందన్నారు. కన్నడ అనే విశాల మనోభావన ప్రతి ఒక్కరిలోను నేడు కలుగుతోందన్నారు. కసాప జిల్లా అధ్యక్షుడు గోపాలగౌడ, పాత్రికేయులు కెఎస్ గణేష్, మామి ప్రకాష్, చంద్రశేఖర్, అనంతరాం, వాసుదేవ హొళ్ల పాల్గొన్నారు.

వాడవాడలా ఏక్తా దినోత్సవం



ప్రతిజ్ఞా విధిని స్వీకరిస్తున్న దృశ్యం

రాయచూరురూరల్ : నగరంలో సర్దార్ వల్లబ్ బాయి పటేల్ జయంతి, ఏక్తా యాత్ర దినోత్సవం జరిగాయి. మంగళవారం పటేల్ రోడ్డులో సర్దార్ వల్లబ్‌బాయి పటేల్ విగ్రహానికి జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, ఎస్పీ నిఖిల్, సీఈఓ రాహుల్ తుకారాం పాండే పూలమాలలు వేశారు. అనంతరం జిల్లాధికారి నాయక్ ఏక్తా యాత్రను ప్రారంభించారు. నగరసభ కార్యాలయంలో కమిషనర్ గురుసిద్దయ్య, వివిధ ప్రభుత్వ, తాలూకా, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, దిన్ని పాఠశాలలో ఏక్తా దినోత్సవాలు జరిగాయి. బీజేపీ కార్యాలయంలో జిల్లాధ్యక్షుడు రమానంద సర్దార్ వల్లబ్ బాయి పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన భారతదేశానికి చేసిన సేవలను కొనియాడారు.

9న జాతీయ జనతా అదాలత్

కోలారు: దేశాన్ని వ్యాజ్యరహితంగా చేయడానికి గాను జనస్నేహ జాతీయ జనతా లోక్‌అదాలత్‌ను డిసెంబర్ 9న నిర్వహిస్తున్నట్లు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవల ప్రాధికార అధ్యక్షుడు శుక్లాక్ష పాలన్ తెలిపారు. మంగవారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత సంవత్సరంలో ఇంతవరకు 3 జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహించామన్నారు. మొత్తం 33 వేల కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించారన్నారు. ఇందులో 19 వేల కేసులు కోర్టులో బాకీ ఉండగా, 14 వేల కేసులు వ్యాజ్య పూర్వ తీర్మానాలన్నారు. గత నెల 9న నిర్వహించిన లోక్ అదాలత్ బైఠక్‌లో మొత్తం 14,621 కేసులను రాజీ ప్రక్రియ ద్వారా పరిష్కరించారన్నారు. జనతా న్యాయాలయం ద్వారా ఇంతవరకు రూ.21.86 కోట్ల పరిహారధనాన్ని రాజీ ద్వారా చెల్లించాలని ఆదేశించినట్లు తెలిపారు. గత లోక్‌అదాలత్‌లో రాజీ అయిన 62 క్రిమినల్ కేసులు, 312 చెక్‌బౌన్స్ కేసులు, 23 కౌటుంబిక వ్యాజ్యాలు, 72 విభాగ దావాలు, 274 సివిల్ కేసులు, 31 మోటారు వాహన ప్రమాద పరిహార కేసులను, 4950 ఇతర క్రిమినల్ కేసులతో పాటు 6619 కేసులు, 8002 వ్యాజ్య పూర్వ కేసులను జిల్లాలోని అన్ని కోర్టుల్లో పరిష్కరించారన్నారు. జనతా లోక్ అదాలత్ ద్వారా డబ్బు, సమయం ఆదా అవుతుందని, ప్రజలు ఈ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంజినీర్ దుర్మరణం

యశవంతపుర: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇంజినీర్ మృతి చెందిన ఘటన జాలహళ్లి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పీణ్యా సెకండ్ స్టేజీకి చెందిన సుభాశ్ (26) మృతి చెందారు. మంగళవారం తెల్లవారుజామున శుభాష్ తన స్కూటర్‌లో వెళ్తుండగా హెచ్ఎంటీ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ శుభాష్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. జాలహళ్లి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బస్సులో జనతా దర్శన్‌కు అధికారులు



తుమకూరు: తుమకూరు జిల్లా హులియూరు దుర్గలో మంగళవారం జరిగిన జనతా దర్శన్‌కు అధికారులు కేఎస్ ఆర్టీసీ బస్సులో వెళ్లారు. అది కూడా టికెట్లు కొని వెళ్లారు. వ్యయాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో కలెక్టర్ శ్రీనివాస్, సీఈఓ జీ ప్రభు, అదనపు జిల్లా అధికారి శివానంద, ఇతర జిల్లా అధికారులు కలిసి ఒకే బస్సులో వెళ్లారు. అనవసర ఖర్చులు తగ్గించాలనే ఉద్దేశ్యంతో అందరూ కలిసి బస్సులో వెళ్లినట్లు జిల్లా అధికారి తెలిపారు.

ఖతర్నాక్ కేటుగాళ్లు అరెస్ట్

యశవంతపుర: రాష్ట్ర ప్రభుత్వ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్టుమెంట్ అధికారిక కావేరి వెబ్‌సైట్ ద్వారా పత్రాలు దొంగలించి, అత్యాధునిక పరికరం ద్వారా ఓ బ్యాంకు ఖాతాలో డబ్బులు కొల్లగొట్టిన ఇద్దరు కేటుగాళ్లను యలహంక పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ. 1.5 లక్షల నగదు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు బిహార్‌కు చెందిన దీపక్ కుమార్, నివేదిత్ కుమార్‌గా గుర్తించారు. నిందితులు ఓ బ్యాంక్ ఖాతా నుంచి ఒకసారి రూ.38 వేలు, మరోసారి రూ.10 వేలు డ్రా చేసిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంక్ నుంచి సమాచారం గానీ, ఓటీపీని కూడా షేర్ చేసుకోకుండా డబ్బులు ఎలా డ్రా అయ్యాయె తెలియకపోవడంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రభుత్వ రిజిస్ట్రేషన్, ముద్రణ వెబ్‌సైట్ నుంచి పత్రాలను డౌన్‌లోడ్ చేసుకొనే పనిలో భాగంగా ఆధార్ నంబర్, చేతివేళ్లను నకలు చేసుకుని అధికారికి తెలియకుండా బ్యాంక్ లింక్‌తో బ్యాంక్ నుంచి డబ్బులను బదిలీ చేసుకున్నట్లు పోలీసుల విచారణలో బయట పడింది. నిందితుల నుంచి రూ.1.5 లక్షలు నగదుతో పాటు రెండు లాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

కోలారు వార్తలు...

హత్యను నిరసిస్తూ బంద్ జయప్రదం



ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీనివాసన్ అభిమానులు



బంద్‌తో నిర్మానుష్యంగా మారిన బస్టాండు

శ్రీనివాసపురం: కాంగ్రెస్ నాయకుడు, కౌన్సిలర్ శ్రీనివాసన్ హత్యను ఖండిస్తూ మంగళవారం వివిధ దళిత సంఘాలు, ప్రగతిశీల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీనివాసపురం బంద్ పూర్తిగా విజయవంతమైంది. ఉదయం పట్టణంలోని ఇందిరా భవన్ సర్కిల్‌లో దివంగత కౌన్సిలర్ శ్రీనివాసన్ చిత్రపటాన్ని ఉంచి అభిమానులు పాలాభిషేకం చేశారు. మానవహారంగా ఏర్పడి శ్రీనివాసన్‌కు నివాళులు అర్పించారు. శ్రీనివాసన్‌కు జయజయ ధ్వానాలు చేస్తూ పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. బంద్‌కు మద్దతుగా పట్టణంలోని అన్ని దుకాణాలు, హోటళ్లు, సినిమా హాళ్లు మూసివేశారు. ఆటో డ్రైవర్లు, ప్రైవేటు బస్సులు బంద్‌కు మద్దతు తెలిపారు. పట్టణంలో వాహనాల సంచారం లేకపోవడంతో వీధులన్ని జనసంచారం లేక నిర్మానుష్యంగా కనిపించాయి. కెఎస్ఆర్టీసీ బస్టాండు కూడా బోసిపోయింది. బంద్ సందర్భంగా పోలీసులు పట్టణంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ర్యాలీలో పాల్గొని మాట్లాడిన పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు దింబాల అశోక్ శ్రీనివాసన్ హత్యను ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలన్నారు. హంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ శిరీన్‌తాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. ర్యాలీలో దళిత నాయకులు తిమ్మయ్య, కెకె మంజునాథ్, పురసభ మాజీ అధ్యక్షుడు బి ఎం ప్రకాష్ పాల్గొన్నారు.

3న మెగా ఉద్యోగ మేళా



మాట్లాడుతున్న సందీష్

కోలారు: బెంగళూరు ఫస్ట్ సర్కిల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలో నవంబర్ 3న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు బెంగళూరు ఫస్ట్ సర్కిల్ సొసైటీ అధ్యక్షుడు సందీష్ తెలిపారు. మంగళవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలోని ప్రభుత్వ బాలుర కళాశాలలో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాలో సుమారు 50 కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. మేళాలో 4 నుంచి 5 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. మూడేళ్ల క్రితం సుమారు 600 మంది పారిశ్రామికవేత్తలు కలిసి సొసైటీని ప్రారంభించి కొత్తగా పరిశ్రమలను ప్రారంభించే వారికి అన్ని విధాలా సహకారం అందించినట్లు తెలిపారు. ఫస్ట్ సర్కిల్ సంస్థ డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో మూడు రోజుల పాటు బెంగళూరులోని ప్యాలెస్ మైదానంలో జాబ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 120 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ఉద్దేశం ఉన్నట్లు తెలిపారు. మేళాలో పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. కౌశల్యాభివృద్ధి శాఖ జిల్లా అధికారి కె శ్రీనివాస్, బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసగౌడ పాల్గొన్నారు.

అవినీతిని దాచడానికే పులిగోరు వివాదం

కోలారు: రాష్ట్ర ప్రభుత్వం అవినీతి అక్రమాల్లో కూరుకుపోయి తమ అవినీతిని కప్పిపుచ్చుకోడానికే పులిగోరు వివాదాన్ని తెరపైకి తెచ్చిందని లోక్‌సభ సభ్యుడు ఎస్.మునిస్వామి ఆరోపించారు. మంగళవారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదాయ పన్ను శాఖ దాడులు నిర్వహించి కాంట్రాక్టర్ల ఇళ్ల నుంచి రూ.100 కోట్లను స్వాధీనం చేసుకున్నప్పుడే దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదు సరి కదా ప్రజల దృష్టి నుంచి మరల్చడానికే ఇలాంటి చిన్న వివాదాలను తీసుకొస్తోందన్నారు. ఇన్నేళ్లు అటవీశాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో డీకే శివకుమార్, సతీష్ జార్కిహోళి, జి.పరమేశ్వర్ గ్రూపులు పుట్టుకొచ్చాయి. తీవ్ర గందరగోళంలో ఉన్న కాంగ్రెస్ పాలనపై దృష్టి పెట్టడానికి సాధ్యం కావడం లేదన్నారు.

దాహం తీర్చుకుంది !



బొమ్మనహళ్లి: బెంగళూరు నగరంలో ఎండలు మండిపోతున్నాయి. నోరు లేని జీవులు దాహం తీర్చుకోవడానికి ఎనలేని పాట్లు పడుతున్నాయి. నగరంలోని కోరమంగళ సమీపంలో ఓ మర్కటం దాహాన్ని తట్టుకోలేక ఓ వ్యక్తి వద్ద ఉన్న నీళ్ల బాటిల్ లాక్కెళ్లి దాహం తీర్చుకున్న ఘటన చోటుచేసుకుంది. ఇక్కడి సెయింట్‌జాన్స్ ఆస్పత్రి వద్ద ఓ వ్యక్తి తన స్నేహితులతో మాట్లాతూ సమీపంలోని ఓ దుకాణంలో నీళ్ల బాటిల్ కొనుక్కున్నాడు. అక్కడే వేచి ఉన్న ఓ కోతి అతని చేతిలో ఉన్న నీళ్ల బాటిల్ లాక్కొని వెళ్లి దాహం తీర్చుకుంది. అక్కడి వారు ఆ దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అయ్యో పాపం ఎంత దాహం కలిగిందో అంటూ మర్కటంపై సానుభూతి చూపారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయ వృత్తి పరమ పవిత్రం



వీడ్కోలు సందర్భంగా శివణ్ణను సన్మానిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: ఉపాధ్యాయ వృత్తి పరమ పవిత్రమైనదని నవీన్ ఇన్‌స్టిట్యూట్ అధినేత నవీన్ తెలిపారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో 8 ఏళ్లు ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించి రిటైరైన శివణ్ణ వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఉత్తమ ప్రిన్సిపాల్‌గా శివణ్ణ గుర్తింపు తెచ్చుకున్నారని, విద్యార్థులు, సిబ్బందితో ఎంతో సౌమ్యంగా వ్యవహరించేవారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శివణ్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సురేశ్ బాబు, మధుసూదనరెడ్డి, మంజునాథ్, మారెప్ప, డా రమేశ్ చంద్ర దత్త తదితులు పాల్గొన్నారు.

ఈద్గా మైదానంలో రాజ్యోత్సవం

శివాజీనగర: నగరంలోని చామరాజపేట ఈద్గా మైదానంలో బుధవారం రాజ్యోత్సవాలను జరిపేందుకు హైకోర్టు ఆమోదం తెలిపింది. అనుమతి కోరుతూ చామరాజపేట ప్రజా ఒక్కూట సంఘం సమర్పించిన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం అందుకు అనుమతించింది. మూడు రోజులు సాంస్కృతిక కార్యక్రమాలు జరిపేందుకు అవకాశం కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం



మహదేవ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందిన ఘటన కనకపుర తాలూకా మరళవాడి గ్రామం వద్ద చోటుచేసుకుంది. విరూపసంద్ర గ్రామానికి చెందిన మహదేవ (56) మృతి చెందిన రైతు. సోమవారం సాయంత్రం స్నేహితుడితో కలిసి మహదేవ మామిడి తోట అమ్మిన డబ్బులు తీసుకోవడానికి బైక్‌లో వెళ్లి తిరిగి వస్తుండగా మరళవాడి వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడగా దయానంద సాగర్ ఆస్పత్రిలో చేర్చారు. మంగళవారం ఉదయం మహదేవ చికిత్స ఫలించక మృతి చెందారు. హారోహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మహా పురుషుల ఆదర్శాలను అలవరచుకోవాలి



కాచిమాచేపల్లిలో పునీత్ వర్ధంతి

గౌరిబిదనూరు: మహాపురుషుల ఆదర్శాలను నేటి యువతరం అలవరచుకోవాలని కాంగ్రెస్ నాయకుడు బొమ్మణ్ణ తెలిపారు. మంగళవారం తాలూకా కాచిమాచేనహళ్లి గ్రామంలో పునీత్‌రాజ్‌కుమార్ సంస్మరణా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పునీత్ రాజ్‌కుమార్ తన జీవితంలో అనేక మంది అనాథ బాలికలకు విద్య, ఆరోగ్యం అందించారు. వారు చేసే సమాజ సేవ వారి కుటుంబ సభ్యులకు సైతం తెలిసేది కాదన్నారు. వారి పేరిట ఈ కుగ్రామంలో అభిమానులు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. హరీశ్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో రాజశేఖర్, నాగరాజు, మంజునాథ్, నరసరెడ్డి, నవీన్‌కుమార్, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తు

శివమొగ్గ: శివమొగ్గ నగరంతో పాటు తీర్థహళ్లి, ఉడుపిలో వివిధ చోట్ల ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు యువకులను శివమొగ్గ నగర పోలీసులు పోలీసులు అరెస్ట్ చేసి బంగారు నగలు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు హావేరి జిల్లా రట్నెహళ్లి తాలూకా సర్వజ్ఞ నగరకు చెందిన ఆకాశ్ (21), రాణిబెన్నూరు పట్టణానికి చెందిన ప్రవీణ్ (28)గా గుర్తించారు. వీరి నుంచి 186 గ్రాముల బంగారు నగలు, రూ. లక్ష విలువైన రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

నందికొండల్లో చిరుత

దొడ్డబళ్లాపురం: నందికొండ పరిసరాల్లో ఉన్న దొడ్డ తాలూకా చన్నాపుర గ్రామంలో చిరుత హల్‌చల్ చేస్తోంది. సోమవారం అర్ధరాత్రి గ్రామంలో జొరబడ్డ చిరుత వెంకటేశ్ అనే రైతుకు చెందిన ఆవును చంపి పారిపోయింది. ఆవు అరుపులకు నిద్రలేచి చూసిన వెంకటేశ్‌కు చిరుత పరారవడం కనిపించింది. దీంతో గ్రామస్తులకు నిద్ర కరువైంది. వెంకటేశ్ రెండు ఆవులపై ఆధారపడి జీవనం సాగిస్తుండగా అందులో ఒక ఆవును చిరుత బలి తీసుకోవడంతో రైతు బోరుమంటున్నాడు. అటవీశాఖ అధికారులు బోను ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని డిమాండు చేస్తున్నారు.

మనోహరం.. మట్టు బీచ్



మట్టు బీచ్ సమీపంలో పురాతన లైట్‌హౌస్



ప్రశాంత సంధ్యా సమయం



రాత్రివేళ మిరుమిట్లు గొలిపే అలలు

- ఉడుపికి సమీపంలో అందమైన తీరం
- రాత్రిపూట మెరిసే అలలు ప్రత్యేకం

బనశంకరి: ఉడుపి నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మట్టు బీచ్ రాత్రిపూట దాని బయోలుమినిసెన్స్ వింతకు ప్రసిద్ధి చెందింది. రాత్రి కాగానే మార్మికమైన వెలుగులతో కూడిన అలలు పోటెత్తుతాయి. కొత్త కాంతులు బీచ్‌ను అలంకరిస్తాయి. నగర జనావాసాలకు దూరంగా ఉండడం వల్ల మరింత ప్రశాంతంగా, ఆహ్లాదంగా ఈ తీరం కనిపిస్తుంది. ఇక్కడి సముద్రం బ్యాక్ వాటర్ మధ్యలో చిన్న చిన్న ఇళ్లు, పచ్చని ప్రాంతాలు అబ్బురపరుస్తాయి. సముద్రం- బ్యాక్ వాటర్ మధ్య విభజనగా ఇసుక పాయలు, వాటిపై కొబ్బరిచెట్లు, లైట్‌హౌస్, ఇళ్లు కొత్త అనుభూతికి గురిచేస్తాయనడంలో సందేహం లేదు.



సముద్రం- బ్యాక్‌వాటర్ మధ్య ఇసుకపాయలు

మట్టు పేరెలా వచ్చింది

మట్టు బీచ్ సందర్శకులకు చక్కని విహారయాత్రకు కావలసినంత అనువైనది. మట్టి అనే చిన్న గ్రామం వల్ల బీచ్‌కు ఆ పేరు వచ్చినట్లు చెబుతారు. ఈ గ్రామం తీర ప్రాంత మంగళూరుశైలిలో కనువిందు చేస్తుంది. మట్టి గ్రామంలో మరో విశేషం.. ఆకుపచ్చ వంకాయలు. ఈ అరుదైన వంకాయ గింజలను దేవుడు వాదిరాజస్వామి బహుమతిగా ఇచ్చారని నమ్ముతారు. సముద్రం దగ్గరే ఉన్నప్పటికీ మట్టు చుట్టుపక్కల వ్యవసాయ భూములను చూడవచ్చు. ఇది బాగా ప్రాచుర్యం పొందింది. ఇక్కడ పండించే మొదటి బెండకాయను ఉడుపిలోని ప్రసిద్ధ శ్రీకృష్ణ దేవాలయంలో జగన్నాటక సూత్రధారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

ఏకాంత ప్రదేశం

మట్టుబీచ్ మామూలుగానే మనోహరంగా దర్శనమిస్తుంది. ఇక ఉషోదయం, సంధ్యా సమయంలో సముద్రం విచిత్రమైన సౌందర్యంతో ప్రకాశిస్తుంది. సూర్యాస్తమయం చూడడానికి చుట్టుపక్కల జిల్లాల నుంచే కాక దూరప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తుంటారు. ఈ చిన్నపాటి బీచ్‌కు సరి సమానమైనది ఎక్కడా లేదని పర్యాటకులు కితాబిస్తారు. సముద్ర తీరాల్లో ఇంత ఏకాంత ప్రదేశాన్ని మించింది మరొకటి ఉండదేమో.

రాత్రి వేళ వెలుగులు

రాత్రివేళల్లో తీరాన్ని తాకే అలలు నీలి, ఆకుపచ్చ రేడియం కాంతులతో ప్రకాశిస్తాయి. వీటిని చూస్తుంటే ఎవరైనా ఉత్సుకతకు లోనవుతారు. నీటిలో పెరిగే ఆల్గే, కొన్ని రకాల సముద్ర బ్యాక్టీరియాలపై కాంతి ప్రసరించినప్పుడు అవి ఇలా వింత వెలుతురును విడుదల చేస్తాయి. అదే ప్రకాశవంతంగా కనిపిస్తుంది. ఇక్కడికి దగ్గరిలోని పడుకెరె బీచ్‌లోనూ ఇదే మాదిరి బయోలుమినెన్స్ విశిష్టత ఉంటుంది. చంద్రుడు లేనప్పుడు చీకటిగా ఉన్నప్పుడు మరింత బాగా కనిపిస్తుంది.

4న తెలుగు పాస్టర్ల, సంఘ పెద్దల సమావేశం

శివాజీనగర: నగరంలోని గోకుల, ఎల్‌సీఆర్ స్కూల్ సమీపంలో ఉన్న ప్రేయర్ బాప్టిస్ట్ చర్చిలో నవంబర్ 4న శనివారం కర్ణాటక తెలుగు క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో తెలుగు పాస్టర్ల, సంఘాల పెద్దల సమావేశం జరుగనుందని కేటీసీఎంఎఫ్ సంస్థాపక అధ్యక్షుడు బిషప్ రెవరెండ్ ఎం.బెంజిమన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపుర తదితర జిల్లాల్లో సేవలందిస్తున్న పాస్టర్లను, సంఘ పెద్దలను ఆధ్యాత్మికంగా బలపరచాలనే ఉద్దేశ్యంతో కేటీసీఎంఎఫ్ పని చేస్తున్నట్లు తెలిపారు. శనివారం జరిగే పాస్టర్ల సమావేశంలో ప్రసంగీకులు డాక్టర్ జాన్‌పాల్, డాక్టర్ రెవరెండ్ జే.డీ.మోజస్ దైవ వర్తమానాన్ని వినిపిస్తారని తెలిపారు.

నదిలో దూకి వ్యాపారి ఆత్మహత్య



ప్రసన్నకుమార్ (ఫైల్)

యశవంతపుర: మంగళూరు సమీపంలోని నేత్రావతి నదిలో దూకి చిక్కమగళూరు వాసి ఆత్మహత్య చేసుకున్నారు. చిక్కమగళూరు నగర కర్తికెరె సమీపంలోని బైరాపుర గ్రామానికి చెందిన ప్రసన్నకుమార్ (40) ఆత్మహత్య చేసుకున్నారు. ప్రసన్నకుమార్ కూరగాయల వ్యాపారం చేస్తూ రోజు చిక్కమగళూరు నుంచి మంగళూరుకు సరఫరా చేసేవారు. సోమవారం ఉదయం వ్యాపారం చేసిన నగదు తీసుకుని వస్తామని చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నం నేత్రావతి నది వంతెన వద్ద కారును నిలిపి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు దూరం నుంచి గమనించి వీడియో తీసి వైరల్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ప్రసన్నకుమార్‌గా బయటపడింది. పోలీసులు మృతదేహాన్ని బయటకి తీసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

స్నాచర్లు అరెస్ట్

బనశంకరి: స్నాచింగ్‌లు, ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని మంగళవారం మల్లేశ్వరం పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 33.12 లక్షల విలువ చేసే 625 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మహమ్మద్ జబీవుద్దీన్, మహ్మద్ మెహతాబ్, జగదీశ్‌కుమార్ పట్టుబడిన దొంగలు. ఈనెల 21న మల్లేశ్వరం 8వ క్రాస్‌లో వృద్ధురాలు శివమ్మ వాకింగ్‌కు వెళ్తుండగా ఆమె మెడలో ఉన్న 30 గ్రాముల బంగారు చైన్ లాక్కెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరాలు పరిశీలించి మహమ్మద్ జబీవుద్దీన్, మహ్మద్‌మెహతాబ్‌ను మంగళవారం అరెస్ట్ చేశారు. వీరు పలు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. మరో కేసులో జగదీశ్ కుమార్‌ను అరెస్ట్ చేసి ఇతడి వద్ద నుంచి రూ.6.5 లక్షల విలువచేసే 122 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

ఉత్తమ విద్యతోనే దేశాభివృద్ధి



పట్టాలు అందుకున్న విద్యార్థులు

బొమ్మనహళ్లి: ఉత్తమ విద్యా సాధనతోనే దేశాభివృద్ధి సాధ్యమని డాక్టర్ టి.ఎస్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం నగరంలోని ఆనేకల్ సమిపంలో ఉన్న సాయిరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన 23వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ... ఇటీవల విద్యతో పాటు ఉపాధి రంగంలో పెనుమార్పులు వచ్చాయని, విద్యార్థులు వారు ఎంచుకున్న రంగంలో లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ బ్రీజేంద్ర షా, నరేష్ రాజ్, టాయోటా కంపెని ప్రిన్సిపాల్ డాక్టర్. షడాక్షరప్ప, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ డాక్టర్.ఆర్. అరుణ్ కుమార్, ప్రొఫెసర్ మాలిని రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఇంటిపై పోస్టర్లు

యశవంతపుర: మాజీ మంత్రి రమేశ్ జారకిహొళి సదాశివనగరలోని ఇంటిపై అనుచిత వ్యాఖ్యలతో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పోస్టర్లు అంటించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే వాటిని తొలగించారు. రమేశ్ ఫొటోతో పాటు పోస్టర్‌లో అనుచిత వ్యాఖ్యలు రాశారు. పోస్టర్లను అంటించటానికి గల కారణాలు తెలియలేదు. దీంతో రమేశ్ జార్కిహోళి ఇంటి వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. సోమవారం ఆయన బెళగావిలో డీకే శివకుమార్‌కు వ్యతిరేకంగా ప్రెస్‌మీట్ పెట్టారు. హైకోర్టు ఆదేశాల కారణంగా డీకే శివకుమార్ అధికారం కోల్పోవటం ఖాయమని వ్యాఖ్యలు చేశారు. అదే రోజు రాత్రి ఇలా జరగటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సీసీబీ దాడి :

మహిళలను అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాపై సీసీబీ పోలీసులు దాడి చేసి 14 మందిని అరెస్ట్ చేసి 20 మంది మహిళలను కాపాడారు. నిందితులపై బాగలగుంటె, వర్తూరు, విద్యారణ్యపుర, అమృతహళ్లి, కేఆర్ పుర పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. నిందితుల నుంచి 4 బైకులు, కారు, 40 మొబైల్ ఫోన్లు, రెండు లాప్‌టాప్‌లు, సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

బెంగళూరు గ్రామీణ జిల్లాగా దొడ్డ పట్టణాన్ని ప్రకటించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

దొడ్డబళ్లాపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా కేంద్రంగా దొడ్డ పట్టణాన్ని ప్రకటించాలని దొడ్డ ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు డిమాండు చేసారు. మంగళవారం పట్టణంలోని బాబు జగజీవన్ రాం భవనంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనతా దర్శన్ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన జిల్లా కేంద్రానికి ఉండాల్సిన అర్హతలు అన్నీ దొడ్డ పట్టణానికి ఉన్నాయని, ఇటీవల ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా దొడ్డబళ్లాపురాన్ని జిల్లా కేంద్రంగా పరిగణించి బెంగళూరు గ్రామీణ జిల్లా రచించామని ఎక్స్‌లో పోస్టు చేసారని గుర్తు చేసారు. జిల్లా ఆస్పత్రి నిర్మాణానికి దొడ్డ తాలూకా సిద్దేనాయకనహళ్లి వద్ద 9.38 ఎకరాలు భూమి గుర్తించామన్నారు. 2019లో జిల్లా ఆస్పత్రికి మనవి చేసుకుంటే 2022లో మంత్రివర్గ సమావేశంలో ఆమోదించడం జరిగిందని గుర్తు చేసారు. మొత్తం రూ.164 కోట్ల ఖర్చుతో జిల్లా ఆస్పత్రి నిర్మాణానికి 2023లో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని ఇప్పటి వరకూ ఆ దిశలో పనులు ప్రారంభం కాలేదన్నారు. జనతా దర్శన్‌లో రెవెన్యూ, నగరసభ, తాలూకా పంచాయతీ కార్యాలయాలపై అధికంగా ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కేహెచ్ మునియప్ప, ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

వందే భారత్ సేవలను బెళగావికి విస్తరించండి

- రైల్వే మంత్రికి సీఎం లేఖ

శివాజీనగర: బెంగళూరు-హుబ్లీ-ధారవాడ వందే భారత్ రైల్వే సేవలను బెళగావి వరకు విస్తరించాలని కోరుతూ సీఎం సిద్దరామయ్య కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు లేఖ రాశారు. కిత్తూరు కర్ణాటక బెళగావి భాగపు లక్షలాది మంది కన్నడిగుల తరపున తాను మీకు లేఖ రాస్తున్నాను. కేంద్ర ప్రభుత్వం జూన్ 17, 2023కు రాష్ట్రంలో రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైల్వే సేవలను బెంగళూరు-హుబ్లీ-ధారవాడ వరకు ఆరంభించింది. దీని ద్వారా ఆ భాగపు ప్రజలందరికీ చాలా అనుకూలమైందని లేఖలో తెలిపారు. బెళగావి వ్యాపారులు, విద్యార్థులకు, పర్యాటక రంగ ప్రధాన కేంద్రం, ఇక్కడ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, చెక్కెర కర్మాగారం, ఆటో మొబైల్ వ్యాపారాలకు ప్రధాన కేంద్రంగా ఉంది. దీంతో బెంగళూరు-హుబ్లీ-ధారవాడ వందే భారత్ రైల్వే సేవలను బెళగావి నగరం వరకు విస్తరించాలని విన్నవిస్తున్నాను. ఇది కర్ణాటక, గోవా, మహారాష్ట్రల మధ్య సంపర్కం కల్పించనుందని తెలిపారు.

కనువిందు చేస్తున్న రాజస్తానీ ఎగ్జిబిషన్



చీరలు ప్రదర్శిస్తున్న యువతి

బనశంకరి: బెంగళూరు నగరంలో నిర్వహిస్తున్న ది గ్రాండ్ రాజస్తానీ ఎగ్జిబిషన్ మగువుల మనసు దోచేస్తోంది. బనశంకరి మూడోస్టేజ్ శ్రీహరి కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ది గ్రాండ్ రాజస్తానీ ఎగ్జిబిషన్‌లో చేనేత కళాకారులు తయారు చేసిన వివిధ కళాకృతులు, పశ్చిమ బెంగాల్ పట్టుచీరలు, రాజస్తాన్ శారీస్ మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు మహిళలు, యువతులు ఎక్కువగా ఇష్టపడే వెండి, కుందన్, మీనాకరి, జవుళి, చేతితో తయారు చేసిన అమూల్యమైన జెమ్‌స్టోన్స్, జ్యువెలరీ, అలంకరణ వస్తువులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంతేగాక వర్ణచిత్రాలు, బాందాని లాంటి వస్త్రాలు, గుజరాత్ సంస్కృతి జౌళివస్త్రాలు, సమకాలిన జీవనశైలి ఉత్పత్తులు, మస్లీన్‌చీరలు ప్రదర్శనలో ఉంచారు. అదే విధంగా కొయ్యలతో తయారు చేసిన వస్తువులు, వెండి, ఇత్తడి వస్తువులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శన నవంబరు 12 తేదీ వరకు నిర్వహిస్తారు.

గనుల అక్రమ తవ్వకాలపై దృష్టి పెడతాం

చిక్కబళ్లాపురం: జిల్లాలోని చిక్కబళ్లాపురం, గుడిబండ, బాగేపల్లి తాలూకాల్లో గనుల అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, ఈ విషయంపై సీరియస్‌గా దృష్టి పెడతామని మంత్రి సుధాకర్ అన్నారు. మంగళవారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ...గత పదేళ్లుగా గనుల తవ్వకాలు జరుగుతున్నాయి, అందుకు మాజీ మంత్రి సుధాకర్ కారణమని అన్నారు. ఇటీవల కొందరు రైతులు తన దృష్టికి తెచ్చారని, తవ్వకాల ద్వారా నైట్రేట్, ఫ్లోరైడ్, ఇతర రసాయనాలు నీటిలో చేరుతున్నాయని, ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. ఈ విషయంపై సీరియస్‌గా పరిగణిస్తామన్నారు. టిప్పర్ల నియంత్రణపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

హోసూరు వార్తలు..

బైకిస్టు దుర్మరణం

క్రిష్ణగిరి: పాల ట్యాంకర్‌ను ఢీకొని బైకిస్టు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రం క్రిష్ణగిరి తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. ధర్మపురి జిల్లా పాలక్కోడు ప్రాంతానికి చెందిన హరిప్రసాద్ (26) సోమవారం సాయంత్రం సొంత పనిపై క్రిష్ణగిరికి ద్విచక్ర వాహనంలో వచ్చాడు. తిరిగి రాయకోట కూడలి రోడ్డు వద్ద వస్తూ ముందు వెళ్తున్న పాల ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

మసాజ్ సెంటర్‌పై పోలీసుల దాడి

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో మసాజ్ సెంటర్ పేరుతో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళా బ్రోకర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని నెల్లూరు జంక్షన్ ప్రాంతంలో నిర్వహిస్తున్న మసాజ్ సెంటర్‌లో వ్యభిచారం జరుగుతుందని హడ్కో పోలీసులకు రహస్య సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు సోమవారం రాత్రి మసాజ్ సెంటర్‌పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఢిల్లీకి చెందిన 40 ఏళ్ల మహిళను అరెస్ట్ చేశారు.

ఇందిరమ్మకు నివాళులు

హోసూరు: భారత దివంగత ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని క్రిష్ణగిరి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. హోసూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద జిల్లా కార్యదర్శి మురళీధరన్ నేతృత్వంలో ఇందిరమ్మ చిత్రపటాన్నుంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడి కేంద్రానికి భూమిపూజ

కెలమంగలం: తళి నియోజకవర్గంలోని ఇస్లాంపూర్ గ్రామంలో అంగన్‌వాడి కేంద్రానికి యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి భూమిపూజ చేశారు. తంద్రి పంచాయతీలోని ఇస్లాంపూర్ గ్రామంలో అంగన్‌వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కొన్నేళ్లుగా కోరుతున్నారు. చైర్మన్ శ్రీనివాసరెడ్డి సంబంధిత శాఖాధికార్లతో చర్చించి రూ. 10.93 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో నిర్మాణ పనులను ప్రారంభించారు. వార్డు సభ్యులు బాబు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నవ వరుడు ఆత్మహత్య

హోసూరు: పెళ్లయిన తొమ్మిది రోజులకే నూతన వరుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటనపై హడ్కో పోలీసులు విచారణ చేపట్టారు. హోసూరు సమీపంలోని తిప్పాళం గ్రామానికి చెందిన వెంకటేష్ కొడుకు సంతోష్‌కుమార్ (28) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి వారం రోజుల క్రితం డెంకణీకోట ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల మహిళతో పెళ్లి జరిగింది. ఈ నేపథ్యంలో సంతోష్‌కుమార్ సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ ఘటనపై అతని సోదరుడు వేణుగోపాల్ హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలేవీ ?



కూడలి వద్ద స్తంభించిన వాహనాలు

హోసూరు: హోసూరు – డెంకణీకోట మార్గంలోని ఆర్సీ చర్చ్ వద్ద రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతుండడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనాలను, బస్సులను తళి రోడ్డుమీదుగా మళ్లించారు. దీంతో తళి రోడ్డులోని రైల్వే గేట్ వద్ద రద్దీ పెరిగింది. దీనికి తోడు రింగ్‌రోడ్డు మీదుగా వెళ్లే వాహనాలు నాలుగు రోడ్ల కూడలి వద్దకు చేరుకోవడంతో ఆ ప్రాంతంలో గంటల తరబడి ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని, సంబంధిత శాఖాధికారులు చర్యలు చేపట్టి ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. దీనికి తోడు డెంకణీకోట, కెలమంగలం వైపు వెళ్లే కొన్ని బస్సుల్లో హోసూరు బస్టాండు నుంచి హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే ప్రయాణికులను కండక్టర్‌లు అనుమతించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారని, ఈ మార్గంలో వెళ్లే అన్ని బస్సులు ప్రభుత్వ ఆస్పత్రి మీదుగానే వెళ్లాలని అధికారులు ఆదేశాలు జారీ చేసినా కొన్ని బస్సులు ఏకంగా తళిరోడ్డుపైనే వెళ్లడంతో ఆస్పత్రి, రైల్వేస్టేషన్ ప్రాంతాలకెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. సంబంధిత శాఖాధికారులు చర్యలు చేపట్టి అన్ని బస్సులు ప్రభుత్వ ఆస్పత్రి మీదుగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దాడి చేశారని ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి సమీపంలోని సోక్కాడి గ్రామంలో కొత్తగా ఆలయ నిర్మాణానికి బండరాళ్లను చదును చేసే పనులు జరుగుతున్నాయి, ఆ దుమ్ముధూళి తమ కాలనీపై పడుతోందని, దుమ్ము రేగకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరడంతో ఆవేశానికి గురైన అన్నాడీఎంకే పార్టీ యూనియన్ కార్యదర్శి సోక్కాడి రాజన్ తమను దూషించి దాడి చేయించాడని స్థానికులు ఆరోపించారు. అనుచరులతో ఇళ్లను ధ్వంసం చేసి, అడ్డువచ్చిన మహిళలను జాతిపేరుతో కించపరిచారని ధర్నా చేయడంతో ఉద్రిక్తత ఏర్పడింది. పలు రాజకీయ నాయకులు కాలనీ ప్రజలకు మద్దతు తెలుపుతూ బాధితులకు న్యాయం చేకూర్చాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దాడికి పాల్పడిన 23 మందిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. వీరిలో అన్నాడీఎంకే నాయకుడు సోకాడి రాజన్ పరారయ్యాడు. అతని కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

దోపిడీ దొంగలకు ఐదేళ్ల జైలు

హోసూరు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి నగదు, నగదును దోచుకెళ్లిన ఘటనలో దొంగలకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ హోసూరు కోర్టులో న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వివరాల మేరకు హోసూరు శాంతినగర్‌లో 2012లో ఓ ఇంటిలో చొరబడిన దొంగలు కొంత బంగారం, నగదు దోచుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని సేలంకు చెందిన గోపినాథ్ మణిగంతన్, క్రిష్ణన్, నాగరాజ్, నరసింహన్‌లను అరెస్ట్ చేశారు. సోమవారం సాయంత్రం తుది విచారణ జరిగింది, నేరం రుజువు కావడంతో జడ్జి శశికళ పై విధంగా తీర్పు చెప్పారు. దొంగలను జైలుకు తరలించారు.

దొంగల నుంచి బంగారం సీజ్

మైసూరు: మైసూరు నగరంతో పాటు దావణగెరెలో జరిగిన 5 దొంగతనాల కేసులను ఛేదించిన మైసూరు సీసీబీ పోలీసులు.. ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ. 35 లక్షల విలువ చేసే బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. దావణగెరె జిల్లాలోని హరిహరలో ఉన్న ఒక ఇంటిలో దొంగలు తలదాచుకున్నట్లు తెలిసి దాడులు చేశారు. 600 గ్రాముల బంగారు, కొంత వెండి సొత్తు, ఒక బైక్‌ను సీజ్‌చేశారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

బనశంకరి: వ్యాపారవేత్త ఇంటిలో చోరీ కేసులో పుట్టేనహళ్లి పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 45 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ. 8 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పెట్టిరఘు, టచ్‌గణేశ్, అలెక్స్ పట్టుబడిన దొంగలు. వ్యాపారవేత్త శాంతను కుటుంబం ఈనెల 21న జైపూర్ వెళ్లారు. ఇంటిలో శాంతను ఒక్కరే ఉన్నారు. ఆయన 22వ తేదీ విధులకు వెళ్లి రాత్రి ఇంటికి వచ్చారు. అంతకు ముందే దొంగలు ఇంటి తలుపులు బద్దలు కొట్టి నగలు దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ పుటేజీలు పరిశీలించి మంగళవారం నిందితులను అరెస్ట్ చేశారు.

వైభవంగా మారెమ్మ జాతర

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట గ్రామంలో మారెమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శక్తి దేవతలు గౌర సముద్ర మారెమ్మ, తుమ్మలు మారెమ్మ, నిడుగల్ మారెమ్మ, కొల్లాపురమ్మ, చౌడేశ్వరి దేవి, మధుగిరి మారెమ్మ, దండిన మారెమ్మ, బండేమేగళ మారెమ్మలకు జలధి మహోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతలను పుర వీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఆలయంలో కలశ పూజ, గణపతి పూజ, శక్తి దేవత పూజ, కంకణధార, నవదుర్గ హోమం పూజలను వేద పండితులు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

క్లుప్తంగా...

గొప్ప చరిత్ర జమ్మూ-కశ్మీర్ సొంతం

గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



లద్దాక్, జమ్మూ కశ్మీర్ వ్యవస్థాపక దినోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి, అమరావతి: జమ్మూ-కశ్మీర్ ప్రాంతం కళ, సంస్కృతి, గొప్ప చరిత్రను సమృద్ధిగా కలిగి ఉందని ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. 'ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్' కార్యక్రమంలో భాగంగా లద్దాక్, జమ్మూ-కశ్మీర్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను మంగళవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో నిర్వహించారు. ఇందులో గవర్నర్ మాట్లాడుతూ..2019 అక్టోబర్ 31న లద్దాక్, జమ్మూ-కశ్మీర్‌లు కేంద్ర పాలిత ప్రాంతాలుగా అవతరించాయని, జమ్మూ-కశ్మీర్ పురావస్తు, చారిత్రాత్మక ప్రదేశాలతో అద్భుతమైన ప్రకృతి సౌందర్యాన్ని కలిగి ఉందని చెప్పారు. థిన్‌లెస్ ఆంగ్మో నేతృత్వంలో లద్దాక్ నుంచి వచ్చిన విద్యార్థి ప్రతినిధి బృందం సాంప్రదాయ లద్దాక్ పాటలు, నృత్యాలను ప్రదర్శించింది. కార్యక్రమంలో జమ్మూ-కశ్మీర్‌కు చెందిన వీఐటీ వర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

65.54 లక్షల మందికి రూ. 1,806.91 కోట్లు

- అవ్వాతాతల పింఛన్ల పంపిణీకి నిధులు విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 65,54,512 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వివిధ రకాల చేతి వృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నవంబర్ ఒకటో తేదీన ఠంచన్‌గా పింఛన్లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారమే రూ.1,806.91 కోట్లు విడుదల చేసింది. సచివాలయాల వారీగా పింఛనుదారుల సంఖ్య ఆధారంగా పంపిణీ చేయాల్సిన మొత్తాలను ఆయా సచివాలయాల పేరిట బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. మంగళవారం సాయంత్రానికే దాదాపు అన్ని చోట్ల సచివాలయాల ఉద్యోగులు డబ్బులను డ్రా చేసి గ్రామ, వార్డు వలంటీర్లకు అందజేసినట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఒకటో తేదీన(బుధవారం) తెల్లవారుజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి డబ్బులు పంపిణీ చేస్తారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు పింఛను డబ్బులు అందచేసే సందర్భంలో పారదర్శకత కోసం ఆధార్ నిర్ధారిత బయోమెట్రిక్, ఐరిస్, ముఖ ప్రమాణీకరణ విధానాలను అమలు చేస్తున్నామని, అలాగే ఆర్‌బీఐఎస్ విధానం కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. సాంకేతిక కారణాల వల్ల లబ్ధిదారులలో ఏ ఒక్కరికీ పింఛను అందలేదనే ఫిర్యాదు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

డీజీ అనూరాధ ఉద్యోగ విరమణ

అనూరాధ, సురేంద్రబాబు దంపతులకు సన్మానం



సాక్షి, అమరావతి: డైరెక్టర్ జనరల్ ఏఆర్ అనూరాధ మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా అనూరాధ, ఆమె భర్త ఎంవీ సురేంద్రబాబు(రిటైర్డ్ డీజీ)లను మంగళగిరి డీజీపీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. పోలీస్ శాఖకు సుదీర్ఘ కాలం పాటు ఆమె అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు డీజీలు, అడిషనల్ డీజీలు, ఐజీలు, డీఐజీలు పాల్గొన్నారు.

ఇండస్ట్రీస్ పార్లమెంటరీ కమిటీ సమావేశం

స్టాండింగ్ కమిటీ చైర్మన్ తిరుచ్చి శివ హాజరు



మాట్లాడుతున్న స్టాండింగ్ కమిటీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు తిరుచ్చి శివ

సాక్షి, విశాఖపట్నం: పరిశ్రమల శాఖకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం విశాఖపట్నంలో సమావేశమైంది. కమిటీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు తిరుచ్చి శివ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి మరో తొమ్మిది మంది సభ్యులతో పాటు పరిశ్రమల ప్రతినిధులు, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, బ్యాంకుల ఉన్నతాధికారులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈల) నిర్వాహకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను చైర్మన్ శివ వివరించారు. ఈ సందర్భంగా తమ ఉత్పత్తులకు విరివిగా మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించాలని ఎంఎస్ఎంఈల నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదీ, ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీ ప్రవీణ్‌కుమార్, పరిశ్రమల శాఖ కమిషనర్ రాజశేఖర్‌రెడ్డి, ఖాదీ విలేజీ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఎస్.గ్రీప్, విశాఖపట్నం జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ గణపతి, యూనియన్ బ్యాంక్ జోనల్ హెడ్ సీవీఎస్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా ఖాదీ పరిశ్రమకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేశారు.

జి.సిగడాం: విజయనగరం రైలు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని ఎస్‌పీఆర్‌పురం గ్రామానికి చెందిన గిడిజాల లక్ష్మి, మెట్టవలస గ్రామానికి చెందిన టంకాల సుగణమ్మ కుటుంబాలకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంగళవారం రూ.10 లక్షల చెక్కును అందజేశారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు.



మృతుడు చిరంజీవి భార్యకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

అసిస్టెంట్ లోకోపైలెట్ కుటుంబానికి..

ఎచ్చెర్ల క్యాంపస్: విజయనగరం రైలు ప్రమాదంలో మృతిచెందిన అసిస్టెంట్ లోకో పైలెట్, కుశాలపురం గ్రామానికి చెందిన సువ్వారి చిరంజీవి కుటుంబాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మంగళవారం పరామర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల నష్టపరిహారం చెక్కును మృతుడి భార్య జ్యోత్స్నకు అందజేశారు. శ్రీకాకుళం ఆర్డీవో గంగయ్య, ఎంపీపీ మొదలవలస చిరంజీవి, తహసీల్దార్ సత్యనారాయణ, లావేరు పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, నాయకులు వెంకన్నగారి శ్రీను, పంచాది నరసింహమూర్తి పాల్గొన్నారు.

సీఎం చలించిపోయారు

రైల్వే ప్రమాద బాధితులకు ప్రకటించిన మొత్తం కన్నా పరిహారం పెంపు

- గాయపడ్డ 30 మందికి కొండంత ఊరట
- 13 మంది మృతుల కుటుంబాలకు చెక్కుల అందజేత
- రూ.2.59 కోట్ల మేర ఎక్స్‌గ్రేషియా అందజేసిన రాష్ట్ర ప్రభుత్వం



గాయపడ్డ మిశ్రాకు చెక్కు అందజేస్తున్న విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయనగరం జిల్లా కంటకాపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రైల్వే ప్రమాదంలో గాయపడ్డవారి పరిస్థితిని చూసి చలించిపోయారు. తొలుత రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాయపడ్డవారిని సోమవారం స్వయంగా పరామర్శించిన అనంతరం ఎక్స్‌గ్రేషియాను పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు రూ.2.59 కోట్ల మొత్తాన్ని మంజూరు చేశారు. దీనికి సంబంధించిన చెక్కులను గాయపడ్డ 30 మందికి మంగళవారం విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి అందజేశారు. అనంతరం మజ్జి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. రైలు ప్రమాదంలో 13 మంది మృతుల కుటుంబాలకు సంబంధించిన ఎక్స్‌గ్రేషియాను వారి ఇంటికి తీసుకెళ్లి కుటుంబసభ్యులకు సంబంధిత ఎమ్మెల్యేల ద్వారా అందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. రైల్వే ప్రమాదంలో గాయపడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి కూడా పరిహారం అందజేస్తామని చెప్పారు. 13 మంది మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున, 30 మంది గాయపడ్డ వారి గాయాల తీవ్రతను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ప్రభుత్వం పరిహారం మంజూరు చేసిందని వివరించారు. స్వల్ప గాయాలతో చికిత్స పొందుతున్న 12 మందికి రూ. 2 లక్షల చొప్పున, తీవ్ర గాయాలతో నెలకు మించి చికిత్స అవసరమైన 15 మందికి రూ. 5 లక్షల చొప్పున మంజూరైనట్టు వివరించారు. తీవ్ర గాయాలతో వైకల్యం పొందిన ముగ్గురికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచారని వెల్లడించారు. వారి పరిస్థితిని చూసి సీఎం ఎంతో చలించిపోయారని, పరిహారం విషయంలో ఎంతో ఉదారంగా నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ అనిలా సునందని, డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.గౌరీశంకర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు షెడ్యూల్

- నవంబర్ 30 వరకు అవకాశం
- ఆలస్య రుసుముతో డిసెంబర్ 15 వరకు చాన్స్

సాక్షి, అమరావతి: ఈ విద్యా సంవత్సరం (2023–24) ఇంటర్మీడియెట్ మొదటి, రెండో ఏడాది జనరల్, ఒకేషనల్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఇంటర్మీడియెట్ విద్యా మండలి మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. వచ్చే మార్చిలో జరిగే బోర్డు పరీక్షలకు హాజరయ్యేందుకు నిర్దీత గడువులోగా విద్యార్థులు తమ తమ కళాశాలల్లో ఫీజు చెల్లించాలని ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి సౌరబ్ గౌర్ మంగళవారం తెలిపారు. రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు ఆలస్య రుసుం లేకుండా నవంబర్ 30వ తేదీ వరకు, రూ.1000 ఆలస్య రుసుంతో డిసెంబర్ 15వ తేదీ వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించినట్టు వెల్లడించారు.

- మొదటి/ రెండో సంవత్సరం థియరీ పరీక్షలకు రూ.550, రెండో ఏడాది జనరల్, ఒకటి, రెండో ఏడాది ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు రూ.250, బ్రిడ్జి కోర్సులకు రూ.150 చెల్లించాలి.
- ఇంటర్మీడియెట్ రెండేళ్ల థియరీ పరీక్షలకు రూ.1,100, ఒకేషనల్ రెండేళ్ల ప్రాక్టికల్స్‌కు రూ.500, ఒకేషనల్ బ్రిడ్జి కోర్సుకు రూ.300 చెల్లించాలి.
- ఇప్పటికే ఇంటర్మీడియెట్ పాసై ఇంప్రూవ్‌మెంట్ రాసేవారు రెండేళ్లకు ఆర్ట్స్ విద్యార్థులు రూ.1,240, సైన్స్ విద్యార్థులు రూ.1,440 చెల్లించాల్సి ఉంటుంది.

విశాఖలో భవనాలు గుర్తింపు

సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాట్లపై సీఎంకు వివరాలు వెల్లడించిన అధికారుల కమిటీ

- సీనియర్ అధికారులు సహా, ఇతర అధికారుల కార్యకలాపాలకు అవసరమైన భవనాలను గుర్తించామని వెల్లడి
- ఉత్తరాంధ్ర అభివృద్ధిపై విశాఖ నుంచి సీఎం పర్యవేక్షణ, సమీక్షా సమావేశాలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో సమావేశమైన అధికారుల కమిటీ

సాక్షి, అమరావతి: విశాఖలో సీఎం క్యాంపు ఆఫీసు కోసం గుర్తించిన వివిధ భవనాల వివరాలను అధికారుల కమిటీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలిపింది. రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో భాగంగా ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రి పర్యవేక్షణ, సమీక్ష సమావేశాల నిర్వహణకు విశాఖలో క్యాంపు కార్యాలయం చూస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో విశాఖలో గుర్తించిన భవనాల వివరాలను సీఎం వైఎస్ జగన్‌కు కమిటీ వివరించింది. రాష్ట్ర ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు సహా, ఇతర అధికారులు తమ కార్యకలాపాలు నిర్వహించడానికి అవసరమైన భవనాలను కూడా గుర్తించామని అధికారుల కమిటీ సీఎంకు తెలిపింది. విశాఖలో ఇప్పటికే వివిధ ప్రభుత్వ విభాగాలు, వాటి కార్యాలయాలు 2,27,287 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నాయని కమిటీ గుర్తించింది. వీటిలో సీనియర్ అధికారులకు అవసరమైన క్యాంపు కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చని తెలిపింది. వారి వసతికి కూడా ఆయా విభాగాల పరిధిలో ఉన్నవాటిని వినియోగించుకోవచ్చని వెల్లడించింది. ఐటీ హిల్‌పై ఉన్న మిలీనియం టవర్‌లో అందుబాటులో ఉన్న 1,75,516 అడుగుల విస్తీర్ణంలో మిగిలిన సీనియర్ అధికారులు క్యాంపు కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొంది. ఇంకా కొంతమంది అధికారుల కోసం, వారి కార్యాలయాల కోసం మరికొన్ని ప్రైవేటు భవనాలను గుర్తించామని సీఎం వైఎస్ జగన్‌కు వివరించింది. ఈ మేరకు 3,98,600 చదరపు అడుగుల విస్తీర్ణాన్ని గుర్తించామని తెలిపింది. ప్రభుత్వంలోని సీనియర్ అధికారుల కార్యకలాపాలు, వారి వసతి కోసం ప్రభుత్వ భవనాలు, ప్రైవేటు భవనాల్లో మొత్తం 8,01,403 చదరపు అడుగుల విస్తీర్ణాన్ని గుర్తించామని చెప్పింది.

ముఖ్యమంత్రి కోసం ఐదు రకాల భవనాలు..

కాగా ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, వసతి కోసం ఐదు రకాల భవనాలను గుర్తించినట్టు కమిటీ వెల్లడించింది. ఆంధ్రా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఓపెన్ వర్సిటీ బ్లాకులు, సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ భవనాలు, మిలీనియం ఎ-టవర్, మిలీనియం బి-టవర్, రుషికొండలోని టూరిజం రిసార్టులను గుర్తించామని వివరించింది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, వసతి, అధికారులతో సమావేశాల కోసం సరిపడా గదులు, భద్రతా సిబ్బంది ఉండేందుకు సదుపాయాలు, ఇలా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని కమిటీ తెలిపింది. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా, పౌరులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా, ముఖ్యమంత్రికి భద్రత తదితర అంశాలను పరిగణన లోకి తీసుకుంటున్నామని స్పష్టం చేసింది. అంతేకాకుండా ముఖ్యమంత్రి రాకపోకల సమయంలో కూడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా, ట్రాఫిక్ సమస్య లేకుండా చూశామని తెలిపింది. అదే సమయంలో సౌలభ్యతను కూడా దృష్టిలో ఉంచుకున్నామని చెప్పింది.

రుషికొండ రిసార్టులు అనుకూలం..

ట్రాఫిక్ దృష్ట్యా, యూనివర్సిటీ అకడమిక్ కార్యకలాపాలకు ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో యూనివర్సిటీ భవనాలను పరిగణనలోకి తీసుకోలేదని కమిటీ వెల్లడించింది. అలాగే వీఎంఆర్‌డీఏ ప్రాంతంలో కూడా పెద్ద ఎత్తున రద్దీ ఉంటుందని, చుట్టూ పెద్ద ఎత్తున వ్యాపార సంస్థలు ఉన్నందున భద్రతాపరంగా ఇబ్బంది ఉందని తెలిపింది. సీఎం క్యాంపు కార్యాలయం ఇక్కడ పెడితే వారందరికీ ఇబ్బందులు వస్తాయని, అధికారులకు సరైన వసతి కూడా దీనికి సమీపంలో లేదని వెల్లడించింది. అలాగే మిలీనియం టవర్‌లో ఒక దాంట్లో ఇప్పటికే కొన్ని కంపెనీలు నడుస్తున్నాయని, రెండో టవర్ కూడా ఆఫీసుకు సరిపోయినా, సీఎం వసతికి సరిపోదని, భద్రతా కారణాల వల్ల కూడా అంత అనుకూలత లేదని తేల్చింది. రుషికొండ వద్ద నిర్మించిన రిసార్టుల కోసం నిర్మించిన భవనాలు సీఎం క్యాంపు కార్యాలయం కోసం అత్యంత అనుకూలంగా ఉన్నాయని అధికారుల కమిటీ నిర్ధారించింది. వీఐపీల రాకపోకల వల్ల పౌరులకు ఎలాంటి అవాంతరాలు లేకుండా, నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఈ భవనాలు ఉన్నాయని, పార్కింగ్, ఆఫీసు, వసతి, భద్రతా సిబ్బందికి, సీఎం సెక్రటరీల కార్యకలాపాలకు, ఈ భవనాలు సరిపోతాయని సూచించింది. అలాగే హెలిప్యాడ్ కూడా సమీపంలోనే ఉందని, దీనివల్ల నగరంలో ట్రాఫిక్‌కు, పౌరులకు కూడా ఎలాంటి ఇబ్బందిలేకుండా ఉంటుందని వెల్లడించింది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని నివేదికను ఖరారుచేస్తున్నామని అధికారుల కమిటీ తెలిపింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు శ్రీలక్ష్మి, షంషేర్‌సింగ్ రావత్, జీఏడీ సర్వీసులు, హెచ్‌ఆర్ సెక్రటరీ పోలా భాస్కర్, సీఎంఓ అధికారులు.. పూనం మాలకొండయ్య, ధనుంజయరెడ్డి, ముత్యాలరాజు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యార్థులకు శిక్షణ

- నెదర్లాండ్స్ సదస్సులో 'ఈఎండీపీ'పై వివరించనున్న సురేష్‌కుమార్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎంపికచేసిన ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ) విజయవంతమైందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ స్పష్టం చేశారు. నెదర్లాండ్స్‌లోని ఉట్రెచ్‌లో నేటినుంచి మూడురోజుల పాటు గ్లోబల్ సోషల్ అండ్ ఫైనాన్షియల్ స్కిల్స్ కాన్ఫరెన్స్–2023 నిర్వహించనున్నారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 75 దేశాల నుంచి 350 మంది పాల్గొంటున్నారు. సదస్సుకు ముఖ్య వక్తగా భారతదేశం నుంచి హాజరయ్యే ఏకైక అధికారి సురేష్ కుమార్ కావడం విశేషం. సదస్సులో ఆయన ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై ప్రసంగించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఆలోచనా సామర్థ్యాలు, ఆధునిక నైపుణాలను పెంచడం, బేసిక్ ఫైనాన్షియల్ లిటరసీ పెంచాలనే లక్ష్యంతో 2021లో 30 ప్రభుత్వ పాఠశాలల్లోని వెయ్యి మంది తొమ్మిదో తరగతి విద్యార్థులతో ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో ఈ విద్యాసంవత్సరం 5,420 పాఠశాలల్లోని 3.50 లక్షల మంది విద్యార్థులకు విస్తరించారు. గత మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 6 లక్షల మంది విద్యార్థులు ఈఎండీపీ కింద శిక్షణ పొందారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం, గ్లోబల్ విద్యార్థులుగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈఎండీపీ ఉందని మంగళవారం జరిగిన ప్రత్యేక ప్రతినిధుల సమావేశంలో సురేష్‌కుమార్ వివరించారు.

రైతులకు ఏపీ ప్రభుత్వ సేవలు అద్భుతం

ఆర్బీకేలు, ఐసీసీ సెంటర్, ఆర్బీకే చానల్ సేవలను ప్రశంసించిన హరియాణా ఐఏఎస్ అధికారుల బృందం



కృష్ణా జిల్లా గంగూరు ఆర్బీకే వద్ద పొలంబడి ప్లాట్‌ను పరిశీలిస్తున్న హర్యానా సివిల్ సర్వెంట్స్ బృందం

సాక్షి, అమరావతి: గ్రామస్థాయిలో ఏపీ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని హరియాణా రాష్ట్ర ఐఏఎస్ అధికారుల బృందం కొనియాడింది. దేశంలో మరెక్కడా ఇలాంటి సేవలు అందడం లేదని పేర్కొంది. హరియాణా రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ దేవేందర్ సింగ్ నేతృత్వంలో శిక్షణలో ఉన్న 40మంది సివిల్ సర్వెంట్స్ బృందం 'భారత్ దర్శన్'లో భాగంగా రాష్ట్రంలో పర్యటించింది. వ్యవసాయ రంగంలో ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, సంస్కరణలపై మంగళవారం అధ్యయనం చేసింది. తొలుత పెనమలూరు నియోజకవర్గంలోని గంగూరు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి, అక్కడ రైతులకు అందిస్తున్న సేవలను వారు ఆరా తీశారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతో పాటు పశుగ్రాస విత్తనాలు, సంపూర్ణ మిశ్రమ దాణా వంటివి అందిస్తున్న తీరును పరిశీలించి రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆర్బీకేకు అనుబంధంగా ఉన్న వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రంలోని పరికరాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలుతో పాటు పొలంబడి, ఎరువుల విక్రయం, కియోస్క్ పనితీరును పరిశీలించారు. అనంతరం గన్నవరంలోని సమీకృత రైతు సమాచార కేంద్రం (ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్)తో పాటు ఆర్బీకే ఛానల్ నిర్వహణ తీరును పరిశీలించారు. రైతుల నుంచి కాల్ సెంటర్‌కు వస్తోన్న ఫోన్ కాల్స్, వాటికి సిబ్బందితో పాటు శాస్త్రవేత్తలు ఇస్తున్న సలహాలు, సూచనలు పరిశీలించారు. కాల్ సెంటర్‌కు ఫోన్ చేసిన రైతులతో మాట్లాడారు. టోల్ ఫ్రీ నంబర్ 155251 ప్రాముఖ్యత, సందేహాలు నివృత్తి చేస్తున్న విధానం ఎలా ఉంది? వారి సంతృప్త స్థాయి ఎలా ఉందో ఆరా తీశారు. అనంతరం ఆర్బీకే స్టూడియోను సందర్శించారు. చానల్ ద్వారా వీడియో ప్రసారాలను యూట్యూబ్, ఇన్‌స్టాగామ్, ట్విటర్, ఫేస్ బుక్ వంటి సామాజిక మాధ్యమాలతో పాటు స్మార్ట్ టీవీల ద్వారా ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నామని అధికారులు చెప్పారు. రైతు భరోసా మ్యాగజైన్ పరిశీలించారు. ఐసీసీ సెంటర్ స్టేట్ కో ఆర్డినేటర్ వల్లూరి శ్రీధర్, నోడల్ ఆఫీసర్ వై.అనురాధ, మీడియా ఇన్‌చార్జి ధర్మపురి రమణమూర్తి, ఏడీఏ సునీల్, ఎంఈఒ శైలజ తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో తగ్గిన రోడ్డు ప్రమాదాలు

- 18,972 ప్రమాదాలతో దేశంలోనే తమిళనాడు టాప్
- 8,650 ప్రమాదాలతో 7వ స్థానంలో ఏపీ
- 2022 నివేదిక విడుదల చేసిన కేంద్ర మంత్రిత్వ శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదాలు, ఆ ప్రమాదాల్లో మరణాల సంఖ్యపై కేంద్ర జాతీయ రహదారులు, రహదారి రవాణా శాఖ 2022 నివేదికను మంగళవారం విడుదల చేసింది. రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధిక రోడ్డు ప్రమాదాలు నమోదైన రాష్ట్రంగా తమిళనాడు వరుసగా ఐదోసారి కూడా రికార్డులకెక్కింది. మృతుల విషయం ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. 18,972 ప్రమాదాలతో తమిళనాడు తొలి స్థానంలో నిలవగా.. తదుపరి స్థానాల్లో కేరళ (17,627), ఉత్తరప్రదేశ్ (14,990), మధ్యప్రదేశ్ (13,860), కర్ణాటక (13,384) నిలిచాయి. 8,650 ప్రమాదాలతో ఆంధ్రప్రదేశ్ 7వ స్థానంలో ఉంది. మృతుల విషయంలో ఏపీ 8వ స్థానంలో నిలిచింది.

విశాఖలో 34.50 శాతం ప్రమాదాలు తగ్గుదల

విశాఖపట్నంలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయని కేంద్రం విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసింది. 10 లక్షలకు పైగా జనాభా ఉన్న పట్టణాల్లో ఢిల్లీ తొలి స్థానంలో నిలిచింది. 2022లో ఢిల్లీలో 5,652 ప్రమాదాలు జరగ్గా.. 1,461 మంది మృతి చెందారు. 5,201 మంది క్షతగాత్రులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన 2,516 ప్రమాదాల్లో 323 మంది మృతి చెందగా.. 2,252 మంది క్షతగాత్రులయ్యారు. విజయవాడ సిటీలో 1,543 ప్రమాదాలకు గానూ 418 మంది మృతి చెందారు. 1,367 మంది క్షతగాత్రులయ్యారు. విశాఖపట్నంలో 1,531 ప్రమాదాలకు గానూ 358 మంది మృతి చెందగా.. 1,288 మంది క్షతగాత్రులయ్యారు. ఓవరాల్‌గా ప్రమాదాల విషయంలో 2021తో పోలిస్తే 2022లో విజయవాడ 22వ స్థానం నుంచి 21కి చేరగా విశాఖపట్నం స్థాణం 7 నుంచి 22కు మెరుగైంది. 5 మిలియన్ల కన్నా ఎక్కువ జనాభా ఉన్న సిటీలతో పోల్చి చూస్తే విశాఖపట్నంలో 34.50 శాతం ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. ఈ విభాగంలో విశాఖ తరువాత చెన్నై రెండో స్థానంలో ఉంది.


బీఎస్సీ అగ్రికల్చర్ ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ (హ్యూన్స్) అగ్రికల్చర్ కోర్సుల ప్రవేశాలకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీ రామారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అగ్రిసెట్ 2023 ర్యాంకుల ద్వారా అర్హత పొందిన విద్యార్థులు వెబ్ ఆప్షన్లను (ఆన్‌లైన్‌లో) నవంబర్ 2, 3, 4వ తేదీల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ సంప్రదించాలని పేర్కొన్నారు.

డిస్కంల ప్రతిపాదనలపై రోత రాతలా?

- విద్యుత్ వినియోగదారులపై వడ్డీ బాదుడు అంటూ ఈనాడు వక్రరాతలు
- ప్రతినెలా విద్యుత్ సంస్థలకు సబ్సిడీ సొమ్ములు సకాలంలో చెల్లిస్తున్న ప్రభుత్వం
- వర్కింగ్ కేపిటల్‌కు ప్రభుత్వ బకాయిలే కారణం అంటూ రామోజీ విషపురాతలు
- స్వల్పకాలిక రుణాలపై వడ్డీని మాత్రమే ఏఆర్ఆర్‌లో పొందుపరచాలని ఈఆర్‌సీకి వినతి
- వినియోగదారుల నుంచి వసూలు చేసే సెక్యూరిటీ డిపాజిట్‌పై ప్రతి ఏటా వడ్డీ
- పొంతనలేకుండా ఈనాడు కథనం ఉందన్న 'ఏపీఈపీడీసీఎల్' సీఎండీ ఐ.పృథ్వీతేజ్

గడచిన నాలుగేళ్లుగా విద్యుత్ కొనుగోళ్ల కోసం చేస్తున్న రుణాలకు ఏటా రూ. 420 కోట్ల నుంచి రూ. 650 కోట్ల వరకూ డిస్కం అదనంగా చెల్లిస్తోంది. ఇదేమీ కొత్తగా తీసుకున్నది కాదు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇదే జరిగింది. రూ. 1,468.98 కోట్లు ఆ ఐదేళ్లలో తీసుకున్నవే.





సాక్షి, అమరావతి: ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్న 'ఈనాడు' మరోసారి ఓ అబద్ధపు కథనాన్ని అచ్చేసింది. 'విద్యుత్ వినియోగదారులపై వడ్డీ బాదుడు' శీర్షికన మంగళవారం అభాండాలను రాష్ట్ర ప్రభుత్వంపై వేయాలని ప్రయత్నించింది. కానీ ఎప్పటిలాగే రామోజీ రాతల్లో వాస్తవాలు లేవని తేటతెల్లమైంది. విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు చేసిన ప్రతిపాదనలకు, ఈనాడు కథనంలో అంశాలకు పొంతన లేదని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) సీఎండీ ఐ.పృథ్వీతేజ్ స్పష్టం చేశారు. ఈ మేరకు 'సాక్షి'కి ఆయన వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

ప్రజలపై భారం వేయడానికి కాదు


సంప్రదాయ విద్యుత్ కొనుగోలు ఒప్పందాల ద్వారా విద్యుత్ కొంటే పంపిణీ సంస్థకు దాదాపు 45 రోజుల నుంచి 60 రోజుల వరకు విద్యుత్ వ్యయ చెల్లింపునకు అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం విద్యుత్ ఒప్పందాలు(పీపీఏ)కు లెటర్ ఆఫ్ క్రెడిట్ ఇవ్వాల్సి వస్తోంది. దానికి బ్యాంకులు కొంత రుసుమును వసూలు చేస్తాయి. ఆ ఖర్చు డిస్కంలు భరిస్తున్నాయి. అదే బహిరంగ మార్కెట్‌లో రోజువారీ లోటు విద్యుత్ కొనుగోళ్లకు ముందస్తు చెల్లింపు చేయాలి. దానికి డిస్కంల వద్ద తగినంత నగదు లేకపోవడం వల్ల బ్యాంకుల నుంచి స్వల్పకాలిక రుణాలు తీసుకోవలసివస్తోంది. ఆ రుణాలపై వడ్డీలు కట్టవలసిన బాధ్యత కూడా డిస్కంలపై ఉంది. ఆ స్వల్పకాలిక రుణాలపై అయ్యే వడ్డీ మాత్రమే సంస్థ వార్షిక ఆదాయ వ్యయ (ఏఆర్ఆర్) నివేదికలో పొందుపరచాల్సిందిగా విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ)ని ఏపీఈపీడీసీఎల్ కోరింది. అంతేకానీ ఈనాడు చెప్పినట్లు గత నాలుగేళ్లలో బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోలుకు డిస్కంలు చేసిన ఖర్చుపై వడ్డీ లెక్కించి, ఆ మొత్తాన్ని ప్రతి నెలా విద్యుత్ బిల్లుతో కలిపి వసూలు చేయడానికి కాదు.

ఏపీఈఆర్‌సీకి చెప్పాల్సిందే

విద్యుత్ పంపిణీ సంస్థల నిర్వహణకు సహేతుకంగా అయ్యే ఖర్చు మొత్తం నిబంధనల ప్రకారం ఈఆర్‌సీకి నివేదించాల్సిందే. వాటిపై కమిషన్ బహిరంగ విచారణ నిర్వహిస్తుంది. వివిధ వర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకున్నాక తుది నిర్ణయం వెల్లడిస్తుంది. అదేవిధంగా ట్రాన్స్‌కో విద్యుత్ లైన్లను వాడుకుంటున్నందుకు వీలింగ్ చార్జీలు చెల్లించాల్సి వస్తోంది. అప్పులపై వడ్డీ, వీలింగ్ చార్జీలు వర్కింగ్ కేపిటల్ పరిధిలోకి వస్తాయి. అందువల్ల వీటిని కూడా వాస్తవ ఆదాయ వ్యయాల పద్దులో చేర్చాలని నివేదికలో డిస్కం పొందుపరిచింది.

ప్రభుత్వం సక్రమంగానే ఇస్తోంది

వివిధ సంక్షేమ పథకాలకు, వ్యవసాయ వినియోగానికి ప్రభుత్వం నుంచి డిస్కంలకు చెల్లించాల్సిన సబ్సిడీ ప్రతినెల సకాలంలోనే వస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థల నుంచి రావాల్సిన బకాయిలకు ప్రతినెల సర్ చార్జీలు విధిస్తున్నాం. కాబట్టి ప్రభుత్వం బకాయిలు చెల్లించని కారణంగా వర్కింగ్ క్యాపిటల్ సరిపోవటం లేదనే వాదన వాస్తవం కాదు. అంతే కాకుండా విద్యుత్తు వినియోగదారుల నుంచి వసూలు చేసే సెక్యూరిటీ డిపాజిట్‌పై ప్రతి ఏటా మే నెలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన రేట్ల ప్రకారం వడ్డీ మొత్తాన్ని వినియోగదారులకు డిస్కంలు చెల్లిస్తున్నాయి. అయితే ఈ సెక్యూరిటీ డిపాజిట్ రూపంలో ఉన్న డబ్బు విద్యుత్తు కొనుగోలు అవసరాలకు సరిపోదు.





* వీగనిజాలు

ఏం తింటున్నాం.. ఎలా ఉంటున్నాం..
జంతువులను బాధిస్తూ పర్యావరణాన్ని దెబ్బతీస్తూ
మన ఆరోగ్యానికి మనమే హాని చేసుకుంటూ బతికేస్తున్నామా..?!
'జంతువులనే కాదు, జంతు ఆధారిత ఉత్పత్తుల నుంచి కూడా
దూరంగా ఉందాం..' అంటూ వరల్డ్ వీగన్ డే సందర్భంగా
వీగన్ ప్రేమికులు చెప్పే మాటలు అందరూ అనుసరించదగినవి, ఆచరణలో పెట్టాల్సినవి...

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వీగన్... లైఫ్‌స్టయిల్ మారెన్!

దుఃఖాన్ని పిండుకు తాగుతున్నాం



శాకాహారం తీసుకోవడం వల్ల మన ఆరోగ్యమే కాదు, పర్యావరణానికీ ఎంతో మేలు జరుగుతుంది. నేను యానిమల్ లవర్‌ని, యాక్టివిస్టుని. జంతువులను బాధించడానికి మనకు ఎలాంటి హక్కుల్లేవు. చాలామంది మాంసాహారం రుచి మీదనే దృష్టి పెడతారు. తరతరాలుగా ఇది అలాగే వస్తోంది. మనం తినడానికే అవి పుట్టాయని మనుషుల ఒక క్రూరమైన ఆలోచన. పాల పరిశ్రమ అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న అతి పెద్ద క్రూరమైన ప్రక్రియ. పాల రూపంలో వేరే జీవి బాధని గ్లాసులో పోసుకొని తాగుతున్నాం అనిపిస్తుంది. ఒక గ్లాసు పాలతో తల్లి–బిడ్డను వేరు చేస్తున్నాం. పాలు తాగుతున్న బిడ్డ మూతి కట్టి, ఆ తల్లి పాలు పిండుకుంటున్నాం. ఇవన్నీ గమనించి 13 ఏళ్లుగా వీగన్ డైట్‌కి మారిపోయాను. ఈ ప్రకృతిలో ప్రతి జీవికీ బతికే హక్కు ఉంది. జంతువుల సంఖ్య అదుపు చేయాలంటే మనం వాటిని చంపుకు తినాలి అనే మనస్తత్వం పెరిగింది. అదే జంతుజాలాన్ని నాశనం చేస్తుంది. కోళ్లకు, ఆవులకు, గేదెలకు కృత్రిమ ఇంజక్షన్లు ఇస్తారు. ఏదైనా తప్పుగా తింటే అది మన ఆరోగ్యంపైనే చెడు ప్రభావం చూపుతుంది. అందుకే ఇవన్నీ గమనించి మనమంతా వీగన్‌కి మారిపోవాల్సిందే. ఈ రోజుల్లో ఇది అత్యవసరం కూడా.

– ప్రతిమా సాగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్

సాధు స్వభావానికి..



మొదట్లో మనిషి ఆహారానికి మొక్కల మీదే ఆధారపడేవాడు. ఇప్పుడంతా ఏది కరెక్ట్‌గా తినాలి, ఏది తినకూడదు అనేదానిపై చాలా అనుమానాలు ఉంటున్నాయి. నా చిన్నప్పటి నుంచి మా ఇంట్లో మాంసాహారానికి ఏ మాత్రం ప్రాముఖ్యం లేదు. ఇప్పుడైతే అస్సలు తీసుకోం. శాకాహారానికి సైడ్‌ఎఫెక్ట్స్ ఏమీ ఉండవు. ఆరోగ్యం బాగో లేకపోతే ముందు నాన్‌వెజ్ తీసుకోవద్దు అని చెబుతారు. కానీ, శాకాహారం విషయంలో అలా ఉండదు. జంతువులకు కూడా మనలాగే కొన్ని ఎమోషన్స్ ఉంటాయి. దూడ పాలు తాగాక అవి మిగిలిన పాలు తీసుకోవడం వరకు పర్లేదు. కానీ, జంతువులను బాధించి, వాటినుంచి మనం ఆహారం పొందుతున్నాం. జంతువుల మీద క్రూరత్వాన్ని చూపుతున్నాం. అదెలాగంటే ఒక జంతువును చూస్తే దానిని కొట్టాలనే ఆలోచనకే వెళుతున్నాడు మనిషి. శాకాహారం మాత్రమే తీసుకుంటే మనిషి సాధు స్వభావిగా ఉంటాడు. దీనిని మనం అర్థం చేసుకోవాలి. సమాజంలో క్రూరత్వాన్ని దూరం చేయాలంటే మన ఆహారపు అలవాట్లలో మార్పు రావాలి. వాహనసదుపాయాలు ఏవీ లేని రోజుల్లో రవాణాకు జంతువులను ఉపయోగించేవారు. ఇప్పుడు అలా లేదు. అలాగే మనలో కూడా మార్పు రావాలి.

– స్టెల్లా మరేజ్, గంధంగూడ, నార్సింగ్, హైదరాబాద్

హింసను తెలుసుకొని..



నేను వీగన్‌గా మారి మూడేళ్లు అయ్యింది. అన్ని డెయిరీ, పౌల్ట్రీ కంపెనీలలో జరుగుతున్న హింసను తెలుసుకొని వీగన్‌గా మారిపోయాను. క్యాల్షియం కావాలంటే పాలు తాగాలంటారు. వీటి బదులు నువ్వులు తీసుకోవచ్చు. చికెన్, మీట్‌లో చెడు కొలెస్ట్రాల్ ఉంటుంది. వాటి గ్రోత్‌కి ఇచ్చే ఇంజక్షన్స్ వల్ల భవిష్యత్తులో క్యాన్సర్లు రావచ్చు. హార్మోనల్ సమస్యలు కూడా రావచ్చు. వీగన్ ఫుడ్ వల్ల ఆరోగ్యంగా ఉంటారు. ముఖ్యంగా ఆర్థ్రైటిస్ సమస్య తగ్గుతుంది. వీగన్ అని విని ఇదేదో పాశ్చాత్యులు తీసుకునేది, మనది కాదు అనుకోకూడదు. కానీ, ప్రాచీనకాలం నుంచి మనం చేస్తున్నదే. దీని వల్ల మన ఆరోగ్యమే కాదు, పర్యవరణానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది.

– హర్షిత వెంపటి, ఉప్పల్, హైదరాబాద్

యవ్వనంగా ఉండచ్చు



వీగన్ ఆహారం తీసుకోవడం వల్ల జంతువులను బాధించడం తగ్గించవచ్చు. మనం ఆరోగ్యంగా, యవ్వనంగా ఉండవచ్చు. పర్యావరణానికి మేలు జరుగుతుంది. విదేశీయులు కూడా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వీగన్ డైట్‌కు మారిపోతున్నారు. ప్రకృతి మనకు ఎన్నింటినో ఫ్రీగా ఇచ్చింది. మనం వాటిని రక్షించుకోకుండా పాడు చేస్తున్నాం. జంతువులంటే ఇష్టపడేవారు, ఆరోగ్యాన్ని, ప్రకృతిని కాపాడుకోవాలనుకునేవారు వీగన్‌కి మారిపోవడం ఎంతో మంచిది. నేను పదేళ్లుగా వీగన్ డైట్ తీసుకుంటాను. వీగన్ కెఫేని కూడా రన్ చేస్తున్నాను. పాలు, జంతు ఆధారిత ఉత్పత్తులేవీ లేకుండా వర్క్‌షాప్స్ ద్వారా అవగాహన తీసుకువస్తుంటాం.

– సిమి, సిమిస్ వరల్డ్
ప్రగతి నగర్, హైదరాబాద్

ఒక్కరాత్రిలో మారిపోయాను



మూడేళ్లుగా వీగనిజానికి మారిపోయాను. నేను మా కుక్క గాయపడటం చూశాను. అది కొన్ని రోజులు పాటు ఎంత బాధపడిందో దగ్గరగా చూశాను. కోడి, మేక బాధ కూడా అంతే కదా! ఆ ఆలోచన వచ్చి ఒక్క రాత్రిలో వీగన్‌కి మారిపోయాను. జంతువుల పాలు తీసుకోవడం కూడా మానేశాను. ఆన్‌లైన్‌లో వీగన్ డైట్ ప్లాన్ చూశాను. అందులో న్యూట్రిషన్ సాయం కూడా తీసుకోవచ్చు. మన శరీరానికి ఎలాంటి ఆహారం అనువైనది, ఎంత అవసరం అనేది ఎక్స్‌పర్ట్ సలహా తీసుకున్నాను. మన చుట్టూ ఉండే పర్యావరణం బాగుండాలంటే ముఖ్యంగా మనలో మార్పు రావాలి.

– పంచ్, వీగన్ యాక్టివిస్ట్

టిప్స్

హోమ్‌మేడ్ ఎరువు

- గ్లాసు నీటిలో గుప్పెడు బియ్యం, స్పూను వంటసోడా వేసి కలపాలి. తరువాత అర టీస్పూను వెనిగర్ కూడా కలపాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలిపి స్ప్రే బాటిల్‌లో పోయాలి. జీవం కోల్పోయిన మొక్కలపై ఈ ద్రావణాన్ని చిలకరిస్తే.. మొక్కలు పచ్చగా కళకళలాడతాయి.
- ఉల్లిపాయ ముక్కలను నానబెట్టిన నీటిని మొక్కలకు పోస్తే మొక్కలకు మంచి ఎరువుగా పనిచేస్తుంది. వెనిగర్ కలిపిన నీళ్లు, సోయాబీన్ నీళ్లు, జీరు కలిపిన నీళ్లు కూడా మొక్కలకు బలాన్ని అందించి చక్కగా పెరిగేలా చేస్తాయి.



- కప్పు వేడినీటిలో స్పూను పంచదార, స్పూను వంట సోడా, స్పూను వెనిగర్ వేసి కలపాలి. కప్పు మీద మూత పెట్టి ఉంచాలి. 48 గంటల తరువాత ఈ నీటిని మొక్కలకు పోస్తే వేళ్లకు బలం అంది మొక్కలు చక్కగా పెరుగుతాయి.

యూత్ పల్స్

ఇవిగివిగో... అవిగవిగో!

● క్రియేటర్ ఫ్రెండ్లీ టూల్స్

డిజిటల్ క్రియేటర్‌లు నిలువ నీరులా, గోడకు కొట్టిన మేకులా ఉండకూడదు అనే స్పృహతో యువ క్రియేటర్‌లు ఎప్పటికప్పుడు కొత్త టాపిక్స్‌పైనే కాదు టూల్స్ గురించి కూడా అవగాహన చేసుకుంటున్నారు. క్రియేటర్–ఫ్రెండ్లీ టూల్స్‌కు సంబంధించి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల అప్‌డేట్స్‌ను వేగంగా అందిపుచ్చుకుంటున్నారు. కంటెంట్ మేకింగ్‌లో మరింత క్రియేటివిటీ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు....

రెండు నెలల క్రితం 'మీ షార్ట్స్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకు వెళ్లండి' అంటూ యూట్యూబ్ కొత్త క్రియేషన్ టూల్స్‌ను తీసుకు వచ్చింది. అందులో ఒకటి కొలాబ్. ఈ టూల్‌తో సైడ్–బై–సైడ్ ఫార్మట్‌లో 'షార్ట్'ను రికార్డ్ చేయవచ్చు. క్రియేటర్‌లు తమకు నచ్చిన వాటిని ఎంపిక చేసుకోవడానికి మల్టిపుల్ లే ఔట్ ఆప్షన్‌లు ఉంటాయి.

గత నెలలో జరిగిన 'మేడ్ ఆన్ యూట్యూబ్' కార్యక్రమంలో క్రియేటర్స్‌కు ఉపకరించే కొత్త టూల్స్‌ను ప్రకటించింది కంపెనీ.

'క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్స్‌కు కొత్త టూల్స్ తీసుకురానున్నాం. క్లిష్టం అనుకునే వాటిని సులభతరం, అసాధ్యం అనుకున్న వాటిని సాధ్యం చేసే టూల్స్ ఇవి. క్రియేటివ్ పవర్‌కు దగ్గర కావడానికి ఉపకరిస్తాయి' అన్నాడు యూ ట్యూబ్ సీయీవో నీల్ మోహన్.

యూ ట్యూబ్ ప్రకటించిన కొన్ని టూల్స్....

డ్రీమ్ స్క్రీన్

యూట్యూబ్ షార్ట్స్ కోసం రూపొందించిన న్యూ జెనరేటివ్ ఫీచర్ ఇది. దీని ద్వారా తమ షార్ట్స్‌కు ఏఐ జనరేటెడ్ వీడియో లేదా ఇమేజ్ బ్యాక్‌గ్రౌండ్ యాడ్ చేయడానికి వీలవుతుంది. పెద్దగా కష్టపడనక్కర్లేకుండానే ప్రాంప్ట్ ఇస్తే సరిపోతుంది. 'డ్రీమ్ స్క్రీన్' ద్వారా క్రియేటర్‌లు తమ షార్ట్స్‌కు న్యూ సెట్టింగ్స్ జనరేట్ చేయవచ్చు.

యూట్యూబ్ క్రియేట్

వీడియోలు క్రియేట్ చేయడానికి షేర్ చేయడానికి ఉపకరిస్తుంది. యూట్యూబ్ క్రియేట్ యాప్ ద్వారా ఖచ్చితత్వం, నాణ్యతతో కూడిన ఎడిటింగ్, ట్రిమ్మింగ్, ఆటోమేటిక్ కాప్షనింగ్, వాయిస్ వోవర్, యాక్సెస్ టు లైబ్రరీ ఆఫ్ ఫిల్టర్స్, ఎఫెక్ట్స్, ట్రాన్సిషన్స్, రాయల్టీ–ఫ్రీ మ్యూజిక్... మొదలైనవి క్రియేటర్‌లకు ఉపయోగపడతాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే కాంప్లెక్స్ ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్‌తో పని లేకుండానే ప్రేక్షకులను ఆకట్టుకునేలా వీడియోలను సులభంగా క్రియేట్ చేయవచ్చు.

క్రియేటర్‌ల నోట 'హిట్ లైక్ అండ్ సబ్‌స్క్రైబ్' అనే మాట తరచుగా వినిపిస్తుంటుంది. ప్రస్తుతం దీన్ని ఫీచర్‌గా మలచనున్నారు. 'హిట్ లైక్ అండ్ సబ్‌స్క్రైబ్' వినిపిస్తున్నప్పుడు ఈ బటన్‌లను సింక్‌లోని విజువల్ క్యూతో హైలైట్ చేస్తుంది.

ఏఐ ఇన్‌సైట్స్

యూట్యూబ్‌లో ప్రేక్షకులు చూస్తున్న కంటెంట్ ఆధారంగా వీడియో ఐడియాలను తయారు చేసుకోవడానికి వీలవుతుంది.

అలౌడ్

ఆటోమేటిక్ డబ్బింగ్ టూల్ ద్వారా కంటెంట్‌ను ఎక్కువ భాషల్లో క్రియేట్ చేయవచ్చు. ఇన్‌స్టాగ్రామ్ కూడా క్రియేటర్‌లను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు అప్‌డేట్స్‌తో ముందుకు వస్తోంది. వాటిలో ఒకటి క్రియేటర్‌లు 'రీల్స్'లో టాప్ ట్రెండింగ్ సాంగ్స్ గురించి తెలుసుకునే అవకాశం. ఆ ఆడియోనూ ఎన్నిసార్లు ఉపయోగించారో తెలుసుకోవచ్చు. సేవ్ చేసి అవసరమైన సందర్భంలో వాడుకోవచ్చు. ట్రెండింగ్ టాపిక్స్ ఏమిటో కూడా తెలుసుకోవచ్చు.


'ప్రస్తుతం పాపులర్ ఏమిటి?' అనేది తెలుసుకోవడానికి కొత్త డెడికేటెడ్ సెక్షన్ క్రియేటర్‌లకు ఉపకరిస్తుంది' అని చెబుతుంది కంపెనీ.

'రీల్స్'ను ఎడిట్ చేయడాన్ని సులభతరం చేయడానికి వీడియో క్లిప్‌లు, ఆడియో, స్టిక్కర్స్, టెక్స్‌ను ఒకేచోటుకు తీసుకువచ్చింది. తమ కంటెంట్ పెర్‌ఫార్మెన్స్ గురించి తెలుసుకోవడానికి కొత్తగా తీసుకువచ్చిన 'రీల్స్ ఇన్‌సైట్స్'తో యాక్సెస్ కావచ్చు. ఇన్‌స్టాగ్రామ్ కొత్తగా యాడ్ చేసిన 'టోటల్ వాచ్ టైమ్' మెట్రిక్, 'యావరేజ్ టైమ్' మెట్రిక్‌తో క్రియేటర్‌లు యాక్సెస్ కావచ్చు. రీల్స్‌లో 'స్ట్రాంగర్ హుక్' క్రియేట్ చేసి వీడియోను ఆకట్టుకునేలా చేయడానికి ఇది ఉపకరిస్తుంది.



ఆకాంక్ష

తాజాగా ఫోర్బ్స్ ఇండియా 'డిజిటల్ స్టార్స్ జాబితాలో చోటు సంపాదించింది 24 సంవత్సరాల ఆకాంక్ష మోంగ. కన్సల్టెన్సీ జాబ్‌ను వదిలేసి ఫుల్‌టైమ్ ట్రావెలర్‌గా మారింది. పుణెకు చెందిన ఆకాంక్ష ట్రావెల్ అండ్ ఫొటోగ్రఫీ విభాగంలో మంచి పేరు తెచ్చుకుంది. 'కంటెంట్‌ను ప్రేక్షకులకు వేగంగా చేరువ చేయడానికి సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విషయం లో ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ తెలుసుకోవాలి' అంటుంది ఆకాంక్ష.



అయిననూ...

టెక్నాలజీ మాత్రమే సర్వస్వం, విజయ సోపానం అనుకోవడం లేదు యువ క్రియేటర్‌లు. 'టెక్నాలజీ అంటే టూల్స్ మాత్రమే కాదు క్రియేటర్ పని తీరు. ప్రత్యేకత. సృజనాత్మకత' అనే విషయంపై అవగాహన ఉన్న యువ క్రియేటర్‌లు నేల విడిచి సాము చేయడం లేదు. కంటెంట్, టెక్నాలజీని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతున్నారు.

న్యూస్‌మేకర్ శీతల్‌దేవి

'జీవితంలో ఎదురయ్యే చిన్నాచితకా కష్టాల గురించి
ఇక మీదట నేను యాగీ చేయను.
తల్లీ నువ్వొక గురువువి' అని ట్వీట్ చేశాడు ఆనంద్ మహీంద్ర,
పారా ఆర్చర్ శీతల్ దేవి గురించి.
అంతే కాదు తమ సంస్థ నుంచి కోరిన కారు తీసుకోమన్నాడు.
రెండు చేతులూ లేకపోయినా విలువిద్య అభ్యసించి
ఆసియా పారాగేమ్స్‌లో స్వర్ణాలు సాధించిన
కశ్మీర్ అమ్మాయి శీతల్‌దేవి జీవితాన్ని ఎలా ఎదుర్కొనాలో
తన పట్టుదలతో చూపించింది.
ఆమె జీవితం ఒక ఆదర్శమైతే
ఆమె నేర్పిన పాఠం సాకులు చెప్పేవారికి గుణపాఠం.

జీవితానికి ఒక గురువు



శీతల్ దేవి





2021లో బెంగళూరుకు చెందిన 'బీయింగ్ యు' అనే సంస్థ శీతల్‌కు ప్రోస్థెటిక్ చేతులు పెట్టించడానికి ఏర్పాట్లు చేసింది. 'ప్రోస్థెటిక్ చేతులు పెడితే నువ్వు చేసే మొదటి పని ఏమిటి?' అని అడిగితే 'గాజులు వేసుకుంటా' అని టక్కున సమాధానం చెప్పింది శీతల్. నిజానికి ఆ అలంకరణకు తప్పితే మిగిలిన అన్ని పనులకు, తన జీవితాన్ని చక్కదిద్దుకోవడానికి శీతల్‌కు తన ఆత్మవిశ్వాసం చాలు. అందుకే ఆమె ప్రోస్థెటిక్ చేతులను పెద్దగా ఉపయోగించదు. దాదాపు పెట్టుకోదనే చెప్పాలి. 'నేనెలా ఉన్నానో అలాగే ఉంటాను' అంటుంది శీతల్. ఈ ధైర్యం ఎంతమందికి ఉంది?

రికార్డులు తిరగరాసింది

ఇటీవల చైనాలో ముగిసిన 'ఆసియన్ పారా గేమ్స్' (దివ్యాంగుల క్రీడలు)లో విలువిద్యలో రెండు స్వర్ణాలు, ఒక రజతం సాధించి రికార్డు సృష్టించింది శీతల్ దేవి. 16 ఏళ్ల వయసులో ఇలా మన దేశం నుంచి విలువిద్య లో రెండు స్వర్ణాలు సాధించిన క్రీడాకారులు లేరు. అది ఒక పెద్ద విశేషం అయితే అంత కన్నా పెద్ద విశేషం శీతల్‌కు రెండుచేతులూ లేకపోవడం. అయినా సరే కుడికాలితో విల్లు ఎత్తి, కుడి భుజంతో నారి సారించి, 50 మీటర్ల దూరంలో ఉండే లక్ష్యాన్ని గురి చూసి బాణం వదిలిందంటే కచ్చితంగా లక్ష్యాన్ని ఛేదించాల్సిందే. అర్జునుడు రెండు చేతులతో బాణాలు సంధిస్తాడు కాబట్టి సవ్యసాచి అన్నారు. శీతల్‌కు చేతులు లేకపోయినా రెండు కాళ్లతో బాణాలు సంధిస్తే ఏమని పిలవాలో. 'సవ్యసాచి' అనాలేమో!



జీవితం గొప్పది

'జీవితంలో నువ్వు ఫలానాది ఎందుకు సాధించలేదు, జీవితం అంటే ఎందుకు ఆసక్తి కోల్పోయావు, జీవితాన్ని ఎందుకు వృథా చేస్తున్నావు' అని ఎవరినైనా అడిగితే సవాలక్ష వంకలు చెబుతారు, అడ్డంకులొచ్చాయంటారు, కష్టాలు వచ్చాయంటారు, రోజువారి జీవితంలో వచ్చే చిన్నాచితకా సమస్యలకు చికాకు పడిపోతుంటారు, జీవితం నుంచి దూరంగా వ్యసనాల్లోకి పారిపోవాలనుకుంటారు... కాని శీతల్‌ను చూస్తే ఆ అమ్మాయికి మించిన కష్టమా?

అయినా కూడా ఆ అమ్మాయి సాధించ లేదా? మహీంద్రా అధినేత ఆనంద్ మహీంద్రా అదే అన్నాడు శీతల్‌ను చూసి– 'తల్లి.. నిన్ను చూశాక జీవితం విలువ తెలిసింది' అని! ఆమెకు కారు ఆఫర్ చేశాడు.

కశ్మీర్ అమ్మాయి

శీతల్ దిగువ మధ్యతరగతి కశ్మీర్ అమ్మాయి. వీళ్లది కిష్టవర్ జిల్లా లియోధర్ గ్రామం. తండ్రి మాన్ సింగ్ రైతు, తల్లి శక్తిదేవి కాసిన్ని గొర్రెలను సాకుతుంటుంది. వీరి పెద్ద కూతురు శీతల్. చిన్న కూతురు శివాని. శీతల్‌కు పుట్టుకతో చేతులు ఏర్పడలేదు. ఇలాంటి స్థితిని వైద్యపరిభాషలో 'ఫొకొమెలియా' అంటారు. అయితే శీతల్ నిరాశలో కుంగిపోలేదు. తల్లిదండ్రులు ఆమెను బేలగా పెంచలేదు. శీతల్ తనకు లేని చేతుల లోటును కాళ్లతో పూడ్చడానికి ప్రయత్నించేది. ఆమెకు చేతులు లేకపోవడం వల్ల మిగిలిన శరీరం అంతా మరింత సూక్ష్మంగా, దృఢంగా తయారయ్యింది. రెండు చేతులూ లేకపోయినా శీతల్ చెట్లు ఎక్కి ఆడుకునేదంటే ఆశ్చర్యం. స్కూల్లో కూడా కాళ్లతోనే నోట్స్ రాసుకోవడం, ఫోన్‌ను ఉపయోగించడం నేర్చుకుంది. జీవితం అలాగే సాగిపోయేదేమో కాని కరోనా లాక్‌డౌన్ వల్ల ఇంటర్‌నెట్‌లో తనలాంటి దివ్యాంగులకు సాయం చేసే సంస్థ– బీయింగ్ యు గురించి తెలిసింది. ఆ సంస్థకు చెందిన ప్రీతి రాయ్.. శీతల్‌లోని క్రీడాకారిణిని గుర్తించింది. దివ్యాంగుల క్రీడల పోటీల్లో ఆమె ప్రతిభ చూపగలదని గ్రహించి, తన సంస్థ స్పాన్సర్‌షిప్ కింద కశ్మీర్‌లోని కత్రాలో దివ్యాంగుల క్రీడా శిక్షణా కేంద్రానికి పంపింది. ఆగస్టు 2022 నుంచి మాత్రమే శీతల్ విలువిద్య సాధన మొదలెట్టింది. 2023 అక్టోబర్ నాటికి అంతర్జాతీయ గుర్తింపు పొందింది. ఇంతకన్నా విజయం ఉందా?

'నాకు ఎలాగైనా సాధించాలని ఉండేది. అందుకు ఏమిటి మార్గం అని మా కోచ్‌ను అడిగాను. కష్టపడాలి అన్నాడు. కష్టపడ్డాను. చాలా చాలా కష్టపడ్డాను' అంటుంది శీతల్.

అడ్డదారుల్లో వెళితే విజయం ఉండొచ్చు లేకపోవచ్చు. కాని కష్టపడితే? గెలుపు తథ్యం. శీతల్‌ను చూసి మన జీవితాల్లో లక్ష్యాన్ని గురి చూద్దాం.



జపాన్‌పై భారత మహిళల విజయం

రాంచీలో జరుగుతున్న మహిళల హాకీ ఆసియా చాంపియన్స్‌ ట్రోఫీలో భారత జట్టు మరో విజయాన్ని అందుకుంది. టోర్నీలో ఇది భారత్‌కు వరుసగా నాలుగో గెలుపు కావడం విశేషం. మంగళవారం హోరాహోరీగా జరిగిన పోరులో భారత్‌ 2-1 గోల్స్‌ తేడాతో జపాన్‌ను ఓడించింది. భారత్‌ తరఫున నవనీత్‌ కౌర్‌ 31వ నిమిషంలో ఫీల్డ్‌ గోల్‌ సాధించగా...47వ నిమిషంలో సంగీత కుమారి పెనాల్టీని గోల్‌గా మలచింది. జపాన్‌కు లభించిన పెనాల్టీని సద్వినియోగం చేసుకుంటూ 37వ నిమిషంలో ఉరాటా కానా గోల్‌ నమోదు చేసింది. భారత సీనియర్‌ ప్లేయర్‌ వందన కటారియాకు ఇది 300వ అంతర్జాతీయ మ్యాచ్‌ కావడం విశేషం. ఈ సందర్భంగా హాకీ ఇండియా ఆమెను ఘనంగా సన్మానించింది. టోర్నీలో థాయిలాండ్, మలేసియా, చైనా, జపాన్‌లను ఓడించి భారత్‌ నేడు జరిగే మ్యాచ్‌లో కొరియాతో తలపడుతుంది.

నేడు సచిన్ విగ్రహావిష్కరణ



ముంబై: ప్రతిష్టాత్మక వాంఖెడె మైదానంలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ విగ్రహం ఏర్పాటు కానుంది. బుధవారం జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. సచిన్ స్టాండ్ పక్కనే దీనిని ఏర్పాటు చేయనుండగా...ఆఫ్ సైడ్‌లో షాట్ ఆడుతున్న చిత్రాన్ని ఈ విగ్రహం కోసం ఎంచుకున్నారు. అహ్మదాబాద్‌కు చెందిన ప్రమోద్ కాంబ్లే దీనిని రూపొందించారు. స్వయంగా సచిన్‌తో పాటు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, బీసీసీఐ కార్యదర్శి జై షా తదితరులు దీనికి హాజరవుతారు. తన సొంత మైదానమైన ముంబై వాంఖెడె స్టేడియంలోనే 2011 వన్డే వరల్డ్ కప్ ట్రోఫీ అందుకున్న సచిన్... తన ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్‌ను ఇక్కడే నవంబర్ 16, 2013న ఆడాడు.

శ్రేయస్‌పైనే దృష్టి



ముంబై: వరల్డ్‌కప్‌లో వరుసగా ఏడో విజయంపై దృష్టి పెట్టిన భారత జట్టు తమ సన్నాహకాలకు పదును పెట్టింది. మ్యాచ్‌కు రెండు రోజుల ముందు సోమవారం టీమ్ సాధన కొనసాగింది. 'ఆప్షనల్ ప్రాక్టీస్' కావడంతో రోహిత్, కోహ్లి, గిల్ దీనికి హాజరు కాలేదు. అయితే జట్టులోని ఇతర ప్రధాన ఆటగాళ్లంతా నెట్స్‌లో శ్రమించారు. కేఎల్ రాహుల్, సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ సుదీర్ఘ సమయం పాటు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయగా... జడేజా, అశ్విన్, శార్దుల్ కూడా తమ బౌలింగ్‌కు పదును పెట్టారు. అయితే అన్నింటికంటే కీలక సెషన్ మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌దే. ఆశించిన స్థాయిలో ఈ టోర్నీలో రాణించలేకపోతున్న అయ్యర్ పదే పదే షార్ట్ పిచ్ బంతులకు అవుటవుతూ తన బలహీనతను బయట పెట్టుకుంటున్నాడు. దీనిని సరిదిద్దే క్రమంలో అయ్యర్ ప్రాక్టీస్ సాగింది. ఆరంభంలో స్థానిక నెట్ బౌలర్లు అతనికి బౌలింగ్ చేయగా... ఆ తర్వాత టీమ్ త్రో డౌన్ స్పెషలిస్ట్ రాఘవేంద్ర అతనికి పెద్ద సంఖ్యలో షార్ట్ పిచ్ బంతులు విసిరాడు. అయ్యర్ సాధనను పర్యవేక్షించిన హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ అతడికి తగిన సూచనలిస్తూ లోపాలు సరిదిద్దే ప్రయత్నం చేశారు. ముంబైకే చెందిన శ్రేయస్ సొంత మైదానంలో జరిగే మ్యాచ్‌లో సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నాడు.

పాకిస్తాన్ విజయం

- 7 వికెట్లతో బంగ్లాదేశ్ చిత్తు
- టోర్నీలో బంగ్లా ఖేల్ ఖతం
- పాక్‌ను గెలిపించిన అఫ్రిది, ఫఖర్



వికెట్ తీసిన అఫ్రిదికి షకీల్, బాబర్ అభినందన

కోల్‌కతా: ప్రపంచకప్‌లో పాకిస్తాన్ ఎట్టకేలకు మరో విజయం సాధించింది. వరుసగా నాలుగు ఓటముల తర్వాత ఆ జట్టు ఖాతాలో గెలుపు చేరింది. మంగళవారం ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో పాక్ 7 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. బంగ్లాకు ఇది ఆరో పరాజయం కాగా...తాజా ఫలితంతో సెమీస్ అవకాశాలు కోల్పోయి టోర్నీ నుంచి నిష్క్రమించిన తొలి జట్టుగా బంగ్లా నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ 45.1 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌటైంది. మహ్ముదుల్లా (70 బంతుల్లో 56; 6 ఫోర్లు, 1 సిక్స్), లిటన్ దాస్ (64 బంతుల్లో 45; 6 ఫోర్లు), షకీబ్ అల్ హసన్ (64 బంతుల్లో 43; 4 ఫోర్లు) రాణించారు. షాహిన్ అఫ్రిది 3 కీలక వికెట్లతో బంగ్లాను దెబ్బ తీశాడు. అనంతరం పాక్ 32.3 ఓవర్లలో 3 వికెట్లకు 205 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫఖర్ జమాన్ (74 బంతుల్లో 81; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు), అబ్దుల్లా షఫీక్ (69 బంతుల్లో 68; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 21.1 ఓవర్లలో 160 పరుగులు జోడించి విజయానికి పునాది వేశారు. దాంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా మరో 17.3 ఓవర్లు మిగిలి ఉండగానే అలవోకగా లక్ష్యం చేరిన పాక్ టోర్నీలో తమ ఆశలు నిలబెట్టుకుంది. వరుసగా భారత్, ఆస్ట్రేలియా, అఫ్గనిస్తాన్, దక్షిణాఫ్రికా చేతుల్లో ఓడిన తర్వాత పాకిస్తాన్‌కు ఈ విజయం దక్కింది.



స్కోరు వివరాలు: బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తన్‌జీద్ (ఎల్బీ) (బి) షాహిన్ 0; దాస్ (సి) సల్మాన్ (బి) ఇఫ్తికార్ 45; నజ్ముల్ (సి) ఉసామా (బి) షాహిన్ 4; ముష్ఫికర్ (సి) రిజ్వాన్ (బి) రవూఫ్ 5; మహ్ముదుల్లా (బి) షాహిన్ 56; షకీబ్ (సి) సల్మాన్ (బి) రవూఫ్ 43; తౌహీద్ (సి) ఇఫ్తికార్ (బి) ఉసామా 7; మిరాజ్ (బి) వసీమ్ 25; తస్కిన్ (బి) వసీమ్ 6; ముస్తఫిజుర్ (బి) వసీమ్ 3; షరీఫుల్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (45.1 ఓవర్లలో ఆలౌట్) 204. వికెట్ల పతనం:** 1-0, 2-6, 3-23, 4-102, 5-130, 6-140, 7-185, 8-200, 9-201, 10-204. **బౌలింగ్:** షాహిన్ అఫ్రిది 9-1-23-3, ఇఫ్తికార్ 10-0-44-1, రవూఫ్ 8-0-36-2, వసీమ్ 8.1-1-31-3, ఉసామా 10-0-66-1.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: షఫీక్ (ఎల్బీ) (బి) మిరాజ్ 68; ఫఖర్ (సి) తౌహీద్ (బి) మిరాజ్ 81; బాబర్ (సి) మహ్ముదుల్లా (బి) మిరాజ్ 9; రిజ్వాన్ (నాటౌట్) 26; ఇఫ్తికార్ (నాటౌట్) 17; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (32.3 ఓవర్లలో 3 వికెట్లకు) 205. వికెట్ల పతనం:** 1-128, 2-160, 3-169. **బౌలింగ్:** తస్కిన్ 6-1-36-0, షరీఫుల్ 4-1-25-0, మిరాజ్ 9-0-60-3, ముస్తఫిజుర్ 7-0-47-0, షకీబ్ 5.3-0-30-0, నజ్ముల్ 1-0-5-0.

ప్రపంచకప్‌లో నేడు

న్యూజిలాండ్ × దక్షిణాఫ్రికా

వేదిక: పుణే

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	6	6	0	12	1.405
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
పాకిస్తాన్	7	3	4	6	-0.024
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	6	2	4	4	-0.275
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	7	1	6	2	-1.446
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

'నేనెప్పుడూ అనుకోలేదు'

రికార్డు పరుగులు, సెంచరీలపై కోహ్లి

న్యూఢిల్లీ: క్రికెట్ కెరీర్‌లో ఈ స్థాయికి చేరుకుంటానని ఎప్పుడు అనుకోలేదని భారత స్టార్ విరాట్ కోహ్లి అన్నాడు. ఈ వన్డే ప్రపంచకప్‌లో 48వ సెంచరీతో భారత గ్రేటెస్ట్ బ్యాటింగ్ దిగ్గజం సచిన్ (49) సరసన నిలిచేందుకు చేరువైన కోహ్లి తన తారాస్థాయి బ్యాటింగ్ ప్రదర్శనపై స్పందిస్తూ... 'క్రికెట్ గురించే మాట్లాడితే... ఇంతలా రాణిస్తానని, ఇన్ని మైలురాళ్లు అధిగమిస్తానని ఎప్పుడూ అనుకోనే లేదు. దేవుడి కృప వల్లే ఎక్కడో ఉన్న నేను ఇక్కడి దాకా వచ్చాను. నా ఆటతీరు, నిలకడ కొనసాగుతున్నాయి. సెంచరీలు చేయాలని, వేల కొద్దీ పరుగులు సాధించాలని కలలైతే కనేవాణ్ని. కానీ అవన్నీ ఇలా ఒక్కొక్కటిగా సాకారమవుతాయని అనుకోలేదు. నిజం చెప్పాలంటే క్రికెట్‌లో ఇవి ఇలా జరుగుతాయని, పయనం ఇలా సాగుతుందని ఎవరూ ప్రణాళికలు వేసుకోరు' అని అన్నాడు. ఈ 12 ఏళ్లలో టన్నుల కొద్దీ పరుగులు చేయడం చాలా ఆనందంగా ఉందన్నాడు. ఒక దశలో తన ప్రొఫెషనల్ క్రికెట్‌లోని లోపాల్ని గుర్తించడం... వెంటనే ఆటకు తగిన జీవనశైలి, క్రమశిక్షణ అలవర్చుకోవడం వల్లే అంతా మంచి జరిగిందని విరాట్ చెప్పుకొచ్చాడు. 'నా దృష్టంతా జట్టుపైనే ఉంటుంది. టీమిండియా విజయాల కోసం నా ప్రదర్శన బాగుండాలని, క్లిష్ట సమయంలోనూ జట్టును గట్టెక్కించాలన్నదే నా లక్ష్యం. అందుకే జీవనశైలి (సంపూర్ణ ఫిట్‌నెస్ కోసం)ని మార్చుకున్నాను. కఠినమైన క్రమశిక్షణ తప్పదని భావించాను. ఆట ఎప్పుడు మన కృషినే గుర్తిస్తుంది. నిజాయితీగా చెబుతున్నా... నా కెరీర్‌లో నేను బాగా నేర్చుకుంది ఇదే! ఫీల్డులో వంద శాతం అంకితభావంతో ఆడేందుకే కృషి చేస్తా. ఇదంతా కూడా భగవంతుడి ఆశీర్వాదంగా భావిస్తా' అని కోహ్లి వివరించాడు. 2008లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఈ బ్యాటింగ్ కింగ్... సచిన్ తర్వాత అంతటి క్రేజ్‌ను సంపాదించుకోవడమే కాదు... ఆ మాస్టర్ బ్లాస్టర్ వేర్వేరు ఘనతలను తిరగరాశాడు. ఈ ప్రపంచకప్‌లో ఒక శతకం, మూడు అర్ధసెంచరీలతో అతను ఇప్పటికే 354 పరుగులు చేశాడు. గురువారం శ్రీలంకతో మ్యాచ్ అనంతరం నవంబర్ 5న కోహ్లి పుట్టినరోజు. అదే రోజు దక్షిణాఫ్రికాతో మ్యాచ్ ఉండటంతో శతకోటి భారతీయులంతా ఆ రోజు కింగ్ కోహ్లి శతకం కొట్టాలని కోరుకుంటున్నారు. మరోవైపు కోహ్లి కోసం ఆదివారం బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) ఈడెన్ గార్డెన్స్‌లో ప్రత్యేక వేడుకలకు ఏర్పాట్లు చేస్తోంది. మ్యాచ్‌కు ముందు ఐసీసీ అనుమతితో అందరి ముందు భారీ కేక్‌ను కట్ చేయించాలనేది ప్రతిపాదన. దీంతో పాటు మైదానానికి వచ్చే దాదాపు 70 వేల మంది ప్రేక్షకులకు లోపలికి వెళ్లే సమయంలో 'కోహ్లి మాస్క్'లను అందజేస్తారు. దాంతో స్టేడియమంతా కోహ్లిమయమయ్యే అవకాశం ఉంది.



శ్రియాంక గురికి 13వ బెర్తు



న్యూఢిల్లీ: భారత షూటర్లు పారిస్ ఒలింపిక్సే లక్ష్యంగా ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రాణిస్తున్నారు. తాజాగా శ్రియాంక సదాంగి ఒలింపిక్స్ బెర్తు సంపాదించింది. కొరియాలోని చాంగ్వాన్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో ఆమె మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. పతకం చేజారినా... 'పారిస్' గురి కుదిరింది. ఆమె 440.5 స్కోరుతో నాలుగో స్థానంలో తృప్తిపడింది. ఆమెతో పాటు ఈ ఈవెంట్‌లో సిఫ్త్ కౌర్ సమ్రా, ఆషి చౌక్సీ, ఆయుషి పొడెర్‌లు కూడా క్వాలిఫయింగ్ మార్క్ దాటారు. షూటింగ్‌లో భారత్‌కిది 13వ ఒలింపిక్ బెర్తు కావడం విశేషం.

హైదరాబాద్‌లో 'రేసింగ్' లేదు!

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా నగరంలో జరగాల్సిన రెండు రేసింగ్ పోటీలు రద్దయ్యాయి. ఈ నెల 4, 5 తేదీల్లో నెక్లెస్ రోడ్ వేదికగా ఎఫ్4 ఇండియన్ చాంపియన్‌షిప్, ఇండియన్ రేసింగ్ లీగ్ నిర్వహించాల్సి ఉంది. అయితే ఎలక్షన్ కమిషన్ నిబంధనలతో వీటిని ఇక్కడ జరపడం లేదని నిర్వాహకులు ప్రకటించారు. ఈ రెండు రేస్‌లను హైదరాబాద్ నుంచి తరలిస్తున్నామని, ప్రకటించిన ఆ రెండు తేదీల్లోనే చెన్నైలో నిర్వహిస్తామని వారు వెల్లడించారు. రేస్‌ల కోసం ఇప్పటికే టికెట్లు కొన్నవారికి పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామన్నారు.

ఆంధ్ర ప్రదేశ్‌కు స్వర్ణం, కాంస్యం

పనాజీ: జాతీయ క్రీడల్లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు రెండు పతకాలతో మెరిశారు. మహిళల 4x100 మీటర్ల రిలే ఫైనల్లో చెలిమి ప్రత్యూష, భవానీ యాదవ్, మధుకావ్య, జ్యోతి యర్రాజీలతో కూడిన ఏపీ బృందం పోటీని 45.61 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచింది. మహిళల జావెలిన్ త్రోలో బల్లెంను 52.55 మీటర్ల దూరం విసిరి ఏపీకి చెందిన రష్మీ శెట్టి కాంస్యం నెగ్గింది.

మెస్సీకి 8వ 'బాలన్ డోర్'



పారిస్: అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లయోనల్ మెస్సీ రికార్డు స్థాయిలో 8వ సారి ప్రతిష్టాత్మక 'బాలన్ డోర్' అవార్డును అందుకున్నాడు. గత ఏడాది ఖతర్‌లో జరిగిన ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో కెప్టెన్‌గా అర్జెంటీనాను విజయవంతంగా నడిపించి మెస్సీ టైటిల్ అందించాడు. ఫైనల్లో 2 గోల్స్ సహా టోర్నీలో అతను మొత్తం 7 గోల్స్ సాధించాడు. ఈ నేపథ్యంలో అతని అసాధారణ ప్రదర్శనకు గాను 'బాలన్ డోర్' అవార్డు మరో సారి వరించింది. గతంలో మెస్సీ 2009, 2010, 2011, 2012, 2015, 2019, 2021లలో కూడా దీనిని అందుకున్నాడు. ప్రతీ సీజన్‌లో విశేష ప్రతిభ కనబరిచిన ఫుట్‌బాల్ ఆటగాళ్లను ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు. మహిళల కేటగిరీలో స్పెయిన్‌కు చెందిన ఐటానా బొన్‌మటికి ఈ అవార్డు లభించింది.

సినిమా

కథ సెట్.. కాంబో రిపీట్



● కమల్ హాసన్ ● శంకర్ ● మణిరత్నం

ఒక హీరో... ఒక డైరెక్టర్... వీరి కాంబినేషన్‌లో ఓ బ్లాక్‌బస్టర్... ఇది చాలు... ప్రేక్షకులు ఆ కాంబో రిపీట్ కావాలని కోరుకోవడానికి. అయితే కారణాలేమైనా కొన్ని హిట్ కాంబినేషన్స్ రిపీట్ కావడానికి ఇరవయ్యేళ్లకు పైగా పట్టింది. ఇప్పుడు కథ సెట్ అయింది.. కాంబో రిపీట్ అవుతోంది. రిపీట్ అవుతున్న ఆ హిట్ కాంబినేషన్స్ గురించి తెలుసుకుందాం.



● అమిర్ ఖాన్ ● సన్నీ డియోల్ ● రాజ్‌కుమార్ సంతోషి

బిగిన్ ది బిగిన్

కమల్‌హాసన్ కెరీర్‌లో 'నాయగన్' (1987) బ్లాక్ బస్టర్ ఫిల్మ్. మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం తెలుగులో 'నాయకుడు'గా విడుదలైంది. ఇంతటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ ఇచ్చిన కమల్–మణిరత్నం కాంబోలో మరో సినిమా ప్రకటన రావడానికి మూడు దశాబ్దాలకు పైగా సమయం గడిచిపోయింది. ముప్పైఐదేళ్ల తర్వాత.. అంటే గత ఏడాది నవంబరులో తన పుట్టినరోజు సందర్భంగా మణిరత్నంతో సినిమాను ప్రకటించారు కమల్. మణిరత్నం, కమల్‌హాసన్, ఉదయనిధి స్టాలిన్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. నటుడిగా కమల్ కెరీర్‌లో 234వ సినిమాగా తెరకెక్కనుంది. ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని నిర్వహించి, బిగిన్ ది బిగిన్ అంటూ వీడియోను షేర్ చేశారు మేకర్స్. దుల్కర్ సల్మాన్, త్రిష, 'జయం' రవి ఈ చిత్రంలో కీ రోల్స్ చేస్తారని సమాచారం. వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. మరోవైపు 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం కూడా కమల్‌హాసన్ కెరీర్‌లో ఓ బ్లాక్‌బస్టర్. ఈ సినిమాకు శంకర్ దర్శకుడు. 1996లో వచ్చిన 'ఇండియన్' తర్వాత కమల్, శంకర్‌ల కాంబినేషన్‌లో పాతికేళ్లకు 'ఇండియన్ 2' రూపొందుతోంది. సుభాస్కరన్, ఉదయనిధి స్టాలిన్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

లక్నో టు లాహోర్

దాదాపు పాతికేళ్ల క్రితం బాలీవుడ్‌లో హీరో సన్నీ డియోల్, దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషిల కాంబినేషన్ అంటే సెన్సేషన్. వీరి కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'ఘాయల్' (1990) సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. ఆ ఏడాది బాక్సాఫీస్ టాప్ కలెక్షన్స్ సాధించిన మొదటి ఐదు చిత్రాల్లో 'ఘాయల్'కు చోటు దక్కడం అనేది ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించిన తీరుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఆ తర్వాత 'దామిని' (1993) చిత్రం కోసం సన్నీడియోల్, రాజ్‌కుమార్ సంతోషిలు కలిసి పని చేశారు. కానీ ఇది ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్. మీనాక్షీ శేషాద్రి మెయిన్ లీడ్ రోల్ చేయగా, సన్నీ డియోల్, రిషీ కపూర్, అమ్రిష్ పూరి ఇతర లీడ్ రోల్స్ చేశారు. ఈ చిత్రం కూడా సూపర్‌హిట్. ఇక ముచ్చటగా మూడోసారి సన్నీ డియోల్, రాజ్‌కుమార్ సంతోషిలు కలిసి చేసిన చిత్రం 'ఘాతక్'. 'దామిని' చిత్రంలో నటించిన సన్నీ డియోల్, మీనాక్షీ చౌదరి, ఓమ్ పురి ఈ సినిమాలో కూడా నటించారు. 1996లో విడుదలైన ఈ చిత్రం సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. ఇలా మూడు వరుస హిట్స్ ఉన్నప్పటికీ ఎందుకో కానీ సన్నీ డియోల్, రాజ్‌కుమార్ సంతోషిల కాంబినేషన్‌లో ఈ సినిమా తర్వాత మరో సినిమా సెట్స్ పైకి వెళ్లలేదు. ఇప్పుడు ఆ సమయం వచ్చేసింది. సన్నీ డియోల్, రాజ్‌కుమార్ సంతోషిల కాంబినేషన్‌లో 'లాహోర్ 1947' అనే చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాను హీరో ఆమిర్ ఖాన్ నిర్మిస్తున్నారు. భారతదేశం, పాకిస్తాన్ విభజన నాటి పరిస్థితుల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని, లక్నో నుంచి లాహోర్‌కు వలస వెళ్లిన ఓ ముస్లిం కుటుంబం కథే ఈ చిత్రం అని టాక్. ఈ చిత్రం 2024లో విడుదల కానుంది. మరోవైపు హీరోగా ఆమిర్ ఖాన్, దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషిల కాంబినేషన్ కూడా రిపీట్ అయ్యే చాన్సెస్ ఉన్నాయట. ఇదే నిజమైతే... 1994లో వచ్చిన 'అందాజ్ అప్నా అప్నా' తర్వాత ఆమిర్, రాజ్‌కుమార్ సంతోషిల కాంబినేషన్‌లో వచ్చే చిత్రం ఇదే అవుతుంది. అంటే.. 30 ఏళ్లకు ఆమిర్, రాజ్‌కుమార్ కలిసి సినిమా చేసినట్లవుతుంది.



● జాకీ ష్రాఫ్ ● సుభాష్ ఘయ్

ఎప్పటికీ హీరోయే!

జాకీ ష్రాఫ్‌ను 'హీరో'ను చేసింది దర్శకుడు సుభాష్ ఘయ్. జాకీ ష్రాఫ్, సుభాష్ కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'హీరో' (1983) సూపర్ హిట్‌గా నిలిచింది. హీరోగా జాకీకి ఇదే తొలి సినిమా. 'హీరో' సూపర్‌హిట్ అయినప్పటికీ వీరి కాంబోలో తర్వాతి చిత్రం 'యాదేం' (2001) తెరకెక్కడానికి 18 ఏళ్లు పట్టింది. జాకీ ష్రాఫ్‌తో పాటు హృతిక్ రోషన్ కూడా ఓ లీడ్ రోల్ చేసిన ఈ చిత్రం ఫర్వాలేదనిపించింది. ఇప్పుడు జాకీ ష్రాఫ్ హీరోగా 'వన్స్ ఏ హీరో.. ఆల్వేస్ ఏ హీరో' అంటూ తాజా చిత్రాన్ని ప్రకటించారు సుభాష్.

ఇలా ఇరవై, ముప్పైఏళ్ల తర్వాత రిపీట్ అవుతున్న హీరో–డైరెక్టర్ కాంబినేషన్స్ ఇంకా ఉన్నాయి.

జరగవు కొన్ని!

శ్రీరామ్ నిమ్మల, కలపాల మౌనిక జంటగా నటించిన క్రైమ్ కామెడీ థ్రిల్లర్ 'అనుకున్నవన్నీ జరగవు కొన్ని'. జి. సందీప్ దర్శకత్వంలో శ్రీ భారత ఆర్ట్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో నిమ్మల శ్రీరామ్ మాట్లాడుతూ– ''కథ రెడీ చేసుకుని నిర్మాత కోసం వెతుకున్న తరుణంలో నేనే నిర్మిస్తే ఎలా ఉంటుందని ఆలోచించి, అమ్మానాన్నలకు చెబితే వారు సపోర్ట్ చేశారు. నవీన, అశోక్, హరి.. ఇలా నా మిత్రుల సహకారంతోనే నేను ఇంత దూరం రాగలిగాను. ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు. ఈ సినిమా విజయం సాధించాలని కిరీటి దామరాజు, మౌనిక, సోనియా అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: గిడియన్ కట్ట.



● శ్రీరామ్, మౌనిక, జి. సందీప్

థ్రిల్ చేసే విధి



● శ్రీనాథ్, శ్రీకాంత్, రోహిత్ నంద, రంజిత్

రోహిత్ నందా, ఆనంది జంటగా శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ ద్వయం తెరకెక్కించిన థ్రిల్లర్ ఫిల్మ్ 'విధి'. ఎస్. రంజిత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రోహిత్ మాట్లాడుతూ–''మమ్మల్ని ప్రోత్సహించిన నిర్మాత 'దిల్' రాజు కుమార్తె హన్షితా రెడ్డిగారికి థ్యాంక్స్. 'విధి' ప్రేక్షకులను అలరిస్తుంది. ఎక్స్‌ఎల్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని థియేటర్‌కు వెళ్తే.. కంటి చూపు లేనివాళ్లు కూడా ఈ సినిమాను ఎక్స్‌పీరియన్స్ చేయొచ్చు'' అన్నారు. ''అనుభవం ఉన్న యాక్టర్‌లా నటించాడు రోహిత్. ఇప్పటివరకు 'విధి' మా సినిమా. నవంబరు 3 నుంచి ఇది ప్రేక్షకుల సినిమా. మమ్మల్ని ప్రోత్సహించిన నిర్మాత రంజిత్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు శ్రీకాంత్, శ్రీనాథ్. ''ఈ సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు ఎస్. రంజిత్. ''విధి' కొత్తగా ఉంటుంది'' అన్నారు సంగీతదర్శకుడు శ్రీచరణ్ పాకాల.

ఆస్కార్ వరకూ వెళ్లాం

\- అక్కినేని నాగార్జున



''దక్షిణాది చిత్రాలను ఇండియా అంతా ఫాలో అవుతోంది. నాగ్ అశ్విన్ వంటి దర్శకులు సత్తా చాటుతున్నారు. మేం ఆస్కార్ వరకూ వెళ్లాం. ఇండియా జాయ్ వారి గ్రాఫ్ అద్భుతంగా పెరుగుతోంది. గేమింగ్, యానిమేషన్, వీఎఫ్ఎక్స్ వంటి వాటి గురించి తెలుసుకోవాలంటే హైదరాబాద్ రండి'' అని అక్కినేని నాగార్జున అన్నారు. ఇండియా జాయ్, ఫ్లయింగ్ మౌంటెన్ కాన్సెప్ట్స్ సమర్పణలో సినిమాటిక్ ఎక్స్‌పో కార్యక్రమం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. సినీ రంగంలోని 24 శాఖలకు చెందిన సరికొత్త సాంకేతికతను అందరికీ తెలియజేసే పరిచయ వేదికగా సినిమాటిక్ ఎక్స్‌పో నిలిచింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నాగార్జున పాల్గొన్నారు. మరో అతిథి డైరెక్టర్ నాగ్ అశ్విన్ మాట్లాడుతూ– ''హాలీవుడ్‌లాంటి క్వాలిటీతో సినిమాలు ఎందుకు చేయరని అడుగుతుంటారు. కానీ, పదేళ్లుగా అద్భుతమైన క్వాలిటీతో సినిమాలు తీస్తున్నాం. 'కల్కి 2898 ఏడీ'ని పూర్తిగా మేడ్ ఇన్ ఇండియా మూవీలా ఇక్కడి వీఎఫ్ఎక్స్ కంపెనీలతోనే చేద్దామని ప్రయత్నించాను'' అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రీస్, కామర్స్, ఐటీ డిపార్ట్‌మెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ మాట్లాడుతూ– ''కొత్తగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు యానిమేషన్, గేమింగ్ ఇండస్ట్రీ అంతగా అభివృద్ధి చెందలేదు. కానీ, ఇప్పుడీ స్థాయికి తీసుకొచ్చాం'' అన్నారు. సినిమాటిక్ కో ఫౌండర్, తెలుగు సినిమాటోగ్రఫీ అసోసియేషన్ ప్రెసిడెంట్ పీజీ విందా తదితరులు పాల్గొన్నారు.

నన్ను నేను చూసుకున్నాను

\- తరుణ్ భాస్కర్

బ్రహ్మానందం, తరుణ్ భాస్కర్, చైతన్యా రావు, రఘురామ్, రవీంద్ర విజయ్, జీవన్‌కుమార్, విష్ణు, రాగ్ మయూర్ ప్రధాన పాత్రల్లో నటించిన క్రైమ్ కామెడీ ఫిల్మ్ 'కీడా కోలా'. కె. వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్ నండూరి, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో తరుణ్ భాస్కర్ చెప్పిన విశేషాలు.



● లాక్‌డౌన్ సమయంలో కొందరు విభిన్న రకాలుగా డబ్బులు సంపాదిస్తున్నారని తెలిసి ఆసక్తిగా అనిపించింది. అలా ఆలోచిస్తున్న సమయంలో నా స్నేహితుడు ఒకడు ఏదైనా డ్రింక్‌లో పురుగు ఉన్నట్లయితే, కన్జ్యూమర్ కోర్టులో కేసు వేసి డబ్బులు వసూలు చేయవచ్చని చెప్పాడు. ఈ ప్రయత్నంలో ఏయే ఘటనలు జరుగుతాయో చర్చించుకున్నాం కూడా. ఇదంతా నాకు ఓ క్రైమ్‌లా అనిపించింది. కానీ కామెడీగా కూడా అనిపించింది. అలా 'కీడా కోలా' కథ మొదలైంది. ● నాకు క్రైమ్ కామెడీ జానర్ అంటే చాలా ఇష్టం. ఈ జానర్‌లో 'మనీ మనీ' సినిమా నా ఆల్ టైమ్ ఫేవరెట్. క్రైమ్ జానర్‌లో సినిమా చేయాలన్న నా కల ఓ రకంగా 'కీడా కోలా'తో నిజమైనట్లు అనిపించింది. ఈ సినిమాలో ప్రధానంగా ఎనిమిది పాత్రలు ఉన్నాయి. ప్రతి పాత్రకు ప్రాముఖ్యత ఉంది. అయితే ఈ ఎనిమిది పాత్రల్లో ఆడియన్స్ ఎవర్ని హీరో చేస్తారో చూడాలని నాతో పాటు ఈ చిత్రం యూనిట్ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం. ప్రేక్షకులు ఖర్చు పెట్టినదానికి వారికి వినోదం లభిస్తుందనే నమ్మకం ఉంది. ● ఫిల్మ్‌మేకర్ బాధ్యత అంటేనే నాకు కాస్త భయంగా అనిపించింది. జాతీయ అవార్డు ('పెళ్ళి చూపులు') రాగానే నాకు పెద్ద బరువుగా అనిపించింది. ఆ బరువును కాస్త పక్కన పెడదామనే 'ఈ నగరానికి ఏమైంది?' సినిమా చేశాను. కానీ ఈ సినిమా నాకు ఇంకా బరువును పెంచింది. ● నా దర్శకత్వంలోని సినిమాల్లో నేను నటించిన తొలి సినిమా 'కీడా కోలా'. గతంలో కొన్ని సినిమాల్లో నేను నటించినప్పుడు చిన్న ఇబ్బంది ఫీలయ్యానని అనిపించింది. అయితే ఈ చిత్రంలో నేను చేసిన నాయుడు పాత్రను రైటింగ్ పరంగా, యాక్టింగ్ పరంగా ఫుల్ ఫ్రీడమ్‌తో చేశాను. ఓ విధంగా చెప్పాలంటే నన్ను నేను ఈ పాత్రలో చూసుకున్నానని అనిపించింది. ఇప్పటివరకైతే నాయుడు నా ఫేవరెట్ రోల్. అలాగే మా తాతయ్యగారి స్ఫూర్తితో బ్రహ్మానందంగారి పాత్రను డిజైన్ చేశాను. ఈ పాత్రలో చాలా ఫన్ ఉంటుంది. ఇక ప్రస్తుతం వెంకటేశ్‌గారి కోసం కథ రెడీ చేస్తున్నాను. ఒక ఓటీటీ ప్రాజెక్ట్ కూడా ఉంది.

సాక్షి బిజినెస్
బుధవారం
1-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	238	63,875
నిఫ్టీ ▽	61	19,080

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,827	△	39
డోజోన్స్	32,987	△	58
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,322	▽	6
డాక్స్	14,810	△	94
షాంఘై	3,017	▽	3
నికాయ్	30,856	△	162

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	61,370
బంగారం (99.5 స్వచ్ఛత)	61,124
వెండి (కేజీ)	72,165

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.51	84.18
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.54	102.89
€	యూరో	ఎస్‌బీఐ	86.79	89.88
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.76	56.45
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.81	54.14
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.02	61.86
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.22	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.67	23.66
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.23	12.29

ఐవోసీ.. లాభాల రికార్డ్

- క్యూ2లో రూ. 12,967 కోట్లు
- షేరుకి రూ. 5 మధ్యంతర డివిడెండ్



న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) రెండో త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్‌లో నష్టాలను వీడి దాదాపు రూ. 12,967 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది. వెరసి ఒక ఏడాదికి కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా ఆర్జించిన లాభాల్లో సగానికిపైగా తాజా త్రైమాసికంలో సాధించింది. ఇక గతేడాది (2022-23) ఇదే కాలంలో రూ. 272 కోట్ల నికర నష్టం ప్రకటించింది. చమురు శుద్ధి మార్జిన్లతోపాటు మార్కెటింగ్ మార్జిన్లు మెరుగుపడటంతో లాభదాయకత పుంజుకుంది. ఈ కాలంలో ముడిచమురు ధరలు క్షీణించినప్పటికీ పెట్రోల్, డీజిల్ ధరల సవరణను నిలిపివేయడం ఇందుకు సహకరించింది. దీంతో పెట్రోలియం ప్రొడక్టుల అమ్మకాల ద్వారా రూ. 17,756 కోట్ల పన్నుకుముందు లాభం సాధించింది. గత క్యూ2లో రూ. 104 కోట్ల నిర్వహణ నష్టం నమోదైంది.

ఆదాయం డౌన్

ప్రస్తుత సమీక్షా కాలంలో ఐవోసీ ఆదాయం రూ. 2.28 లక్షల కోట్ల నుంచి రూ. 2.02 లక్షల కోట్లకు క్షీణించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 5 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. కాగా.. ఈ ఏడాది తొలి అర్ధభాగం(ఏప్రిల్-సెప్టెంబర్)లో ఐవోసీ రూ. 26,718 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది 2021-22 ఏడాదికి సాధించిన రికార్డ్ నికర లాభం రూ. 24,184 కోట్లకంటే అధికంకావడం విశేషం! తొలి ఆరు నెలల్లో ఒక్కో బ్యారల్ స్థూల చమురు శుద్ధి మార్జిన్లు(జీఆర్ఎం) 13.12 డాలర్లుగా నమోదైంది. ఈ కాలంలో ఎగుమతులతో కలిపి మొత్తం 47.65 మిలియన్ టన్నుల పెట్రోలియం ప్రొడక్టులను విక్రయించినట్లు కంపెనీ చైర్మన్ ఎస్ఎం వైద్య వెల్లడించారు. క్యూ2లో ఐవోసీ ఇంధనాల ఉత్పత్తి 16.1 ఎంటీ నుంచి 17.72 ఎంటీకి బలపడ్డాయి.

ఫలితాల నేపథ్యంలో ఐవోసీ షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం బలపడి రూ. 90 వద్ద ముగిసింది.

భారత్‌కు కొత్త మ్యాక్‌బుక్ ప్రో



న్యూఢిల్లీ: యాపిల్ కొత్త మ్యాక్‌బుక్ ప్రో ల్యాప్‌టాప్స్, ఎం3 చిప్‌సెట్‌తో కూడిన ఐమ్యాక్ ఆల్ ఇన్ వన్ డెస్క్‌టాప్స్ భారత్‌సహా ప్రపంచవ్యాప్తంగా 27 దేశాల్లో అందుబాటులోకి రానున్నాయి. యాపిల్ ఇండియా స్టోర్, యాపిల్ స్టోర్ యాప్ ద్వారా అక్టోబర్ 30 నుంచే ఆర్డర్లను తీసుకోవడం ప్రారంభం అయింది. నవంబర్ 7 నుంచి డెలివరీలు మొదలు కానున్నాయి. యాపిల్ స్టోర్లు, యాపిల్ అధీకృత రీసెల్లర్స్ వద్ద కూడా ఇవి లభ్యం అవుతాయి. మ్యాక్‌బుక్ ప్రో 14 అంగుళాల ల్యాప్‌టాప్ ధర రూ.1.69 లక్షలు, 16 అంగుళాల వేరియంట్ రూ.2.49 లక్షల నుంచి ప్రారంభం. ఐమ్యాక్ ఆల్ ఇన్ వన్ డెస్క్‌టాప్స్ 8-కోర్ గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ (జీపీయూ) వేరియంట్ ధర రూ.1.29 లక్షలు, 10-కోర్ జీపీయూ రూ.1.44 లక్షల నుంచి ప్రారంభమవుతుంది.

రిలయన్స్-ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు



ముంబై: రిటైల్ దిగ్గజం రిలయన్స్ రిటైల్, ఎస్‌బీఐ కార్డు చేతులు కలిపాయి. తాజాగా రిలయన్స్ ఎస్‌బీఐ కార్డు పేరిట కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డును ఆవిష్కరించాయి. దీనితో రిలయన్స్ రిటైల్ స్టోర్స్‌లో జరిపే కొనుగోళ్లపై రివార్డు పాయింట్లు, డిస్కౌంట్లు వంటి ప్రయోజనాలు పొందవచ్చని సంస్థ డైరెక్టర్ వి. సుబ్రమణియం తెలిపారు. అటు ఎస్‌బీఐ కార్డు అందించే ప్రత్యేక ఆఫర్లను కూడా అందుకోవచ్చు. వినియోగాన్ని బట్టి రెన్యువల్ ఫీజు నుంచి మినహాయింపు, రిలయన్స్ రిటైల్ వోచర్లు మొదలైనవి ఈ ప్రయోజనాల్లో ఉంటాయి. ఈ కార్డు రెండు వేరియంట్లలో (రిలయన్స్ ఎస్‌బీఐ కార్డు, రిలయన్స్ ఎస్‌బీఐ కార్డ్ ప్రైమ్) లభిస్తుంది. వార్షిక రెన్యువల్ ఫీజు విషయానికొస్తే ప్రైమ్ కార్డుకి రూ. 2,999 గాను, రిలయన్స్ ఎస్‌బీఐ కార్డుకి రూ. 499 (పన్నులు అదనం) వర్తిస్తాయి. ప్రైమ్ కార్డుపై ఏటా రూ. 3,00,000 పైగా, రిలయన్స్ ఎస్‌బీఐ కార్డుపై రూ. 1,00,000 పైగా ఖర్చు చేస్తే రెన్యువల్ ఫీజు నుంచి మినహాయింపు లభిస్తుంది.

ఎయిర్‌టెల్ లాభం డౌన్



క్యూ2లో రూ. 1,341 కోట్లు

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జూలై-సెప్టెంబర్‌లో కన్సాలిడేటెడ్ నికర లాభం 38 శాతం క్షీణించి రూ. 1,341 కోట్లకు పరిమితమైంది. అయితే రూ. 1,619 కోట్ల అసాధారణ నష్టాన్ని మినహాయిస్తే రూ. 2,960 కోట్ల లాభం నమోదైంది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 2,145 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 7 శాతంపైగా పుంజుకుని రూ. 37,044 కోట్లను తాకింది. దేశీ కార్యకలాపాల్లో వృద్ధి ఇందుకు సహకరించింది. దేశీ బిజినెస్ 11 శాతం ఎగసి రూ. 26,995 కోట్ల టర్నోవర్ సాధించింది. ఈ కాలంలో కొత్తగా 7.7 మిలియన్ల 4జీ/5జీ వినియోగదారులు జత కలవగా.. ఒక్కో వినియోగదారుపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) రూ. 190 నుంచి రూ. 203కు మెరుగుపడింది. ఒక్కో కస్టమర్ సగటు డేటా వినియోగం 20 శాతం ఎగసి నెలకు 21.7 జీబీగా నమోదైంది. పోస్ట్‌పెయిడ్ విభాగంలో మిలియన్ కస్టమర్లను జత చేసుకుంది. దీంతో మొత్తం సబ్‌స్క్రయిబర్ల సంఖ్య 214.6 మిలియన్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు 1.3 శాతం నీరసించి రూ. 914 వద్ద ముగిసింది.

ఎల్అండ్‌టీ లాభం జూమ్



రూ. 3,223 కోట్లు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్అండ్‌టీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్‌లో కన్సాలిడేటెడ్ నికర లాభం 45 శాతం జంప్‌చేసి రూ. 3,223 కోట్లకు చేరింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 2,229 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 43,501 కోట్ల నుంచి రూ. 52,157 కోట్లకు ఎగసింది. కాగా.. ఈ ఏడాది తొలి ఆరు నెలల(ఏప్రిల్-సెప్టెంబర్) కాలంలో మొత్తం రూ. 1,54,672 కోట్ల విలువైన కాంట్రాక్టులు పొందినట్లు కంపెనీ సీఎఫ్‌వో ఆర్.శంకర్ రామన్ వెల్లడించారు. ఇది 65 శాతం వృద్ధికాగా.. దీనిలో 56 శాతం అధికంగా రూ. 87,333 కోట్ల విలువైన అంతర్జాతీయ ఆర్డర్లు లభించినట్లు తెలియజేశారు. భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో సమీప కాలానికి అప్రమత్తంగా వ్యవహరించనున్నట్లు కంపెనీ చైర్మన్, ఎండీ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ పేర్కొన్నారు. ఫేబ్‌లెస్ సెమీకండక్టర్ చిప్ డిజైన్, ప్రొడక్ట్ ఓనర్‌షిప్‌నకు వీలుగా పూర్తి అనుబంధ కంపెనీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు రూ. 830 కోట్లు వెచ్చిస్తామని చెప్పారు.

ఫలితాల నేపథ్యంలో ఎల్అండ్‌టీ షేరు నామమాత్ర నష్టంతో రూ. 2,923 వద్ద ముగిసింది.

లాభాల్లోంచి నష్టాల్లోకి...

- సెన్సెక్స్ 238 పాయింట్లు డౌన్



ముంబై: ఆరంభ లాభాలను కోల్పోయిన స్టాక్ సూచీలు మంగళవారం నష్టాలతో ముగిశాయి. ఫెడ్ రిజర్వ్ పాలసీ కమిటీ సమావేశానికి ముందు ట్రేడర్లు అప్రమత్తత వహించారు. మిశ్రమ కార్పొరేట్ కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మెప్పించకలేపోయాయి. బ్యాంకింగ్, ఇంధన, ఆటో, మెటల్, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా సెన్సెక్స్ 238 పాయింట్లు కోల్పోయి 63,875 వద్ద నిలిచింది. నిఫ్టీ 61 పాయింట్లు పతనమై 19,080 వద్ద స్థిరపడింది. దీంతో రెండు రోజుల లాభాల తర్వాత సూచీలకు మళ్లీ నష్టాలు వాటిల్లాయి. కమోడిటీ, వినిమయ, కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫెడ్ రిజర్వ్ పాలసీ ప్రకటన(బుధవారం రాత్రి), కీలక స్థూల ఆర్థిక డేటా వెల్లడికి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

భారత్ డిమాండ్.. 'బంగారం'

- సెప్టెంబర్ త్రైమాసికంలో 10% అప్
- 210.2 టన్నులుగా నమోదు
- ధన్‌తేరాస్ కొనుగోళ్లపై భరోసా

న్యూఢిల్లీ: భారత్ పసిడి డిమాండ్ 2023 క్యాలెండర్ ఇయర్ మూడవ త్రైమాసికంలో (జూలై-సెప్టెంబర్) గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 10% పెరిగి 191.7 టన్నుల నుంచి 210.2 టన్నులకు ఎగసింది. పసిడి కొనుగోళ్లకు పవిత్రమైనదిగా భావించే ధన్‌తేరాస్ కొనుగోళ్లు భారీగా జరుగుతాయన్న విశ్వాసాన్ని పరిశ్రమ వ్యక్తం చేస్తోంది. ధరలు కొంత తగ్గడం, పండుగల డిమాండ్ దీనికి కారణం. చైనా తర్వాత పసిడి కొనుగోళ్లకు రెండో అతిపెద్ద దేశంగా ఉన్న భారత్ సెప్టెంబర్ త్రైమాసికం డిమాండ్‌పై ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) విడుదల చేసిన నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు..

- వాణిజ్య వర్గాల అభిప్రాయం ప్రకారం, 10 గ్రాముల ధర రూ.60,000 వరకూ కొంత ఆమోదయోగ్యమైనదిగా వినియోగదారులు భావిస్తున్నారు. అంతకన్నా తక్కువ ధరలో పసిడి భారీ కొనుగోళ్లు జరగొచ్చని అంచనా.
- సెప్టెంబర్ త్రైమాసికంలో ఆభరణాల డిమాండ్ 7 శాతం పెరిగి 146.2 టన్నుల నుంచి 155.7 టన్నులకు చేరింది. ఇదే కాలంలో కడ్డీలు, నాణేల డిమాండ్ 20 శాతం ఎగసి 45.4 టన్నుల నుంచి 54.5 టన్నులకు ఎగసింది. కడ్డీలు, నాణేల విభాగంలో డిమాండ్ 2015 గరిష్ట స్థాయిని చూసింది.
- మూడవ త్రైమాసికంలో పసిడి దిగుమతులు గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 184.5 టన్నుల నుంచి 220 టన్నులకు ఎగసింది.



తొమ్మిది నెలల్లో 481.2 టన్నుల డిమాండ్..

2023 మొదటి 9 నెలల్లో బంగారం డిమాండ్ 481.2 టన్నులు. సంవత్సరం మొత్తంలో డిమాండ్ 700-750 టన్నులు ఉంటుందని అంచనా. 2022 డిమాండ్ 774 టన్నులతో పోల్చితే తగ్గడం గమనార్హం. అయితే దిగుమతులు మాత్రం పెరుగుతాయని అంచనా. 2022లో యల్లో మెటల్ దిగుమతులు 650.7 టన్నులు కాగా, 2023 సెప్టెంబర్ వరకూ జరిగిన దిగుమతుల విలువ 563 టన్నులు.

అంతర్జాతీయంగా డిమాండ్ 6 శాతం డౌన్

ఇదిలాఉండగా, అంతర్జాతీయంగా మూడవ త్రైమాసికంలో పసిడి డిమాండ్ 6 శాతం పడిపోయి 1,147.5 టన్నులకు చేరింది. సెంట్రల్ బ్యాంకుల నుంచి తగ్గిన కొనుగోళ్లు, కడ్డీలు, నాణేల డిమాండ్ తగ్గడం దీనికి కారణమని డబ్ల్యూజీసీ తన నివేదికలో పేర్కొంది. చైనా డిమాండ్ మూడవ త్రైమాసికంలో 242.7 టన్నుల నుంచి స్వల్పంగా 247 టన్నులకు ఎగసింది.

జీఆర్‌టీ జ్యువెలర్స్ స్వర్ణ దీపావళి ఆఫర్లు



హైదరాబాద్: దీపావళి పండుగ సందర్భంగా జీఆర్‌టీ జ్యువెలర్స్ అద్భుతమైన ఆఫర్లు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో 'స్వర్ణ దీపావళి', తమిళనాడులో 'తంగ దీపావళి' పేరుతో ఆఫర్లు అందుబాటులోకి తెచ్చింది. కస్టమర్లు కొనుగోలు చేసిన బంగారం బరువుకు అంతే సమానమైన వెండిని ఉచితంగా పొందవచ్చు. వజ్రాల కొనుగోలుపై క్యారెట్‌కు 25 గ్రాముల వెండి ఉచితం. వెండి వస్తువుల తరుగుపై 25%, వెండి ఆభరణాల గరిష్ఠ విక్రయ ధర(ఎంఆర్‌పీ)పై 10% తగ్గింపు ఇస్తుంది. ప్రత్యేక ఆఫర్లతో దీపావళికి మరింత శోభ చేకూరుస్తున్నందుకు సంతోషిస్తున్నామని సంస్థ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు.

నాలుగు నెలల కనిష్టానికి మౌలిక రంగం

సెప్టెంబర్‌లో వృద్ధి 8.1%



న్యూఢిల్లీ: ఎనిమిది పరిశ్రమల మౌలిక రంగం గ్రూప్ సెప్టెంబర్‌లో 8.1% వృద్ధి రేటును నమోదు చేసుకుంది. అంతక్రితం 4 నెలల్లో ఇంత తక్కువ స్థాయి ఇదే తొలిసారి. ఈ ఎనిమిది రంగాల్లో క్రూడ్ ఆయిల్ మైనస్ 0.4%లో ఉండగా, బొగ్గు (16.1%), సహజ వాయువు (6.5%), స్టీల్ (9.6%) పురోగతి సాధించాయి. రిఫైనరీ ప్రొడక్టులు (5.5%), ఎరువులు (4.2%), సిమెంట్ (4.7%), విద్యుత్ (9.3%) రంగాలు కూడా వృద్ధి బాటన పయనించాయి. ఇక ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకూ ఈ గ్రూప్ వృద్ధి రేటు 7.8%. గత ఏడాది ఇదే కాలంలో ఈ రేటు 9.8%. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి (ఐఐపీ) సూచీలో ఈ 8 రంగాల వెయిటేజ్ 40.27%.

ఎగ్జిట్ పోల్స్‌పై ఈసీ నిషేధం

- నవంబర్ 7 నుంచి 30వ తేదీ వరకు అమలు
- ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 7వ తేదీ ఉదయం 7 గంటల నుంచి నవంబర్ 30న సాయంత్రం 6.30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం విధించింది. చివరగా నవంబర్ 30న సాయంత్రం 6.30 గంటల వరకు తెలంగాణ సహా అయిదు రాష్ట్రాల్లో అన్ని దశల ఎన్నికలు ముగిసేలోగా ఎగ్జిట్ పోల్స్ ప్రకటించినా, ప్రచురించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఎగ్జిట్ పోల్స్‌ను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ప్రచురణ, ప్రసారం చేయకూడదని స్పష్టం చేసింది. గెజిట్ నోటిఫికేషన్ ద్వారా తమ ఆదేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయా రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారులకు సూచించింది. అలాగే మీడియా రంగాలకు సైతం తెలియజేయాలని తెలిపింది. నాగాలాండ్‌లో జరుగనున్న ఒక ఉపఎన్నిక నేపథ్యంలో అక్కడ కూడా ఇవే ఉత్తర్వులు అమలవుతాయని కూడా ఈసీ పేర్కొంది. ఉత్తర్వులను ఎవరు ఉల్లంఘించినా ఎలక్టోరల్ చట్టం ప్రకారం రెండేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా లేదా రెండూ ఉంటాయని హెచ్చరించింది.

దోపిడీ సొత్తు పంపకాలపై 'జై, వీరు' మధ్య పోరు

దిగ్విజయ్ సింగ్, కమల్‌నాథ్‌లపై సీఎం చౌహాన్ వ్యంగ్యాస్త్రాలు

భోపాల్: మధ్యప్రదేశ్ కాంగ్రెస్ సీనియర్ నేతలు దిగ్విజయ్ సింగ్, కమల్‌నాథ్‌ల మధ్య విభేదాలు లేవని, వారు షోలే సినిమాలో జై, వీరు లాంటి వారంటూ ఆ పార్టీ నేత రణదీప్ సూర్జేవాల్ చేసిన వ్యాఖ్యలపై సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇద్దరు నేతలు ఢిల్లీకి వెళ్లారన్న వార్తాలపై ఆయన స్పందిస్తూ...'వీరిద్దరూ గతంలో సీఎంలుగా పనిచేసిన సమయంలో రాష్ట్రాన్ని దోపిడీకి అడ్డాగా మార్చేశారు. ఆ సొత్తును ఎలా పంచుకోవాలి? అధికారంలోకి వస్తే ఎవరి వాటా ఎంతెంత? అనే విషయంలో భేదాభిప్రాయాలు రావడం వల్లే కాంగ్రెస్ హై కమాండ్ వారికి కబురు పంపించింది. ఇందులో ఢిల్లీ పెద్దలకు కూడా ప్రమేయం ఉంది'అని అన్నారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు గాను టికెట్ల పంపిణీపై కాంగ్రెస్‌లో కీలకంగా ఉన్న దిగ్విజయ్, కమల్‌నాథ్‌ల మధ్య విభేదాలు పొడసూపాయన్న వార్తలు ఇటీవల చక్కర్లు కొట్టాయి.



కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పెంపుడు శునకమిది. మంగళవారం ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వద్ద రాహుల్‌కు ముందు వెళుతోందిలా

మధ్యప్రదేశ్ అసెంబ్లీ బరిలో 3,832 మంది

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీలోని 230 సీట్లకు గాను నవంబర్ 17వ తేదీన జరగనున్న ఎన్నికల బరిలో మొత్తం 3,832 మంది బరిలో నిలిచారని అధికారులు తెలిపారు. అక్టోబర్ 21న మొదలైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ సోమవారంతో ముగిసిందని చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో) అనుపమ్ రాజన్ తెలిపారు. ఆఖరు రోజున 2,489 మంది అభ్యర్థులు 2,811 సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారని చెప్పారు. నామినేషన్ల ఉప సంహరణకు నవంబర్ 2వ తేదీ వరకు గడువుందన్నారు.

టోంక్ స్థానానికి సచిన్ పైలట్ నామినేషన్



జైపూర్: రాజస్తాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ మంగళవారం టోంక్ అసెంబ్లీ స్థానానికి నామినేషన్ వేశారు. ముందుగా భూతేశ్వర్ ఆలయంలో పూజలు చేసిన పైలట్ బడా కువాన్ నుంచి టోంక్ నగరం లోని పటేల్ చౌక్‌కు ర్యాలీగా తరలి వెళ్లారు. నామినేషన్ల దాఖలుకు ఈనెల 6 ఆఖరు తేదీ కాగా, టోంక్‌లో బీజేపీ తన అభ్యర్థిని ఖరారు చేయలేదు. 2018 ఎన్నికల్లో టోంక్‌లో సచిన్ పైలట్ బీజేపీకి చెందిన యూనుస్ ఖాన్‌పై 54 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. రాజస్తాన్ అసెంబ్లీకి నవంబర్ 25న ఓటింగ్ జరగనున్న విషయం తెలిసిందే.

పంచతంత్రం

మిజోరంలో వారి చుట్టూ రాజకీయం

- ఎన్నికల ప్రచారానికీ కేంద్ర బిందువు
- తమకే లాభిస్తుందంటున్న మిజో నేషనల్ ఫ్రంట్
- బెడిసికొడుతుందంటున్న విపక్షాలు

ఓటు లేదు గానీ.. శరణార్థులే కీలకం



అది మిజోరాం రాజధాని ఐజ్వాల్‌కు దాదాపు 25 కిలోమీటర్ల దూరంలోని పునరావాస ప్రాంతం. ఒక 52 ఏళ్ల మహిళ. పేరు థాంగ్‌తెయ్. చెక్క పాత్రలో బియ్యం కడుగుతోంది. మరోవైపు పిల్లల అల్లరిని అదుపు చేయలేక ఆపసోపాలు పడుతోంది. వెనకాలే ఉన్న వెదురు గుడిసె ఐదు నెలలుగా వారి ఆవాసం. రాష్ట్రంలో హోరెత్తుతున్న ఎన్నికల ప్రచారంతో గానీ, నవంబర్ 7న జరగబోయే పోలింగ్‌తో గానీ తనకు నిమిత్తమే లేదన్నట్టుగా పనిలో మునిగిపోయిందామె. ఏ రోజుకారోజు తిండీ, నీరూ దొరికితే అంతే చాలనుకుంటోంది. అది వాస్తవం. ఎందుకంటే ఆమెకు ఓటు లేదు. ఆమెకే కాదు, అలాంటి తాత్కాలిక వెదురు గుడిసెల్లో కాలం వెళ్లదీస్తున్న కనీసం 35 వేల పైచిలుకు మందికి ఓటు లేదు. ఎందుకంటే వారంతా మయన్మార్‌లో సైనిక కుట్ర అనంతరం చెలరేగిన హింస బారి నుంచి ప్రాణాలతో తప్పించుకుని ఇల్లూ వాకిలీ విడిచి పొట్ట చేత పట్టుకుని భారత్‌కు వచ్చిన శరణార్థులు. వీళ్లే కాదు, మణిపూర్ హింసాకాండకు జడిసి వలస వచ్చిన వేలాది మంది కుకీ గిరిజనులు దాదాపు అలాంటి పరిస్థితుల్లోనే మిజోరంలో పలుచోట్ల కాలం వెళ్లదీస్తున్నారు. వీళ్లెవరికీ ఓటు లేదు.

కానీ... ఓటు హక్కు కూడా లేని ఈ శరణార్థులే ఈసారి మిజోరంలో అతి పెద్ద ఎన్నికల అంశంగా మారిపోయారు! ఒకరకంగా ఫలితాలను నిర్దేశించే స్థాయిలో ఉన్నారు...!!

ఈశాన్య రాష్ట్రం మిజోరంలో పోలింగ్‌కు వారం రోజులే ఉంది. అధికార మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్)తో పాటు విపక్ష కాంగ్రెస్, జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎస్) మొత్తం 40 స్థానాలకూ పోటీ చేస్తున్నాయి. బీజేపీ కూడా 23 సీట్లలో బరిలో దిగింది. ఇప్పుడు పార్టీల దృష్టి శరణార్థుల సమస్యపైనే కేంద్రీకృతమైంది. విడిగా ఏ పార్టీ ఏం చెబుతున్నా అదే వాటన్నింటికీ, ముఖ్యంగా బీజేపీ మినహా మిగతా మూడు ప్రధాన పార్టీలకూ ప్రధానాంశంగా మారిపోయిందన్నది వాస్తవం. అందుకే ఈ విషయంలో అధికార ఎంఎన్ఎఫ్ ముందుగానే రంగంలోకి దిగింది. శరణార్థులను అక్కున చేర్చుకోవడమే గాక వారికి వీలైనన్ని సదుపాయాలు కల్పిస్తూ మిజోల మది దోచుకునే ప్రయత్నంలో పడింది. మిజో జాతీయవాదానికి పరిరక్షకులం తాము మాత్రమేనని ఎంఎన్ఎఫ్ చీఫ్, సీఎం జోరాం తంగా బాహాటంగా ప్రకటించారు. ఇది ఎన్నికల్లో తమకు ఎంతగానో కలిసొస్తుందని కూడా మీడియా సాక్షిగా చెప్పుకున్నారాయన!

జోరాం తంగా ఓట్ల రాజకీయం

- మయన్మార్ నుంచి వచ్చిన శరణార్థులంతా ప్రధానంగా చిన్ గిరిజన తెగకు చెందినవారు.
- వారితోనూ, మణిపూర్‌లోని కుకీ తెగతోనూ మిజోలకు అనాది కాలం నుంచీ అతి సన్నిహితమైన సాంస్కృతిక, సామాజిక, తెగలపరమైన బంధాలున్నాయి.
- అందుకే కేంద్రం నిర్దేశాలను పక్కన పెట్టి చిన్ శరణార్థులకు జోరాం సర్కారు ఆశ్రయమిచ్చింది. వారిని వెనక్కు పంపాలన్న ఆదేశాలను తోసిరాజంది.
- కనీసం చిన్ తెగ వారి వేలిముద్రలు తదితరాలు సేకరించాలన్న కేంద్రం ఆదేశాలనులెక్కచేయలేదు.
- అంతేకాదు, ప్రధాని నరేంద్ర మోదీ గనక మిజోరంలో ఎన్నికల ప్రచారానికి వస్తే ఆయనతో కలిసి వేదిక పంచుకునే సమస్యే లేదని సీఎం తంగా ఏకంగా బీబీసీ ఇంటర్వ్యూలోనే కుండబద్దలు కొట్టారు.
- తద్వారా, తోటి గిరిజన సమూహం కోసం కేంద్రాన్నే ఎదిరించిన ఇమేజీతో మిజో ఓటర్ల మనసు దోచే ప్రయత్నాల్లో పడ్డారు.
- అయితే కేంద్రంలోని అధికార ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉండటం ఎంఎన్ఎఫ్‌కు పెద్ద అవరోధంగా మారింది. దీన్ని కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం చేస్తోంది.
- దీనికి విరుగుడుగా బీజేపీపై తంగా ఒంటికాలిపై లేస్తున్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకోకుండా జాగ్రత్త పడ్డారు.
- మణిపూర్‌లో బీజేపీయే అధికారంలో ఉందన్న విషయాన్ని తంగా పదేపదే తన ప్రచారంలో ప్రస్తావిస్తున్నారు.
- అక్కడ కుకీ, మెయితీ తెగల ఘర్షణను ఉద్దేశపూర్వకంగానే ఉపేక్షించి కుకీలకు అన్యాయం చేసిందని ఆరోపిస్తున్నారు.

విపక్షాలదీ అదే బాట...

- శరణార్థుల విషయంలో ఎంఎన్ఎఫ్‌కు మైలేజీ రాకుండా చూసేందుకు కాంగ్రెస్, జెడ్‌పీఎం యథాశక్తి ప్రయత్నాల్లో పడ్డాయి..
- కేంద్రంలోనూ, మణిపూర్‌లోనూ బీజేపీయే అధికారంలో ఉన్నా కుకీల ప్రయోజనాలను తుంగలో తొక్కుతున్న ఆ పార్టీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిలో ఎంఎన్ఎఫ్ భాగస్వామిగా కొనసాగుతుండటాన్ని ఓటర్లు అసహ్యించుకుంటున్నారని అవి అంటున్నాయి.
- తమ రాష్ట్రంలో ఆశ్రయం పొందిన చిన్, కుకీ తెగలవాళ్లంతా సోదర సమానులని జెడ్‌పీఎం అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి లుదుహోమా చెబుతున్నారు.
- ఎవరేం చెప్పినా చిన్, కుకీ తెగలకు ఆశ్రయమిచ్చిన తీరు ఎంఎన్ఎఫ్‌కు ఎంతో కొంత లాభించేలానే కన్పిస్తోందన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.
- అయితే శరణార్థులను తంగా సర్కారు మరీ నెత్తిన పెట్టుకుంటోందన్న అసంతృప్తి స్థానికుల్లో క్రమంగా ప్రబలుతోంది. ఇది దానికి కాస్త చేటు చేసే ఆస్కారమూ లేదన్న అభిప్రాయముంది.

ఆపన్నులే ఆసరా...

తంగా సర్కారు ఏం చెబుతున్నా చిన్ శరణార్థుల పరిస్థితి అంత మెరుగ్గా ఏమీ లేదు. వారి ఆవాసాల్లో కరెంటు, తాగునీరు వంటి సదుపాయాలేవీ లేవు. స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు, చర్చి సంస్థలు అందించే బియ్యం తదితరాలతోనే నెట్టుకొస్తున్నారు. మగవాళ్లంతా పొలాల్లో పనులకు వెళ్తూ రోజుకు రూ.500 కళ్లజూస్తున్నారు. కానీ వారానికి రెండు రోజులకు మించి పని దొరక్క అవస్థ పడుతున్నారు. మయన్మార్‌లో ఏమాత్రం శాంతియుత వాతావరణం నెలకొన్నా తిరిగి వెళ్లిపోతామని చెబుతున్నారు. మణిపూర్ శరణార్థుల ఆవాసాల్లో జోరాం సర్కారు కరెంటు, తాగునీటి వంటి సదుపాయాలు కల్పించింది.

సంఖ్యల్లో శరణార్థులు..	
చిన్ తెగకు చెందిన వారు (మయన్మార్)	33,500 మంది
కుకీ తెగకు చెందిన వారు (మణిపూర్)	13,500 మంది
మిజోరంలో ఎప్పట్నుంచి ఉంటున్నారు	
చిన్ తెగవారు	ఏడాది పైగా
కుకీలు	ఆర్నెల్లుగా

జగనన్న ఆరోగ్య సురక్ష



జగనన్న ఆరోగ్య సురక్ష

23 వ రోజు

నిర్వహించిన మొత్తం శిబిరాలు
12,929

నమోదైన ఓపీలు
56,94,661

నిర్వహించిన వైద్య పరీక్షలు
6,38,72,792

మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రెఫర్ చేసినవారి సంఖ్య
82,823



విశాఖపట్నం బాలాజీనగర్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం వరిధనం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డి ఉమామహేశ్వరరావు



పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం గరికపాడులో నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



కృష్ణాజిల్లా తేలప్రోలులో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడలో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు



తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు



విజయనగరం జిల్లా కొత్తవలస మండలం రాజుపాత్రునిపాలెంలో వైద్య సేవలు పొందుతున్న ప్రజలు



నంద్యాల జిల్లా పేరాయిపల్లెలోని వైద్య శిబిరంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వంగల్లులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో వైద్యసేవలు పొందుతున్న ప్రజలు



అనంతపురం నగరంలోని శ్రీనివాసనగర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం పొల్లాడలో వ్యక్తి నుంచి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న వైద్యుడు

క్లుప్తంగా...

ఆరోగ్య ఆంధ్రప్రదేశే ప్రభుత్వ లక్ష్యం

వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

మంగళగిరి: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ఇంటింటికీ వైద్యాన్ని అందిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పలు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను కృష్ణబాబు కలెక్టర్ వేణుగోపాలరెడ్డితో కలసి మంగళవారం పరిశీలించారు. కృష్ణబాబు మాట్లాడుతూ..పేదవాడు అనారోగ్యంతో బాధపడకూడదనే లక్ష్యంతో జగనన్న వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జే. నివాస్ మాట్లాడుతూ.. అన్ని మండల కేంద్రాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ వైఎ స్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో హరేందిరప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణ్‌బాబు పాల్గొన్నారు.

రైలు ప్రమాద బాధితులను పరామర్శించిన భువనేశ్వరి



క్షతగాత్రులను పరామర్శిస్తున్న భువనేశ్వరి

విజయనగరం ఫోర్ట్: విజయనగరం జిల్లాలోని కంటాకపల్లి–అలమండ మధ్య జరిగిన రైలు ప్రమాదంలో గాయపడి విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను నారా భువనేశ్వరి మంగళవారం పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ క్షతగాత్రులను పరామర్శించేందుకు వచ్చానని చెప్పారు. చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ రావడంపై స్పందిస్తూ.. బాబు గురించి పోరాటం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ నాయకులు అశోక్‌గజపతిరాజు, ప్రతిభాభారతి, కోళ్ల లలితకుమారి, కళావెంకటరావు పాల్గొన్నారు.

గిరిజనుల రక్షణలో ప్రభుత్వ చర్యలు భేష్

వడిత్యా శంకర్ నాయక్

సాక్షి, అమరావతి: గిరిజనుల సంక్షేమంతోపాటు వారి రక్షణ విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డిని మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిజనుల సంక్షేమం, రక్షణ వంటి అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. గిరిజనుల శాంతిభద్రతల సమస్యలపై పోలీసులు తక్షణం స్పందిస్తున్నారని చెప్పారు. గిరిజనులపై దాడులు జరిగిన సమయంలో బాధితులకు అండగా నిలిచి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా అన్ని జిల్లాల ఎస్పీలకు ఆదేశాలు ఇవ్వాలని డీజీపీని శంకర్‌నాయక్ కోరారు.

7 జిల్లాల్లో 103 కరువు మండలాలు

వీటిలో 80 మండలాల్లో తీవ్ర కరువు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో 103 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం జాబితా విడుదల చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో 2, చిత్తూరు జిల్లాలో 4, నంద్యాల జిల్లాలో 6, అన్నమయ్య జిల్లాలో 18, శ్రీసత్యసాయి జిల్లాలో 21, కర్నూలు జిల్లాలో 24, అనంతపురంలో జిల్లాలో 28 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వీటిలో 80 మండలాలు తీవ్ర కరువు మండలాలుకాగా, 23 మండలాల్లో సాధారణ కరువు ఉన్నట్లు తెలిపింది.

దీర్ఘకాలిక జబ్బులకు 'సురక్ష'తో భరోసా

జగనన్న ఆరోగ్య సురక్ష స్క్రీనింగ్‌లో బయటపడిన బీపీ, షుగర్, క్షయ కేసులు

- కొత్తగా 2.25 లక్షల బీపీ కేసులు, 1.40 లక్షల షుగర్ కేసులు నిర్ధారణ
- క్షయ అనుమానిత లక్షణాలున్న 1.78 లక్షల మందికి పరీక్షలు
- 417 మందిలో క్షయ వ్యాధి నిర్ధారణ
- వీరికి స్పెషలిస్ట్ డాక్టర్లతో ఉచిత వైద్యం.. ఫ్యామిలీ డాక్టర్‌తో నిరంతర పర్యవేక్షణ



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. వైద్య శాఖ ఇంటింటినీ జల్లెడ పట్టి ప్రజలందరినీ స్క్రీనింగ్ చేయడమే కాకుండా.. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య సేవలందిస్తోంది. ఈ క్రమంలో కొత్తగా మధుమేహం(షుగర్), రక్తపోటు(బీపీ), క్షయ జబ్బులతో బాధపడుతున్నవారిని గుర్తించింది. వీరందరికీ మెరుగైన వైద్యం అందించడంతో పాటు నిరంతరం వైద్య పర్యవేక్షణ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

1.84 కోట్ల మందిలో షుగర్ లక్షణాలు..

గత నెలలో ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా 4.63 కోట్ల మందిని స్క్రీనింగ్ చేశారు. 2.16 కోట్ల మందిలో బీపీ, 1.84 కోట్ల మందిలో షుగర్ జబ్బు లక్షణాలను గుర్తించారు. గతంలో నిర్వహించిన నాన్–కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) సర్వేలో నిర్ధారించిన పాత బీపీ, షుగర్ బాధితులు కాకుండా కొత్తగా 2,25,451 మంది బీపీ, 1,40,218 మంది షుగర్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. బీపీ కేసులు అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 12,790, నెల్లూరులో 12,583, విజయనగరంలో 12,124 వెలుగులోకి వచ్చాయి. అలాగే పశ్చిమ గోదావరి జిల్లాలో 9,279, నెల్లూరులో 8,275, విజయనగరంలో 7,363 షుగర్ కేసులను గుర్తించారు. మరోవైపు క్షయ అనుమానిత లక్షణాలున్న 1,78,515 మంది నుంచి నిర్ధారణ పరీక్ష కోసం నమూనాలు సేకరించగా.. 417 మందిలో వ్యాధి నిర్ధారణ అయ్యింది. అలాగే కుష్ఠు వ్యాధి లక్షణాలున్న 9,925 మందిని గుర్తించగా.. వ్యాధి నిర్ధారణ ప్రక్రియ కొనసాగుతోంది. దాదాపు 8 లక్షల మందిలో కంటి సమస్యలున్నట్టు గుర్తించిన వైద్యులు.. సాధారణ మందులతో తగ్గే సమస్యలున్న 2.44 లక్షల మందికి మందులు అందజేశారు. 4.86 లక్షల మందిని కళ్లద్దాలకు, 69,676 మందిని కేటరాక్ట్ సర్జరీలకు రిఫర్ చేశారు. వీరిలో 833 మందికి ప్రభుత్వం ఇప్పటికే ఉచితంగా సర్జరీలు నిర్వహించింది. కొత్తగా బయటపడిన బీపీ, షుగర్, క్షయ తదితర జబ్బులున్న వారికి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం అందించడంతో పాటు.. ఉచితంగా మందులిస్తున్నారు.

ప్రారంభదశలోనే గుర్తిస్తే ఎంతో మేలు..

చిన్న ఆరోగ్య సమస్యే కదా అని మొదట్లో నిర్లక్ష్యం చేస్తే అది ముదిరి తీవ్ర అనారోగ్యానికి దారి తీసే ప్రమాదం ఉంది. చాలా మందికి బీపీ, షుగర్ సమస్య ఉన్నట్టు కూడా తెలియదు. ఇలా అధిక రక్తపోటును నిర్లక్ష్యం చేయడమే.. 20 శాతం పెరాలసిస్ కేసులకు ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. షుగర్ సమస్యను కూడా ఇలాగే నిర్లక్ష్యం చేస్తే.. కిడ్నీ, గుండె, ఇతర సంబంధిత సమస్యల బారిన పడే ప్రమాదముంది. దేశంలో బీపీ, షుగర్, ఇతర నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ కారణంగా 64.9 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి.. ప్రతి ఇంటిని జల్లెడ పట్టి వ్యాధి ప్రారంభ దశలోనే గుర్తించి వైద్యం అందించడం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేస్తోందని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఫ్యామిలీ డాక్టర్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ



జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా గుర్తించిన మధుమేహం, రక్తపోటు, క్షయ, ఇతర సమస్యలన్నింటినీ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి అనుసంధానం చేశాం. కొత్తగా గుర్తించిన మధుమేహం కేసుల్లో సంబంధిత వ్యక్తులకు హెచ్1బీ ఏసీ టెస్టులు నిర్వహిస్తాం. సంబంధిత వ్యక్తుల ఆరోగ్యాలను ఫ్యామిలీ డాక్టర్‌తో పాటు వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలతో పాటు మందులు అందిస్తుంటారు. ఆస్పత్రిలో వైద్యం అవసరమైతే తగిన సహకారం అందిస్తారు. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానంలో 6 లక్షల మందికిపైగా బీపీ బాధితులకు, 4.10 లక్షల మందికిపైగా మధుమేహం బాధితులకు నిరంతర వైద్య సేవలందిస్తున్నాం.

–జె.నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్

ప్రజారోగ్యంలో మంచి ఫలితాలు



గ్రామాల్లో వ్యవసాయం, ఇతర కూలిపనులు చేసుకుంటూ జీవించే పేదలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. ఈ క్రమంలో ప్రభుత్వమే వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి.. ప్రతి ఒక్కరినీ స్క్రీనింగ్ చేసి వైద్య సేవలందించడం శుభపరిణామం. ఇలా చేయడం ద్వారా బీపీ, షుగర్, ఇతర జబ్బులను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్యం అందించవచ్చు. తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తకుండా నియంత్రించవచ్చు. ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వల్ల ప్రజారోగ్య రంగంలో మంచి ఫలితాలు వస్తున్నాయి.

– డాక్టర్ బాబ్జీ, సీనియర్ వైద్యుడు, వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ

నేడు 'వైఎస్సార్' అవార్డుల ప్రదానోత్సవం

- 7 రంగాల్లో విశిష్ట సేవలందించిన 27 మంది వ్యక్తులు, సంస్థలకు పురస్కారాలు
- 23 వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, 4 వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులు
- ముఖ్య అతిథిగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, విశిష్ట అతిథిగా సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ జీవిత సాఫల్య, వైఎస్సార్ సాఫల్య పురస్కారాలను వరుసగా మూడో ఏడాది ప్రదానం చేస్తోంది. ఏడు విభాగాల్లో ఈ అవార్డులు అందజేస్తోంది. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు జరిగే అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, విశిష్ట అతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. 2023 సంవత్సరానికిగాను వివిధ రంగాల్లో సామాజిక అభ్యున్నతి కోసం అసామాన్య కృషి చేసిన, విశిష్ట సేవలు అందించిన 27 మంది వ్యక్తులు, సంస్థలను అవార్డులతో సత్కరించనున్నారు. వ్యవసాయం, కళలు–సంస్కృతి, తెలుగుభాష–సాహిత్యం, క్రీడలు, వైద్యం, మీడియా, సమాజసేవ విభాగాల్లో 23 వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, 4 వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులను ప్రదానం చేయనున్నారు. వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతలకు రూ.10 లక్షల నగదు పురస్కారంతోపాటు మెమొంటో, మెడల్, ప్రశంసాపత్రం అందజేస్తారు. వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతలకు రూ.5 లక్షల నగదు పురస్కారంతోపాటు మెమొంటో, ప్రశంసాపత్రం బహూకరిస్తారు.

15 నుంచి వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

- తొలుత గిరిజన జనాభా కలిగిన 110 జిల్లాల్లో ఆరంభం
- సీఎస్‌ల వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అర్హులైన పేదలకు చేర్చేందుకు, అలాగే వారిలో వీటిపై అవగాహన కల్పించేందుకు 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరుతో ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపడుతున్నట్లు కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీ నుంచి ఆయన వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గౌబ మాట్లాడుతూ ముందుగా గిరిజన జనాభా కలిగిన 110 జిల్లాల్లో నవంబర్ 15వ తేదీన ఈ 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'ను ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమవుతుందని చెప్పారు. ఆ తర్వాత నవంబర్ మూడో వారం నుంచి దేశంలోని మిగతా జిల్లాలన్నింటిలో ఈ కార్యక్రమం ప్రారంభిస్తామని తెలిపారు. దేశంలో ఏడు లక్షల వరకూ గ్రామ పంచాయతీలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, సమన్వయంతో అన్ని పంచాయతీల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. రానున్న రెండు నెలల్లో అన్ని సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను మొబైల్ ద్వారా ఐటీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, ప్రణాళికాశాఖ కార్యదర్శి గిరిజా శంకర్, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ జె.నివాస్, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు

ఇసుక అమ్మకాల్లో వందల కోట్ల అవినీతి

- మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి
- విలేకరుల ప్రశ్నలకు సమాధానాలు దాటవేత



సాక్షి, అమరావతి/రేణిగుంట (తిరుపతి జిల్లా): ఇసుక విక్రయాల్లో కొత్త విధానాలు తీసుకొచ్చి ప్రభుత్వ పెద్దలు అక్రమ మార్గంలో వందల కోట్ల రూపాయలను తమ జేబుల్లో నింపుకొంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి విమర్శించారు. మంగళవారం విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం, రేణిగుంట విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. పోటీదారు లేకుండా చేసి ఇసుక అమ్మకాల మొత్తం ఒకే కాంట్రాక్టు సంస్థకు అప్పగించారని అన్నారు. ఆ కాంట్రాక్టు సంస్థ సంవత్సరానికి రూ. 760 కోట్లు ప్రభుత్వానికి చెల్లించే షరతుపై ఒప్పందం జరిగిందన్నారు. దీంట్లో 16 నెలల కాలానికే రూ. 2,000 కోట్లు అక్రమాలు జరిగినట్టు చెప్పారు. అయితే, అవినీతి జరిగిందనడానికి గతంతో పోల్చితే ఇసుక అమ్మకాలలో రాష్ట్రానికి ఆదాయం తగ్గిందా అని విలేకరులు ప్రశ్నించగా.. పురందేశ్వరి జవాబు దాటవేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి గతం కంటే ఎక్కువ ఆదాయం వస్తున్నప్పుడు వందల కోట్ల రూపాయల అక్రమాలకు ఎలా అవకాశం ఉంటుందన్న ప్రశ్నకు నేరుగా జవాబు చెప్పలేదు. ఇక మద్యం అనుమతుల్లో అక్రమాల విషయంలో చంద్రబాబు తదితరులపై కేసు నమోదు చేయడంపై తానేమీ వ్యాఖ్యానించాల్సిన అవసరం లేదన్నారు.

చంద్రబాబు బెయిల్‌ను స్వాగతిస్తున్నాం

టీడీపీ అధినేత చంద్రబాబుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని పురందేశ్వరి వ్యాఖ్యానించారు.

సంస్థాగతంగా బీజేపీని బలోపేతం చేస్తాం

క్షేత్రస్థాయిలో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేస్తామని పురందేశ్వరి అన్నారు. ఆమె రేణిగుంట విమానాశ్రయంలో మాట్లాడుతూ తిరుపతి జిల్లా అభివృద్ధికి కేంద్రప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించిందన్నారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద రాష్ట్రానికి 25లక్షల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అప్పుల ఊబిలోకి నెట్టేశారన్నారు. నాణ్యత లేని మద్యాన్ని అందిస్తూ పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు.

ఓటర్ల జాబితాలో మార్పులపై అప్రమత్తంగా ఉండాలి

బూత్ లెవెల్ నుంచి నిశితంగా పరిశీలించాలి

- అర్హులైన అందరికీ ఓట్లు ఉండేలా చూడాలి.. వారి మద్దతు పొందాలి
- ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా పనిచేయాలి
- ఓటర్లకు సంబంధించి అక్రమాలకు పాల్పడుతున్నది టీడీపీనే..
- ఫిర్యాదులు వైఎస్సార్‌సీపీపై చేస్తోంది
- చంద్రబాబులాంటి మారీచులతో పనిచేస్తున్నాం
- సీఎం జగన్ నేతృత్వంలో మరోసారి వైఎస్సార్‌సీపీ ఘన విజయం ఖాయం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: ఎన్నికలు సమీపిస్తున్నందున ఓటర్ల జాబితాలో మార్పులపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఓటర్ల జాబితాలకు సంబంధించి 175 నియోజకవర్గాల పార్టీ నేతలకు మంగళవారం తాడేపల్లిలో వర్క్‌షాప్ నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలపై పార్టీ శ్రేణులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని, ఓటర్ల చేర్పులు, ఇతర మార్పులను నిశితంగా పరిశీలించాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు ఉండేలా చూసి, వారి మద్దతు పొందాలని తెలిపారు. అనర్హులను గుర్తించడానికి పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక యంత్రాంగం పనిచేస్తోందని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారిని నియమించుకుని బూత్ లెవెల్ నుంచి ఓటర్ల జాబితాలను పర్యవేక్షించాలని చెప్పారు. ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల సంఖ్య నుంచి ఇటీవల జరిగిన మార్పుల వరకు సరిచూసుకోవాలని సూచించారు. జేసీఎస్ కోఆర్డినేటర్లు, గృహసారథులు, పోలింగ్ బూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ప్రత్యర్థి పార్టీల దుష్ప్రచారం నేపథ్యంలో నిరంతర పర్యవేక్షణ అవసరమని చెప్పారు. మనం తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు లాంటి మారీచులతో పోరాడుతున్నామని గుర్తుంచుకొని పనిచేయాలన్నారు. ఓటర్లకు సంబంధించి టీడీపీనే అక్రమాలకు పాల్పడుతూ, ఆ పార్టీ నేతలు ఎదురు మనపైనే ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. పచ్చ మీడియా, టీడీపీ కలిసి వైఎస్సార్‌సీపీపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి, ఓటర్లు ప్రజాస్వామ్యయుతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగున్నరేళ్లుగా అమలు చేస్తున్న పథకాలతో మరోసారి వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడం ఖాయమని చెప్పారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పాజిటివ్ ఓటుతో పాటు మరింత మంది వైఎస్ జగన్ నాయకత్వాన్ని బలపరుస్తున్నారని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో తుమ్మల లోకేశ్వర రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ నేతల సందేహాలను నివృత్తి చేశారు. రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, శాసన మండలిలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, జేసీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ డెలివరీకి చార్జీలు చెల్లించొద్దు

పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్



సాక్షి, అమరావతి: గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో రశీదులో ఉండే మొత్తానికి మించి ఎటువంటి అదనపు చెల్లింపులు చేయాల్సిన అవసరం లేదని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ మంగళవారం తెలిపారు. పట్టణ ప్రాంతం, గ్రామీణ/పట్టణ ప్రాంతంలోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ సెంటర్ నుంచి 15 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలు, గిరిజన, కొండ ప్రాంతాలకు ఎటువంటి డెలివరీ చార్జీలు తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఎల్పీజీ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి 15 కిలో మీటర్లు పైబడిన ప్రాంతాలకు మాత్రమే నిర్దిష్ట రుసుము వసూలు చేసేందుకు ప్రభుత్వం అనుమతించిందన్నారు. కానీ గ్యాస్ డెలివరీ సమయంలో ఎక్కువ రుసుము వసూలు చేస్తే పౌరసరఫరాల శాఖ, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ టోల్‌ఫ్రీ నంబర్ 1967, 1800 2333555కు ఫిర్యాదు చేయాలని కోరారు.

ఏపీ నిట్ విద్యార్థుల కారు బోల్తా

- డ్రైవర్ మృతి.. ఆరుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు
- వారిలో ఇద్దరి పరిస్థితి విషమం
- ఆగి ఉన్న లారీని ఢీకొట్టి, పల్టీలు కొట్టిన కారు



నుజ్జునుజ్జయిన కారు

తాడేపల్లిగూడెం, రూరల్, అర్బన్ : ఏపీ నిట్ విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు తాడేపల్లిగూడెం బైపాస్ రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందగా, ఆరుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. తాడేపల్లిగూడెంలోని నిట్ విద్యార్థులు ఆరుగురు ట్రావెల్స్‌కు చెందిన కారులో ఏలూరుకు వెళ్తున్నారు. మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో తాడేపల్లిగూడెం పట్టణ జాతీయ రహదారి బైపాస్‌పై ఆగి ఉన్న ధాన్యం లోడు లారీని కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. అదే వేగంతో డివైడర్ పైకి ఎక్కి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జయింది. కారు డ్రైవర్ బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. విద్యార్థులు ఆరుగురూ తీవ్ర గాయాలపాలయ్యారు. వారిలో గుంటూరు సమీపంలోని నల్లపాడు గ్రామానికి చెందిన ఈశ్వర్ పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్న నెల్లూరుకు చెందిన నవీన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. అనంతపురానికి చెందిన విష్ణువర్ధన్, గుంటూరుకు చెందిన హర్షవర్ధన్, నిడదవోలుకు చెందిన జగతా శ్రీనివాసు, విజయవాడకు చెందిన సాత్విక్ కూడా తీవ్ర గాయాలయ్యాయి. మరణించిన డ్రైవర్ వివరాలు తెలియరాలేదు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

కాలువలో గేజ్ కాపాడండి



ఎంపీకి వినతిపత్రం సమర్పిస్తున్న నిరుపాది

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువలో నీటి గేజ్‌ను సక్రమంగా నిర్వహించాలని కర్ణాటక రాష్ట్ర సమితి కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ, సింధనూరు ఎమ్మెల్యే హంపనగౌడ బాదర్లిని డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లాధ్యక్షుడు నిరుపాది మాట్లాడుతూ 40, 42, 46, 52, 54వ మైలు వద్ద నీటి నిర్వహణకు అధికారులు సహకరించి ఆయకట్టు చివరి భూములకు నీరందించాలన్నారు.

జేజేఎంతో ఇంటింటికీ కొళాయి కనెక్షన్

రాయచూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో జల్ జీవన్ మిషన్(జేజేఎం)తో ఇంటింటికీ కొళాయి కనెక్షన్‌కు ప్రాధాన్యత కల్పిస్తామని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ తెలిపారు. మంగళవారం తాలూకాలోని దేవసూగూరు, యద్లాపూర్‌లో జల్ జీవన్ మిషన్ పథకం నిర్మాణాలకు రూ.కోటి నిధులు కేటాయించామన్నారు. భూములకు నీరందించేందుకు చెరువులకు రూ.2 కోట్లతో పైపులైన్లు, వంతెనల నిర్మాణాలు చేపడుతామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు.

గ్యారెంటీలతో మోసపోవద్దు

రాయచూరు రూరల్: తెలంగాణలో నవంబరులో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చే గ్యారెంటీలతో మోసపోవద్దని రైతు సంఘం పేర్కొంది. తెలంగాణ సరిహద్దులోని రాయచూరు, బూర్దిపాడు, వడ్డేపల్లి, గాజులపాడు రైతులు కృష్ణ, గద్వాల సరిహద్దు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. కర్ణాటకలో గ్యారెంటీ పథకాలతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. మహిళలకు రూ.2 వేలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, తుంగభద్ర ఎడమ కాలువకు నీరు అందించక పోవడం వంటివి చేశారని, మీరు మోసపోవద్దని హితవు పలికారు.

హుషారుగా కాలేజ్ ఫెస్ట్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

బనశంకరి: బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద గల ఐబీఎస్ , బెంగళూరు లో పేరుపొందిన కాలేజీగా ఉంది. మంగళవారం టౌన్‌హాల్ పుట్టణ్ణ శెట్టి పురభవన్‌లో ఐబీఎస్ సర్ఫేస్- 2023 అంతర్ కాలేజీ సాంస్కృతిక ఉత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే నాటకాలు, నృత్యం, గాయనం తదితర 50 కి పైగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించగా, ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రముఖులు అక్షిత్ కెనడి ప్రసంగించారు. ముఖ్య అతిథులుగా అశ్వినకుమార్- డెలాట్ ఇండియా డైరెక్టర్, ఐబీఎస్ సంస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జైప్రకాష్, మహేశ్వరరెడ్డి, కులదీప్‌శర్మా, ప్రిన్సిపాల్ డాక్టర్ త్రిపురనేని జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



సిద్దమ్మ(ఫైల్)

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా సూలదహళ్లికి చెందిన సిద్దమ్మ అనే మహిళ అదృశ్యమైంది. ఈ విషయంపై ఆమె బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హొసహళ్లి పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఆమె బొద్దుగా ఉండి 25 ఏళ్ల వయస్సు, 5 అడుగుల ఎత్తు, నలుపు రంగు శరీరఛాయ కలిగి కన్నడలో మాట్లాడగలదని, నేవీ కలర్ చూడీదార్ ధరించిందని, ఆమె ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

వ్యక్తి కూడా..

విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా హురుళిహాళ్ మాసరహట్టికి చెందిన మల్లేశ్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు హొసహళ్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ తెలిపారు. మల్లేశ్ 4.8 అడుగుల ఎత్తు, గుండ్రని ముఖం, గోధుమ రంగు శరీరఛాయ, 24 ఏళ్ల వయస్సు కలిగి, కన్నడ, తెలుగులో మాట్లాడతారని, నీలం చొక్కా, బెర్ముడా ధరించాడని, ఆయన ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

క్రికెట్ పోటీల విజేత కోలారు



ట్రోఫీని అందుకున్న కోలారు జట్టు

కోలారు: తుమకూరులోని మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో 2022-23వ సంవత్సరపు ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల ఫైనల్‌లో రాయచూరు జిల్లా జట్టుపై కోలారు జిల్లా జట్టు విజయం సాధించింది. విజేత కోలారు జట్టుకు జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.సురేష్‌బాబు అభినందనలు తెలిపారు. క్రికెట్ జట్టు ఉత్తమ ప్రదర్శనతో విజయం సాధించిందని కొనియాడారు. విజేత జట్టుకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షడక్షరి ట్రోఫీని అందించారు. కేజీఎఫ్ ఆటగాడు మంజునాథ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

రేగిన మరాఠా రిజర్వేషన్ల చిచ్చు

- కర్ణాటక ఆర్టీసీ బస్సుకు ఆందోళనకారుల నిప్పు
- మహారాష్ట్రకు తాత్కాలికంగా బస్సుల నిలిపివేత



కర్ణాటక బస్సుకు నిప్పు పెట్టిన దృశ్యాలు



రాళ్ల దాడిలో ధ్వంసమైన ఓ బస్సు అద్దం

సాక్షి బళ్లారి: మహారాష్ట్రలో చెలరేగిన మరాఠా రిజర్వేషన్ల పోరాటం హింసాత్మకంగా మారింది. ఎమ్మెల్యే ఇంటిపై ఆందోళనకారులు దాడి చేసి నిప్పంటించారు. దీంతో పాటు కర్ణాటక ఆర్టీసీ బస్సుకు నిప్పు పెట్టడంతో మహారాష్ట్రకు వెళ్లే కర్ణాటక బస్సులను తాత్కాలికంగా నిలిపి వేసినట్లు కేఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ రాచప్ప తెలిపారు. మహారాష్ట్రలో రిజర్వేషన్ల పోరాటం తీవ్ర రూపం దాల్చడం సోమవారం కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో కలకలం సృష్టించింది. రెండు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మహారాష్ట్రలోని ఉమర్గా సమీపంలోని తరూరీ గ్రామం వద్ద బీదర్ జిల్లా భాల్కి నుంచి పుణె వెళ్తున్న బస్సు(కేఏ-37 ఎఫ్-1201)కు ఆందోళనకారులు నిప్పు పెట్టారు. ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనతో మహారాష్ట్రకు వెళ్లే అన్ని బస్సులను నిలిపివేయడంతో కాస్త పరిస్థితి అదుపులోకి వచ్చింది. మహారాష్ట్రలో మరాఠా రిజర్వేషన్ల డిమాండ్‌పై గత ఆగస్టు నుంచి నిరసనలు కొనసాగుతున్నాయి. అక్టోబర్ 25న జాల్నా జిల్లా అంతర్‌వాలి సారథి గ్రామంలో నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభమైన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మరాఠా రిజర్వేషన్ల పోరాటం మళ్లీ ఉధృతమై హింసాత్మకంగా మారడానికి కారణమైంది.

ఎమ్మెల్యే ఇంటిపైకి రాళ్లు

నిరసనకారులు ఎమ్మెల్యే ఇంటిపై రాళ్లు రువ్వడంతో పాటు కర్ణాటక బస్సును తగలబెట్టడం ద్వారా తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. రిజర్వేషన్లు కోరుతూ మనోజ్ అనే కార్యకర్త ముంబైలో నిరవధిక నిరాహార దీక్షను చేపడుతున్నారు. ఆయన దీక్ష చేపట్టి వారం రోజులైంది. అంతకు ముందు మరాఠా వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలని లేకుంటే మరాఠాలతో పోరాడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ రెండు ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి. మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించేదాకా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని సూచించారు. మరాఠా రిజర్వేషన్ల పోరాటం హింసాత్మకంగా మారడంతో బీడ్ జిల్లాలో కూడా ముగ్గురు ఎమ్మెల్యేల ఇళ్లపై దాడులు నిర్వహించారు. ఇద్దరు ఎన్‌సీపీ ఎమ్మెల్యేలపై కూడా దాడులు జరిపారు. పోరాటం హింసాత్మకంగా మారిన నేపథ్యంలో పోలీసులు పరిస్థితిని అదుపు చేసేందుకు టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. రిజర్వేషన్ల డిమాండ్‌తో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి కూడా పాల్పడ్డాడు. బెళగావిలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. మహారాష్ట్రకు వెళ్లే వందలాది బస్సు సర్వీసులను నిలిపి వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సుకు నిప్పు పెట్టిన నేపథ్యంలో కర్ణాటక రవాణా శాఖా మంత్రి రామలింగారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటి దాడులు సరికాదని ఆందోళనకారులకు తీవ్రంగా హెచ్చరికలు జారీ చేశారు.



మాట్లాడుతున్న రవాణా మంత్రి రామలింగారెడ్డి

ఉక్కుమనిషి అడుగు జాడల్లో నడవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందిస్తున్న దృశ్యం

కంప్లి: రాష్ట్రీయ ఏక్తా దివస్ ఉక్కు మనిషిగా పేరొందిన సర్దార్ వల్లబ్‌బాయి పటేల్ జయంతిని తమ సంస్థ పరంగా జరుపుకోవడం తమ పూర్వ జన్మ సుకృతమని జేసీఐ కంప్లి సోనా అధ్యక్షులు సంతోష్ కొట్రప్ప సోగి, కార్యదర్శి బీహెచ్‌ఎం అమరనాథ శాస్త్రి తెలిపారు. మంగళవారం విజయనగర పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారి అడుగు జాడల్లో నడవాలని సూచించారు. అనంతరం ఎస్ఎల్‌టీఎస్ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రమాణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల మండలి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు జేసీఐ కంప్లి సోనా పదాధికారులు పాల్గొన్నారు.

ఇందిరా, పటేల్‌లకు పుష్పాంజలి



ఇందిరా, పటేల్‌ల చిత్రపటాలకు నాయకుల పుష్పాంజలి

రాయచూరు రూరల్: దేశానికి స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు శ్రమించిన మహానుభావుడు, ఉక్కు మనిషిగా పేరొందిన వ్యక్తి సర్దార్ వల్లబ్‌బాయి పటేల్ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వసంత్ కుమార్, నగరాధ్యక్షుడు బసవరాజరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి సర్దార్ వల్లబ్‌బాయి పటేల్ జయంతి, ఏక్తా దివస్, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. మహనీయుల ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో సుఖాణి, బసవరాజ్ పాటిల్, శశికళ, శాంతప్ప, అమరేగౌడ, శ్రీనివాస్, ఆంజినేయ, మంజులలున్నారు.

వాడవాడలా ఏక్తా దినోత్సవం



ప్రతిజ్ఞా విధిని స్వీకరిస్తున్న దృశ్యం

రాయచూరురూరల్ : నగరంలో సర్దార్ వల్లబ్ బాయి పటేల్ జయంతి, ఏక్తా యాత్ర దినోత్సవం జరిగాయి. మంగళవారం పటేల్ రోడ్డులో సర్దార్ వల్లబ్‌బాయి పటేల్ విగ్రహానికి జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, ఎస్పీ నిఖిల్, సీఈఓ రాహుల్ తుకారాం పాండే పూలమాలలు వేశారు. అనంతరం జిల్లాధికారి నాయక్ ఏక్తా యాత్రను ప్రారంభించారు. నగరసభ కార్యాలయంలో కమిషనర్ గురుసిద్దయ్య, వివిధ ప్రభుత్వ, తాలూకా, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, దిన్ని పాఠశాలలో ఏక్తా దినోత్సవాలు జరిగాయి. బీజేపీ కార్యాలయంలో జిల్లాధ్యక్షుడు రమానంద సర్దార్ వల్లబ్ బాయి పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన భారతదేశానికి చేసిన సేవలను కొనియాడారు.

ఆరేళ్లలో ఎక్కడా కనిపించని ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీ చంద్రశేఖర్ పాటిల్

రాయచూరు రూరల్: ప్రజలు, డిగ్రీ పట్టాలు పుచ్చుకొన్న మేధావుల ఓట్లు వేయించుకొని పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి ఎన్నికై గత ఆరేళ్లు గడుస్తున్నా ఎమ్మెల్సీ చంద్రశేఖర్ పాటిల్ ఆరు జిల్లాల్లో పర్యటించకుండా ఎక్కడ ఉన్నారా? అని ప్రజలు వెతుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. 2018లో జరిగిన ఎన్నికల్లో ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్ పాటిల్ ఎన్నికయ్యారు. 2024లో ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గంలో పోటీ చేసేందుకు కాంగ్రెస్ అభ్యర్థిగా మళ్లీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ పాటిల్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గంలో రాయచూరు, బళ్లారి, విజయనగర, కొప్పళ, కలబుర్గి, యాదగిరి, బీదర్ జిల్లాలున్నాయి. పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏనాడూ విధాన పరిషత్ కార్యకలాపాల్లో గళం విప్పకపోవడం విడ్డూరంగా ఉంది. పేరుకు పదవి కావాలనే తపన తప్ప వారి బాగోగుల గురించి పట్టించుకోకపోవడం శోచనీయం. రాయచూరు, బళ్లారి, కొప్పళ, యాదగిరి జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల్లోను, సమావేశాల్లో, అభివృద్ధి పథకాల్లో, జాతీయ స్థాయి పండుగల వేళల్లో, ముఖ్యమంత్రి పర్యటించిన సమయంలో మాత్రం కార్డులో ఎమ్మెల్సీ చంద్రశేఖర్ పాటిల్ పేరు ముద్రిస్తారు. దీంతో అంతగా పరిచయం లేని చంద్రశేఖర్ పాటిల్ అంటే ఎవరనే ప్రశ్న ప్రతి ఒక్కరి మదిలో మెదులుతోంది.

ఈసారి రమేష్ ఆటలు సాగవు

హుబ్లీ: మాజీ మంత్రి రమేష్ జార్కిహోళి ఆటలు ఈసారి సాగవు. తమలో ఎటువంటి అసంతృప్తి లేదు. డీకే శివకుమార్ మాజీ మంత్రి కాదని చెన్నగిరి ఎమ్మెల్యే శివగంగ బసవరాజ్ తెలిపారు. ఆయన మంగళవారం దావణగెరెలో విలేకరులతో మాట్లాడారు. గత సంకీర్ణ ప్రభుత్వంలో సంఖ్యా బలం తక్కువగా ఉన్న నేపథ్యంలో రమేష్ తన కుయుక్తులతో ప్రభుత్వాన్ని కూల్చారన్నారు. ఇప్పుడు అలాంటి ఆటలు సాగవు. 136 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కలిసికట్టుగా ఉన్నామన్నారు. ఆపరేషన్ కమలకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలోనే ఆడియో, వీడియో విడుదల చేస్తాం. పరమేశ్వర్ ఇంటిలో విందుపై రాజకీయాలు చేయడం తగదన్నారు. మంత్రి సతీష్ జార్కిహోళి దుబాయికి పిలిచినా వెళతానన్నారు. తమ నేతలు ఎక్కడికి పిలిచినా అక్కడికి వెళతాను. తమలో ఎటువంటి అసంతృప్తి లేదు. కార్పొరేషన్, మండలి పదవులను తానేమి ఆశించలేదు. వాటిని తమ నాయకులే చూసుకుంటారు. మంత్రి పదవుల పంపకంలో ఎమ్మెల్యే బేలూరు వ్యాఖ్యలకు తాను మద్దతిస్తున్నానన్నారు. అధికారం నిలిచిన నీరు కారాదు. అందరికీ అధికారాలు లభించాలన్నారు.

3న మెగా ఉద్యోగ మేళా

కోలారు: బెంగళూరు ఫస్ట్ సర్కిల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలో నవంబర్ 3న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు బెంగళూరు ఫస్ట్ సర్కిల్ సొసైటీ అధ్యక్షుడు నందీష్ తెలిపారు. మంగళవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలోని ప్రభుత్వ బాలుర కళాశాలలో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాలో సుమారు 50 కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. మేళాలో 4 నుంచి 5 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. మూడేళ్ల క్రితం సుమారు 600 మంది పారిశ్రామికవేత్తలు కలిసి సొసైటీని ప్రారంభించి కొత్తగా పరిశ్రమలను ప్రారంభించే వారికి అన్ని విధాలా సహకారం అందించినట్లు తెలిపారు. ఫస్ట్ సర్కిల్ సంస్థ డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో మూడు రోజుల పాటు బెంగళూరులోని ప్యాలెస్ మైదానంలో జాబ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 120 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ఉద్దేశం ఉన్నట్లు తెలిపారు. మేళాలో పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. కౌశల్యాభివృద్ధి శాఖ జిల్లా అధికారి కె శ్రీనివాస్, బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసగౌడ పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీటి కోసం రాస్తారోకో

- మూడు గంటలు స్తంభించిన రవాణ
- తుంగభద్రను మరో కావేరి కానివ్వొద్దు
- ముక్తకంఠంతో నినదించిన ఆందోళనకారులు



ఎండిన వరిదుబ్బులతో రాస్తారోకో చేస్తున్న రైతులు

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువలో నీటి గేజ్‌ను కాపాచి చివరి ఆయకట్టుకు నీరందించాలని 104వ మైలు పోరాట సమితి డిమాండ్ చేసింది. మంగళవారం సాత్ మైలు వద్ద చేపట్టిన రాస్తారోకోను ఉద్దేశించి అధ్యక్షుడు మహంతేష్ పాటిల్, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు చామరస మాలిపాటిల్, జిల్లా జేడీఎస్ అధ్యక్షుడు విరుపాక్షి, జనాందోళన సమితి అధ్యక్షుడు రాఘవేంద్ర కుష్టిగి మాట్లాడారు. 104వ మైలు వద్ద నీటి నిర్వహణకు అధికారులు సహకరించాలన్నారు. ఆయకట్టు చివరి భూములకు నీరందించాలంటే గేజ్‌ను పెంచాలన్నారు. ఇంజినీర్లు సక్రమంగా కాలువలపై నీటి నిర్వహణ చేపట్టాలన్నారు. చివరి ఆయకట్టుకు నీరు వచ్చేంత వరకు ఆందోళను విరమించరాదన్నారు. నీటిపారుదల శాఖా మంత్రి డీకే శివకుమార్ మౌనం వీడాలన్నారు. తుంగభద్రను మరో కావేరీని కానివ్వొద్దు అంటూ నినాదాలు చేశారు. రాస్తారోకోతో మూడు గంటల పాటు వాహన రాకపోకలు స్తంభించాయి.

హంపీలో కర్ణాటక సంభ్రమ వేడుకలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: కర్ణాటకగా నామకరణం చేసి నవంబర్ 1తో 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో కన్నడ, సంస్కృతి శాఖ బెంగళూరు, విజయనగర జిల్లా యంత్రాంగం సంయుక్తంగా కర్ణాటక సంభ్రమ-50 వేడుకలను నవంబర్ 2న సాయంత్రం 4 గంటలకు విజయనగర సామ్రాజ్య రాజధాని హంపీలోని ఎదురు బసవణ్ణ మంటపం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతుల మీదుగా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరోజు సాయంత్రం 4.45 గంటలకు సాధుకోకిల బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు, విరుపాక్షేశ్వర ఆలయంలో ముఖ్యమంత్రి, ప్రముఖులతో భువనేశ్వరీ దేవికి ప్రధాన అర్చకులు, ప్రముఖులతో పూజలు నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 5.15 గంటలకు ఎదురు బసవణ్ణ మండపం వద్ద జానపద కళా బృందాలతో కలిసి కాలినడక జాతాలో సీఎం సిద్దరామయ్యతో పాటు కేబినెట్ మంత్రులు పాల్గొంటారన్నారు. సాయంత్రం 5.30 గంటలకు బసవన్న మండటం ఎదుట కర్ణాటక 50వ జ్యోతి రథోత్సవం, 6.10 గంటలకు కర్ణాటక వేడుకల ప్రారంభోత్సవం, 6.15 గంటలకు కర్ణాటక భక్తి గీతాల గాయన, సాయంత్రం 6.50 గంటలకు ముఖ్యమంత్రి కర్ణాటక వేడుక-50వ సందేశం, రాత్రి 7.15 గంటలకు కళాకారులతో వీర చిన్నారుల నృత్యం, రాత్రి 7.30 నుంచి 10.30 గంటల వరకు కన్నడ సినీ సంగీత డైరెక్టర్ సాధుకోకిల బృందంతో రసమంజరి జరుగుతాయన్నారు.

నేడు రాజ్యోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

బళ్లారిఅర్బన్: నవంబర్ 1న కర్ణాటక రాజ్యోత్సవం సందర్భంగా నగరంలోని వివిధ కార్యాలయాల్లో కన్నడ పతాకాన్ని ఎగరవేసి రాజ్యోత్సవ వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా బళ్లారి కొండపై కన్నడ పతాకాన్ని ఉదయం 6 గంటలకు ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ధ్వజారోహణ చేస్తారు. సిటీ కార్పొరేషన్‌లో, మున్సిపల్ కళాశాల మైదానంలో, రాజ్‌కుమార్ పార్క్‌లో, ఏపీఎంసీ సర్కిల్‌లో, కాస్మోపాలిటిన్ క్లబ్ ఎదురుగా తదితర కన్నడ సంఘాల కార్యాలయాల ముందు, పలు వీధుల్లో కన్నడ పతాకాలను ఆవిష్కరించి రాష్ట్రవతరణ దినోత్సవ వేడుకలను జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

అవినీతిని దాచడానికే పులిగోరు వివాదం

కోలారు: రాష్ట్ర ప్రభుత్వం తమ అవినీతిని కప్పిపుచ్చుకోడానికే పులిగోరు వివాదాన్ని తెరపైకి తెచ్చిందని లోక్‌సభ సభ్యుడు ఎస్.మునిస్వామి ఆరోపించారు. మంగళవారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదాయ పన్ను శాఖ దాడులు నిర్వహించి కాంట్రాక్టర్ల ఇళ్ల నుంచి రూ.100 కోట్లను స్వాధీనం చేసుకున్నప్పుడే దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రజల దృష్టిని మరల్చడానికే ఇలాంటి చిన్న వివాదాలను తీసుకొస్తోందన్నారు. ఇన్నేళ్లు అటవీశాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో డీకే శివకుమార్, సతీష్ జార్కిహోళి, జి.పరమేశ్వర్ గ్రూపులు పుట్టుకొచ్చాయి. తీవ్ర గందరగోళంలో ఉన్న కాంగ్రెస్ పాలనపై దృష్టి పెట్టడానికి సాధ్యం కావడం లేదన్నారు.

3న ఉచిత మెగా ఆరోగ్య శిబిరం

బళ్లారి రూరల్ : బళ్లారి అనువ్రత సమితి, విమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 3న కర్ణాటక రాజ్యోత్సవం సందర్భంగా తేరువీధిలోని పార్శ్వనాథ జైన్‌మందిరంలో ఉచిత మెగా ఆరోగ్య పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు బసంత్ చాజీర్ తెలిపారు. ఈ శిబిరంలో కాన్సు, స్త్రీరోగ వ్యాధులు, కన్ను, ఈఎన్‌టీ, దంత, చర్మరోగాలకు పరీక్షలు, ఆర్థోపెడిక్స్, మానసిక వ్యాధులకు పరీక్షలు, ల్యాబ్‌టెస్ట్‌లు చేసి, చికిత్స నిర్వహించి మందులు, మాత్రలను అందించనున్నట్లు తెలిపారు. విమ్స్, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు పాల్గొననున్న ఈ శిబిరంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది పాల్గొంటారని తెలిపారు.

హత్యను నిరసిస్తూ బంద్ జయప్రదం



ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీనివాసన్ అభిమానులు



బంద్‌తో నిర్మానుష్యంగా మారిన బస్టాండు

శ్రీనివాసపురం: కాంగ్రెస్ నాయకుడు, కౌన్సిలర్ శ్రీనివాసన్ హత్యను ఖండిస్తూ మంగళవారం వివిధ దళిత సంఘాలు, ప్రగతిశీల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీనివాసపురం బంద్ పూర్తిగా విజయవంతమైంది. ఉదయం పట్టణంలోని ఇందిరా భవన్ సర్కిల్‌లో దివంగత కౌన్సిలర్ శ్రీనివాసన్ చిత్రపటాన్ని ఉంచి అభిమానులు పాలాభిషేకం చేశారు. మానవహారంగా ఏర్పడి శ్రీనివాసన్‌కు నివాళులు అర్పించారు. శ్రీనివాసన్‌కు జయజయ ధ్వానాలు చేస్తూ పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. బంద్‌కు మద్దతుగా పట్టణంలోని అన్ని దుకాణాలు, హోటళ్లు, సినిమా హాళ్లు మూసివేశారు. ఆటో డ్రైవర్లు, ప్రైవేటు బస్సులు బంద్‌కు మద్దతు తెలిపారు. పట్టణంలో వాహనాల సంచారం లేకపోవడంతో వీధులన్ని జనసంచారం లేక నిర్మానుష్యంగా కనిపించాయి. కెఎస్‌ఆర్టీసీ బస్టాండు కూడా బోసిపోయింది. బంద్ సందర్భంగా పోలీసులు పట్టణంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ర్యాలీలో పాల్గొని మాట్లాడిన పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు దింబాల అశోక్ శ్రీనివాసన్ హత్యను ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలన్నారు. హంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ శిరీన్‌తాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. ర్యాలీలో దళిత నాయకులు తిమ్మయ్య, కెకె మంజునాథ్, పురసభ మాజీ అధ్యక్షుడు బి ఎం ప్రకాష్ పాల్గొన్నారు.

కావేరి నీటి కోసం పట్టు ఖండనీయం



వినతిపత్రం సమర్పిస్తున్న కరవే నేతలు

కంప్లి: కావేరిపై కర్ణాటక బంద్‌కు మద్దతిస్తూ కంప్లి రైతు సంఘం, కన్నడ పర సమాఖ్య, విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతు ప్రముఖులు బీవీ గౌడ, సీఆర్ హనుమంత మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు విలయ తాండవం చేస్తోందన్నారు. కావేరి జలాశయంలో తగినంత నీటి నిల్వ లేనప్పటికీ తమిళనాడుకు నీటిని విడుదల చేయాలనడం ఖండనీయం అన్నారు. ప్రముఖులు బీ.రమేష్, బళె మల్లికార్జున, బీసీ నాగరాజ్, బీ.సిద్దప్ప పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై రైతుల ధర్నా

రాయచూరు రూరల్: గ్రామాల్లో విద్యుత్ కోతలు విధిస్తుండడంతో రైతులు భూముల్లో వేసుకున్న పంటలు ఎండిపోతున్నాయని పేర్కొంటూ కర్ణాటక రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులు ఎండిన వరిదుబ్బులతో జిల్లాధ్యక్షుడు నిరుపాది నేతృత్వంలో ఆందోళనకు పూనుకున్నారు. గ్రామాల్లో 12 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నా కేవలం 3 గంటలకు మించి విద్యుత్ సరఫరా చేయక పోవడంతో పంప్‌సెట్లకు నీరందక పంటలు ఎండిపోతున్నాయన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా చేపట్టాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఎల్ఎల్‌సీకి నీరివ్వకుంటే పోరాటం



మాట్లాడుతున్న శ్రీరాములు, చిత్రంలో సురేష్‌బాబు

కంప్లి: తుంగభద్ర ఎల్ఎల్‌సీకి డిసెంబర్ 15వ వరకు నీరు పారించని పక్షంలో జిల్లాధికారి కార్యాలయం ముందు రైతాంగం ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపట్టనున్నట్లు మాజీ మంత్రి బీ.శ్రీరాములు హెచ్చరించారు. కంప్లి పట్టణంలో బీజేపీ కార్యకర్తలు, ప్రముఖుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తుంగభద్ర కుడి దిగువ కాలువ(ఎల్ఎల్‌సీ)కు డిసెంబర్ 15 వరకు నీటిని వదలాలన్నారు. ఇక ప్రధానంగా ఈ ప్రాంతంలో మిరప పంట పండించే రైతుల శ్రేయస్సును కాపాడాలన్నారు. కాలువ నీటి పంపకాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చించాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు, బీజేపీ క్షేత్ర అధ్యక్షులు అళ్లళ్లి వీరేష్, బ్రహ్మయ్య పురుషోత్తం, బీ.సిద్దప్ప, డాక్టర్ వెంకటేష్ బర్మక్కనవర్, వీఎల్ బాబు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వివాహాలతో ఆడంబరాలు దూరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, స్వామీజీలు

కంప్లి: వధూవరులు దాంపత్య జీవితంలో పెద్దలను గౌరవించడం ద్వారా సంస్కారయుత జీవితం సాగించాలని ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్ హితవు పలికారు. హగరిబొమ్మనహళ్లి తాలూకా కడలబాళు గ్రామంలో గవిమఠపు 15వ పీఠాధిపతి శివశాంత వీరస్వామి 101వ పుణ్యారాధన సందర్భంగా 21 మంది జంటలకు ఏర్పాటు చేసిన సామూహిక వివాహాలు, ధర్మసభను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జీవితంలో సంకోచం విడిచి సామూహిక వివాహాల్లో పాల్గొనడం ద్వారా ఆడంబర వివాహాలకు క్లాం వేయాలన్నారు.

ఏఈపీఎస్‌తో నగదు వంచన

హుబ్లీ: బ్యాంక్ ఖాతాదారుల దృష్టికి తేకుండా ఆధార్ ఎనేబల్ పేమెంట్ సిస్టమ్(ఏఈపీఎస్) ద్వారా గుర్తు తెలియని వ్యక్తి హైకోర్టు న్యాయవాది ఖాతాలో నుంచి రూ.27,900 బదలాయించుకొని వంచించిన ఘటన కేశ్వాపుర దయానంద కాలనీలో చోటు చేసుకుంది. వివరాలు..హైకోర్టు న్యాయవాది దత్తాత్రేయ హెబ్బార బాధితుడు, ఏఈపీఎస్ ద్వారా ఈ నెల 24న రూ.7900, ఈ నెల 26న రూ.20 వేలను దశల వారీగా తన ఖాతా నుంచి బదలాయించుకున్నట్లుగా ఆయన సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.